

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 90

శనివారం 21-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ణి చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 90

శనివారం 21-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బ్యాటింగ్‌తో అదరగొట్టారు

ఇంగ్లండ్‌తో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 359/3. జైస్వాల్, గిల్ శతకాలు -17లో



నాదమే జీవనం

వరల్డ్ మ్యూజిక్ డే సందర్భంగా పలువురు సంగీత దర్శకుల మనోభావాలు -15లో



ప్రజాసేవ చేయకపోతే..

నిత్యం ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా నిద్రించలేనని ప్రధాని మోదీ శుక్రవారం బిహార్ పర్యటనలో వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸



మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

మణిపూర్‌లో మళ్లీ అశాంతి చెలరేగింది. భద్రతా దళాల కాల్పుల్లో ఓ మహిళ మృతితో జాతుల మధ్య ఉద్రిక్తతలు మొదలయ్యాయి.

వివరాలు 6లో ▸



రాష్ట్రపతి కంటతడి

తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ దివ్యాంగ చిన్నారులు పాడిన పాట విని రాష్ట్రపతి ముర్ము భావోద్వేగానికి గురయ్యారు.

వివరాలు 6లో ▸



చమురు రేట్లకు యుద్ధం సెగ

ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో ముడిచమురు రేట్లు భగ్గుమన్నాయి. యుద్ధం మొదలైన ఈ నెల 13న 6 నెలల గరిష్టానికి ఎగబాకాయి.

వివరాలు 17లో ▸

ఇంద్రావతి కట్టడి!

గోదావరి ఉపనది జలాల గరిష్ట వినియోగానికి ఛత్తీస్‌గఢ్ రెడీ

బోధ్‌ఘాట్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు శ్రీకారం..కేంద్రం అనుమతి!

తెలంగాణ ప్రాజెక్టులకు నీటి లభ్యత కష్టమే అంటున్న నిపుణులు

- గోదావరిలో ఇంద్రావతి కలిసే ప్రాంతానికి దిగువనే దేవాదుల, సీతారామ, సమ్మక్క–సారక్క
- వీటికి దిగువన ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం
- గోదావరికి ప్రాణహిత తర్వాత ఇంద్రావతే ప్రధాన వనరుగా ఉన్న వైనం
- ఈ నదిలో ఏటా సుమారు 600–800 టీఎంసీల మేర లభ్యత
- రూ.49 వేల కోట్లతో సుమారు 9.45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు జీవ నాడిగా ఉన్న గోదావరి నదికి ప్రాణహిత తర్వాత ప్రధాన ఉప నది అయిన ఇంద్రావతి నీటిని పూర్తిగా కట్టడి చేసేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇంద్రావతిలో లభ్యతగా ఉన్న నీటిలో మెజారిటీ జలాలను వినియోగించుకునేలా బోధ్‌ఘాట్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తోంది. ఇటీవలే ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సైతం అనుమతినిచ్చిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించారు. ఇంద్రావతి నీటినే నమ్ముకొని తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు చేపడుతుండటం గమనార్హం. కాగా ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ తెరపైకి తెచ్చిన ఈ ప్రాజెక్టుతో దిగువ గోదావరిలో జలాల లభ్యత తగ్గిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ వినియోగించని జలాలనే ఆధారంగా చేసుకుని కేంద్రం గోదావరి–కావేరి అనుసంధానాన్ని తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే.

ఎగువ నీళ్లకు ఎగువనే అడ్డుకట్ట..

ఇంద్రావతిలో ప్రతి ఏటా సుమారు 600–800 టీఎంసీల మేర లభ్యత ఉంటుందని కేంద్రం లెక్కలు చెబుతున్నాయి. ఇది ఛత్తీస్‌గఢ్‌లో 264 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మేడిగడ్డ దిగువన, సమ్మక్క–సారక్క బరాజ్ ఎగువన గోదావరిలో కలుస్తుంది. దంతెవాడ, బీజాపూర్, సుక్మా, బస్తర్, కాంకేర్ జిల్లాల గుండా ప్రవహిస్తుంది. ఆయా జిల్లాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుల్లోనే ఉన్నాయి. ఇంద్రావతి నీళ్లు కలిశాకే గోదావరి దిగువన ప్రవాహాలు మరింత ఉధృతంగా ఉంటాయి. కాగా ఇంద్రావతి నది గోదావరిలో కలిసే ప్రాంతానికి దిగువన, గరిష్ట నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ.. దేవాదుల (38 టీఎంసీలు), సీతారామ (70 టీఎంసీలు), సమ్మక్క–సారక్క (50 టీఎంసీలు మిగతా 2వ పేజీలో ▶

ఆంధ్రప్రదేశ్‌తో చర్చలకు సిద్ధం

నదీ జలాలపై వివాదాల పరిష్కారంలో మాకెలాంటి భేషజాలు లేవు

- 23న కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- అవసరమైతే నేనే స్వయంగా చంద్రబాబును ఆహ్వానిస్తా
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- మోదీ సీట్లో కూర్చోవాలంటే చంద్రబాబు సహకారం కావాలి
- బాబు మళ్లీ గెలవాలంటే గోదావరి నీళ్లు కావాలి
- కానీ మేం ఎవరి కోసమో రాష్ట్రం హక్కులు వదులుకోలేమన్న ముఖ్యమంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా, గోదావరి నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంలో తమకెలాంటి భేషజాలు లేవని, ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడితో ముఖాముఖి చర్చలు జరిపే అంశంపై ఈ నెల 23న జరిగే కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే చర్చలకు తానే స్వయంగా చంద్రబాబును ఆహ్వానించేందుకు కూడా సిద్ధంగా ఉన్నానన్నారు. 'గోదావరి జలాలకు సంబంధించి రాష్ట్ర ప్రయోజనాలు మిగతా 2వ పేజీలో ▶

పోటాపోటీగా దాడులు

- ఇజ్రాయెల్‌పై క్లస్టర్ బాంబుల వర్షం కురిపించిన ఇరాన్.. తీరప్రాంత హైఫా సిటీపై క్షిపణి దాడులు
- డజన్ల మందికి గాయాలు
- ప్రతిగా ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రంపై దాడులు చేసిన ఇజ్రాయెల్
- ఎటూతేలని ఇరాన్, యూరప్ నేతల 'అణు' మధ్యవర్తిత్వ తొలిదఫా చర్చలు

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

ట్రాఫిక్ జామ్.. ఇలా వెళ్లండి!



హైదరాబాద్‌లో వాహన చోదకులకు ఎప్పటికప్పుడు ట్రాఫిక్ అలర్ట్స్ ఇవ్వడంపై నగర పోలీసులు–గూగుల్ ఇండియా ప్రతినిధులు కసరత్తు చేశారు. ఇప్పటికే కొన్ని మార్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. త్వరలో నగరమంతా విస్తరించే యోచనలో ఉన్నారు.

- వివరాలు 18లో▶

మిలిటరీ కాలేజీలో 'చొరబాటు'



కట్టుదిట్టమైన భద్రత ఉండే సికింద్రాబాద్‌లోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎల్రక్టానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్‌లోకి నలుగురు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి హల్‌చల్ చేశారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిని పోలీసులకు అప్పగించారు.

- వివరాలు 14లో▶

ఈఎన్‌సీ అనిల్ బదిలీ



నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) అనిల్ కుమార్‌పై ప్రభుత్వం బదిలీ వేటువేసింది. పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 5లో▶

స్మార్ట్ రింగ్‌లో.. మన ఆరోగ్యం



ఆరోగ్యాన్ని, ఫిట్‌నెస్‌నూ స్మార్ట్‌గా తెలుసుకోవడానికి వాడే స్మార్ట్ బ్యాండ్, స్మార్ట్ వాచ్‌లకు పోటీగా ఇప్పుడు స్మార్ట్ రింగ్స్ వచ్చాయి. చిన్నదే గానీ వేరబుల్స్ రంగంలో ఇవి ట్రెండ్ సృష్టిస్తున్నాయి. వినియోగంలో ఎక్కువ సౌలభ్యం ఈ రింగ్స్‌కి కలిసి వచ్చే అంశం.

- వివరాలు 2లో▶

ఇదండీ జోక్



మధ్యవర్తిత్వం, కాల్పుల విరమణ పేటెంట్ హక్కు మీది కదా సార్!!

ఎల్బీ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నటుడు తేజ సజ్జా, నటి మీనాక్షీ చౌదరి



స్థానిక సమరానికి సన్నద్ధం కావాలి

- జిల్లా, పార్లమెంట్, అసెంబ్లీ, మండలాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమిస్తాం
- పదాధికారులతో వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- అన్ని స్థానాల్లో ఒంటరి పోరాటమే ఉంటుందని వెల్లడి
- బీజేపీకి కలిసొచ్చే అంశాలు, మెరుగుపరుచుకోవాల్సిన వ్యూహాలపై చర్చ

14లో

24న టీపీసీసీ పీఏసీ భేటీ

- స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ నిర్మాణం, రాజకీయ పరిణామాలపై చర్చ
- జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక పద్ధతి ప్రకారం జరుగుతుంది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

14లో



రేకుల షెడ్డే తరగతి గది

రేకుల షెడ్‌లో బిక్కుబిక్కుమంటూ చూస్తున్న ఈ చిన్నారులు జగిత్యాల జిల్లా తాండ్రియాల జెడ్పీ పాఠశాల విద్యార్థులు. అదనపు గదులు లేకపోవడంతో ఇలా రేకుల షెడ్లలో విద్యార్థులు పాఠాలు వింటున్నారు. ఇటీవల ఈదురుగాలులకు రేకులు అస్తవ్యస్తంగా మారాయి. వీటికి కనీసం మరమ్మతులు కూడా చేసే పరిస్థితి లేదు.

వసతులు మిథ్య.. పిల్లల వ్యథ..

- విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతున్న సర్కారీ స్కూళ్లు.. శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ చదువులు
- టాయిలెట్లు, తాగునీటి వసతులకు నోచుకోని చిన్నారులు
- రాజధాని నగరంలోని ప్రభుత్వ స్కూళ్లదీ అదే పరిస్థితి
- రాష్ట్రంలో ప్రభుత్వ బడుల స్థితిగతులపై 'సాక్షి' ఫోకస్

14లో

ఆరోగ్యాన్ని, ఫిట్‌నెస్‌నూ స్మార్ట్‌గా తెలుసుకోవడానికి వాడే స్మార్ట్ బ్యాండ్, స్మార్ట్ వాచ్‌లకు పోటీగా ఇప్పుడు స్మార్ట్ రింగ్స్ వచ్చాయి. చిన్నదే గానీ వేరబుల్స్ రంగంలో ఇవి కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి. వినియోగంలో ఎక్కువ సౌలభ్యం.. 24 X 7 ధరించే వెసులుబాటు.. అధిక బ్యాటరీ సామర్థ్యం.. తేలిగ్గా, స్టైలిష్ లుక్‌తో ట్రెండీగా, ఉండటం వంటివి ఈ రింగ్స్‌కి కలిసి వచ్చే అంశాలు. నిద్ర తీరును తెలుసుకోవాలంటే స్మార్ట్ వాచ్ కంటే ఈ రింగే అత్యుత్తమం. ఇలాంటి ఎన్నో అనుకూలాంశాలు ఉన్నాయి కాబట్టే.. చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా ఈ స్మార్ట్ ఉంగరాన్ని ఎంచక్కా తొడిగేస్తున్నారు. - సాక్షి, ఫీచర్స్ - హెల్త్ డెస్క్

స్మార్ట్ రింగ్‌లో.. మన ఆరోగ్యం



స్మార్ట్ రింగ్‌లో రకరకాల సెన్సార్స్ ఉంటాయి. చర్మం కిందనున్న రక్తంలోకి ప్రసరిస్తూ హృదయ స్పందనల వేగాన్ని తెలుసుకునే ఫొటోప్లిథిస్మోగ్రఫీ (పీపీజీ) సెన్సార్స్, ఉష్ణోగ్రతను కొలిచే టెంపరేచర్ చెకర్, నడక, పరుగు, సైక్లింగ్, నిద్రలో కదలికలు, నిద్రాభంగాన్ని కొలిచే మినీ మోషన్ సెన్సార్ (యాక్సిలరేటర్), రక్తంలో ఆక్సిజన్ మోతాదులను కొలిచే ఎస్‌పీఓ–2 సెన్సార్ ఉంటాయి. సేకరించిన సమాచారం ఇందులోని బ్లూటూత్ సాయంతో యూజర్ స్మార్ట్‌ఫోన్‌లోని యాప్‌లో నిక్షిప్తం అవుతుంది. యాప్‌ను తెరిచి ఈ సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

ఉష్ణోగ్రత నుంచి గుండె స్పందనల వరకు

రక్తంలో ఆక్సిజన్ స్థాయినీ చెప్పేస్తాయి

మహిళల రుతుచక్రాల వివరాలూ నిక్షిప్తం

స్మార్ట్ వాచీలు, బ్యాండ్లకు పోటీగా మార్కెట్లోకి

నిద్ర సమస్యలు



స్మార్ట్ రింగ్ ధరించిన వారు ఉదయం ఎప్పుడు నిద్రలేస్తున్నారు, రాత్రి నిద్రను ఆపుకొంటూ ఉంటున్నారా, వారి నిద్రలో నాణ్యత ఉందా అన్న అంశాలతో పాటు నిద్రకు సంబంధించిన సమస్యలేమైనా ఉన్నాయా అని తెలుపుతుంది. అలాగే స్లీప్ ఆప్నియా సమస్యను తెలుసుకుని, మెదడుకు ఆక్సిజన్ అందనప్పుడు ఆ విషయాన్ని తెలియజేయడం, ముప్పు గురించి హెచ్చరిక పంపడం.. తద్వారా ప్రాణాలను రక్షించడమూ చేస్తుంది.

గుండె ఆరోగ్య సమాచారం



గుండె స్పందనల వేగాన్నీ, వైవిధ్యాన్ని బట్టి ఓ వ్యక్తి తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాడా, ఆ ఒత్తిడి ప్రభావం అతడి గుండె మీద ప్రతికూలంగా పడుతోందా అన్న అంశాలను తెలుసుకుంటుంది.

జ్వరం, ఇన్ఫెక్షన్ల వివరాలు



దేహ ఉష్ణోగ్రతలూ, శ్వాస వేగం వీటన్నింటి ఆధారంగా ఓ వ్యక్తికి జ్వరం ఉందా అన్న అంశాన్ని గుర్తించవచ్చు. ఉదాహరణకు ఇటీవల కోవిడ్–19 స్వైరవిహారం చేసినప్పుడు ఈ తరహా రింగ్స్ చాలా మందిని హెచ్చరిస్తూ అప్రమత్తం చేశాయి.

మహిళల ఆరోగ్యం

మహిళల శరీర ఉష్ణోగ్రత, ఇతరత్రా సమాచారంతో పాటు.. అండం ఎప్పుడు విడుదలైంది, భాగస్వామితో ఎప్పుడు కలిస్తే గర్భధారణ తేలిగ్గా జరుగుతుంది, గర్భధారణ వద్దనుకుంటే ఏ సమయంలో కలవకూడదు లాంటి సమాచారం రెడీగా దొరుకుతుంది.

రిమోట్ డాక్టర్ మానిటరింగ్

గుండె జబ్బులూ లేదా ఊపిరితిత్తుల సమస్యలున్న వృద్ధులకు 'సర్కిల్ +' లాంటి స్మార్ట్ రింగ్స్ ఎప్పటికప్పుడు డాక్టర్లకు సమాచారాన్ని తెలియజేస్తుంటాయి. తద్వారా అవసరమైన ఆరోగ్య సలహాలూ, సూచనలూ లేదా ప్రిస్క్రిప్షన్‌లో వైద్యులు మార్పులు, చేర్పులు చేస్తారు.

వేటికవే ప్రత్యేకం

ఔరా రింగ్ (యూఎస్‌ఏ): ఇది పూర్తి ఆరోగ్య సమాచారంతో పాటు నిద్రకు సంబంధించిన సమాచారాన్ని ఇస్తూ సైంటిస్టులకు బాగా ఉపయోగపడుతున్నాయి.

అల్ట్రా హ్యూమన్ రింగ్ ఎయిర్: వ్యాయామాలకూ, దేహ జీవక్రియల పనితీరును (మెటబాలిక్ రేట్ ట్రాకింగ్) గమనించేందుకు, అలాగే చక్కెర విలువలను తెలుసుకునేందుకు పనికొస్తుంది.

సర్క్యులర్ రింగ్: దీన్ని కస్టమైజ్ చేసుకోవచ్చు. అంటే మనకు కావాల్సిన సమాచారం తీసుకునేలా అవసరమైన అమరికలు జరుపుకోవచ్చు. ఇవి వైబ్రేషన్ ద్వారా హెచ్చరికలు (వైబ్రేషన్ అలర్ట్స్) కూడా పంపుతూ అప్రమత్తం చేస్తుంటాయి.

ఈవీ రింగ్ (యూఎస్‌ఏ): ఇది మహిళలకూ, యువతులకూ ఉపయోగపడేది. రుతుచక్రాల వివరాలను తెలుపుతుంది.

గో 2 స్లీప్: ఇది చైనాకు సంబంధించినది. నిద్రలో ఎవరికైనా ఊపిరి ఆగితే వెంటనే అప్రమత్తం చేసి నిద్రలేపుతుంది.

సర్కిల్ + రింగ్ (యూఎస్‌ఏ): ఇది ఆసుపత్రుల్లో రోగులకు ఉపయోగపడేది. వీటి ద్వారానే అనేక మెడికల్ రీడింగ్స్ తెలుసుకోవచ్చు. వీటిని వృద్ధులకూ వాడతారు.



వీటికీ పరిమితులు

ఇవి పూర్తిగా స్మార్ట్ అని చెప్పలేం. వీటికీ కొన్ని పరిమితులు ఉన్నాయి.

- ఫలితాలు తెలియజేసే స్క్రీన్ వీటికి ఉండదు.
- కొన్ని స్మార్ట్ వాచెస్ మాదిరిగా ఇవి ఇంకా ఈసీజీ తీసుకోలేవు.
- జీపీఎస్ లేనందువల్ల నడక, పరుగు మార్గాలను చూపలేవు.
- వీటి అలర్ట్ బజ్ శబ్దం చాలా గట్టిగా వినిపించేలా ఉండదు.

స్మార్ట్ రింగ్స్ వర్సెస్ స్మార్ట్ వాచెస్

స్మార్ట్ రింగ్స్	స్మార్ట్ వాచెస్
చిన్నగా ఉంగరంలా అమరుతాయి	పెద్దగా, గమనించదగినవిగా ఉంటాయి.
బ్యాటరీ పవర్ 4 -7 రోజులు	బ్యాటరీ కేవలం 1 - 2 రోజులు
స్క్రీన్ ఉండదు (మొబైల్ కావాలి)	స్క్రీన్ ఉంటుంది
ఫిట్‌నెస్ ట్రాకింగ్ బానే ఉంటుంది	గ్రాఫ్‌లూ, మ్యాప్‌లతో బాగా కనిపిస్తుంది కానీ జీపీఎస్ ఉండదు
సింపుల్‌గా చిన్నగా ఉంటుంది	కాస్త పెద్దగా ఉంటుంది



చివరగా... ఈ రింగ్స్ స్మార్ట్‌గా అందంగా అలంకరించుకునే ఓ చిన్ని ఉంగరంలా కనిపిస్తూ.. ఆరోగ్య రక్షణకోసం అవసరమైన అనేక రకాల సమాచారాన్ని సేకరిస్తూ.. వాటిని తొడుక్కున్నవారికీ, భవిష్యత్తులో డాక్టర్లకూ ఆ సమాచారం అందిస్తూ ఉండే ఉపకరణాలు.

మినీ ఎమర్జెన్సీ రూమ్!



ఒక్కమాటలో చెప్పాలంటే.. ఓ హాస్పిటల్‌లోని ప్రైమరీ వైటల్స్‌ను కొలిచే సాధనాలన్నీ వేలికి చుట్టుకుని ఉన్న మినీ ఎమర్జెన్సీ రూముగా ఈ ఉంగరాన్ని పరిగణించవచ్చు. అలంకార వస్తువుగానో, ఆభరణం లాగానో కాకుండా ఇవి ఆరోగ్యాన్ని తెలుసుకుని డాక్టర్లకు తెలుపుతుంటాయి. దాంతో దాన్ని ధరించిన వ్యక్తి పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నాడా లేదా అన్న అంశాన్ని డాక్టర్లు తెలుసుకుంటారు. అంతేకాదు.. కొన్నిసార్లు సైంటిస్టులకూ డేటాను అందజేస్తాయి. వాటి ఫలితాల ఆధారంగా పరిశోధకులు తమకు లభ్యమైన సమాచారం ఆధారంగా అవసరమైన విశ్లేషణలు చేస్తుంటారు.

– డాక్టర్ ఎమ్ఎస్ఎస్ ముఖర్జీ, సీనియర్ కార్డియాలజిస్ట్

విశాఖకు ప్రధాని రాక..



ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ యోగా డే ఉత్సవానికి హాజరయ్యేందుకు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం విశాఖకు చేరుకున్నారు. భువనేశ్వర్ నుంచి నేరుగా నగరానికి చేరుకున్న ఆయనను సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా తూర్పు నావికాదళం గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ప్రధాని.. శనివారం ఉ.6.25 నిమిషాలకు ఆర్‌కే బీచ్‌కు చేరుకుంటారు. అనంతరం 11.45కు విశాఖ విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీకి వెళ్తారు.

ఆంధ్రప్రదేశ్‌తో చర్చలకు సిద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

కాపాడటం చాలా ముఖ్యం. తెలంగాణ హక్కులను హరించే ఏ ప్రతిపాదనలనైనా వివిధ వేదికలపై అడ్డుకునే ప్రయత్నం చేస్తాం. ఏపీ చేపట్టిన పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు విషయంలో మేము వివాదాలు కోరుకోవడం లేదు. అదే సమయంలో మా హక్కుల విషయంలో రాజీ పడబోము..'అని సీఎం స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి ఫిర్యాదు చేసేందుకు గురువారం ఢిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

ఏపీతో సత్సంబంధాలు కోరుకుంటున్నాం..

'తెలంగాణ, ఏపీ మధ్య గోదావరి, కృష్ణా జలాల పంపిణీయే ప్రధాన సమస్య. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారం కోసం టెక్నికల్, అపెక్స్, అధికారుల కమిటీలున్నాయి. సమస్యలపై రెండు రాష్ట్రాల అధికారులు, మంత్రులు కలిసి కూర్చుని మాట్లాడుకుంటే సరిపోయేది. అలా కాకుండా బనకచర్ల ప్రాజెక్టుపై పీఎఫ్‌ఆర్ (ప్రీ ఫీజబిలిటీ రిపోర్ట్)ను కేంద్రానికి ఏపీ ప్రభుత్వం అందజేయడంతో వివాదం మొదలైంది. సమస్య ఏదైనా చర్చల ద్వారా పరిష్కారం అవుతుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సత్సంబంధాలు కోరుకున్నట్లే, తెలంగాణ కూడా ఏపీతో సత్సంబంధాలు కోరుకుంటోంది..'అని సీఎం అన్నారు.

కిషన్‌రెడ్డికి కేటీఆర్ ప్రైవేట్ ట్యూటర్

'కిషన్‌రెడ్డికి బీఆర్‌ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ ప్రైవేట్ ట్యూటర్. ఆయన ఏం చెబితే అదే చేస్తారు. కేంద్రానికి కేటీఆర్‌కు మధ్య లైజనింగ్ ఆఫీసర్. నేను కేంద్ర మంత్రులను కలుస్తానని, తనతో కలిసి రావాలని కిషన్‌రెడ్డికి ముందే లేఖ ద్వారా సమాచారం ఇచ్చా. అయినా ఆయన రాలేదు. నేను కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, మనోహర్‌లాల్ ఖట్టర్‌లను కలవడానికి ముందే.. కేటీఆర్ డైరెక్షన్ మేరకు కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు..'అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

ముందు మా ప్రాజెక్టులు పూర్తికావాలి..

'మోదీ సీట్లో కూర్చోవాలంటే చంద్రబాబు సహకారం కావాలి. బాబు మళ్లీ ఏపీలో గెలవాలంటే ఆయనకు గోదావరి నీళ్లు కావాలి. అయితే ఎవరి కోసమో మా హక్కులను వదులుకోలేము. లిటిగేషన్లు, వివాదాలతో ప్రాజెక్టులు పూర్తి కావడం లేదు. తెలంగాణలో మా ప్రాజెక్టులు పూర్తయి, పూర్తి స్థాయిలో నీటిని వినియోగించుకున్న తర్వాతే.. ఏపీ తమ ప్రాజెక్టుల గురించి ఆలోచించాలి..'అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

రాజకీయం చేస్తోంది బీఆర్‌ఎస్సే..: 'తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పదేళ్ల పాటు నీళ్లు, నిధులు, నియామకాలు అనే మోసపూరిత సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని రాజకీయం చేసింది. ఇప్పుడు అదే జలాలను ఆ పార్టీ సంజీవనిగా భావిస్తోంది. కృష్ణా–గోదావరి జలాల విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తప్పు చేసింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులే గోదావరి జలాలపై ఏపీకి అన్ని హక్కులు రాసిచ్చి తెలంగాణకు అన్యాయం చేశారు..'అని సీఎం ఆరోపించారు.

ఇంద్రావతి కట్టడి!

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తంగా 158 టీఎంసీలు) ప్రాజెక్టులు చేపట్టింది. ఇక ఏపీలో పోలవరం ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. ఇలావుండగా ఇంద్రావతిలో లభ్యత నీటిని ఛత్తీస్‌గఢ్ పూర్తి స్థాయిలో వినియోగించుకోలేక పోవడంతో.. ఈ నీటిని మిగులు జలాలుగా గుర్తించిన కేంద్రం.. నదుల అనుసంధాన ప్రతిపాదనలు చేసింది. ఇంద్రావతి బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ (అప్పటి మధ్యప్రదేశ్)కు గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన నీటిలో వాడుకోని 141.4 టీఎంసీలకు మరో 106 టీఎంసీల వరద జలాలను జతచేసి మొత్తం 247 టీఎంసీలను ఇచ్చంపల్లి–నాగార్జునసాగర్–సోమశిల మీదుగా కావేరి గ్రాండ్ ఆనకట్ట వరకు తరలించేలా నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) తొలుత ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే గోదావరిలో మిగులు, వరద జలాల నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చేవరకు అనుసంధానం పక్కన పెట్టాలని తెలంగాణ, ఏపీలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. దీంతో తొలిదశ కింద ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీలనే గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి నుంచి నీటిని తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఆవిరి, ప్రవాహ నష్టాలు పోను ఏపీకి 41.8, తెలంగాణకు 42.6, తమిళనాడుకు 38.6, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 9.8 టీఎంసీలు ప్రతిపాదించింది. దీనిపై ఛత్తీస్‌గఢ్ సర్కార్ తీవ్ర అభ్యంతరం తెలిపింది.

చెప్పినట్టే చేస్తున్న ఛత్తీస్‌గఢ్

తమకు హక్కుగా సంక్రమించిన నీటిని తరలించుకు పోతామంటే ఒప్పుకునేది లేదని, భవిష్యత్తులో ఈ నీటిని వినియోగించుకునేలా తాము ప్రాజెక్టులు చేపడతామని ఛత్తీస్‌గఢ్ తెగేసి చెప్పింది. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గఢ్ బోధ్‌ఘాట్ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్రం ముందుంచింది. ఈ ప్రాజెక్టు కింద ఇంద్రావతి నీటిని ఒడిసిపట్టేలా రూ.29 వేల కోట్లతో బోధ్‌ఘాట్ ఆనకట్టని, అదనంగా మరో రూ.20 వేల కోట్లతో మహానది–ఇంద్రావతి లింక్‌ను చేపట్టనుంది. దీనిద్వారా 300 మెగావాట్ల విద్యుదుత్పత్తితో పాటు దంతెవాడ, సుక్మా, బీజాపూర్ జిల్లాల్లోని 359 గ్రామాల పరిధిలోని 3.78 లక్షల హెక్టార్లకు (9.45 లక్షల ఎకరాలకు) సాగునీటిని అందించాలని నిర్ణయించింది. అదనంగా తాగు, పారిశ్రామిక అవసరాలకు నీటిని ఇచ్చేలా ప్రణాళికలు ఉన్నాయి.

గోదావరి–కావేరి అనుసంధానం కూడా ప్రశ్నార్థకమే..!

ఇంద్రావతి మెజారిటీ జలాలను ఛత్తీస్‌గఢ్ వినియోగించుకునే పక్షంలో గోదావరి నుంచి తెలంగాణ, ఏపీ ప్రాజెక్టులకు నీటి లభ్యత తగ్గడం ఖాయమని నీటి పారుదల నిపుణులు అంటున్నారు. అలాగే కేంద్రం ప్రతిపాదిస్తున్న నదుల అనుసంధానం కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని చెబుతున్నారు. కాగా దీనిపై తెలుగు రాష్ట్రాలు ఎలా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

చంద్రబాబుతో చర్చలు మ్యాచ్ ఫిక్సింగ్..

అపెక్స్ కౌన్సిల్ కాకుండా చర్చలు ఎందుకో?

మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ



సాక్షి, హైదరాబాద్: అపెక్స్ కౌన్సిల్‌కు డిమాండ్ చేయకుండా, చంద్రబాబుతో చర్చిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అనడం వెనుక మతలబు ఏమిటని, ఇది గురువు చంద్రబాబుకు గురుదక్షిణగా భావించాలా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను హరీశ్‌రావు ఖండించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబుతో బనకచర్ల అంశంపై ముందుగానే లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని గోదావరిలో 1,000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు ఇస్తే చాలని అనడం తెలంగాణకు తీరని ద్రోహం లాంటిదన్నారు. కృష్ణా జలాల్లో 763 టీఎంసీల వాటా కోసం కేసీఆర్ ట్రిబ్యునల్ ముందు పోరాటం చేస్తే, రేవంత్‌రెడ్డి 500 టీఎంసీలతో సరిపెట్టాలని చూడటం తెలంగాణను నిండా ముంచడమేనన్నారు. అపెక్స్ కౌన్సిల్‌లో కేసీఆర్ బనకచర్లకు ఒప్పుకున్నారనే విధంగా దుష్ప్రచారం చేస్తున్న తీరును ఇప్పటికే పూర్తి ఆధారాలతో ఎండగట్టినట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు. మన న్యాయవాదులు ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తున్నారని, రేపోమాపో మన ఆకాంక్ష మేరకు 763 టీఎంసీల వాటా సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

సన్నాల బోనస్ బోగస్ అయ్యింది: ఎన్నికల హామీల్లో అన్ని పంటలకు బోనస్ అని రైతులను మభ్యపెట్టి ఇప్పుడేమో సన్నాలకే పరిమితం చేసి, ఆ సన్నాల బోనస్‌నూ ఎగ్గొట్టి ప్రభుత్వం బోగస్‌లా చేసిందని హరీశ్‌రావు విమర్శించారు. యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ 1,161 కోట్ల బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. 4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్నాల సేకరణ చేసిన ప్రభుత్వం.. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదన్నారు.

క్లుప్తంగా...

'సాక్షి టీవీ'కి ఏపీ హైకోర్టులో ఊరట

పోలీసులు నమోదుచేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలుపుదల

సాక్షి, అమరావతి: సాక్షి టీవీ యాజమాన్యానికి హైకోర్టు ఊరటనిచ్చింది. రాజధాని అమరావతిపై సీనియర్ పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు గాను సాక్షి టీవీ యాజమాన్యంపై తుళ్లూరు పోలీసులు నమోదుచేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ హైకోర్టు నిలిపేసింది. ఫిర్యాదుదారు అయిన తెలుగుదేశం పార్టీ నేత కంభంపాటి శిరీషకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 24కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

హరీశ్‌కు కంటెంట్ లేదు.. ఆవేశమే ఉంది

భువనగిరి ఎంపీ చామల ఫైర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం బేసిక్ నాలెడ్జ్‌తో జరిగి ఉంటే బాగుండేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఉన్న అపరజ్ఞానం కారణంగానే కాళేశ్వరం కూలిపోయిందని ఎద్దేవా చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు నీళ్ల విషయంలో అన్యాయం జరిగింది బీఆర్‌ఎస్ హయాంలోనేనన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం సీట్లో కూర్చోవడాన్ని వారు చూడలేకపోతున్నారని, అందుకే హరీశ్‌రావు మాట్లాడిన దాంట్లో కంటెంట్ తక్కువ, ఆవేశం ఎక్కువ కనిపించాయని ఎద్దేవాచేశారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేశారు కాబట్టే తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్‌ను పక్కన పెట్టారని, కాంగ్రెస్ పార్టీకి బేసిక్స్ కాదు ఎథిక్స్ ఉన్నాయి కనుకనే ప్రజలు పట్టం కట్టారని చామల తెలిపారు.

పునరుద్ధరణ వ్యయం నిర్మాణ సంస్థలదే..

కాళేశ్వరం బరాజ్‌లపై సర్కార్ స్పష్టీకరణ

పరీక్షలు, ఇతర పనుల కోసం నిధులు కోరిన సీఈపై ఫైర్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చంతా నిర్మాణ సంస్థలే భరించాల్సి ఉంటుందని ప్రభుత్వం తేల్చిచెప్పింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం.. నిర్మాణ సంస్థలే ఈ బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేసింది.

ఈ విషయం మీకు తెలియదా?

ఇటీవల మూడు బరాజ్‌లకు కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన కేంద్రం (సీడబ్ల్యూపీఆర్‌ఎస్–పుణె)తో భూ సాంకేతిక, భూ భౌతిక పరీక్షలు చేయించడానికి, ఇతరత్రా పనుల కోసం రూ.19.4 కోట్లు అవుతాయని లెక్కకట్టి, ఈ నిధులను మంజూరు చేయాలని కోరుతూ గత నెల 29వ తేదీన రామగుండం చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీనిపై ఆరా తీసిన ప్రభుత్వం.. సదరు సీఈతో పాటు బరాజ్‌ల పునరుద్ధరణ కోసం డిజైన్లు జారీ చేసే విషయంలో చేతులెత్తేసిన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం 2018 మేలో పూర్తికాగా, అనుబంధ పనులు ఇంకా మిగిలి ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. 2019 నవంబర్‌లో వరదల అనంతరం బరాజ్‌ల గేట్లు మూయగానే దిగువ భాగంలోని రక్షణ వ్యవస్థలు చెల్లాచెదురు అయ్యాయని, అయినా ఆ పనులు చేయకుండా లేఖ రాసి నిర్మాణ సంస్థలు మౌనంగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. డిఫెక్ట్ లయబులిటీ కాలం (డీఎల్పీ)లోనే బరాజ్‌లు దెబ్బతిన్నందున..బరాజ్‌ల పునరుద్ధరణ కోసం చేయాల్సిన పరీక్షలతో పాటు పునరుద్ధరణ పనుల బాధ్యత కూడా నిర్మాణ సంస్థలదేనని స్పష్టం చేసింది. 'ఈ విషయం మీకు తెలియదా..?' అని ప్రశ్నిస్తూ నిర్మాణ సంస్థల చేతుల మీదుగానే ఈ పనులు జరగాలని చీఫ్ ఇంజనీర్‌కు ప్రభుత్వం స్పష్టం చేసింది.

దారికి రాకపోతే క్రిమినల్ కేసులు!


మేడిగడ్డ బరాజ్ డిజైన్లకు సీఈ సీడీవోతో పాటు ఎల్ అండ్ టీలోని డిజైన్ల విభాగం ఆమోదం తెలిపిన విషయాలు బహిర్గతమయ్యాయి. డిజైన్లు/డ్రాయింగ్ల లోపాల్లో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ పాత్ర ఉందని తేలింది. నిర్మాణ లోపాలతోనే మేడిగడ్డ కుంగిందని ఎన్డీఎస్ఏ నివేదిక కూడా తేల్చింది. మరోవైపు విజిలెన్స్ కమిషన్.. మేడిగడ్డ ఏడో బ్లాకు నిర్మాణ ఖర్చునంతా ఎల్ అండ్ టీ నుంచి వసూలు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ దారికి రాకపోతే క్రిమినల్ కేసుల దిశగా ప్రభుత్వం అడుగులు పడే అవకాశాలున్నాయి.

సీడీవోపై సర్కారు ఆగ్రహం

ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం బరాజ్‌ల పునరుద్ధరణ కోసం తగిన డిజైన్లు ఇవ్వాలని ప్రభుత్వం సీఈ సీడీవోను కోరగా..'తాము ఏమీ చేయలేమని, తమకు స్థాయి సామర్థ్యాలు లేవు..' అని బదులిచ్చారని, దీనిపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

దొరగారి అప్పులు చాంతాడంత..

రుణాలు తీరుస్తూనే సంక్షేమం కొనసాగిస్తున్నాం: పొంగులేటి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): 'గడిచిన పదేళ్లలో ఇష్టారాజ్యంగా రాష్ట్రాన్ని పాలించిన దొర గారు చేసిన అప్పులు చాంతాడంత ఉన్నాయి.. అయినా ఓ పక్క అప్పులు తీరుస్తూనే అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నాం' అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డి మండలాల్లో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే, అన్నపురెడ్డిపల్లి మండలంలోని మర్రిగూడెంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేయడంతో పాటు పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని తమ ప్రభుత్వం రెండు కళ్లలా భావిస్తోందని తెలిపారు. రూ.లక్షల కోట్ల అప్పుల భారం మోస్తూనే ప్రజలు ఇబ్బంది పడకుండా పాలన సాగిస్తున్నామని చెప్పారు.

బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయాలి: కూనంనేని

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును వెంటనే అడ్డుకోవాలని, ఈ ప్రాజెక్టును నిర్మించకుండా నిలిపివేసేందుకు కేంద్రంపై ఒత్తిడి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గోదావరిపై ప్రాజెక్టు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతి పదికన తలపెట్టాలని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణ హిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిలిపి వేయాలని, అఖిలపక్ష పార్టీలు, నిపుణులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.


పోలవరంతో భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు



- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పోలవరం ముంపుపై రౌండ్ టేబుల్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచడంతో తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, దీంతో భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని, ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఐదు ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రగతి ఎజెండా పేరిట ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించబోయే సమావేశంలో ఈ అంశంపై చర్చించాలని కోరారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను ఈనెల 25న నిర్వహించే ప్రగతి ఎజెండా సమావేశంలో ప్రధాని ముందు పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆమె లేఖ రాశారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని చెప్పారు. దేవుడేమో తెలంగాణలో, దేవుడి మాన్యం భూములు మాత్రం ఆంధ్రాకి పోయాయన్నారు. సమావేశంలో సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎం సొంత జిల్లాలో పరిస్థితి దారుణం'



సాక్షి, హైదరాబాద్: 'పాల మూరు–రంగారెడ్డి ద్వారా ఆరు నెలల్లో నీళ్లు ఇస్తామన్నారు. అలాంటి ఆరు నెలలు ఎన్నో గడిచి పోయాయి. అయినా నీళ్లు రాలేదు. సీఎం సొంత జిల్లాలోనే ఈ దుస్థితి ఇలా ఉంటే ఎలా? అసలు మహబూబ్ నగర్‌ను ఏం చేయదలుచుకున్నారు?' అని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు పడుతుంటే రిజర్వాయర్లు నింపుకోవాలని ఎవరైనా చూస్తారు కానీ ఈ ప్రభుత్వానికి అలాంటి ఆలోచన లేదని విమర్శించారు. కరువు పీడిత జిల్లాలైన మహబూబ్‌నగర్, నల్గొండల్లో వచ్చిన వరదతో రిజర్వాయర్లు నింపే ఆనవాయితీ ఉండేదన్నారు. ఆల్మట్టి, తుంగభద్ర నుంచి నీళ్లు వస్తున్నా వాటిని వాడుకోవాలనే ఆలోచన లేదని పేర్కొన్నారు.

కవాతును నడిపించేది బ్రాస్ బ్యాండ్ బృందాలే : డీజీపీ

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లలో కవాతును నడిపించేది బ్రాస్ బ్యాండ్ బృందాలే అని డీజీపీ జితేందర్ అన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో రాష్ట్రంలోని వివిధ యూనిట్ల నుంచి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డులు కలిపి 53 మంది బ్రాస్ బ్యాండ్, బిగులర్ శిక్షణ పొందారు. ఈ శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం పోలీస్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.


ఇంటర్ కాలేజీల్లో జేఈఈ, నీట్ ఆన్‌లైన్ కోచింగ్

- ఫిజిక్స్‌వాలా భాగస్వామ్యంతో జూలై నుంచి మొదలు
- ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థులకు జేఈఈ, నీట్, సీఎల్ఏటీ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా నాణ్యమైన ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఎడ్‌టెక్ సంస్థ ఫిజిక్స్‌వాలా భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 'తెలంగాణ అచీవర్స్–2025' పేరుతో జూలై నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం డిసెంబర్ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా నేతృత్వంలో శుక్రవారం ఈ కార్యక్రమంపై సమీక్షించారు. విద్యార్థులకు కాలేజీ ప్రిన్సిపాళ్లు ఆన్‌లైన్‌కు సంబంధించిన లాగిన్ అందజేస్తారని తెలిపారు. విద్యార్థుల పురోగతిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అధికారులకు సూచించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంపై ముందుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని ప్రిన్సిపాళ్లను కోరారు. సర్వశిక్ష అభియాన్ ద్వారా కాలేజీల్లో క్రీడా పరికరాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, ఇంటర్ పరీక్షల నియంత్రణ అధికారి జయప్రద బాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌పై అట్రాసిటీ కేసులో తీర్పు రిజర్వు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై 2016లో దాఖలైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి గ్రామం సర్వే నంబర్ 127లోని 31.5 ఎకరాలపై ఫిర్యాదుదారు(డీఫ్యాక్టో కంప్లైనెంట్) పెద్దిరాజుకు, ఎనుముల సోదరుల మధ్య వివాదం ఉంది. తన భూమిలోకి అక్రమంగా చొరబడి జేసీబీతో సొసైటీకి చెందిన గదిని కూల్చివేశారని, అంతేకాకుండా తనను కులంపేరుతో అసభ్యకరంగా దూషించారని పెద్దిరాజు (ఫిర్యాదుదారు) ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కొండల్‌రెడ్డిని ఏ–1గా, ఇ.లక్ష్మిని ఏ–2గా, రేవంత్‌రెడ్డిని ఏ–3గా పేర్కొంటూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2016, జనవరి 13న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో దాఖలైన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ 2020లో రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజకీయ ప్రేరేపితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌసమీ భట్టాచార్య శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. ఘటనా ప్రదేశంలో రేవంత్ లేకున్నా తప్పుడు కేసు నమోదు చేశారని, అది చెల్లదని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది రఘు వాదించారు. గతంలో ఇదే ఫిర్యాదుదారు.. రేవంత్‌పై మరో పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టగా, దాన్ని కోర్టు కొట్టివేసిందని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వెల్లడించారు. పెద్దిరాజు తరఫున నారాయణ వాదనలు వినిపిస్తూ.. ఫిర్యాదుదారును కొండల్‌రెడ్డి కులంపేరుతో దూషించడంతోపాటు రేవంత్ సూచన మేరకు కూల్చివేస్తున్నామన్నారన్నారు. వాదనలు పూర్తి కావడంతో న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు.

బడిబాట విజయవంతంలో పీఆర్టీయూటీఎస్ కృషి భేష్: ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పీఆర్టీయూటీఎస్ కృషిని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అభినందించారు. తన పిలుపు మేరకు క్షేత్రస్థాయిలో శక్తి వంచన లేకుండా కృషి చేసిన ఉపాధ్యాయ మిత్రులకు ఆయన అభినందనలు తెలిపారు. పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డితో కలిసి శుక్రవారం బడిబాట కార్యక్రమంపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు జరుగుతున్న కృషి, అర్హత గల ఉపాధ్యాయులతో బోధన, వ్యక్తిగత వికాసం పెంచే నైపుణ్యాలు ప్రభుత్వ బడుల్లోనే సాధ్యమన్న అవగాహనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సంఘం విజయవంతమైందన్నారు. బడిబాట నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను అన్ని జిల్లాల టీచర్ల నుంచి తీసుకోవాలని, వీటిని ప్రభుత్వానికి సూచనల రూపంలో నివేదిక ఇవ్వాలని నేతలు అభిప్రాయపడ్డారు.

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తానికి 23 నుంచి దరఖాస్తులు: సింగరేణి సీఎండీ బలరాం



సాక్షి, హైదరాబాద్: రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకానికి ఈనెల 23 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఎంపికైన విద్యార్థి ఒక్కొక్కరికీ రూ.లక్ష రూపాయలు అందిస్తామన్నారు. సింగరేణి సామాజిక బాధ్యత నిధుల నుంచి పారితోషికం ఇస్తామని చెప్పారు. గతేడాది 140 మంది ప్రిలిమ్స్ పాసైన వారికి సాయం చేశామని, వీరిలో 20 మంది మెయిన్స్‌లోనూ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి మరో రూ.లక్ష సాయం కూడా అందించామని, వారిలో ఏడుగురు సివిల్స్‌లో సత్తా చాటారని వెల్లడించారు. అర్హతగల అభ్యర్థులు www.scclmines.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బలరాం సూచించారు.

'పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి'

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ఇందిరాపార్క్ వద్ద సర్పంచుల సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పెండింగ్ బిల్లులు విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని నిర్ణయించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య, తెలంగాణ సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీజీఎడ్‌సెట్-25 ఫలితాలు విడుదల

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో 2025–2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 1న నిర్వహించిన టీజీఎడ్‌సెట్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేయనున్నట్లు టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. ఫలితాలను హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మధ్యాహ్నం 2.45 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి విడుదల చేస్తారని పేర్కొన్నారు. ఈనెల 1న రెండు సెషన్‌లలో కలిపి ఎడ్‌సెట్‌కు 32,106 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇప్పటికే ప్రీప్రైమరీ 'కీ'ని విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. శనివారం ఫైనల్ 'కీ'తో పాటు ఫలితాలు విడుదల చేస్తారు. ఫలితాలను వెంటనే సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

> ఎపుడెవుడు ధర్మములకు గ్లాని ఏర్పడి అధర్మము వృద్ధి చెందుచున్నదో, అపుడు నన్ను నేను తయారుచేసుకొని భూమిమీద పుట్టుచున్నాను.
> – హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 21 జూన్ 2025

ఎయిరిండియా రద్దుల పద్దు!

చూడబోతే ఎయిరిండియాకు కష్టాలన్నీ ఒక్కసారే కట్టగట్టుకుని వచ్చినట్టున్నాయి. ఈ నెల 12న గుజరాత్‌లో జరిగిన దురదృష్ట ఘటనలో 272 మంది మరణించిన తర్వాత ఎయిరిండియా విమానాలు ఎక్కాలన్నా, ప్రత్యేకించి ప్రమాదం సంభవించిన బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ రకం విమానాల్లో ప్రయాణించాలన్నా చాలామంది భయపడుతున్నారు. అందుకు తగినట్టే ఆ సంస్థ అంతర్జాతీయ, దేశీయ మార్గాల్లో వినియోగించే దాదాపు 90 విమాన సర్వీసుల్ని అంచెలంచెలుగా రద్దుచేస్తూ పోతోంది. శుక్రవారం కూడా ఎనిమిది విమానాలు రద్దయ్యాయి. నిర్వహణాపరమైన, సాంకేతికమైన సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ చెబుతోంది. వీటికితోడు పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇరాన్ గగనతలాన్ని మూసివేయటం వంటివి కూడా విమాన సర్వీసుల రద్దుకు దోహదపడ్డాయి. జూలై రెండో వారం వరకూ అంతర్జాతీయ విమాన సర్వీసులు 15 శాతం మేర తగ్గించనున్నామని ఎయిరిండియా ప్రకటించింది. ప్రయాణికులు కూడా ఏమంత భరోసాతో లేరు. అసలు విమానయానమే వద్దనుకున్నవారు కొందరైతే, బోయింగ్ విమానాలు ఎక్కరాదని మరికొందరు నిర్ణయించుకుని ప్రయాణాలు రద్దుచేసుకున్నారు.

విమానయాన సంస్థలను నియంత్రించే పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఎయిరిండియా విమానాల్లో భద్రతకు సంబంధించిన ప్రధాన లోపాలేమీ లేవని, కేవలం నిర్వహణాపరమైన సమస్యలే ఉన్నాయని చెబుతోంది. భిన్న విభాగాల మధ్య సమన్వయం అవసరమవుతుందని సలహా ఇచ్చింది. ఎక్కడ ఏ చిన్న లోపాన్ని గమనించినా దాన్ని నమోదు చేయటం, వెనువెంటనే సరిదిద్దటం వంటివి జరగాలని సూచించింది. ఎయిర్‌లైన్స్ సంస్థలకు రేటింగ్ ఇచ్చే అంతర్జాతీయ స్వతంత్ర ఆన్‌లైన్ సంస్థ పరిశీలనలో ఇండిగో, ఆకాశ సంస్థలు ఏడు అంశాల్లో ఆరు పాయింట్లు సాధించాయి. స్పైస్ జెట్ ఏడుకు ఏడు పాయింట్లు పొందగా, ఎయిరిండియా కేవలం నాలుగు పాయింట్లే సాధించటం గమనించదగ్గ అంశం. ఇక బోయింగ్ డ్రీమ్‌లైనర్ భద్రతా లోపాలపై ఫిర్యాదు చేసిన ఇంజినీర్ జార్జి బార్నెట్ అనుమానాస్పద స్థితిలో నిరుడు మార్చిలో మరణించిన ఉదంతం కలవరపరుస్తుంది. ఆ సంస్థ క్వాలిటీ కంట్రోల్‌లో 32 ఏళ్లు పనిచేసిన బార్నెట్ రెండ్రోజులు విచారణకు హాజరై మూడో రోజు ఎందుకు తుపాకీతో కాల్చుకుంటాడన్నది ప్రశ్నార్థకమైంది.

టాటా ఎయిర్‌లైన్స్‌గా ఉన్న సంస్థను 1953లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జాతీయం చేసి, ఎయిరిండియాగా నామకరణం చేశారు. దేశీయ విమాన సర్వీసుల కోసం ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఆవిర్భవించింది. ఈ రెండూ పబ్లిక్ రంగ సంస్థలు కావటంతో పౌర విమానయాన రంగంలో అవి దిగ్గజ సంస్థలుగా వెలిగాయి. కానీ దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలై విమానయానంలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించటం, తక్కువ ధరకే ప్రయాణికులను చేరవేసే సంప్రదాయాన్ని ప్రారంభించటంతో అంతక్రితమే నష్టాలతో ఉన్న ఆ సంస్థ మరింతగా కుంగిపోవటం మొదలైంది. అసలు విమానయాన రంగంలో ప్రైవేటును అనుమతించినప్పుడే ఎయిరిండియా నిర్వహణను పూర్తిగా నిపుణులకు వదిలేయాల్సింది. కానీ పగ్గాలు ప్రభుత్వం దగ్గరే ఉండటం, దానికి లోబడి సంస్థ పనిచేయాల్సి రావటంతో ఎన్నో సమస్యలు చుట్టుముట్టాయి.

టాటా సన్స్ 2022లో ఎయిరిండియాను తీసుకున్నప్పుడు విమానయాన రంగాన్నే సంపూర్ణంగా మారుస్తామని ప్రకటించింది. దశాబ్దాల అసమర్థ ఉద్యోగస్వామ్యాన్ని తొలగించి, గర్వించదగిన గొప్ప సంస్థగా తీర్చిదిద్దుతామని తెలిపింది. మూడేళ్లు గడిచాయి. కానీ చెప్పుకోదగ్గ మార్పుల జాడ లేదు. అలాగని ఎయిరిండియా ఏమీ చేయలేదని కాదు. సిబ్బందికి పునఃశిక్షణనిచ్చింది. వారి యూనిఫాంని మార్చింది. యాప్‌ను సరికొత్తగా తీసుకొచ్చింది. అయితే, ప్రాణం మీదికొచ్చే ప్రమాదాలు జరగలేదన్న మాటేగానీ లోపాల పరంపర గురించిన ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఇందులో పారిశుద్ధ్యం మొదలుకొని విరిగిపోయిన సీట్లు, నాసిరకం ఉపకరణాలు వగైరాలున్నాయి. అయినా పెద్దగా ఫలితం లేదు. ఇక అస్వస్థతగా ఉండి సెలవు పెట్టినవారిని సైతం ఒత్తిడి తెచ్చి విధి నిర్వహణకు పిలిచిన సందర్భాలున్నాయని పైలెట్ల ఫిర్యాదు. ఇవన్నీ విడివిడి ఘటనలుగా కొట్టిపారేయటం కాక వాటివెనక అల్లుకునివున్న నిర్లక్ష్యాన్నీ, అలసత్వాన్నీ సకాలంలో గమనించుకుంటే పరిస్థితి మెరుగుపడేది. నిరుడు ఢిల్లీ–శాన్‌ఫ్రాన్సిస్కో సర్వీస్ విమానం ఇంజన్ వైఫల్యం కారణంగా రష్యాలో రోజుల తరబడి నిలిచిపోయింది. మరుగుదొడ్లు పనిచేయక చికాగోకు బయల్దేరిన విమానం కాసేపటికే వెనుదిరిగింది. టాటా బ్రాండ్‌కు మార్కెట్‌లో మంచి పేరుంది. వాటి ఉత్పత్తులపై వినియోగదారుల్లో విశ్వాసం ఉంది. ఎయిరిండియా దాన్ని అందుకోలేకపోయింది.

నిరుడు మే నెలలో ముంబై–లండన్ సర్వీసు బోయింగ్ 787 విమానంలో తలుపు సరిగా పనిచేయటం లేదంటూ ఫిర్యాదు చేశాక, దాన్ని వెనక్కు తీసుకోవాలని తమపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చారని, నిరాకరించినందుకు షోకాజ్ నోటీసులు జారీచేసి, 48 గంటలు దాటకుండా ఉద్యోగం నుంచి తొలగించారని సీనియర్ ఫ్లయిట్ అటెండెంట్లు ఇద్దరు ఈ మధ్యే ప్రధాని నరేంద్ర మోదీకి ఫిర్యాదు చేయటం గమనించదగ్గది. ప్రవర్తన సరిగా లేకపోవటం, విధి నిర్వహణ సక్రమంగా చేయకపోవటం వంటి కారణాలతోనే వారిని తొలగించామని సంస్థ సంజాయిషీ ఇస్తోంది. అంతా సవ్యంగా గడిచినంతకాలం నిర్వాహకులు తమను తాము అభినందించుకుంటూ కాలం గడుపుతారు. ఎప్పటికప్పుడు తనిఖీ చేసే నియంత్రణ వ్యవస్థ ఉంటే ఇలాంటివి చోటుచేసుకోవు. ఈ విషాద ఘటన నుంచి అయినా గుణపాఠం నేర్చుకోవాలి. అత్యంత జాగరూకతతో మెలగాలి.

అణు ఉపద్రవం

విశ్లేషణ



మనోజ్ జోషి

"ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయకుండా (అమెరికా) పరిస్థితిని నిరంతరం మదింపు చేస్తోంది. (ఇరాన్) 2003లో పక్కనపెట్టిన అణ్వాయుధాల నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు సర్వోన్నత నాయకుడు ఖొమేనీ ఆదేశించలేదు" అని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబార్డ్ ఈ ఏడాది మార్చి 26న చెప్పారు. అయినా, ఇరాన్ అణ్వాయుధాల నిర్మాణ సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు 'ముందస్తు' చర్యగా పేర్కొంటూ ఇజ్రాయెల్ ఈ జూన్ 13న దాడులు ప్రారంభించింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చర్యను నిర్లక్ష్య పూరిత దుందుడుకు చర్య.

ఇరాన్‌లో ఉన్న ప్రభుత్వం అక్కడి ప్రజలందరికీ ఆమోదయోగ్యమైందని చెప్పలేం. ఇజ్రాయెల్‌లో ఉన్న ప్రభుత్వం కూడా అలాంటిదే. అయినా ఇరాన్‌పై దాడికి దిగే హక్కు దానికి లేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. అణ్వాయుధాన్ని నిర్మించగలిగిన స్థితికి ఇరాన్ చాలా దగ్గరలో ఉందనే ఇజ్రాయెల్ అభిప్రాయం ట్రంప్ మనసులో నాటుకుంది. దాంతో ఆయన ఇంటెలిజెన్స్ అంచనాను పక్కనపెట్టేశారు.

చేయాలనుకుంటే ఆపగలరా?

ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడం, అక్కడ అధికారం చేతులు మారేటట్లు చూడటం ఇజ్రాయెల్ ఆశయాలు. ఆ రెంటిలో ఏదీ తేలికైనది కాదు. ఇరాన్ అణ్వాయుధాన్ని నిర్మించకుండా జాప్యం చేయగలిగిన సత్తా ఇజ్రాయెల్ సొంతం ఏమీ కాదని ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఎహూద్ బరాక్ ఈమధ్య అన్నారు. "బహుశా కొన్ని వారాలు ఆపగలం... ఓ నెల ఆపగలం... అమెరికా కూడా దాన్ని కొద్ది నెలలపాటే అడ్డుకోగలదేమో" అన్నారాయన.

ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థతోపాటు నటాంజ్‌లో ఉన్న ముఖ్యమైన యురేనియం శుద్ధి సదుపాయాన్ని, ఇస్ఫహాన్ న్యూక్లియర్ టెక్నాలజీ సెంటర్‌ను ఇజ్రాయెల్ తీవ్రంగా ధ్వంసం చేయగలిగిందని ప్రస్తుత మదింపులు సూచిస్తున్నాయి. కానీ అరాక్ న్యూక్లియర్ కాంప్లెక్స్ చాలా వరకు చెక్కుచెదరకుండానే ఉందని చెబుతున్నారు.

అన్నింటికన్నా ముఖ్యంగా, ఫర్దోలో ఉన్న ఇంధన శుద్ధి భూగర్భ కేంద్రానికి కూడా ఇంతవరకు వాటిల్లిన నష్టం ఏమీ లేదు. ఈ సదుపాయం చాలా కీలకమైంది. ఎందుకంటే, ఇరాన్ వద్ద 60 శాతం శుద్ధి అయిన యురేనియం ఉంది. అణ్వాయుధాన్ని నిర్మించడానికి 90 శాతం శుద్ధి అయిన యురేనియం అవసరం. ఆ పనిని ఫర్దో సదుపాయం వారం రోజుల్లో చేసిపెట్టగలదు. ఇరాన్ వద్ద 2025 మే నాటికి 408.6 కిలోల శుద్ధి చేసిన యురేనియం ఉందని అంచనా. దానిని మరింత శుద్ధి చేస్తే, రానున్న వారాల్లో తొమ్మిది అణ్వాయుధాల తయారీకి సరిపోతుంది.

అమెరికా భాగస్వామ్యం ఎంత?

భారీ మందుగుండు సామగ్రితో కూడిన ఎయిర్ బ్లాస్ట్ బాంబు (ఎంఏబీ) మాత్రమే ఫర్దోను ధ్వంసం చేయగలదు. అది ఇజ్రాయెల్ వద్ద లేదు. అమెరికా రంగంలోకి దిగితేనే దాన్ని ధ్వంసం చేయడం సాధ్యం. అణ్వాయుధాలను సమకూర్చుకునేందుకు ఇరాన్ ఇరవై ఏళ్ళ పైనుంచి కృషి చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ చెక్కుచెదరని భూగర్భ సదుపాయాలను కూడా అది నిర్మించుకుంది.

గగనతల దాడులొక్కటే ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించలేవు. పదాతి దళాలతో భూతల ఆక్రమణ కూడా అవసరమవుతుంది. అమెరికా పాత్ర ఇక్కడే అవసరం పడుతుంది. ఇరాన్ 'బేషరతుగా లొంగిపోవడం' ట్రంప్ డిమాండ్లలో ముఖ్యమైంది. వెనుతిరిగి చూస్తే, ఇరాన్‌పై యుద్ధం అమెరికా–ఇజ్రాయెల్ కలసి చేసిన పనేనేమో అనిపిస్తుంది. బేషరతుగా లొంగిపొమ్మనడం, ప్రభుత్వాన్ని మార్చుకొమ్మని చెప్పడం వల్ల, ఇరాన్ నిజంగానే అణ్వాయుధ నిర్మాణ దిశగా అడుగు వేయవచ్చు. ఇరాన్ అలాంటి ఆయుధాలను నియోగించకుండా నివారించేందుకు ఇజ్రాయెల్, అమెరికాలు అణ్వాయుధాలను అమ్ములపొదుల నుంచి బయటకు తీయవలసి రావచ్చు. అణ్వాయుధాల ప్రయోగమే జరిగితే అది ప్రపంచానికంతటికీ వినాశకరం.

నిజానికి, ఇజ్రాయెల్‌ను దృష్టిలో పెట్టుకుని ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టలేదు. ఇరాక్ కారణంగా ఆ పని చేసింది. ఇరాన్–ఇరాక్‌ల మధ్య 1980–88 వరకు సాగిన యుద్ధం అందుకు ప్రేరణగా నిలిచింది. అమెరికా సాయంతోనే ఇరాన్‌పై దాడికి ఇరాక్ ఉపక్రమించింది. ఇరాన్‌లోని నగరాలపై ఇరాక్ రసాయనిక ఆయుధాలు, క్షిపణులతో దాడులకు దిగినా ప్రపంచ దేశాలు చాలావరకు మిన్నకుండిపోయాయి. దాంతో 1980ల మధ్య నుంచి ఇరాన్ సైనిక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే, ఇరాక్‌పై 2003లో అమెరికా దాడి చేసిన తర్వాతనే, అణ్వాయుధాలు లేనిదే తన భద్రతకు పూచీ ఉండదని ఇరాన్ భావించడం మొదలుపెట్టింది.

ఇరానియన్లకు చరిత్ర పట్ల చక్కని అవగాహనతోపాటు జాతీయతా భావాలు మెండు. ఇరాక్‌లో మాదిరిగానే ఇరాన్‌లో కూడా అపార విధ్వంసానికి పాల్పడటంలో, ఆ దేశాన్ని బలహీనపరచడంలో అమెరికా–ఇజ్రాయెల్ విజయం సాధించవచ్చు. ప్రభుత్వాన్ని మార్చడంలోనూ సఫలం కావచ్చు. కానీ, కథ అంతటితో కంచికి పోదు.



ఇరాన్ వద్ద 2025 మే నాటికి 408.6 కిలోల శుద్ధి చేసిన యురేనియం ఉందని అంచనా. దానిని మరింత శుద్ధి చేస్తే, రానున్న వారాల్లో ఇరాన్ తొమ్మిది అణ్వాయుధాలు తయారు చేయవచ్చు.

వ్యాసకర్త ఢిల్లీలోని అబ్జర్వర్ రిసెర్చ్ ఫౌండేషన్‌లో విశిష్ట సభ్యుడు

మనకు పరీక్ష

విశ్లేషణ



శ్యామ్ శరణ్

మనకు సంబంధం లేని సమస్య మన తలకు చుట్టుకోవడమంటే ఇదే. ప్రాంతీయ ఘర్షణలు లేదా అంతర్జాతీయ సంక్షోభాలు తరచు భారత్‌కు లేనిపోని కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ఇవి మన విదేశాంగ విధానానికి, భద్రతకు సంబంధించి ఊహించని సవాళ్లను విసురుతున్నాయి. సాపేక్షంగా చూస్తే, మనం ఇరాన్‌తో సుహృద్భావ వాతావరణాన్ని నిలబెట్టుకుంటున్నాం. అటు పశ్చిమాసియా, గల్ఫ్ దేశాలతో, ఇటు ఇజ్రాయెల్‌తో సమాంతరంగా మనం ఎంతో జాగ్రత్తగా సన్నిహిత రాజకీయ, భద్రతా, ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూ గడించుకున్న ప్రయోజనాలకు ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం గొడ్డలిపెట్టు.

ఇరు పక్షాలూ కావాల్సినవే!

పరస్పరం శత్రువులుగా ఉన్న దేశాలు మనతో మాత్రం మైత్రిని కొనసాగించేటట్లు చేయడంలో భారత్ ఇంతవరకు గణనీయమైన నిపుణతను ప్రదర్శించింది. భారతదేశ రక్షణ, భద్రతా సామర్థ్యాలను పెంపొందించడంలో ఇజ్రాయెల్ కీలక భాగస్వామిగా ఉంది. ఇటీవల మనకు పాకిస్తాన్‌తో తలెత్తిన సైనిక ఘర్షణలో అది మనకు ఎంతగా ఉపయోగపడిందో చూశాం. నిజానికి, కొన్ని అంశాల్లో ఇజ్రాయెల్‌తో కలిసి పనిచేయాలని కొన్ని ముఖ్యమైన గల్ఫ్ దేశాలే కోరుకుంటూండటంతో, దానితో మైత్రిని కాపాడుకుంటూనే, పశ్చిమాన పొరుగునున్న అన్ని ముఖ్యమైన దేశాలతో స్నేహ సంబంధాలను సుస్థిరపరచుకునేందుకు మనకొక మహత్తర అవకాశం లభించింది. ఈ దేశాల్లో అమెరికా కూడా ఉంది. దానికి ఈ ప్రాంతంలో భద్రతాపరంగా పటిష్ఠమైన ఉనికి ఉంది.

గల్ఫ్‌కు సంబంధించి భారత్–అమెరికా మధ్యనున్న లోపాయకారీ అవగాహన భారత్–ఇజ్రాయెల్‌లను, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లను ఒక గ్రూపుగా చేర్చింది. ఈ నాలుగు దేశాల గ్రూపును పశ్చిమ దేశాలవారు 'క్వాడ్'గా పిలుచుకుంటున్నారు. దీన్నే ఐ2యు2గా కూడా పిలుస్తున్నారు. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో భద్రతకు బాధ్యత వహించే అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయం (సెంట్ కామ్)లో ఒక భారతీయ అనుసంధాన అధికారి కూడా ఉన్నారు. సాపేక్షంగా చూస్తే, ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలకు అవకాశం ఉందనే అంచనాతోనే భారత్–మధ్య ప్రాచ్య–యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఇసి) ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టే ప్రయత్నం చేశారు. భారత్–గల్ఫ్ మధ్య ఏర్పాటు చేసే ఈ రవాణా కారిడార్ ఇజ్రాయెల్‌లోని హైఫా నౌకాశ్రయం వరకు వెళుతుంది.

ఇరాన్, తుర్కియే ఆ ప్రయత్నాల పట్ల సంతోషంగా లేవు. ప్రాజెక్టులో తమ పాత్ర లేదని కినుక వహించాయి. కానీ, ఆ రెండు దేశాలతోనూ సత్సంబంధాలను కొనసాగిస్తూ భారత్ జాగ్రత్తపడింది. 'లుక్ వెస్ట్ పాలసీ' భారత్ ఇంధన భద్రతను పెంపొందించడంలో, విస్తరిస్తున్న మార్కెట్లను, పెట్టుబడి వనరులను కనుగొనడంలో సఫలమైంది. ఆ ప్రాంతంలో బతుకుబండి లాగిస్తున్న 90 లక్షల మంది భారతీయుల సంక్షేమానికి తోడ్పడింది.

మున్ముందు ఈ వైఖరి సాధ్యమా?

గాజాలో 2023లో మొదలైన యుద్ధంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఇజ్రాయెల్, పాలస్తీనా రెండూ పక్కపక్కన రెండు స్వతంత్ర, సార్వభౌమాధికార రాజ్యాలుగా ఉండాలనే మూసపోసిన ప్రకటనలనే భారత్ విడుదల చేసింది. ఇజ్రాయెల్‌ను విమర్శిస్తూ ఐరాస చేసిన తీర్మానాలు ఓటింగుకు వచ్చినపుడు భారత్ గైర్హాజరైంది. గల్ఫ్, అరబ్ దేశాలతో మన సంబంధాలపై అదృష్టవశాత్తు, అది ఇంతవరకు ప్రతికూల ప్రభావాన్ని చూపలేదు. కానీ, వెస్ట్ బ్యాంక్, గాజాలలో జాతి నిర్మూలన విధానాలను ఇజ్రాయెల్ స్పష్టమైన రీతిలో అనుసరిస్తూండటంతో ఆ ప్రాంతం పట్ల ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాన్ని భారత్ కొనసాగించడం ఇకపై కష్టం. కవ్వింపు లేకుండానే ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన తాజా దాడులతో పరిస్థితి జటిలమైంది.

ఇజ్రాయెల్ దాడులకు భారత్ మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు. ఇజ్రాయెల్‌తో మన భాగస్వామ్యం, ప్రాంతీయ శాంతి, సుస్థిరతతో ముడిపడిన మన గణనీయ ప్రయోజనాలను కాపాడుకోనివ్వకుండా అడ్డుపడుతోందా?

అమెరికా లోపాయకారీగా ఆమోదం తెలుపనిదే ఇజ్రాయెల్ ఈ 'రైజింగ్ లయన్' ఆపరేషన్‌కు దిగి ఉండదు. అణ్వస్త్ర సహిత దేశంగా ఇరాన్ అవతరించకుండా నిరోధించడానికి ఇజ్రాయెల్ ఎంత పట్టుదలతో ఉందో అమెరికా కూడా అంతే దృఢ నిశ్చయంతో ఉంది. ఆరంభపు దాడులను ఇజ్రాయెల్ నిర్వహించినా, ప్రాణాంతక తదుపరి దాడులను అమెరికా చేపట్టవచ్చు. ఇజ్రాయెల్ వద్ద లేని బంకర్–బస్టింగ్ బాంబులు దానివద్ద ఉన్నాయి. నటాంజ్, ఫర్దో అనే రెండుచోట్ల భూగర్భ అణు సదుపాయాలను ఇరాన్ నిర్మించుకుంది. ఆ బాంబులు ఈ భూగర్భ సదుపాయాలను కూడా ధ్వంసం చేయవచ్చు. ఇరాన్‌పై దాడులను అరబ్, గల్ఫ్ దేశాలు పైకి విమర్శించినా, దాని అణ్వస్త్ర నిర్మాణ సామర్థ్య సదుపాయాలు కుప్పకూలడం వల్ల అవి లోలోపల సంతోషిస్తున్నాయని అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తున్నాయి.

ఇస్లామిక్ రిపబ్లిక్‌గా అవతరించాక, ఇరాక్‌తో ఎనిమిదేళ్ళపాటు సాగిన యుద్ధం తర్వాత ఏర్పడిన బలహీన స్థితిని మినహాయిస్తే– నేడున్నంత బలహీన స్థితిలో ఇరాన్ ఎన్నడూ లేదు. భారతదేశ దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా, పటిష్ఠమైన, స్థిరమైన, స్నేహపూర్వకమైన ఇరాన్ ఒక అమూల్యమైన ఆస్తి. పశ్చిమం వైపు దృష్టి సారిస్తున్న మన విధానం ఈ వాస్తవికతను కూడా ప్రతిబింబించి తీరాలి.

భారత దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా, స్నేహపూర్వకమైన ఇరాన్ ఒక అమూల్యమైన ఆస్తి. ఇక భారత్ రక్షణ, భద్రతా సామర్థ్యాలను పెంపొందించడంలో ఇజ్రాయెల్ కీలక భాగస్వామి.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి, ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ఇన్‌బాక్స్

తెలంగాణ మార్గదర్శి

తెలంగాణలోని ప్రతీ పల్లె ఆయన మాటతో పోరాట గుత్ప అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద, విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభల్లో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినిపించిన పోరాట శీలి. ఆయనే ప్రొఫెసర్ జయశంకర్.



ప్రొఫెసర్ జయశంకర్

జయశంకర్ సార్ 1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లా, ఆత్మకూరు మండలం, అక్కంపేటలో జన్మించారు. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోయారు. హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా ఆయన 1954లో 'ఫజల్ అలీ కమిషన్'కు నివేదిక ఇచ్చారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్తగా, కేసీఆర్‌కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించారు. 'మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి. మా తెలంగాణ మాగ్గావాలి' అంటూ పోరాటం, అవగాహన, రాజకీయ ప్రక్రియ... ఈ మూడు ఏకకాలంలో జరగాలని, ఆ దిశగా నిత్యం తెలంగాణ ప్రజల్లో చైతన్య దివిటీని వెలిగించారు. 'ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్లారా చూడాలి, తర్వాత మరణించాలి' అని అనేవారు. కానీ క్యాన్సర్ రూపంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందే 2011 జూన్ 21న జయశంకర్ సార్ మరణించారు. కానీ ఆయన చూపిన మార్గం, ఉద్యమ పాఠాలు, చైతన్యం యావత్తు తెలంగాణ సమాజం గుండెల్లో చిరస్మరణీయం.

– సంపత్ గడ్డం, కామారెడ్డి జిల్లా
(నేడు ప్రొ॥ జయశంకర్ వర్ధంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

నిరసన అంటే నిజం చెప్పడమే...

నిరసన అనేది పాలకులకు ప్రజలు నిజం చెప్పడానికి ఉన్న ఒక బలమైన మార్గం. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ హక్కులో భాగమిది. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అసమ్మతి, నిరసన అనేది ఒక సేఫ్టీ వాల్వ్ అని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. నిజానికి, ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే అనేక సామాజిక ఉద్యమాలకు నిరసనలు అత్యంత శక్తిమంతమైన చోదక శక్తిగా ఉన్నాయి. ఈ నిరసనలు ప్రభుత్వాలు చేసే అన్యాయం, దుర్వినియోగాన్ని బట్టబయలు చేస్తున్నాయి. పాలకుల నుంచి జవాబుదారీతనం కోరుతున్నాయి. మెరుగైన భవిష్యత్తు కోసం ఆశతో ఉండటానికి నిరసనలే ప్రజలకు దిక్సూచులుగా కనిపిస్తున్నాయి.

కానీ దురదృష్టవశాత్తు, ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం ప్రసాదించిన ఇతర హక్కులతో పాటు ఈ హక్కూ దాడికి గురవుతోంది. ప్రశ్నించే గొంతులను కర్కశంగా అణిచివేస్తున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, జీవించే హక్కు, దోపిడీని నిరోధించే హక్కులకు భంగం కలిగిస్తున్నారు. రాజ్యాంగానికి లోబడే నిష్పక్షపాతంగా పనిచేస్తామన్న పాలకుల ప్రమాణాలు ఆచరణలో కనిపించడం లేదు. ప్రభుత్వం పోలీసు వ్యవస్థ ద్వారా నాయకుల నిరసనలను వారి పర్యటనలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష నేతలకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోంది. ప్రజలలో వస్తున్న మార్పుకు ప్రభుత్వ పెద్దలు భయపడుతున్నారా? అనే చర్చ ప్రారంభమైంది. నిరసనలను అడ్డుకోవడమంటే నిజాలన్నింటినీ దాచేందుకు ప్రయత్నిస్తున్నారనే అర్థంకాక మరేమిటి? ఈ నిరసన గొంతుకలను నొక్కేసేందుకు పోలీసు వ్యవస్థ నానాటికీ వింతపోకడలకు దిగుతోంది. టీవీ లైవ్ షోలో విశ్లేషకుడి మాటలను సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకి అన్వయించి పోలీసులు ఆయనను అరెస్ట్ చేయడం దీనికి ఓ సంకేతం.

అయితే దీనిపై సర్వోన్నత న్యాయస్థానం స్పందించి ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'లైవ్ షోలో విశ్లేషకుడి మాటలను యాంకర్‌కు ఎలా అన్వయిస్తారు? నవ్వినంత మాత్రాన అరెస్టు చేస్తారా? అలాగైతే విచారణల సందర్భంగా మేము కూడా నవ్వుతుంటా'మని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. అత్యంత కీలకమైన వాక్ స్వాతంత్ర్యపు హక్కును పరిరక్షించాలని పోలీసులకు, ప్రభుత్వానికి హితవు పలికింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను పరిశీలిస్తే, ఏపీ పోలీసులు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పౌరుల హక్కులను కాలరాస్తున్న వైనం తేటతెల్లమైంది. పాలకుల మెప్పు కోసం పోలీసులు చట్ట విరుద్ధంగా చేసే ఇలాంటి చర్యలను ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు చెక్ పెడుతూనే వస్తోంది.



భిన్నాభిప్రాయాలు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సేఫ్టీ వాల్వ్ లాంటివని జస్టిస్ డీవై చంద్రచూడ్ అభివర్ణించారు. భిన్నాభిప్రాయాలను అణచివేయాలని చూడటం, ప్రజలలో భయాన్ని సృష్టించడం వ్యక్తిగత స్వేచ్ఛనూ, రాజ్యాంగ విలువలనూ ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు.

భారతదేశంలో పోలీసు సంస్కరణలు అత్యవసరమని 'ప్రకాష్ సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. పోలీసుల హింసను అరికట్టేందుకు అనేక అంశాలను సూచించింది. దుష్ప్రవర్తనకు పాల్పడే పోలీసులను జవాబుదారీ చేయాలని వెల్లడించింది. పోలీసులు చట్టబద్ధంగానే అరెస్టులు చేయాలని, ఏకపక్ష నిర్బంధం సరికాదని సూచనలు చేసింది. ఎందుకంటే ఇవి తీవ్రమైన కస్టోడియల్ హింసకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. అయితే ఈ మార్గదర్శకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిష్క్రియాత్మకంగా ఉన్నాయి. ఫలితంగా పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనం లోపిస్తోంది.

నిజానికి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం, నిరసనలు ప్రకటించడం భావ ప్రకటన స్వేచ్ఛలో భాగమే. ఆర్టికల్ 19 కింద పౌరులకు వాక్ స్వాతంత్ర్య హక్కు, సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించుకునే హక్కును రాజ్యాంగం ప్రజలకు కల్పించింది. భిన్నాభిప్రాయాలు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సేఫ్టీ వాల్వ్ లాంటివని జస్టిస్ డీవై చంద్రచూడ్ అభివర్ణించారు. అంతేకాదు, భిన్నాభిప్రాయాలను అణచివేయాలని చూడటం, ప్రజలలో భయాన్ని సృష్టించడం కచ్చితంగా వ్యక్తిగత స్వేచ్ఛనూ, రాజ్యాంగ విలువలనూ ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. నిజానికి నిరసన ద్వారానే వివక్ష, అన్యాయాల నుంచి ప్రజలకు విముక్తి పొందే మార్గం దొరుకుతుంది. అసమానతల, అన్యాయాల సంకెళ్లను తెంచి సమానత్వాన్నీ, స్వేచ్ఛనూ సాధించేందుకు ఉపకరిస్తుంది. అయితే దురదృష్టవశాత్తు ఏపీలో రాజకీయ ద్వేషాలతో ఈ నిరసన హక్కు ప్రమాదంలో పడింది.

– వెంకటేష్ నాగిళ్ల,
డిప్యూటీ ఇన్‌పుట్ ఎడిటర్, సాక్షి టీవీ, ఢిల్లీ

సానుకూల ఆలోచన

ఒకానొక జెన్ గురువును సందర్శించిన ఓ వ్యక్తి తాను ఏ పనీ చెయ్యలేకపోతున్నాననీ, సొంత వ్యాపారం చేద్దామన్నా ఎవరైనా మోసం చేస్తారని భయపడుతున్నాననీ చెప్పాడు. అంతా విన్న గురువుగారు 'ఈ రోజు రాత్రి నువ్వు కోతుల గురించి ఆలోచించకుండా రేపు వచ్చి కలువు' అన్నారు. సరేనని ఇంటికి వెళ్లిన ఆ వ్యక్తి 'గురువుగారు ఇలా ఎందుకు చెప్పారు? తాను కోతికి ఎప్పుడూ ఏ అపకారం చెయ్యలేదే...' అనుకుంటూ దాని గురించే ఆలోచిస్తూ నిద్రపోయాడు. కలలో కూడా కోతే కనిపించింది. తెల్లవారింది. గురువు దగ్గరకు పరుగుతీశాడు. ఎంత వద్దనుకున్నా కోతి ఆలోచన తనను వెంటాడిందన్నాడు.

జ్యోతిర్మయం

అతను చెప్పినదంతా విన్న గురువుగారు చిరునవ్వుతో 'నిజానికి నువ్వేమీ కోతికి అపరాధం చేయలేదు. ఇది అర్థం చేసుకో. నీ ఆలోచనలకు నువ్వే అధిపతివి. వాటిని నువ్వే తీర్మానిస్తావు. నీకేది అవసరమో దాని గురించి మాత్రమే ఆలోచించు. కోతి గురించి తలవకు అన్నాను. కానీ దాని గురించే ఆలోచించావు. నీకు ప్రయోజనం లేని దాని గురించి ఆలోచించకు. ఏదైనా మంచిగానే జరుగుతుందని నమ్ము. ఏదైనా ఆరంభించేటప్పుడు అలా జరుగుతుందేమో, ఇలా జరుగుతుందేమో అని ఆలోచించి ఓ నిర్ణయానికి రాకు... ప్రతికూలమైన ఆలోచనే నీ పురోగతికి అడ్డుకట్ట. కనుక దానిని విడిచిపెట్టు. ఏది ఎదురైనా అధిగమించడానికి ప్రయత్నించు. నీ లక్ష్యసాధన మీదే దృష్టిపెట్టు' అని చెప్పారు. దాంతో అతను అలాగేనని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం; **తిథి:** బ.ఏకాదశి రా.1.43 వరకు, తదుపరి ద్వాదశి; **నక్షత్రం:** అశ్విని సా.5.38 వరకు, తదుపరి భరణి; **వర్జ్యం:** ప.1.48 నుండి 3.17 వరకు, తదుపరి రా.2.34 నుండి 4.03 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.6.02 నుండి 7.13 వరకు; **అమృత ఘడియలు:** ఉ.10.54 నుండి 12.21 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు; **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు; **సూర్యోదయం:** 5.30; **సూర్యాస్తమయం:** 6.33; **స్మార్త ఏకాదశి.**

కేసీఆర్‌తో సంబంధం లేదు

- నాకు వచ్చిన సమాచారం ఆధారంగానే ట్యాపింగ్ చేశాం
- నాటి డీజీపీనే నా ఎక్స్‌టెన్షన్‌ను ప్రతిపాదించారు
- శుక్రవారం సిట్ విచారణలో ప్రభాకర్‌రావు వెల్లడి
- 'రివ్యూ కమిటీ'వాంగ్మూలాల నమోదు పూర్తి



సాక్షి, హైదరాబాద్: 'నేను పదవీ విరమణ చేసిన తర్వాత అప్పటి డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి నా ఎక్స్‌టెన్షన్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీని ఆధారంగా అప్పట్లో హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న రవిగుప్తా ఆదేశాలిచ్చారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలు ఎవరికీ సంబంధం లేదు. అప్పటి సీఎం కేసీఆర్‌కు నాకు ఎలాంటి సంబంధం లేదు'అని అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులకు ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు చెప్పారు. ప్రభాకర్‌రావు శుక్రవారం ఐదోసారి జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో సిట్ విచారణకు హాజరయ్యారు. మరోపక్క ట్యాపింగ్ కేసులో బాధితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుడు, కరీంనగర్‌కు చెందిన ప్రవీణ్ సహా మరికొందరు సిట్ ఎదుట హాజరై వాంగ్మూలాలు ఇచ్చారు. ప్రభాకర్‌రావును శుక్రవారం ఉదయం 11 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రశ్నించారు. బాధితులను ఎదురుగా ఉంచి ప్రశ్నించే కన్‌ఫ్రంటేషన్ విధానంలోనూ కొంత సేపు విచారించారు. మరోపక్క సిట్ ఎదుట సాక్షిగా హాజరైన మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అనుచరుడు కపిల్ వాంగ్మూలం ఇచ్చారు. అప్పట్లో తన సీడీఆర్ సేకరించడంతో పాటు ఫోన్ ట్యాప్ చేశారని పోలీసులు తెలిపినట్లు కపిల్ విలేకరులకు చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

అందుబాటులో ఒక నెల లేఖలే..

అసాంఘికశక్తుల ఫోన్లు ట్యాప్ చేయటానికి రివ్యూ కమిటీ అనుమతితో పోలీసులు మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లకు లేఖలు రాస్తారు. వాటిని ప్రొవైడర్లు ఆరు నెలల వరకు మాత్రమే భద్రపరచాలని నిబంధనలు చెప్తున్నాయి. దీంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం చాలాకాలం సాగినప్పటికీ 2023 నవంబర్ నెలకు సంబంధించిన లేఖలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నట్లు సమాచారం. ఆ నెలలో ట్యాప్ చేసిన 618 ఫోన్ నంబర్ల ఆధారంగానే దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, అధికారుల నంబర్లు ఉండటంతో వాటిని ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చిందని ప్రభాకర్‌రావును సిట్ ప్రశ్నించింది. అప్పట్లో వారికో, వారి సంబంధీకులకో మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు ఎస్ఐబీకి సమాచారం వచ్చి ఉంటుందని, దాని ఆధారంగానే ట్యాప్ చేసి ఉంటారని ప్రభాకర్‌రావు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. కాగా, అప్పట్లో రివ్యూ కమిటీలో సభ్యులుగా ఉన్న శాంతికుమారి, రవిగుప్తా, అనిల్‌కుమార్, మహేందర్‌రెడ్డితోపాటు మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నుంచి సిట్ వాంగ్మూలాల నమోదు పూర్తి చేసింది. త్వరలోనే మరో మాజీ డీజీపీ అంజనీకుమార్ నుంచి స్టేట్‌మెంట్ తీసుకోవడానికి సన్నాహాలు చేస్తోంది.

కేసీఆర్ ప్రమేయంతోనే ట్యాపింగ్..

అప్పట్లో మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలకు ఎర ఉదంతం జరిగిన మరుసటి రోజే నాటి సీఎం కేసీఆర్ విలేకరుల సమావేశం పెట్టి ఆడియోలు, వీడియోలు చూపించారు. నిఘా విభాగం ఆయన కనుసన్నల్లో పని చేయకపోతే ఇది ఎలా సాధ్యం? ఇవే ట్యాపింగ్‌లో వారికి ప్రమేయం ఉందని చెప్పడానికి ఆధారం. మూడోసారి అధికారంలోకి రావడానికే బీఆర్ఎస్ ఇలాంటి పనులు చేసింది. ఆగస్టు 5 తర్వాత ప్రభాకర్‌రావు అరెస్టు అవుతారు.

– మీడియాతో గోనె ప్రకాశ్‌రావు

'ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ కోదండరాం ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



అంతిమయాత్రలో ఉద్యమ గీతాలను ఆలపిస్తున్న విమలక్క

జోహార్.. కామ్రేడ్ రవన్న

- జనసంద్రంగా గాజర్ల రవి అంతిమయాత్ర
- హాజరైన ఉద్యమకారులు, కవులు, కళాకారులు

టేకుమట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్ అంత్యక్రియలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలో శుక్రవారం ముగిశాయి. అంత్యక్రియలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, తీన్మార్ మల్లన్న హాజరై నివాళులర్పించారు. అంతిమయాత్రలో ఉద్యమకారులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు. వారి ఉద్యమ గీతాలు మరోసారి వెలిశాలను ఎరుపెక్కించాయి. గాదె ఇన్నయ్య, విమలక్క, నకిరేకల్ ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప, పౌరహక్కుల సంఘం ఈసీ సభ్యులు హరగోపాల్, విరసం నేతలు తదితరులు ఎన్‌కౌంటర్‌ను ఖండించారు.

మీ ఫోన్ ట్యాప్ అయింది.. వాంగ్మూలం ఇవ్వండి

- కేంద్రమంత్రి బండి సంజయ్‌కి సిట్ అధికారుల ఫోన్

కరీంనగర్ టౌన్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వాంగ్మూలం నమోదుచేసేందుకు సిట్ అధికారులు సిద్ధమయ్యారు. శుక్రవారం రాత్రి ఆయనకు ఫోన్ చేసి విషయం చెప్పారు. మీ ఫోన్ ట్యాప్ అయ్యిందని, వాంగ్మూలం ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. దీంతో షెడ్యూల్ చూసుకుని విచారణకు వచ్చే టైం చెబుతానని బండి బదులిచ్చారు. బండి ప్రధాన అనుచరుడు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు ఫోన్ కూడా ట్యాప్ అయినట్లు గుర్తించిన సిట్ అధికారులు.. శుక్రవారం ఆయనకు కూడా ఫోన్ చేసి విచారణకు పిలిచారు. 'మీరేం చేస్తుంటారు? గతంలో మీ ఫోన్‌ను ట్యాప్ చేశారు. మీకు నోటీసులు పంపిస్తాం. విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. అందుబాటులో ఉండండి'అని సూచించారు. బోయినపల్లి ప్రవీణ్‌రావు గతంలో బండి సంజయ్ రాజకీయ వ్యవహారాలను పర్యవేక్షించారు.



కేంద్రమంత్రి బండి సంజయ్‌తో బోయినపల్లి ప్రవీణ్‌రావు

ఇరిగేషన్ ఈఎన్‌సీ అనిల్ బదిలీ

- ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశం
- ఈఎన్సీ (అడ్మిన్) అంజద్ హుస్సేన్‌కు అదనపు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ జనరల్) జి. అనిల్‌కుమార్‌పై ప్రభుత్వం వేటు వేసింది. ఈఎన్‌సీ పదవి నుంచి బదిలీ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఈ నెల 16నే ఆయనను బదిలీచేస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా ఉత్తర్వులు జారీచేసినా.. ఆ విషయం శుక్రవారం బయటకు వచ్చింది. అనిల్‌కుమార్ స్థానంలో ప్రస్తుతం ఈఎన్‌సీ (పరిపాలన)గా ఉన్న అంజద్ హుస్సేన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొన్నిరోజులుగా అనిల్‌కుమార్‌పై ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. తాజాగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) నూనె శ్రీధర్ వ్యవహారంతో ఇది ముదిరి పాకానపడినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుగుతున్న క్రమంలో విచారణ ప్రక్రియను ప్రభావితం చేసేలా నూనె శ్రీధర్ వ్యవహరిస్తున్నారని గుర్తించిన ప్రభుత్వం.. 2024 జూన్ 27న ఆయనను బదిలీ చేసి, నీటిపారుదలశాఖ ఈఎన్సీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. అయినా శ్రీధర్ ఏడాదిపాటు చొప్పదండిలోనే కొనసాగడానికి ఈఎన్సీ అనిల్‌కుమార్ కారణమని, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులను అనిల్‌మార్ అడ్డుకున్నారనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. శ్రీధర్‌కు అనిల్‌కుమార్ మేలు చేశారని ఏసీబీ కూడా గుర్తించి, ప్రభుత్వానికి నివేదించింది. ఓ దశలో అనిల్‌కుమార్‌కు కూడా నోటీసులివ్వాలని ఏసీబీ యోచించినట్లు సమాచారం. అక్రమాస్తుల కేసులో శ్రీధర్‌ను ఏసీబీ అరెస్ట్ చేసి, చంచల్‌గూడ జైలుకు తరలించింది. శ్రీధర్ అక్రమార్జనకు సహకరించింది ఎవరనే విషయంలో ఏసీబీ విచారణ జరుపుతుండగా.. అనిల్‌కుమార్ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని సమాచారం. అయితే, శ్రీధర్ బదిలీని ఆపింది వాస్తవమేనని, దీని వెనుక ఎలాంటి దురుద్దేశాలు లేవని అనిల్‌కుమార్ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు రాహుల్ బొజ్జాకు సమాచారం ఇచ్చారు. కాళేశ్వరంపై విచారణ జరుగుతున్న క్రమంలో కీలక పత్రాలను కమిషన్ కోరే అవకాశం ఉందని, అక్కడ పనిచేసిన వారైతేనే ఆ పత్రాలు ఇవ్వగలరనే కారణంతోనే బదిలీని ఆపినట్లు ఆయన తెలిపారు.

మంత్రి వివేక్ పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత

- దుబ్బాకలో రసాభాసగా సమావేశం

దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో శుక్రవారం మంత్రి వివేక్ పర్యటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వందలాది మంది బీఆర్ఎస్..కాంగ్రెస్ శ్రేణుల మధ్యన జరిగిన తోపులాటతో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగడంతో వారిని అదుపుచేయడం పోలీసులకు కష్టంగా మారింది. దుబ్బాకలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించే సభలో అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటో చిన్నగా ఉండటంపై ఆయన అధికారులను ప్రశ్నించడంతో, అక్కడే ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు ఫ్లెక్సీని తొలగించాలని ఆందోళనకు దిగాయి. దీంతో కాంగ్రెస్ శ్రేణులు పోటాపోటీగా అడ్డుపడటంతో ఇరుపార్టీల మధ్యన తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. చేసేదిలేక మంత్రి వివేక్ ఉద్రిక్తత మధ్యనే కొద్ది మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సంఘటనతో దుబ్బాకలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.



సమావేశంలో పోటాపోటీగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

తొలిరోజు వ్యక్తిగత వివరాలకే పరిమితం

- ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్‌ను ప్రశ్నించిన ఏసీబీ అధికారులు
- శుక్రవారం ఏడు గంటలపాటు విచారణ • నేడు మరోసారి కస్టడీ

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం ప్రశ్నించారు. మొదటి రోజు విచారణలో ప్రధానంగా వ్యక్తిగత, వృత్తిగత వివరాలకే పరిమితమైనట్లు సమాచారం. శ్రీధర్‌ను ఐదు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ నాంపల్లిలోని ఏసీబీ స్పెషల్ కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. చంచల్‌గూడ జైలు రిమాండ్‌లో ఉన్న శ్రీధర్‌ను కోర్టు అనుమతితో శుక్రవారం ఉదయం కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఉదయం 11 గంటల నుంచి శ్రీధర్‌ను ప్రశ్నించడం ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలోని గాయత్రి బాహుబలి పంప్‌హౌస్ ఇన్‌చార్జిగా శ్రీధర్ కీలక బాధ్యతలు నిర్వహించారు. తొలిరోజు విచారణలో భాగంగా శ్రీధర్ వ్యక్తిగత వివరాలు, ఉద్యోగంలో చేరిన నాటి నుంచి అతని సంపాదన, అంతకు ముందు ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన వివరాలతో కూడిన స్టేట్‌మెంట్ రికార్డ్ చేసినట్టు సమాచారం. కుటుంబ నేపథ్యంతో పాటు వారసత్వంగా వచ్చిన ఆస్తుల వివరాలను సేకరించినట్టు తెలిసింది. శ్రీధర్ జీతభత్యాలు, నెలవారీ ఖర్చులు, స్థిర చరాస్తులకు చెందిన డాక్యుమెంట్లతో ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ఉద్యోగంలో చేరిన నాటి నుంచి గత నెల వరకు ఎంత జీతం తీసుకున్నారు.. ప్రతి నెలా ఖర్చులుపోను ఎంత మిగులు ఉంటుందనే కోణంలో శ్రీధర్ స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయన బ్యాంక్ స్టేట్‌మెంట్లను ఏసీబీ అధికారులు సేకరించారు. సాయంత్రం 5 గంటల వరకు ప్రశ్నించిన అనంతరం తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. శనివారం ఉదయం మళ్లీ కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.

విధ్వంసకర క్లస్టర్ బాంబు

యుద్ధం మొదలైనప్పటి నుంచి తమపై క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించి విధ్వంసం సృష్టించిన ఇరాన్ ఇప్పుడు ఏకంగా క్లస్టర్ బాంబులను ప్రయోగిస్తూ దారుణాలకు ఒడిగడుతోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఎన్నో దేశాలు నిషేధం విధించిన క్లస్టర్ బాంబులను ఇరాన్ ఉద్దేశపూర్వకంగా భారీ పౌరనష్టం జరగాలని తమపై ప్రయోగిస్తోందని ఇజ్రాయెల్ శుక్రవారం ప్రకటించింది. గత వారం రోజులుగా కొనసాగుతున్న సమరంలో ఇరాన్ క్లస్టర్ బాంబులను వినియోగించడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. దీంతో డజన్లకొద్దీ దేశాల నుంచి నిషేధాన్ని ఎదుర్కొంటున్న క్లస్టర్ బాంబులపై చర్చ మొదలైంది.

ప్రత్యేకతలేంటి?

ఏదైనా బాంబును జారవిడిస్తే అది ఒకేసారి పూర్తిగా పేలిపోతుంది. మొత్తం మందుగుండు అయిపోతుంది. కానీ క్లస్టర్ బాంబు అలా కాదు. అందులో గోళాకృతిలో చిన్న చిన్న బాంబులుంటాయి. వాటిని మోస్తున్న క్లస్టర్ బాంబు వార్‌హెడ్‌ను ప్రయోగించాక లక్ష్యాన్ని ఢీకొట్టడానికి కొంతదూరంలో అంటే గాల్లోనే అది పేలిపోతుంది. దాంతో అందులోని గోళాకార చిన్నపాటి బాంబులన్నీ చెల్లాచెదురుగా నలుదిక్కులా పడి పేలిపోతాయి. దీంతో వినాశనం విస్తృతస్థాయిలో ఉంటుంది. జన సమూహంపై ఈ బాంబు పడితే ఈ చిన్న బాంబులు సృష్టించే విధ్వంసం అంతాఇంతా కాదు. ఇష్టమొచ్చినట్లు అన్ని వైపులకు దూసుకెళ్లడంతో నలుచెరుగులా ఉన్న వారంతా తీవ్రస్థాయిలో లేదా మధ్యస్థాయిలో గాయపడటం ఖాయం. ఇంతటి ప్రమాదకర బాంబు కావడంతోనే చాలా దేశాలు ఈ క్లస్టర్ బాంబు వినియోగానికి దూరంగా ఉండిపోయాయి. ఇంట్లో కొంత ఎత్తు నుంచి ఒక గాజుముక్కను నేలపై పడేస్తే అది ముక్కలుచెక్కలై ఎలాగైతే గది మొత్తం పరుచుకుంటుందో ఈ క్లస్టర్ బాంబులోని పేలని ముక్కలు పరిసరాల్లోకి దూసుకెళ్లి దారుణ నష్టానికి కారణమవుతాయి. శుక్రవారం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన ఒక క్లస్టర్ బాంబు ఆకాశంలో ఏడు కిలోమీటర్ల ఎత్తులో పేలిపోయి పెద్దసంఖ్యలో చిన్నబాంబులుగా మారి 8 కిలోమీటర్ల పరిధిలో వేర్వేరుచోట్ల బద్ధలయ్యాయి. బాలిస్టిక్ క్షిపణితో పోలిస్తే ఈ బాంబు తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇజ్రాయెల్ సైనికాధికారిది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' వార్తాసంస్థతో చెప్పారు.



పొంచి ఉన్న మరో ప్రమాదం

క్లస్టర్ బాంబు పేలాక అంతటా పడిపోయే చిన్న బాంబులు అన్నీ అదే సమయంలో పేలకపోవచ్చు. పేలని ఆ కొన్నింటిని నిర్వీర్యమైనట్లు భావించకూడదు. అవి కొంతకాలం తర్వాత పేలుతాయి. అంటే యుద్ధక్షేత్రంలో ఈ క్లస్టర్ బాంబును ప్రయోగిస్తే ఆ తర్వాతకూడా అక్కడికి జవాన్లు వెళ్లాలంటే జంకాల్సిందే. ఎక్కడ పడిన బాంబు ఎప్పుడు పేలుతుందో ఎవరూ ఊహించలేరు. 2008లో వందకుపైగా దేశాలు ఐక్యరాజ్యసమితి సారథ్యంలో ఈ బాంబు వినియోగంపై నిషేధాన్ని అమల్లోకి తెచ్చాయి. 111 దేశాలు, 12 ఇతర సంస్థలు ఈ ఒప్పందంపై సంతకాలుచేశాయి. క్లస్టర్ బాంబుల ఉత్పత్తి, నిల్వ, రవాణా, వినియోగంపై నిషేధం విధించారు. అయితే ఆనాడు ఇరాన్, ఇజ్రాయెల్, రష్యా, ఉక్రెయిన్, అమెరికా ఈ ఒడంబడికకు కట్టుబడతామని ప్రకటించలేదు. ఈ లెక్కన అమెరికా సైతం ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధంలో దిగితే ఈ బాంబులను ఉపయోగించే వీలుంది. లేదంటే పరోక్షంగా ఇజ్రాయెల్‌కు సరఫరా చేసే అవకాశముంది. చాన్నాళ్ల క్రితం సిరియాను ఏలిన బషర్ అల్ అసద్ ప్రభుత్వం సైతం తాము అంటే గిట్టనివారిపై వీటిని విపరీతంగా వాడిందని ఆరోపణలున్నాయి. అఫ్గాన్‌లో అమెరికా సైతం ఇదే బాటలో పయనించిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 2006 లెబనాన్ యుద్ధంలో ఇజ్రాయెల్ ఏకంగా 40 లక్షల క్లస్టర్ బాంబులను ప్రయోగించిందని ఐక్యరాజ్యసమితి గతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 19 ఏళ్ల క్రితం ప్రయోగించిన క్లస్టర్ బాంబుల్లో కొన్ని ఇప్పటికీ పేలుతూ లెబనాన్ పౌరుల ప్రాణాలు హరిస్తున్నాయని స్థానిక మీడియా గతంలో ఆరోపించింది.

రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలోనూ...

ఆనాడు ఒప్పందంలో భాగస్వామిగా లేని రష్యా నెలలతరబడి కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధంలో దానిపై విచ్చలవిడిగా వాడుతోందని తెలుస్తోంది. దీంతో రష్యాతో పోరాటం చేస్తున్న ఉక్రెయిన్‌కు తమ వద్ద పేరుకుపోయిన లక్షలాది క్లస్టర్ బాంబులను సరఫరాచేయాలని అమెరికా భావిస్తోంది. సమరసమయంలో పేలితే అది యుద్ధనీతిగా భావించవచ్చు. కానీ యుద్ధం ముగిశాక కూడా పేలుతూ ఇవి ఒకరకంగా పౌరహక్కులను కాలరాస్తున్నాయని మానవహక్కుల సంఘాలు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఇరాన్ క్షిపణి దాడిలో ధ్వంసమైన ఇజ్రాయెల్‌లోని హైఫా నగరంలోని ఓ భవనం



ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా శుక్రవారం టెహ్రాన్‌లో భారీ ర్యాలీ

పోటాపోటీగా దాడులు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్లస్టర్ బాంబుల వర్షం

- హైఫా సిటీపై క్షిపణుల దాడిలో డజన్లమందికి గాయాలు
- ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రంపై విరుచుకుపడిన ఇజ్రాయెల్
- ఎటూతేలని ఇరాన్, యూరప్ నేతల 'అణు' మధ్యవర్తిత్వ తొలి దఫా చర్చలు
- టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ వ్యతిరేక ర్యాలీ

టెల్ అవీవ్/టెహ్రాన్/జెనీవా: ఏడు రోజులుగా ఎడతెరిపిలేకుండా భీకరంగా బాంబులేసుకుంటూ పశ్చిమాసియాలో రావణకాష్టాన్ని మరింత రాజేసిన ఇజ్రాయెల్, ఇరాన్‌లు శుక్రవారం సైతం పోరుపంథాలోనే పయనించాయి. పోటాపోటీగా క్షిపణులు జారవిడుస్తూ రెండు దేశాల్లో ఉద్రిక్తతల్ని అమాంతం పెంచేశాయి. ఇజ్రాయెల్‌ను మరింత దెబ్బకొట్టేందుకు ఇరాన్ తన వద్ద పోగుబడిన క్లస్టర్ బాంబులను ప్రయోగించింది. ఇరాన్ క్లస్టర్ బాంబుల్ని ఉపయోగించడం ఇదే తొలిసారి. ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్, హైఫా, బీర్‌షెబా, రెహోవోట్ నగరాలు సహా పలు ప్రాంతాలపై క్లస్టర్ బాంబులను వేయడంతో పెద్దసంఖ్యలో భవనాలు ధ్వంసమయ్యాయి. తీరప్రాంత నగరమైన హైఫాలో భవంతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో పదుల సంఖ్యలో జనం గాయపడ్డారు. రక్తమోడుతూ జనం వీధుల్లో పరుగులు పెడుతున్న దృశ్యాలు మీడియాలో కనిపించాయి. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రుల్లో చేర్పించారు. కొందరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని నగర మేయర్ యొనా యాహవ్ చెప్పారు. రెహోవోట్‌లో దెబ్బతిన్న భవనాలను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ స్వయంగా వచ్చి పరిశీలించారు. కర్మెయిన్ పట్టణంలో షెల్టర్‌లో దాక్కున్న 51 ఏళ్ల మహిళ భయంతో గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది. ప్రతిగా ఇజ్రాయెల్ టెహ్రాన్‌లోని పలు క్షిపణి తయారీ కార్మాగారాలపై దాడులు చేసింది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా సగం వరకు ఇరాన్ మిస్సైల్ లాంచర్లను నాశనం చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ చీఫ్ ఇయాల్ జమీర్ చెప్పారు. ఇరాన్ అణుపరిశోధనా ఏజెన్సీసహా పలు నగరాలపై తమ 60 యుద్ధవిమానాలు బాంబుల వర్షం కురిపించాయని ఇజ్రాయెల్ ప్రకటించింది. శుక్రవారం నాటికి ఇరాన్‌లో 263 మంది పౌరులు, 154 మంది సైనికులు సహా 657 మంది ప్రాణాలు కోల్పోయారు. 2,000 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఇరాన్ జరిపిన దాడుల్లో ఇజ్రాయెల్‌లో 24 మంది చనిపోయారు. మరోవైపు ఇరాన్‌లో బుషెహర్ అణుకేంద్రంపై దాడితో అత్యంత ప్రమాదకర పరిస్థితి తలెత్తనుందని అంతర్జాతీయ అణుఇంధన ఏజెన్సీ డైరెక్టర్ రఫేల్ గ్రోసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్లాంట్‌లో వేల కేజీల అణుపదార్థం ఉందని, అది బయటకొస్తే వినాశకర స్థాయిలో రేడియోధార్మికత వందలకిలోమీటర్ల పరిధికి విస్తరిస్తుందని ఆయన చెప్పారు. మరోవైపు అవసరమైన సమయంలో పోరులో భాగస్వాములమవుతామని హెజ్‌బొల్లా ఉగ్రసంస్థ ప్రధాన కార్యదర్శి షేక్ నయీమ్ ఖాసిమ్ అన్నారు. ఇన్నాళ్లు ఇరాన్ రహస్యంగా గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్‌బొల్లా, యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారులను పెంచి పోషించినప్పటికీ ఎవరూ ఇంతవరకు సాయపడేందుకు ముందుకురాలేదు. ఈ నేపథ్యంలో హెజ్‌బొల్లా స్పందించడం గమనార్హం. అయితే హెజ్‌బొల్లా స్పందించిన వెంటనే లెబనాన్‌లోని దాని స్థావరాలపై ఇజ్రాయెల్ బాంబులు వేసింది.

ఇరాన్‌కు విదేశీ ఆయుధసాయంపై అమెరికా ఆంక్షలు

ఇరాన్ సైనికరంగంపై అమెరికా శుక్రవారం మరికొన్ని ఆంక్షలు విధించింది. ఇరాన్ సైన్యం ఉపయోగించే పలు రకాల ఆయుధాల్లో విడిభాగాలు, సాఫ్ట్‌వేర్‌లను సరఫరాచేసే విదేశీ సంస్థలు, వ్యక్తులపై అమెరికా నిషేధం విధించింది. ఆంక్షలు ఎదుర్కొంటున్న వారిలో చైనా కంపెనీ, ఒక సరుకు రవాణా నౌక సంస్థ సైతం ఉన్నాయి. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు, బాంబులను విక్రయించే సంస్థలనూ అమెరికా నిషేధిత జాబితాలో చేర్చింది.

ఇజ్రాయెల్ వ్యతిరేక ర్యాలీలు

తమపై దండెత్తిన ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్, ఇరాక్‌లో ముస్లింలు శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల తర్వాత వేలాదిగా రోడ్లమీదకొచ్చి భారీ నిరసనర్యాలీ చేపట్టారు. టెహ్రాన్, బాగ్దాద్, సదర్ సిటీల్లో ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు చేశారు. మరోవైపు ఇప్పటికే హమాస్‌తో పోరాడుతున్న ఇజ్రాయెల్ కొత్తగా ఇరాన్‌తోనూ కయ్యం పెట్టుకోవడాన్ని ఇజ్రాయెలీలు తీవ్రంగా తప్పుబట్టారు. టెల్ అవీవ్‌లో వేలాది మంది ఆందోళనకారులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. మరోవైపు ఇరాన్‌లో మౌలికసదుపాయాలు దెబ్బతిని గత 48 గంటలుగా ఇంటర్నెట్ స్తంభించింది. కేవలం 3 శాతం ప్రాంతాల్లో ఇంటర్నెట్‌ను పునరుద్ధరించారు. ఇరాన్‌లోని బ్యాంక్ సెపాపై ఇజ్రాయెలీ హ్యాకర్లు సైబర్ దాడులు చేశారు. దీంతో ఏటీఎంలు పనిచేయక జనం ఇబ్బందులు పడ్డారు.

మరోదఫా చర్చలకు సిద్ధమన్న యూరప్ నేతలు

స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో శుక్రవారం బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతోపాటు యూరోపియన్ యూనియన్ విదేశీవిధానాల చీఫ్‌తో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ చర్చలు జరిపారు. చర్చల్లో ఏఏ అంశాలు ప్రస్తావనకు వచ్చాయో వెల్లడించలేదు. మరోదఫా చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని, చర్చలు ముగిశాక యూరోపియన్ కమిషన్ ఉపాధ్యక్షుడు చెప్పారు. మరోవైపు తమ సేనలు ఎక్కడెక్కడ ఉన్నాయనే విషయాలను మీడియా అత్యుత్సాహంతో ప్రసారం చేయొద్దని స్థానిక మీడియాకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

ధ్వంసమైన వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ వద్ద నెతన్యాహూ



నా కొడుకు పెళ్లి వాయిదా పడింది

- యుద్ధం వల్ల తన కుటుంబమూ ఇబ్బంది పడుతోందన్న నెతన్యాహూ
- ప్రాణాలు కోల్పోవడం, పెళ్లి వాయిదా రెండూ ఒకటేనా? అంటూ ప్రజల ఆగ్రహం

టెల్ అవీవ్: ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ క్షిపణుల దాడి నేపథ్యంలో నెతన్యాహూ చేసిన వ్యాఖ్యలు ఆగ్రహానికి కారణమయ్యాయి. బీర్ షెవాలోని సొరోకా ఆస్పత్రి ముందు మీడియాతో మాట్లాడిన నెతన్యాహూ ''ఈ ఘర్షణ వల్ల మనలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా ఏదో ఒక మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇందుకు నా కుటుంబం ఏం మినహాయింపు కాదు. క్షిపణి దాడుల కారణంగా నా కుమారుడు అవ్నర్ వివాహాన్ని రద్దు చేయడం ఇది రెండోసారి. ఇది అతని కాబోయే భార్యను కలవరపెడుతోంది. నా భార్య ఒక హీరో అని చెప్పాలి. ఆమె వ్యక్తిగతంగా ఎన్నో భరిస్తోంది'' అని వ్యాఖ్యానించారు. కాగా, ప్రధాని వ్యాఖ్యలపై ఆన్‌లైన్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రాణాలు కోల్పోవడం, పెళ్లి ఆగిపోవడం ఒకటేనా? అని ప్రశ్నిస్తున్నారు. పెళ్లి ఆగిపోతే మళ్లీ చేసుకోవచ్చు.. కానీ పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా? రెండు ఘటనలను పోల్చడమేంటని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా నిద్రించలేను

- రాత్రి పగలు ప్రజల కోసమే పని చేస్తున్నా
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నా హృదయంలో ఉన్నాడు
- ఆయన చిత్రపటాన్ని గుండెకు హత్తుకోవడం ఇష్టం
- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- బిహార్, ఒడిశాలో ప్రధానమంత్రి పర్యటన



సివాన్: నిత్యం ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా నిద్రించలేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాత్రి పగలు ప్రజల కోసమే పని చేస్తున్నానని చెప్పారు. ఆయన శుక్రవారం బిహార్, ఒడిశాలో పర్యటించారు. తొలుత బిహార్‌లోని సివాన్ జిల్లాలో రూ.5,900 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. బిహార్‌లోని పాటలీపుత్ర జంక్షన్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ వరకు నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. విపక్ష రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ), కాంగ్రెస్‌లపై విరుచుకుపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆర్జేడీ అవమానించిందని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను అంబేడ్కర్ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అందుకే అంబేడ్కర్ అంటే ఆర్జేడీ, దాని మిత్రపక్షాలకు ఇష్టం లేదన్నారు. బాబాసాహెబ్ చిత్రపటాన్ని ఆర్జేడీ నేతలు పాదాలతో తొక్కేశారని, దీనిపై క్షమాపణ చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తే ఏమాత్రం స్పందించలేదని మండిపడ్డారు. అంబేడ్కర్ కంటే తామే గొప్పవాళ్లమని ఆర్జేడీ–కాంగ్రెస్ నాయకులు అహంకారం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ తన హృదయంలో ఉన్నాడని, ఆయన చిత్రపటాన్ని గుండెకు హత్తుకోవడం తనకు ఇష్టమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆర్థిక వనరులు కొల్లగొట్టడానికి ఆర్జేడీ, కాంగ్రెస్ కాచుకొని కూర్చున్నాయని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమిని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

అభివృద్ధి కోసం శ్రమిస్తున్నాం

''భారతదేశ ప్రగతిని చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయి. నిన్ననే విదేశాల నుంచి తిరిగొచ్చా. విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు అక్కడి నేతలు మన దేశ అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రశంసించారు. పేదల సాధికారతకు ఎదురవుతున్న అడ్డంకులను ఎన్డీయే ప్రభుత్వం తొలగిస్తోంది. గత 11 ఏళ్లుగా ప్రజాసేవలో నిమగ్నమయ్యాం. అభివృద్ధి కోసం అహోరాత్రులూ శ్రమిస్తున్నాం. బిహార్‌లో మళ్లీ జంగిల్‌రాజ్ రావొద్దంటే విపక్ష ఇండియా కూటమి ఓడించాలి. ఎన్డీయే నినాదం సబ్‌కా సాత్, సబ్‌కా విశ్వాస్. విపక్ష కూటమి నినాదం పరివార్‌కా సాత్, పరివార్‌కా వికాస్. సొంత కుటుంబాల అభివృద్ధి తప్ప ప్రజలంటే వారికి లెక్క లేదు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది విరుద్ధం కాదా?'' అని ప్రధాని మోదీ ప్రశ్నించారు.

భువనేశ్వర్‌లో తిరంగా యాత్ర

ప్రధాని మోదీ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో తిరంగా యాత్ర, రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి జనతా మైదాన్ వరకు 9 కిలోమీటర్ల మేర జరిగిన ఈ యాత్రలో వేలాది మంది ప్రజలు భాగస్వాములయ్యారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయిన సందర్భంగా తిరంగా యాత్ర నిర్వహించారు. రూ.18,600 కోట్లకుపైగా విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు.

ట్రంప్ ఆహ్వానం తిరస్కరించా..

వాషింగ్టన్‌లో పర్యటించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించగా, తాను తిరస్కరించానని ప్రధాని మోదీ చెప్పారు. వాషింగ్టన్ పర్యటనకు బదులు ఒడిశాను ఎంచుకున్నానని తెలిపారు. భువనేశ్వర్ సభలో ఆయన మాట్లాడారు. ''జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. వాషింగ్టన్‌కు రావాలంటూ ఆహ్వానించారు. చర్చించుకుందామని, కలిసి భోజనం చేద్దామని అన్నారు. ఆహ్వానించినందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలియజేశా. జగన్నాథుడు కొలువుదీరిన ఒడిశాకు వెళ్లాల్సి ఉందని చెప్పా. వాషింగ్టన్‌కు రాలేనంటూ ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా'' అని ప్రధానమంత్రి వెల్లడించారు.



చిన్నారుల పాటకు రాష్ట్రపతి ముర్ము కంటతడి

న్యూఢిల్లీ: చిన్నారుల పాట విని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కరిగిపోయారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ముర్ము శుక్రవారం 67వ బర్త్‌డే జరుపుకున్నారు. డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిజబిలిటీస్‌కు వెళ్లిన ఆమెకు చిన్నారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంధులైన చిన్నారులు రాష్ట్రపతికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక పాట ఆలపించారు. 'ఈ రోజులు మళ్లీ మళ్లీ రావాలి, నా హృదయం మళ్లీ మళ్లీ పాడాలి, మీరు వెయ్యేళ్లు జీవించాలి, ఇదే నా కోరిక, హ్యాపీ బర్త్ డే టూ యూ.. (బార్ బార్ దిన్ ఏ ఆయే, బార్ బార్ దిల్ యే గాయే, తు జియో హజారోం సాల్, యే మేరీ హై ఆర్జూ...)అంటూ సాగిన పాట విని ఆమె కన్నీటిని ఆపుకోలేకపోయారు. 'వాళ్లెంతో అందంగా, హృద్యంగా పాడారు. నేనెంతో ఉద్వేగానికి లోనయ్యా. వారి పాటవిని సంతోషంతో ఉప్పొంగిపోయా. నా కళ్ల వెంట నీళ్లు ఆగకుండా వచ్చేస్తూనే ఉన్నాయి'అని ఆమె పేర్కొన్నారు. కాగా, రాష్ట్రపతి ముర్ముకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తదితర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె జీవితం, నాయకత్వం దేశవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రశంసించారు. ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో 1958 జూన్ 20వ తేదీన ముర్ము జన్మించారు. దేశానికి 15వ రాష్ట్రపతిగా 2022 జూలై 25న బాధ్యతలు చేపట్టారు.

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

చురాచంద్‌పూర్/బిష్ణుపూర్: మణిపూర్‌లో మళ్లీ అశాంతి చెలరేగింది. గురువారం చురాచంద్‌పూర్ జిల్లాలోని చింగ్‌ఫీ గ్రామంలో భద్రతా దళాలు, అనుమానిత కుకీ ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో కుకీ వర్గానికి చెందిన ఒక మహిళ మరణించింది. ఆ తర్వాత బిష్ణుపూర్ జిల్లాలోని ఫుబాలా గ్రామంలో కాల్పుల్లో ఒక మైతేయి రైతు గాయపడ్డాడు. ఈ సంఘటనలతో ఈ ప్రాంతంలో మళ్లీ జాతుల మధ్య ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి. ఇరువర్గాలు నిరసనలకు పిలుపునిచ్చాయి. పోలీసులు, అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు బిష్ణుపూర్–చురాచంద్‌పూర్ సరిహద్దులో ఉన్న లోతట్టు గ్రామమైన ఫుబాలా వద్ద సాయుధులు కాల్పులు జరిపారు. పక్కనే ఉన్న కొండలలో నుంచి పొలాల్లో పనిచేస్తున్న రైతులపై అనేక రౌండ్లు కాల్పులు జరిపారు. మైతేయి రైతు 60 ఏళ్ల నింగ్తౌజామ్ బిరెన్ ఎడమ చేతికి గాయమైంది. వెంటనే బిష్ణుపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. దాడి తరువాత, భద్రతా దళాలు సమీపంలోని చింగ్ఫీ గ్రామంలో ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో అనుమానిత ఉగ్రవాదులతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో చురాచంద్‌పూర్‌లోని లాంగ్‌చింగ్‌మాన్‌బి గ్రామ అధిపతి ఖైఖోగిన్ హావోకిప్ భార్య హోయిఖోల్హింగ్ హావోకిప్ బుల్లెట్ తగిలి మరణించింది.

1,600 కోట్ల పాస్‌వర్డ్‌లు చోరీ!

వాషింగ్టన్: నేటి ఇంటర్నెట్ యుగంలో డేటా లీకేజీ సర్వసాధారణంగా మారిపోయింది. నెటిజన్ల గోప్యతకు భంగం కలుగుతోంది. వారి వ్యక్తిగత సమాచారం హ్యాకర్ల చేతుల్లోకి వెళ్తుండడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు సైబర్ మోసాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అతిపెద్ద డేటా లీకేజీ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఇటీవలి కాలంలోనే 1,600 కోట్ల పాస్‌వర్డ్‌లు లీకైనట్లు సైబర్‌న్యూస్, ఫోర్బ్స్ సంస్థలు వెల్లడించాయి. ఇది ఇంటర్నెట్ చరిత్రలో అతిపెద్ద డేటా లీకేజీ ఘటన అని తెలియజేశాయి. ఆపిల్, ఫేస్‌బుక్, గూగుల్, టెలిగ్రామ్‌తోపాటు ప్రభుత్వ వెబ్‌సైట్ల యూజర్ల లాగిన్ వివరాలు హ్యాకర్ల చేతికి చేరినట్లు పేర్కొన్నాయి. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికలు ఉపయోగించేవారి వివరాలు సైతం బయటకు లీకైనట్లు వెల్లడించాయి. రహస్యంగా ఉండాల్సిన పాస్‌వర్డ్‌లు పరులు చేతికి చేరుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఫిషింగ్ స్కామ్‌లు, అకౌంట్ హ్యాకింగ్ వంటివి పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు ఇన్ఫోస్టీలర్స్ అని పిలిచే మాల్‌వేర్‌ను కంప్యూటర్లు, ఫోన్లలోకి పంపించి పాస్‌వర్డ్‌లు చోరీ చేస్తున్నారని చెప్పారు. డేటా లీకేజీ వెనుక అంతర్జాతీయ ముఠాల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని ముఠాలు వ్యవస్థీకృతంగా పనిచేస్తూ వ్యక్తుల రహస్య సమాచారాన్ని కొల్లగొట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి.

సవాల్ చేయకుంటే 45 రోజుల్లో ఫుటేజీని ధ్వంసం చేయండి

ఎన్నికల సంబంధ వీడియో రికార్డ్‌లపై రాష్ట్ర అధికారులకు ఈసీ సూచన

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం అమలుచేస్తున్న సీసీటీవీ, వెబ్‌క్యాస్టింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ సంబంధ ఫుటేజీ ఆ తర్వాత దుర్వినియోగం అవుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) అప్రమత్తమైంది. ఆయా నియోజకవర్గాల్లో పోటీచేసిన అభ్యర్థులు ఎవరైనా 45 రోజుల్లోపు ఎన్నికల ఫలితాన్ని హైకోర్టులో సవాల్ చేయపోతే సంబంధిత ఎన్నికల ఫుటేజీని రాష్ట్ర అధికారులు ధ్వంసం చేయాలని ఈసీ ఆదేశించింది. ఈ మేరకు గత నెల 30వ తేదీన రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌లకు ఈసీ లేఖలు రాసింది. ఎన్నికల చట్టాల్లో ఎక్కడా ఇలా సీసీటీవీ, వెబ్‌క్యాస్టింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ తీయాలనే దానిపై ఎలాంటి నిబంధనలు లేవు. కానీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత పారదర్శకత కోసం ఈ విధానాలను ఒక అంతర్గత సాధనంగా ఈసీ సద్వినియోగం చేసుకుంటోంది. అయితే ఇన్నాళ్లు ఈ ఫుటేజీ అందరికీ బహిరంగంగా అందుబాటులో ఉండటంతో కొందరు వీటిని తమకు నచ్చినట్లుగా మార్చేసి తప్పుడు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తుండటంతో ఈసీ అప్రమత్తమైంది.

స్కూటీకి రూ. లక్ష నంబర్‌కు రూ.14 లక్షలు



సిమ్లా: బైక్ లేదా కారు.. వాహనం ఏది కొన్నా, రిజిస్ట్రేషన్ చేయించినప్పుడు ఫ్యాన్సీ నెంబర్ కావాలని కోరుకుంటాం. ఏదైతే ఏముందిలే? అని కొందరనుకుంటే.. ఇష్టమైన నంబర్ కోసం ఎంతైనా ఖర్చు చేయాలనుకుంటారు మరికొందరు. ఈ కోవలోకే వస్తాడు హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఈ వ్యక్తి. లక్ష రూపాయలు పెట్టి కొన్న స్కూటీకి వీఐపీ నంబర్ హెచ్‌పీ21సీ–0001 కోసం ఏకంగా రూ.14 లక్షలు చెల్లించాడు. ఆ నంబర్ కోసం వేలంలో ఇద్దరే పాల్గొనడం గమనార్హం. సోలన్ జిల్లాలోని బడ్డీకి చెందిన ఓ వ్యక్తి రూ.13.5 లక్షలు పాడగా.. హమీర్‌పూర్‌కు చెందిన సంజీవ్ కుమార్ అతని కంటే ఎక్కువగా రూ.14 లక్షలకు ఆ నంబర్‌ను కైవసం చేసుకున్నాడు. రాష్ట్రంలో అత్యంత ఖరీదైన బైక్ రిజిస్ట్రేషన్ నంబర్ కూడా ఇదే. తనకు ప్రత్యేకమైన నంబర్లను సేకరించడం ఇష్టమని చెప్పే సంజీవ్ కుమార్.. ఫ్యాషన్ ముందు డబ్బులు లెక్క కాదంటున్నాడు. కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవడం తప్పదని చెబుతున్నాడు.

ఎయిరిండియాలో ఆగని రద్దులు

సాక్షి, న్యూఢిల్లీ: తనిఖీలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, గగనతల పరిమితుల కారణంగా ఎయిర్ ఇండియా నాలుగు అంతర్జాతీయ సర్వీసులు సహా మొత్తం 8 సర్వీసులను రద్దు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జూన్ 21 నుంచి జూలై 15వ తేదీ వరకు అంతర్జాతీయ మార్గాల్లో విమానాల సంఖ్య తగ్గిస్తున్నట్లు, మూడు మార్గాల్లో విమానాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టామని తెలిపింది.

ఎయిరిండియా విమానాన్ని ఢీకొన్న పక్షి

ఢిల్లీ–పుణే ఎయిరిండియా విమానాన్ని శుక్రవారం పక్షి ఢీకొట్టింది. పుణేలో సురక్షితంగా ల్యాండయ్యాక తనిఖీల్లో ఈ విషయం వెల్లడైంది. ఇంజనీర్లు మరింత క్షుణ్నంగా పరీక్షలు చేపట్టారని ఎయిరిండియా తెలిపింది.

ఇండిగో విమానంలో సాంకేతిక లోపం

చెన్నై: సాంకేతిక లోపం తలెత్తడంతో మదురై వెళ్లే ఇండిగో విమానం మధ్యలోనే వెనుదిరిగింది. మొత్తం 68 మంది ప్రయాణికులతో శుక్రవారం చెన్నై విమానాశ్రయంలో టేకాఫ్ తీసుకున్న ఈ విమానంలో అరగంటలోనే సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. దీంతో, ఆయన అధికారులకు సమాచారమిచ్చారు. వారి సూచనల మేరకు తిరిగి విమానాన్ని చెన్నైలోనే సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులను వేరే విమానాల్లో గమ్యస్థానాలకు పంపించారు.

భారత్ కోసం గగనతలం తెరిచిన ఇరాన్

న్యూఢిల్లీ: ఓవైపు యుద్ధం కొనసాగుతున్నాసరే ఇరాన్ భారత్‌కు అనుకూలంగా వ్యవహరించింది. పౌరవిమానాల రాకపోకల కోసం గతంలో మూసేసిన గగనతలాన్ని భారత్ కోసం ప్రత్యేకంగా తెరిచింది. దీంతో ఇరాన్ నుంచి భారత్‌కు విమానాలు రానున్నాయి. ఆపరేషన్ సిందూలో భాగంగా ఈ విమానాల్లోనే అక్కడి 1,000 మంది భారతీయులను స్వదేశానికి భారత్ తరలించనుంది. యుద్ధం కారణంగా అక్కడి మష్హాద్ సిటీలో ఎక్కువ సంఖ్యలో భారతీయ విద్యార్థులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆపరేషన్ సిందూలో భాగంగా భారతసర్కార్ ఇరాన్‌లోని కొందరు విద్యార్థులను రోడ్డుమార్గంలో అర్మేనియాకు తరలించి అక్కడి నుంచి విమానమార్గంలో స్వదేశానికి తీసుకొచ్చింది. ఇకపై నేరుగా ఇరాన్ ఎయిర్‌పోర్ట్‌ల నుంచే విమానాలు తిరుగు ప్రయాణం కానున్నాయి. శుక్రవారం రాత్రికల్లా తొలివిమానం ఇరాన్ నుంచి ఢిల్లీకి చేరుకుంటుందని తొలుత వార్తలొచ్చాయి. టెహ్రాన్‌లో చిక్కుకున్న భారతీయులను తొలుత ఖ్వామ్‌కు ఆ తర్వాత మష్హాద్‌కు తీసుకొచ్చి మూడు విమానాల్లో తీసుకు రావొచ్చని ఢిల్లీలోని ఇరాన్ ఎంబసీలో మిషన్ డిప్యూటీ చీఫ్ మొహమ్మద్ జావేద్ హుస్సేనీ చెప్పారు. తుర్క్మెనిస్తాన్ రాజధాని అష్గబాత్ నుంచి మరో విమానం ఢిల్లీకి రానుంది.

బాబు ష్యూరిటీ బాండు...

మోసం గ్యారంటీకి బ్రాండ్

"బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ" పేరుతో ఇంటింటికీ బాండ్లతో టీడీపీ శ్రేణుల ప్రచారం

తీరా అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా అతీగతీ లేని వైనం..



జూన్ 2024 నుంచి ప్రారంభం

ఏడాదికి అందే మొత్తం సహాయం రూ.1,04,000

ఐదేళ్లకు అందే మొత్తం సహాయం రూ.5,20,000

సాక్షి, అమరావతి: ''చంద్రబాబునాయుడు అనే నేను మన రాష్ట్ర ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని త్రికరణ శుద్ధితో ప్రమాణం చేస్తున్నాను. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ''భవిష్యత్తుకు గ్యారెంటీ''లోని వాగ్దానాలను ఎటువంటి వివక్ష లేకుండా, నిబంధనలు విధించకుండా అమలు చేయడంతో పాటు మన రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి పునరంకితం అవుతానని ప్రతిజ్ఞ చేస్తున్నాను''

- ఇదీ బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబు సంతకంతో ఆ పార్టీ జారీ చేసిన ష్యూరిటీ బాండ్. ఇందులో పథకాలను 2024 జూన్ (ఎన్నికల ఫలితాలు వెలువడిన నెల) నుంచే అమలు చేస్తామని కూడా ప్రత్యేకంగా పేర్కొన్నారు కూడా. ఇక ఈ బాండ్ పేపర్లతో ఇంటింటికీ వెళ్లిన టీడీపీ క్యాడర్... ఆ ఇంటిలో మొత్తం ఎందరు ఉన్నారు...? మహిళలు, విద్యా ర్థులు, నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారు? అనే వివరాలు, వారి పేర్లు తీసుకుని... వీరికి ఏ పథకం కింద ఎంతెంత వస్తుంది..? అని లెక్కలేసి మరీ చెప్పారు. బాండ్ పేపర్లను మొబైల్ ఫోన్లకూ పంపారు. వీటిని నమ్మి ప్రజలు ఓట్లేయడంతో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైంది. కానీ, సూపర్ సిక్స్ సహా వారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవీ అమలు కాలేదు. దీంతో ప్రతి ఇంట ఆగ్రహం వ్యక్తమవుతోంది. టీడీపీ కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులను ఎక్కడికక్కడ నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ ఇచ్చిన బాండ్లు మోసా లకు నకళ్లుగా మారిన వైనాన్ని ఏకరవు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, సీఎం చంద్రబాబు మాత్రం ''సూపర్ సిక్స్ పథకా లన్నీ అమలు చేసేశా... ఇంకా ఎవరైనా సూపర్ సిక్స్ హామీల అమలు గురించి ప్రశ్నిస్తే వారి నాలుక మందం తప్ప మరోటి కాదంటూ'' ముందుగానే బెదిరింపులకు దిగుతున్నారు. సూపర్ సిక్స్ అమ లుపై ఇంకా ఎవరైనా ప్రశ్నిస్తే వారి నాలుక మందం అంటూ హూంకరిస్తుండడం పై సర్వత్రా అసహనం వ్యక్తమవుతోంది.

వైఎస్ జగన్ కంటే ఎక్కువ సంక్షేమం ఇస్తామని...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తానని.. అంతకు రెండింతలు సంక్షేమం సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఇస్తామంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నమ్మబలి కారు. జగన్ కంటే ఎంత ఎక్కువ ఇస్తాం అనేది రసీదు రూపంలో చెప్పారు. ఇక ఈ హామీల అమలు పూచీ నాదంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గ్యారంటీ ఇచ్చారు. చంద్రబాబు తానా అంటే తందానా అనే ఎల్లో మీడియా సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీలపై విస్తృత ప్రచారం చేసింది. అప్పటికీ చంద్రబాబును నమ్మి ఓట్లేస్తే చంద్రముఖిని మళ్లీ నిద్ర లేపినట్లేనంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నాటి సీఎం వైఎస్ జగన్ ప్రజలను హెచ్చరించారు. కానీ.. చంద్ర బాబు మాటలు, పవన్ కళ్యాణ్ గ్యారంటీలు.. ఎల్లో మీడియా కథనాలు నమ్మి ఓట్లేసి టీడీపీ కూటమిని గెలిపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది.. సూపర్ సిక్స్ అతీ గతీ లేదు.. పైగా హామీల అమలుపై ఎవరైనా ప్రశ్నిస్తే.. 'సంపద సృష్టించడం ఎలాగో చెవిలో చెప్పు.. సంపద సృష్టించాక సంక్షేమం ఇస్తా' అంటూ దబాయిస్తున్నారు. సూపర్ సిక్స్ సహా ఎన్ని కల అమలు చేసేశా.. ఇంకా ఎవరైనా వాటిపై ప్రశ్నిస్తే.. వారికి నాలుక మందం తప్ప మరోటి కాదంటూ ముందే బెదిరింపులకు దిగుతున్నారు.

మహానాడు నుంచే మహా మోసానికి నాంది

సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందే.. అంటే 2023 మే 28న రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడు వేదికగా సూపర్ సిక్స్ హామీలను టీడీపీ అధ్యక్షుడు ప్రకటించారు. వీటితో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇంటింట ప్రచారం చేసి, తద్వారా ఒక కుటుంబానికి ఐదేళ్లలో చేకూరే ప్రయోజనంపై గ్యారంటీ ఇస్తూ బాండ్లు జారీ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ'గా నామకరణం చేశారు.

- మహానాడు అనంతరం ఎన్నికల ప్రచారం ముగిసేవరకు నియోజకవర్గాల టీడీపీ సమన్వయకర్తలు, నాయకులు ప్రతి నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి.. కుటుంబసభ్యుల పేర్లు ఆరా తీసి, ''టీడీపీ మేనిఫెస్టో.కామ్'' వెబ్‌సైట్‌లో ఆ వివరాలు నమోదు చేశారు. ఆ తర్వాత కుటుంబ యజమాని లేదా ఆయన భార్య ఫోన్ నంబరు తీసుకుని టీడీపీ మేనిఫెస్టో.కామ్ వెబ్‌సైట్ ద్వారా ఓటీపీ పంపించారు. ఆ ఓటీపీని టీడీపీ మేనిఫెస్టో.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి.. ఆ కుటుంబానికి సూపర్ సిక్స్ సహా వివిధ పథకాల కింద ఏటా చేకూరే లబ్ధి... ఐదేళ్లకు ఒనగూరే ప్రయోజనం ఎంతనో వివరించారు. తర్వాత టీడీపీకీ మద్దతు ఇస్తున్నట్లు వెబ్‌సైట్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. ఆ వెంటనే.. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల ద్వారా చేకూర్చే ప్రయోజనానికి గ్యారంటీ ఇస్తూ వారి ఫోన్ నంబర్‌కు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో బాండ్లు పంపారు. బాండ్లను కుటుంబ సభ్యుల ఎదుటే డౌన్‌లోడ్ చేయించారు. వివిధ పథకాల కింద ఆ కుటుంబానికి చేకూరే లబ్ధి, ఈ హామీలను అమలు చేస్తానని త్రికరణ శుద్ధిగా ప్రమాణం చేసి చెబుతున్నానని ఆ బాండ్లలో చంద్రబాబు స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ సహా హామీలన్నీ 2024 జూన్ నుంచే అమలు ప్రారంభమవుతుందని బాండ్లలో తేల్చిచెప్పారు.

'త్రి'కరణశుద్ధిగా మాట తప్పారు..

సూపర్ సిక్స్, ఎన్నికల హామీల అమలుపై ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సంతకంతో ఉన్న బాండ్ పేపర్లు పంపిణీ చేసి వివరాలు నమోదు చేశారు టీడీపీ నేతలు. టీడీపీకి మద్దతు తెలుపుతున్నట్లుగా మిస్డ్ కాల్ ఇప్పించారు. వారి ఫోన్ నుంచి వన్‌టైమ్‌పాస్‌వర్డ్ (ఓటీపీ) కూడా తీసుకున్నారు. ప్రతి ఇంటి యజమాని లేదా ఆయన భార్య ఫోన్ నంబరు తీసుకుని టీడీపీ మేనిఫెస్టో.కామ్ వెబ్‌సైట్‌లోకి ఎక్కించారు. చివరగా ఎన్నికల బహిరంగ సభల్లోనూ భారీగా ఊదరగొట్టారు. ఇలా 'త్రి'కరణశుద్ధిగా మాట తప్పారు. ఈ మోసంపైనే ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అధికార టీడీపీ కూటమి నేతలను ప్రశ్నించేందుకు ప్రతి ఇల్లు-ప్రతి గడప ఇప్పుడు ఎదురుచూస్తోంది.

ఆ బాండ్లు... మోసాలకు సాక్ష్యాలు

- ఏడాదిలో రూ.81,397.83 కోట్లు ఎగవేత

కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటికీ బాండ్లలో గ్యారంటీ ఇచ్చిన హామీల మేరకు లబ్ధి చేకూరకపోవడంతో 'మోసపోయాం'అంటూ ప్రతి ఇంట ప్రజలు నిట్టూర్చుతున్నారు. టీడీపీ నేతలు ఇచ్చిన బాండ్లు.. ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న బాండ్లను తీసుకుని.. ఏడాదిలో సూపర్ సిక్స్ పథకాల కింద తమ కుటుంబం ఎంతమేరకు ప్రభుత్వం ఎగ్గొట్టిందో లెక్కలేసుకుంటున్నారు.

- సూపర్ సిక్స్‌లో భాగంగా.. 20 లక్షల మందికి ఉద్యోగాలు.. లేదా ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. తొలి ఏడాది నిరుద్యోగ భృతి జాడే లేదు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వారికి నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.7,200 కోట్లు బాకీ పడ్డారు.
- పీఎం కిసాన్ సమ్మాన్ పథకంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తానని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో 53,58,266 మంది రైతులు ఉన్నారు. వారికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే ఏటా రూ.10,716.53 కోట్లు అవసరం. కానీ, తొలి ఏడాది వాటిని ఇవ్వకుండా ఎగ్గొట్టారు.
- సూపర్ సిక్స్‌లో ఆడబిడ్డ నిధి పథకం ఒకటి. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు 2.07 కోట్ల మంది ఉన్నారు. ఇందులో 18-59 ఏళ్ల మధ్య వయసు వారు 1.80 కోట్ల మంది. వీరికి నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలను ఆడబిడ్డ నిధి కింద ఇస్తానని బాబు హామీ ఇచ్చారు. మొదటి ఏడాది ఒక్క పైసా ఇవ్వలేదు. అంటే.. మహిళలకు రూ.32,400 కోట్లు బాకీపడ్డారు.
- దీపం పథకం కింద రాష్ట్రంలో 1,59,20,000 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఏడాదికి 3సిలిండర్లను ఉచితంగా ఇస్తామని బాబు హామీ ఇచ్చారు. సిలిండర్ ధర రూ.855. ఈ లెక్కన ఏడాదికి 3 సిలిండర్లు ఇవ్వాలంటే రూ.4,083.48 కోట్లు అవసరం. తొలి ఏడాది ఒక సిలిండర్‌కు రూ.865 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఈ ప్రకారం రూ.3,218.48 కోట్లు ఎగ్గొట్టారు.
- మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామనేది మరో హామీ. దీనికోసం నెలకు రూ.275 కోట్ల చొప్పున ఆర్టీసీకి ఇవ్వాలి. తొలి ఏడాది ఈ హామీ అమలు చేయలేదు. అంటే... ఉచిత బస్సు రూపంలో మహిళలకు రూ.3,500 కోట్లు ఎగ్గొట్టారు.
- 50 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు, పురుషులకు పింఛను ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 లక్షల మంది ఉన్నారు. వారికి నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.9,600 కోట్లు పింఛనుగా ఇవ్వాలి. కానీ.. తొలి ఏడాది ఇది ఇవ్వలేదు. రూ.9,600 కోట్లు ఎగ్గొట్టారు.
- తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలను బడికి పంపిస్తే అంతమందికి రూ.15 వేల వంతున తల్లి ఖాతాలో జమ చేస్తామని బాబు వాగ్దానం చేశారు. యూడీఐఎస్‌ఈ (యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ యూడైస్) ప్రకారం రాష్ట్రంలో 87,41,885మంది పిల్లలు పాఠశాలల్లో చదువుతున్నారు. రూ.15 వేల చొప్పున వారికి ఏడాదికి రూ.13,112.82 కోట్లు ఇవ్వాలి. కానీ, తొలిఏడాది ఆ మేరకు ఇవ్వకుండా ఎగ్గొట్టారు.
- పంటల బీమా పరిహారం ఇవ్వకుండా రాష్ట్రంలోని 53 లక్షల మంది రైతులకు టోపీ పెట్టిన మొత్తం రూ.1,385 కోట్లు. ఇక మత్స్యకారులకు వేట నిషేధ భృతి కింద ఎగ్గొట్టిన మొత్తం రూ.265 కోట్లు.

(ఇలా ఏడాది కాలంగా టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.81,397.83 కోట్లు బకాయి పడిందని ప్రజలు లెక్కలు వేస్తున్నారు. బాకీపడిన ఈ మొత్తంతో పాటు ఈ ఏడాది ఇవ్వాల్సినవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు)



విశ్వవిద్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించిన నిరుద్యోగులు

ఇంటర్వ్యూలని పిలిచారు.. 'వాయిదా' పడ్డాయన్నారు..

ఏజీ వర్సిటీ తీరుకు నిరసన.. నిరుద్యోగుల ఆందోళన

నోటిఫికేషన్ ఎలా వాయిదా వేస్తారని వీసీ భవన్ ముట్టడి

ఏజీవర్సిటీ(హైదరాబాద్): అసిస్టెంట్ వార్డెన్ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను అర్ధంతరంగా ఎలా వాయిదా వేస్తారని నిరుద్యోగులు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ముట్టడించారు. వివరాల్లోకి వెళితే.. వర్సిటీ పరిధిలో 20 అసిస్టెంట్ వార్డెన్ పోస్టులకు జూన్ 9న నోటిఫికేషన్ విడుదల చేశారు. వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. జూన్ 20న నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని నోటిఫికేషన్‌లో పేర్కొనడంతో శుక్రవారం ఉదయం ఏడుగంటలకే సుమారు



చిన్న పిల్లలతో అభ్యర్థులు

2 వేల మంది రాజేంద్రనగర్‌లోని వర్సిటీకి చేరుకున్నారు. కొందరైతే చంటిపిల్లలను తీసు కొని రాత్రే వర్సిటీ పరిసరాలకు చేరుకున్నారు. అయితే వర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయని చెప్పడంతో నిరుద్యోగులంతా షాక్‌కు గురయ్యారు. రోడ్డుపై బైఠాయించి వీసీ, రిజిస్ట్రార్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆపై నిరుద్యోగులు వీసీ భవన్ ముట్టడికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా వాయిదా వేస్తారంటూ అధికారులపై నిరుద్యోగులు మండిపడ్డారు. రిజిస్ట్రార్ వచ్చి వివరణ ఇవ్వడంతో పోలీసులు సర్దిచెప్పి పంపించారు.

17న వెబ్‌సైట్‌లో పెట్టాం

అసిస్టెంట్ వార్డెన్ పోస్టుల ఇంటర్వ్యూలు వాయిదా వేస్తున్నట్టు ఈ 17న రాత్రి వెబ్‌సైట్‌లో పెట్టాం. అయితే ఈ సమాచారాన్ని చాలామంది చూసుకోకుండా వచ్చారు. 20 పోస్టులకు ఇంత పెద్ద మొత్తంలో అభ్యర్థులు వస్తారని అనుకో లేదు. తిరిగి నోటిఫికేషన్ ఇస్తాం. అప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చు.

– విద్యాసాగర్, వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్


నాడు కాలేజీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో తనిఖీలు..

దాన్ని బయటకు తీయాలని తాజాగా ఆదేశం

ఫీజుల పెంపునకు ఆ నివేదికకు ప్రభుత్వం మెలిక

కోర్టుకెళ్లే యోచనలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు

త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్: ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఎప్పుడు?

2016 నాటి టాస్క్‌ఫోర్స్ నివేదిక కోరిన సర్కారు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ ఎప్పుడు నిర్వహిస్తారనేది సమాధానం లేని ప్రశ్నగా మారుతోంది. ఇంజనీరింగ్ కాలేజీల్లో సౌక ర్యాల పరిశీలనకు 2016లో వేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించిన తర్వాతే కాలేజీల్లో ఫీజుల పెంపుపై ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటివరకు పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ చేపట్టాలని సూచించింది. దీంతో కౌన్సెలింగ్ షెడ్యూల్‌కు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నిర్ణయంపై ప్రైవే టు ఇంజనీరింగ్ కాలేజీలు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాయి. ఫీజుల నిర్ధారణ జరిగే వరకు కౌన్సెలింగ్ చేపట్టరాదని వాదించబోతు న్నాయి. దీంతో కౌన్సెలింగ్ జరుగుతుందా? అనే సందేహాలు కలుగుతున్నాయి. మే 11న ఇంజనీరింగ్ సెట్ ఫలితాలు విడుదలైనా ఇప్పటి వరకు కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ కాలేదు. ఈ పరిణామాలపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 175 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఇందులో 156 ప్రైవేటువి. మొత్తం 1.18 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, 70 శాతం కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేస్తారు.

టాస్క్‌ఫోర్స్ నివేదిక ఉందా?

ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో 2016 టాస్క్‌ఫోర్స్ నివేదిక ప్రస్తావనకు వచ్చింది. దీన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సీఎం ఆదేశించారు. అప్పటి నుంచి అధికారులు దానిపై స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. అసలా నివేదిక ఉందా? అనే విషయంపై నోరు మెదపడం లేదు. కొంతమంది కన్పించడం లేదని చెబుతున్నారు. 2016లో ప్రైవేటు కాలేజీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు నిర్వహించింది. కాలేజీ రికార్డుల్లో ఉన్న అధ్యాపకులు బోధించడం లేదని, అర్హత లేని బీటెక్, ఎంటెక్ చదివిన వారే బోధిస్తున్నా రని విజిలెన్స్ తేల్చింది. అయితే, ఆ నివేదిక కన్పించటంలేదని విద్యాశాఖ ఉన్నతాధికారి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తెచ్చినట్టు తెలిసింది. కాగా, ఆ నివేదికను ప్రైవేటు కాలేజీలు వ్యతిరేకిస్తు న్నాయి. 2016లో పరిస్థితి వేరని, అప్పట్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ వంటి ఎమర్జింగ్ కోర్సులు లేవని వాదిస్తున్నాయి. నిపుణులైన ఫ్యాకల్టీ ఉంటే తప్ప వీటిని బోధించలేరని అంటున్నాయి.

మరో ప్రత్యేక కమిటీ

టాస్క్‌ఫోర్స్ కమిటీ నివేదిక కన్పించడం లేదని తెలియడంతో ప్రభుత్వం మరో ప్రత్యేక కమిటీ వేసేందుకు సిద్ధమైంది. ఫీజుల పెంపుపై పరి శీలనే దీని ఉద్దేశమని అధికారులు అంటు న్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగానే ఫీజుల పెంపు ఉంటుందని ఉన్నత విద్యా మండలి వర్గాలు అంటున్నాయి. అయితే, ఈ కమిటీని రెండు నెలల క్రితమే వేసి ఉంటే బాగుండేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఫీజుల నిర్ధారణ చేయాల్సింది రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఎఫ్ఆర్‌సీ) అని, దాని అధికారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడ దని ప్రైవేటు కాలేజీలు వాదిస్తున్నాయి. ఇప్పటికే ఎఫ్ఆర్‌సీ ఫీజులపై ఓ నిర్ణయానికి వచ్చిందని, ప్రభుత్వం దీన్ని అడ్డుకోవడం న్యాయ విరుద్ధమనే వాదనను న్యాయస్థానం ముందుకు తీసుకెళ్తామని ఓ ప్రైవేటు కాలేజీ నిర్వాహకుడు తెలిపారు.

త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటిస్తాం



గతంలో కూడా కౌన్సెలింగ్ చేపట్టిన తర్వాతే ఫీజుల నిర్ధారణ జరిగింది. కాబట్టి ఫీజులతో సంబంధం లేకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. త్వరలోనే షెడ్యూల్ ఇస్తాం. ఇప్పటికే ఆలస్యమైంది. పాత ఫీజులే ప్రస్తుతం ఉంటాయి. పెంచితే వాటిని అమలులోకి తీసుకుంటారని విద్యార్థులకు స్పష్టతిచ్చి, కౌన్సెలింగ్ చేపడతాం.

– ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్య మండలి చైర్మన్

అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

పెట్టుబడులకు సరైన వేదిక హైదరాబాద్

అసోచామ్ సదరన్ కౌన్సిల్ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి



అవార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో కలెక్టర్ హరిచందన

సాక్షి, హైదరాబాద్: ఆర్థికాభివృద్ధికి మానవీయ కోణాన్ని జోడిస్తూ తెలంగాణలోని ప్రజాప్రభుత్వం అభివృద్ధికి ఓ కొత్త నిర్వచనాన్ని రచిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని ది వెస్టిన్, మైండ్‌స్పేస్‌లో అసోచామ్ సదరన్ సీఎస్సార్ అండ్ సస్టెయినబిలిటీ కౌన్సిల్ సదస్సు, అవార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యతలతో కూడిన తెలంగాణను నిర్మించేందుకు కట్టుబడి పనిచేస్తుందన్నారు. అపార వనరులు ఉన్నా మనం ఇప్పుడు అసమానతలు ఉన్న ప్రపంచంలో జీవిస్తున్నామని చెప్పారు. ఆర్థికాభివృద్ధి సామాజిక న్యాయం పునాదిపై నిలవాలన్నది కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమని, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఆ సిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్సార్ నిధులు ఖర్చు చేసేందుకు తెలంగాణ సరైన వేదిక అని తెలిపారు. పెట్టుబడులకు తెలంగాణ అనువైన ప్రాంతమని, ఇక్కడ అనుకూలమైన అందరికీ సరిపోయే వాతావరణం, భాషా సమస్య లేదన్నారు. గతంలో నిర్మించిన 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చాయని డిప్యూటీ సీఎం తెలిపారు. సీఎస్సార్ అంటే లాభాల్లో రెండు శాతం ప్రజాహిత కార్యక్రమాలకు కేటాయించడానికి చట్టపరమైన బాధ్యతగా చూస్తాం ...కానీ నేను ఒక భిన్నమైన దృష్టి కోణాన్ని సమావేశానికి హాజరైన వారితో పంచుకోవాలని కోరుకుంటున్నట్టు భట్టి చెప్పారు. సమాజాన్ని పరిగణనలోకి తీసుకోని అభివృద్ధి సరైనది కాదని, ప్రయోజనం లేని లాభం శూన్యమే అన్నారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, నిర్వాహకులు సురేష్ చుక్కపల్లి, బారుల్ ఇస్లాం, అభిషేక రంజన్, కృష్ణ ఏదుల తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోలో కారుణ్య నియామకాలు

నియామక ఉత్తర్వులు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ శాఖ సిబ్బంది సంక్షేమమే ప్రజా ప్రభుత్వ విధానం అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ప్రజాభవన్‌లో ట్రాన్స్‌కోలోని 18 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఇందులో ఏడుగురు రెగ్యులర్ ఉద్యోగులు కాగా, ఆర్టిజన్స్ 11 మంది ఉన్నారు. ట్రాన్స్‌కో ఉద్యోగులతో పాటు ఆర్టిజన్స్‌కు కూడా కారు ణ్య నియామకాల్లో అవకాశాలు కల్పిస్తున్నా మని భట్టి తెలిపారు. ఆర్టిజన్స్‌ను కూడా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ప్రభు త్వం భావిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, డైరెక్టర్లు సూర్య ప్రకాశ్, నర్సింగరావు, నరసింహారావు, గుప్తా, జాయింట్ సెక్రటరీ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

కొత్త స్పెషల్ కమిషనర్‌ను కోరిన టీడబ్ల్యూజేఎఫ్ బృందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం అవసరమని, అక్రెడిటేషన్లు ఇవ్వాలని, కొత్త ఆరోగ్య విధానాన్ని తీసుకురావాలని కోరింది. శుక్రవారం సమాచార్ భవన్‌లో కొత్త స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఐఏఎస్ అధికారి సీహెచ్ ప్రియాంకను ఫెడ రేషన్ బృందం కలిసింది. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లస్థలాలు, అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులు, మహిళా జర్నలిస్టుల సమస్యలు, వేజ్‌బోర్డు అమలు, ప్రత్యేక రక్షణ చట్టం, రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకం, మీడియా అకాడమీ శిక్షణా తరగతులు, మీడియా కమి షన్ తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆరోగ్య సమస్యలతో పాత్రికే యులు అనేక కష్టాలు అనుభవిస్తున్నారని, ఉద్యోగుల కోసం కొత్తగా తెచ్చే ఆరోగ్య పథ కాన్ని జర్నలిస్టులకూ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పి.రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యతో పుష్కల అవకాశాలు

భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌సీ అగ్రవాల్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ దేశాలు ప్రస్తుతం భారతీయ వ్యవసాయ విద్య వైపు చూస్తున్నాయని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్సీ అగ్రవాల్ అన్నారు. భారతీయ విద్యార్థులు ఆవిష్కరణల వైపు మొగ్గుచూపాలని కోరారు. భారత వ్యవసాయ విద్య ప్రపంచ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని చెప్పారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాలలో 'వ్యవసాయ విద్య – అవకాశాలు'అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారత్ 5 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగటంలో వ్యవసాయ ఆధారిత అంకుర సంస్థల పాత్ర చాలా కీలకమని అన్నారు. ఏఐ టెక్నాలజీతో భవిష్యత్తులో రైతుల ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. 2029 నాటికి 24.8% సీజీఏఆర్‌తో 6.58 బిలియన్ డాలర్ల విలువైన అవకాశాలు ఈరంగంలో ఉంటాయని చెప్పారు. 2040 నాటికి 17.7 లక్షల వ్యవసాయ ఉద్యోగ అవకాశాలు వస్తాయని వెల్లడించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన వర్సిటీ వీసీ దండా రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జ్ఞానప్రకాష్, ఐఐఓఆర్ డైరెక్టర్ ఆర్కే మాథూర్, నారం డైరెక్టర్ లాల్, ఎస్‌బీపీజీఆర్ డైరెక్టర్ శరవణన్, డాక్టర్ సైదయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణం ఎగవేతదారులను ఏమీ చేయలేరు..

సామాన్యులపై మాత్రం ప్రతాపం ప్రదర్శిస్తారు

బ్యాంక్ అధికారుల తీరుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

రుణాల వసూలు బాధ్యత కూడా అధికారులపైనే పెట్టాలన్న న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: వేల కోట్ల రూపాయల రుణం తీసుకుని ఎగవేసిన వారిని బ్యాంకులు ఏమీ చేయలేవని, సామాన్యులపై మాత్రం ప్రతాపం ప్రదర్శిస్తాయని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో అనేక లోపాలున్నాయని అభిప్రాయపడింది. పేద, మధ్యతరగతి కుటుంబాలు తీసుకునే చిన్న మొత్తంలోని రుణాలకు సంబంధించి అధికార దర్పం ప్రదర్శించడంలో బ్యాంకర్లు ముందుంటారని.. చార్జీల పేరుతో విపరీత భారం మోపుతారని పేర్కొంది. ఏదైనా కారణంతో రుణం చెల్లింపులో కాస్త జాప్యం జరిగితే జరిమానాల మోత మోగిస్తారని వ్యాఖ్యానించింది. తీసుకున్న రుణం చెల్లిస్తే డాక్యుమెంట్లు ఇచ్చేందుకు కూడా చార్జీలు వసూలు చేస్తారని చెప్పింది. అదే సమయంలో తప్పుడు డాక్యుమెంట్లు చూపించిన వారికి కనీస పరిశీలన లేకుండా వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నారని తెలిపింది. మంజూరు చేసిన అధికారులపై వసూలు బాధ్యతను పెడితే గానీ ఈ పరిస్థితిలో మార్పు రాదని స్పష్టం చేసింది. ఎలాంటి సమాచారం లేకుండా ముందస్తు చెల్లింపునకు ఎస్‌బీఐ చార్జీలు విధించడాన్ని సవాల్ చేస్తూ సనత్‌నగర్‌కు చెందిన ఉత్తమ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం దీనిపై విచారణ చేపట్టారు.

ఎగ్గొట్టేవారికి మాఫీ.. సామాన్యులపై చార్జీలా?

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆస్తులను హామీగా పెట్టి రుణాలు తీసుకున్నామని, అవి ముందుగానే చెల్లించినందుకు రూ.1.16 కోట్లను పిటిషనర్‌కు చెందిన కంపెనీ ఖాతా నుంచి మినహాయించుకున్నారని నివేదించారు. ఇది ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధమని, తమ నుంచి వసూలు చేసిన జరిమానాను వడ్డీతో సహా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బ్యాంక్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన వారికి మాఫీ పేరిట ఊరట కల్పించే బ్యాంకులు.. సామాన్య, మధ్యతరగతి వారి విషయంలో చార్జీలపై చార్జీలు వడ్డిస్తూ నడ్డి విరుస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఆర్‌బీఐ, సదరు బ్యాంక్ అధికారుల వాదనలు వినాల్సి ఉందంటూ కౌంటర్ల దాఖలుకు ఆదేశించారు. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేశారు.

సాక్షి హైదరాబాద్


శనివారం । 21 । జూన్ । 2025



వేగం పెరిగింది

గత ఏడాది నగరంలో వాహనాల సరాసరి వేగం గంటకు 17 నుంచి 18 కి.మీ. ప్రస్తుతం అది గంటకు 24 నుంచి 25 కి.మీలకు పెరిగింది.

-10లో



డిట్టో.. 'కాపీ'..

ఆన్‌లైన్‌లో బాగా అమ్ముడవుతున్న పుస్తకాలు కొందరికి 'బిజినెస్ టార్గెట్' అయ్యాయి. కాపీ రైట్ ఉన్న పుస్తకాలను అనుమతుల్లేకుండా డూప్లికేట్ చేసి విక్రయిస్తున్నారు.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/24.0

నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వాన చినుకులు పడే అవకాశముంది. గరిష్టంగా 33, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

యోగా.. భలేగా..









నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం యోగా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకరోజు ముందుగా నగరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సినీ నటులు ఖుష్బూ, మీనాక్షి చౌదరి, సాయిదుర్గ తేజ్, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు.


ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో రోడ్ల పక్కన మార్జిన్లలో, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ సర్కిళ్ల అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్లు రెగ్యులర్‌గా కూల్చివేతలు జరిగేలా చూడాలన్నారు. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రతివారం ఈ కూల్చివేతలు జరగాలని, ప్రతి శనివారం ప్రతి సర్కిల్‌లో కనీసం ఒక రోడ్డులో ఆక్రమణల్ని తొలగించాలని ఆదేశించారు. ఇప్పటికే 'రోప్'లో భాగంగా కబ్జాలు తొలగిస్తుండటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. జీహెచ్‌ఎంసీ చట్టం, నిబంధనల మేరకు కమిషనర్ అనుమతి లేకుండా ఫుట్‌పాత్‌లు, గోడలు తదితర ప్రాంతాల్లో ఎలాంటి వస్తువులు, తదితరమైనవి ఉంచరాదని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

కోట టు టూంబ్స్.. ఆకాశ యానం

- రోప్‌వేలో కేబుల్ కార్ జర్నీ
- ఏర్పాటుకు హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు
- పర్యాటకులను ఆకట్టుకొనేలా ఏర్పాటు
- 1.5 కి.మీ.. రూ.100 కోట్లతో అంచనాలు



సాక్షి, సిటీబ్యూరో: పర్యాటకులను ఆకట్టుకొనే చారిత్రక గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు రోప్‌వే అందుబాటులోకి రానుంది. ఇందుకోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ప్రణాళికలు రూపొందిస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోప్‌వేలు, స్కైవేలపై విస్తృత అధ్యయనం చేస్తోన్న హెచ్‌ఎండీఏ అనుబంధ సంస్థ హుమ్టా గోల్కొండ కోట నుంచి 1.5 కి.మీ దూరంలో ఉన్న కుతుబ్‌షాహీల సమాధుల వరకు రోప్‌వే నిర్మాణంపై దృష్టి సారించింది.

పర్యాటకులతో కిటకిట..

ప్రతి రోజు దేశ,విదేశాలకు చెందిన పర్యాటకులు గోల్కొండ కోటను సందర్శిస్తుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో టూంబ్స్ వరకు వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో పర్యాటకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు వైపులా రాకపోకలు సాగించేందుకు రోప్‌వేను ఏర్పాటు చేయడమే ఏకైక పరిష్కారమని అధికారులు భావిస్తున్నారు. రాకపోకలను సులభతరం చేయడమే కాకుండా రోప్‌వే ద్వారా కేబుల్ కార్లలో ప్రయాణం చేయడం ఒక ప్రత్యేకమైన ఆకర్షణగా మారనుంది. ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 10 వేల మందికి పైగా ఈ రెండు ప్రాంతాలను సందర్శిస్తున్నారు. వీరిలో 3 వేల మంది విదేశీ టూరిస్టులు ఉంటారని అంచనా. రోప్‌వే ఏర్పాటు చేస్తే దేశ విదేశాలకు చెందిన పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

త్వరలో కన్సల్టెన్సీ ..

రోప్‌వే ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదికను అందజేసేందుకు త్వరలో కన్సల్టెన్సీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్‌లను ఆహ్వానించేందుకు త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది.

పీపీపీ పద్ధతిలో నిర్మాణం..

రోప్‌వేను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నిర్మించనున్నారు. 1.5 కిలోమీటర్లకు సుమారు రూ.100 కోట్ల వరకు వ్యయం కానున్నట్లు అంచనా. ప్రస్తుతం గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు ట్రాఫిక్ రద్దీ కారణంగా రోడ్డు మార్గంలో వెళ్లాలంటే అరగంటకు పైగా సమయం పడుతుంది. రోప్‌వే వల్ల కేబుల్ కార్లలో 10 నిమిషాల్లో రాకపోకలు సాగించవచ్చు. పైగా టూరిస్టులకు ఆకాశంలో విహరించిన అనుభూతి కలుగుతుంది. ప్రస్తుత అంచనాల మేరకు రోజుకు 3000 మందికి పైగా రోప్‌వేను వినియోగించే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఆ సంఖ్య మరింత పెరగవచ్చు.

నిధులే ముద్దు.. నిబంధనలొద్దు!

'రోడ్ సేఫ్టీ' లేకుండా జీహెచ్‌ఎంసీ ఇంజినీర్ల నిర్లక్ష్యం

- సైనేజీలు, లేన్‌మార్కింగ్‌లు, నేవిగేషన్‌లు పట్టవు
- పాఠశాలలున్నా.. ప్రమాదాలు జరిగినా అంతే..
- అడ్డగోలుగా రోడ్ల నిర్మాణం, ఎక్కడపడితే అక్కడ రంబుల్‌స్ట్రిప్స్
- ఎట్టకేలకు నిద్రలేచిన బల్దియా యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లకు కాంట్రాక్టర్లతో కలిసి రోడ్లు వేయకుండానే బిల్లులు కాజేయడం తెలుసు. ఎక్కడా లేని నిబంధనలతో కావాల్సిన వారికే టెండర్లు కట్టబెట్టడమూ తెలుసు. నాణ్యత లేమితో తూతూమంత్రంగా పనులు చేయడమూ తెలుసు. ఎటొచ్చీ జేబులు నింపుకొనేందుకు చూపిస్తున్న శ్రద్ధ ప్రజలకు ప్రమాదాలు జరగకుండా ఉండటంపై చూపడం లేదు. నాసిరకం రోడ్లే కాదు.. రోడ్డు ప్రయాణాలు చేసేవారికి చూపాల్సిన మార్గదర్శకాలు పట్టించుకుంటే ఒట్టు. చివరకు సైనేజీలపైనా శీతకన్నే. సైనేజీలు, లేన్‌మార్కింగ్‌లు, అడ్డగోలు రంబుల్‌స్ట్రిప్స్ వల్ల ప్రజలకు ఎలా ప్రమాదాలకు ఆస్కారం ఉందో నగరంలో వాహనాల మొబిలిటీ ఎందుకు తగ్గుతుందో జీహెచ్‌ఎంసీలోని మరో విభాగమే క్షేత్రస్థాయిలో సర్వే చేసి లోపాలు తెలియజేయడం విశేషం. అంతేకాదు, రోడ్‌సేఫ్టీ చర్యల్లో భాగంగా.. రహదారుల ప్రమాణాలకు సంబంధించి దేశంలోనే అత్యున్నత సంస్థలైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ), మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ (మోర్త్) ప్రమాణాలకనుగుణంగా ఎలా ఉండాలో సూచిస్తూ జీహెచ్‌ఎంసీ ట్రాఫిక్ విభాగం రూపొందించిన స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు తప్పనిసరిగా పాటించాల్సిందిగా కమిషనర్ ఆదేశించారు.

క్షేత్రస్థాయి సర్వే నివేదిక మేరకు ..

రోడ్ మార్కింగ్‌లు వేస్తున్నామా అంటే వేస్తున్నాం. స్పష్టంగా కనిపించడం లేదు. చార్మినార్ నుంచి బంజారాహిల్స్, హైటెక్ సిటీ దాకా అదే దుస్థితి. రద్దీప్రాంతాల్లో పాదచారులకుకానీ, పాఠశాలల వద్ద విద్యార్థులకు కానీ సురక్షితంగా రోడ్డు దాటేందుకు జీబ్రా లేన్స్ లేవు. అబిడ్స్ వంటి ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందిన గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో సైతం పాదచారులు రోడ్డు దాటేందుకు ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది.

లేన్ మార్కింగ్‌లెందుకు?

బస్సులు వెళ్లేందుకు, సైకిళ్లు, పాదచారుల కోసం వేర్వేరు విభాగాలుగా ఉండేందుకు లేన్ మార్కింగ్‌లు అవసరం.. కానీ నగరంలో చాలా ప్రాంతాల్లో ఇవి కనిపించడం లేదు. దీంతో డ్రైవర్లు లేన్లను మారుస్తుండటంతో బాటిల్‌నెక్స్ ఏర్పడుతున్నాయి. అందుకు తాజా ఉదాహరణ చాదర్ ఘాట్.

ఈ గుర్తులేవీ?

అవసరమైన ప్రాంతాల్లో 'స్టాప్', 'నో యూ టర్న్' 'ముందుకు స్పీడ్‌బ్రేకర్ ఉంది వంటి హెచ్చరికలు లేవు. ఎన్నో ప్రధాన రహదారులు, జంక్షన్లలోనూ



అదే దుస్థితి. జంక్షన్ల వద్ద ఏ దారి ఎటువైపు వెళ్తుందో సూచించే సైనేజీలూ (నేవిగేషన్) లేవు. ఉన్నా ప్రైవేటు ప్రకటనల్లో మూసుకుపోయాయి. దీంతో నగరానికి కొత్తగా వచ్చిన వారికి కానీ, ఇతర ప్రాంతాలకు వెళ్లే నగర ప్రజలకు కానీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రంబుల్‌స్ట్రిప్స్‌తో ప్రమాదాలు

అడ్డదిడ్డంగా ఇష్టానుసారంగా వేసిన రంబుల్‌స్ట్రిప్స్ వేగాన్ని తగ్గించేందుకు బదులు ప్రమాద హేతువులవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వాటిని దాటేటప్పుడు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. ఓఆర్ఆర్ వంటి ప్రాంతాల్లో పెద్ద వాహనాలు సైతం అదుపు తప్పుతున్నాయి. ఎల్‌బీనగర్ – ఉప్పల్ మార్గంలో తరచూ ప్రమాదాలకు ఇది కూడా కారణమే. రంబుల్‌స్ట్రిప్స్ ఐఆర్‌సీ మార్గదర్శకాల మేరకు 10–17 మిమి ఎత్తు, 250–300 వెడల్పుతో ఉండాలి. 600 ఎంఎం గ్యాప్‌తో 6 స్ట్రిప్స్ ఉండాలి కానీ నగరంలో ఎత్తు మాత్రం పెంచారు.అవి సైతం ఎక్కడ పడితే అక్కడ కాకుండా పాదచారులు రోడ్డు దాటే మార్గాలకు ముందు, జంక్షన్ల వద్ద ఏర్పాటు చేయాలి. 'రంబుల్‌స్ట్రిప్స్ ముందు ఉన్నాయి' అనే సూచికలు ఉండాలి. సాఫీగా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలి కానీ లోపభూయిష్ట డిజైన్లతో నడుములు విరుగుతున్నాయి.

ఏం చేయాలి ?

లోపాలను చక్కదిద్దడంతో పాటు నగరం విశ్వనగరంగా ఉండాలంటే ఆధునిక సాంకేతికతతో కూడిన కొత్త విధానాలు అందుబాటులోకి తేవాలి. సైనేజీలు, సూచికల వంటి వాటి ఏర్పాటుతోపాటు ప్రజలకు వాటి గురించి అవగాహన కలిగేలా నిరంతరం కార్యక్రమాలుండాలి. స్కూల్స్, హాస్పిటల్స్ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక గుర్తులుండాలి. 'పాదచారి దారిలో ఉన్నారు', ఓవర్ టేక్ చేయవద్దు, స్పీడ్‌లిమిట్ వంటి సూచనలు రిఫ్లెక్టివ్ బోర్డులతో ఏర్పాటు చేయాలి. జంక్షన్ల వద్ద కౌంట్‌డౌన్ టైమర్లతో కూడిన లైన్లు, పెలికాన్ క్రాసింగ్‌బటన్లు ఉండాలి. రంబుల్ స్ట్రిప్స్ ఇష్టానుసారం కాకుండా అవసరమైన ప్రాంతాల్లోనే వేయాలి.

- బస్‌బేస్, ఆన్‌స్ట్రీట్, ఆఫ్‌స్ట్రీట్ పార్కింగ్ ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి. ఇరుకు రోడ్లకు, డివైడెడ్ రోడ్లకు వేర్వేరు మార్కింగ్ నిబంధనలుండాలి. ఫ్లై ఓవర్లు, జంక్షన్లు, వలయాకారపు జంక్షన్లు వంటి ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించే లేన్లు, మార్గదర్శక సూచనలు ఉండాలి. మలుపులున్న ప్రాంతాల్లో 15 ఎంఎం వెడల్పుతో రోడ్డుకు ఇరువైపులా తెలుపురంగు ఉండాలి. రాత్రిళ్లు కనపడేలా స్టడ్స్ ఉండాలి. సెన్సర్ ఆధారిత రంబుల్ స్ట్రిప్స్ బదులు కాలం చెల్లిన స్టాటిక్ సిస్టమ్‌నే వాడుతున్నారు. వాటిని మార్చడంతోపాటు రంబుల్‌స్ట్రిప్స్ లొకేషన్స్, స్థితిగతులకు సంబంధించి సెంట్రలైజ్డ్ డేటాబేస్ అవసరం. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఎంఆర్‌ల మధ్య సమన్వయ లోపం వల్ల రోడ్డు నిబంధనలు సవ్యంగా అమలు కావడం లేదు.

పట్టించుకోని అధికారులు

- దిక్కేలేని ఎక్స్‌రే ఫిల్ములు
- సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకోవాల్సిందే
- అల్ట్రాసౌండ్ కోసం తప్పని పడిగాపులు
- నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షే
- ఆస్పత్రిలో బారులు తీరుతున్న రోగులు



మానిటర్‌పై ఉన్న ఎక్స్‌రేను సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకుంటున్న దృశ్యం



టోకెన్లు లేవట!

ఒంట్లో బాలేదని దవాఖానాకు వచ్చా. డాక్టర్ పరీక్షలు చేయించుకోమన్నారు. రెండో రోజు రిపోర్టు వచ్చింది. అల్ట్రాసౌండ్ కోసం వరుసలో నిలబడ్డా. 110 మందికి టోకెన్లు ఇచ్చారు. ఈ రోజుకు ఐపోయాయి. రేపు మళ్లీ వరుసలో రండి అన్నారు. మళ్లీ వచ్చి లైన్‌లో నిలుచుంటే చీటీ దొరుకుతుందనే నమ్మకం కలగడం లేదు. – కౌసల్య, జగద్గిరిగుట్ట

'గాంధీ' ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు

పనిచేయని వైద్య పరికరాలు

సాక్షి, సిటీబ్యూరో/గాంధీ ఆసుపత్రి: పేరు గొప్ప, ఊరు దిబ్బ అంటే ఇదే. పేరుకు పెద్దదే అయినా గాంధీ ఆస్పత్రిలో సరిపడా వైద్యులు కరువయ్యారు. రోగులకు అవసరమైన యంత్రాలు పని చేయడం లేదు. డాక్టర్ రాసిన మందులు దొరకడంలేదు. పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అంటూ ప్రభుత్వ పెద్దలు చేసే ఉపన్యాసాలు మాటలకే పరిమితమవుతున్నాయి. పరిపాలనా పరంగా కొంత మంది ఉన్నతాధికారుల మధ్య అంతర్గత పోరు ఒకవైపు.. పని చేయని యంత్రాలు, ఖాళీగా కీలక విభాగాలు.. వెరసీ.. వైద్యం కోసం వచ్చిన పేదలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఉ.6 గంటలకు లైన్‌లో నిలబడి, తోపులాటను తట్టుకుని, చీటీ సంపాదించి వైద్యుడిని కలవడం ఒక ఎత్తయితే.. డాక్టర్ రాసిన పరీక్షలు చేయించుకుని నివేదికలు తెచ్చుకోవడం అంతకంటే పెద్ద టాస్క్‌గా మరింది. ఫలితంగా రోజుల తరబడి ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని చేయని యంత్రాలు..

గాంధీ ఆస్పత్రికి నిత్యం వందల సంఖ్యలో ఓపీ ఉంటుంది. ఇన్ పేషెంట్‌లు సుమారు రెండు వేల మంది వరకు ఉంటారు. వీరికి అవసరమైన ఎక్స్‌రేల కోసం రేడియాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన మూడు యంత్రాలు మూలకు చేరాయి. సిటీ స్కానింగ్ యంత్రం అసలే పనిచేయడం లేదు. నిత్యం వందలాది మంది ఆస్పత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్ట్రాసౌండ్ కోసం జనం బారులు తీరుతున్నారు. ముందుగా వచ్చిన వారికి వరుస సంఖ్య వేసి వంద దాటిన తర్వాత మరుసటి రోజు రావాలని పంపిస్తున్నారు. కొంతమంది దిక్కుతోచని పరిస్థితిలో బయటకు వెళ్లిపోతున్నారు. వైద్య పరికరాలకు మరమ్మతు చేయించడానికి అధికారులకు తీరిక లేకుండా పోయిందా అని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎక్స్‌రే గది వద్ద క్యూ

వేధిస్తున్న వైద్యులు కొరత

గాంధీ ఆస్పత్రిని వైద్యుల కొరత వేధిస్తోంది. దీంతో కొందరిని కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకున్నారు. ఆపై పీజీ విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన వైద్యుల నియామకాలు చేపట్టాలని ఆస్పత్రి సిబ్బంది వేడుకుంటున్నారు. రేడియాలజీ, మైక్రో బయాలజీ, బయోకెమెస్ట్రీ, పేథాలజీలో ప్రొఫెసర్ల కొరత వేధిస్తోంది. దీంతో రోగులకు సంబంధించిన రక్తం, మూత్రం, ఇతర ల్యాబ్ రిపోర్టులు రావడానికి ఆలస్యం జరుగుతోంది. మధ్యాహ్నం నుంచి వస్తే వైద్యులు అందుబాటులో ఉండటంలేదని రోగులు పేర్కొంటున్నారు.

ఎక్స్‌రే ఫొటోలు సెల్‌ఫోన్‌లో..

ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితిలో ఎంఎస్‌సీ కేసులకైనా ఎక్స్‌రే ఫిలిం నిల్వలు నిండుకున్నాయి. వైద్యుల సూచన మేరకు ఎక్స్‌రే తీసుకున్న బాధితులకు ఫిలిం ఇవ్వడం లేదు. ఇదేమిటంటే ఫిలిం లేదని చెబుతున్నారు. వైద్యులకు చూపించడం కోసం మానిటర్ మీద ఉన్న ఎక్స్‌రే ఫొటోను మీ మొబైల్ ఫోన్లలో తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎవరి ఎక్స్‌రే వారు ఫొటో తీసుకుని వైద్యుడికి చూపించుకోవాల్సిందే తప్ప మరో దారిలేకుండా పోయింది. మానిటర్‌పై ఎక్స్‌రేను ఫొటో తీస్తే ఎంత క్లారిటీ ఉంటుంది, ఏం కనిపిస్తుందనేది వైద్యులకే తెలియాలి.

వైవిధ్య వనం!

- ఆగస్టు 15 నాటికి ప్రారంభించే అవకాశం
- పచ్చిక బయళ్లు, ఉద్యానవనాలు, బోర్డ్‌వాక్‌లు
- 85 ఎకరాలు, సుమారు రూ.75 కోట్ల వ్యయం
- పార్కును సందర్శించిన సీఎస్ తదితరులు

తుదిదశలో కొత్వాల్‌గూడ ఎకోపార్కు



పార్కులో పక్షులతో సరదాగా సీఎస్ రామకృష్ణారావు తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టిన కొత్వాల్‌గూడ ఎకో పార్కు ప్రాజెక్ట్ తుదిదశకు చేరుకుంది. హిమాయత్‌సాగర్‌కు చేరువలో, ఔటర్‌రింగ్ రోడ్డు అంచుల్లో ఆకుపచ్చ అందాలతో పార్కు రూపుదిద్దుకుంటోంది. 2022 అక్టోబర్‌లో 85 ఎకరాల విస్తీర్ణంలో రూ.75 కోట్ల అంచనాలతో ప్రభుత్వం ఎకో పార్కు నిర్మాణం చేపట్టింది. ఎన్నో వైవిధ్యభరితమైన ప్రత్యేకతలతో ఏర్పాటు చేస్తోన్న కొత్వాల్‌గూడ ఎకోపార్కును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తదితర ఉన్నతాధికారులు శుక్రవారం సందర్శించారు. పంద్రాగస్టు నాటికి పార్కును ప్రారంభించే దిశగా పనులు కొనసాగుతున్నాయి. పార్కు ప్రవేశ ద్వారం వద్ద వెదురు అల్లికలతో అందమైన ఆర్చ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సహజత్వం ఉట్టిపడేలా ఈ ఆర్చ్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన వెదురును థాయ్‌లాండ్ నుంచి తెప్పించనున్నారు. ఇందుకోసం నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. వెదురు అల్లికల ఆర్చ్ పని పూర్తి కాగానే పార్కును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.

ఎన్నో ప్రత్యేకతలు..

- ఇటు ఐటీ కారిడార్‌ల నుంచి అటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ఉన్న వివిధ కాలనీలు, ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఒక అద్భుతమైన ఆటవిడుపు.
- అందమైన కాలక్షేపంగా ఎకో పార్కు కనువిందు చేయనుంది. పుట్టిన రోజు, పెళ్లిరోజు వంటి వేడుకలకు అవసరమైన వేదికలు, లగ్జరీ సదుపాయాలతో దీన్ని రూపొందించారు.
- పార్కులో ఏర్పాటు చేసిన ఏవియరి (పక్షుల గ్యాలరీ) సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనుంది. రకరకాల పక్షుల కిలకిలలతో ఆహ్లాదాన్ని పంచేవిధంగా దీన్ని ఏర్పాటు చేశారు.
- 2.5 కి.మీ.లతో ఎలివేటెడ్ వాక్ వేలను నిర్మించారు.నగరవాసులు ఉదయం, సాయంత్రం ఈ వాక్‌వేలపై నడకకు వెళ్లవచ్చు. విశాలమైన పచ్చిక బయళ్లతో పాటు, అందమైన పూల వనాలను ఏర్పాటు చేశారు. బటర్‌ఫ్లై పార్కు మరో ప్రత్యేకత. సీజనల్ ఉద్యాన వనాలు మరో ప్రత్యేకత.



కొత్వాల్‌గూడలోని ఎకోపార్కు

'వేగం' పెరిగింది

- ఏడాది క్రితం నగరంలో వాహనాల వేగం గంటకు 17 నుంచి 18 కి.మీ
- ఇప్పుడు అది 24 నుంచి 25 కి.మీలకు చేరిక
- ప్రయోగాత్మక చర్యలు ఫలితాలు ఇవ్వడంతోనే..
- రానున్న రోజుల్లో అమలు కోసం 'టాప్' సిద్ధం
- వెల్లడించిన నగర పోలీసు కమిషనర్ ఆనంద్


వివరాలు వెల్లడిస్తున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: 'గత ఏడాది ఈ సమయంలో నగరంలో వాహనాల సరాసరి వేగం గంటకు 17 నుంచి 18 కిమీగా ఉండేది. ప్రస్తుతం అది గంటకు 24 నుంచి 25 కిమీకి పెరిగింది. ఇలా ఆరు కిలోమీటర్లు పెరగడానికి ట్రాఫిక్ విభాగం తీసుకున్న నిర్ణయాలే కారణం' అని హైదరాబాద్ కొత్వాల్ సీవీ ఆనంద్ అన్నారు. రానున్న రోజుల్లో అమలు చేయడానికి తయారు చేసిన ట్రాఫిక్ యాక్షన్ ప్లాన్‌పై (టాప్) ఆయన శుక్రవారం ట్రాఫిక్ అధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్, డీసీపీలు రాహుల్ హెగ్డే, అశోక్‌కుమార్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా..

- సిటీలో రోజుకు కొత్తగా 1600 వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. మూడు కమిషనరేట్లలోనూ కలిపి వీటి సంఖ్య 91 లక్షలకు చేరింది. కొత్తగా ఫ్లైఓవర్లు, రహదారులు వచ్చినా, రోడ్ల విస్తరణ జరిగినా వీటి ప్రభావం తీవ్రంగా ఉంది. అయినప్పటికీ సరాసరి వేగం పెరగడానికి ట్రాఫిక్ అధికారుల కృషే కారణం.
- ఆపరేషన్ రోప్, టౌన్ వెండింగ్ కమిటీల ఏర్పాటుతో క్యారేజ్ వేలు గణనీయంగా పెరిగాయి. వీఐపీలు, వీవీఐపీల కదలికల సమయంలోనూ మాన్యువల్‌గా సిగ్నల్స్ వినియోగం తగ్గించడంతో జామ్స్ తగ్గాయి. సరాసరిన చూస్తే గతంలో ఓ సిగ్నల్‌ను 50 శాతం మాన్యువల్‌గా ఆపరేట్ చేయాల్సి వచ్చేది. ఇది ప్రస్తుతం 15 శాతానికి తగ్గగా... 10కి తగ్గించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.
- నగరంలోని 25 ప్రాంతాల్లోని ఎత్తైన భవనాలపై హైరైజ్ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రయోగాత్మకంగా రెండు డ్రోన్లను వినియోగిస్తున్నాం. వీటి సహాయంతో ట్రాఫిక్ స్థితిగతుల్ని ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నాం. ఈ వివరాలను బట్టి ట్రాఫిక్ సిగ్నల్స్ సైకిల్ మార్చడంపై డీసీపీలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. అవసరమైన మార్గానికి ఎక్కువ సేపు గ్రీన్‌లైన్ ఉండేలా చేస్తున్నాం. ఈ కెమెరాలు, డ్రోన్ల సంఖ్యను పెంచనున్నాం.
- ప్రస్తుతం నగరంలో ఉన్న కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెద్ద వ్యాపారులు ట్రాఫిక్ మార్షల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. వీరి నియామకం అనేది కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్సార్) అంశంగా మారుస్తున్నాం. ఇలా ఎంపిక చేసుకున్న వారికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో శిక్షణ ఇస్తాం. ఆయా సంస్థల వద్ద ట్రాఫిక్ నియంత్రణ ఈ మార్షల్స్ బాధ్యత.
- ఆటోడ్రైవర్లు సైతం ఎక్కడపడితే అక్కడ తమ వాహనాలు ఆపుకోకుండా వారి కోసం ప్రత్యేక స్థలాలు కేటాయించి బోర్డులు ఏర్పాటు చేస్తాం. నగరంలోని వాటర్ లాగింగ్ ఏరియాల్లో వర్షం కురవడానికి ముందు నుంచే మళ్లింపులు అమలు చేస్తాం. రాత్రి వేళల్లో నగరంలోకి వచ్చే ప్రైవేట్ బస్సుల వల్ల అనేక ఇబ్బందులు ఉంటున్నాయి. దీనిపై త్వరలో ఓ విధానపర నిర్ణయం తీసుకుంటాం.
- సిటీలోని కొన్ని ప్రాంతాల్లో యూ టర్న్స్ చాలా దూరంగా ఉంటున్నాయి. దీని వల్ల రాంగ్‌సైడ్ డ్రైవింగ్ పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని నగర వ్యాప్తంగా అధ్యయనం చేస్తున్నాం. వీలున్న చోట యూ టర్న్స్‌ను మారుస్తాం. రాత్రి 10 తర్వాత, ఉదయం 5 నుంచి 8 గంటల వరకు విధుల్లో ఉండటానికి 100 మంది సిబ్బందిని కేటాయించాం.

దుర్గంచెరువు 'దుర్గంధం'పై నివేదిక ఇవ్వండి

సిటీ కోర్టులు: దుర్గంచెరువు వద్ద అంత దుర్గంధం ఎందుకు వస్తుందని, దీనికి సంబంధించిన పూర్తి నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. దుర్గంచెరువు అంశంపై ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిని సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. ఈ దుర్గంధానికి కారణాలు ఏంటి? ఎందుకు సమస్య అంత తీవ్రంగా ఉందనే అంశాలపై పూర్తి నివేదిక అందజేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ మెంబర్ తదితరులకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేస్తున్నట్లు కమిషన్ తెలిపింది.

సీఎం ప్రజావాణిలో 272 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 272 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి 51, రెవెన్యూ శాఖకు 74, ఇందిరమ్మ ఇళ్ల కోసం 28, విద్యుత్ శాఖకు 24, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 93 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, స్టేట్ కోఆర్డినేటర్ దివ్యలు దరఖాస్తు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు.


ప్రజావాణిలో పాల్గొన్న చిన్నారెడ్డి, దివ్య

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని నోవాటెల్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణా ఎదురుగా ఉన్న బంజారా హాల్‌లో బిగ్ పటోలా శారీస్ సేల్ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు..
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఉదయం 8.45 గంటలకు మాదాపూర్‌లోని హైటెక్స్ లాన్స్‌లో జరుగుతాయి.
- తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా ఈవెంట్ ఉదయం 6.20 గంటల నుంచి ఉదయం 8.30 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నక్షత్ర తాబేళ్లు స్వాధీనం



గచ్చిబౌలి: రాయదుర్గం పరిధిలో నిషేధిత నక్షత్ర తాబేళ్ల విక్రయించేందుకు యత్నించిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం ..మణికొండ సాయిరాంనగర్‌లో న్యూ బ్లే స్టార్క్ అక్వేరియం నిర్వహించే చెరుకుల బాలస్వామి నక్షత్ర తాబేళ్ల అమ్మేందుకు సిద్ధంగా ఉంచారని సమాచారం అందడంతో ఎస్ఓటీ, రాయదుర్గం పోలీసులు దాడులు నిర్వహించారు. నిందితుడి నుంచి నాలుగు నక్షత్ర తాబేళ్ళు, రెండు రెడ్ ఇయర్డ్ స్లైడర్ తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతని స్నేహితుడు సురేష్ కుమార్ చెన్నై నుంచి తాబేళ్లను సరఫరా చేస్తున్నాడు. నిందితుడు బాలస్వామికి నోటీసు జారీ చేస్తామని, తాబేళ్లను అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. మరో నిందితుడు సురేష్ పరారీలో ఉన్నాడని చెప్పారు. కేసు ఫారెస్ట్ విభాగానికి బదిలీ చేస్తామని చెప్పారు.

విద్యుత్ ఏఈపై వేటు!

- నేలపై పడి ఉన్న కేబుల్‌ను మార్చడంలో నిర్లక్ష్యం
- గచ్చిబౌలి డివిజన్‌లో షాక్‌తో ఓ బాలుడు మృతి
- అసిస్టెంట్ ఇంజనీర్‌పై సస్పెన్షన్ వేటు వేసిన డిస్కం

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు, ఫీడర్ల వద్ద తరచూ వెలుగు చూస్తున్న విద్యుత్ ప్రమాదాలపై డిస్కం దృష్టి సారించింది. ఎప్పటికప్పుడు లోపాలను గుర్తించి, వాటిని సరి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఇంజనీర్లు, సిబ్బందిపై చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు పరోక్షంగా ఓ బాలుని మృతికి కారణమైన గచ్చిబౌలి డివిజన్ తారానగర్ సెక్షన్ ఏఈ సుమన్‌పై శుక్రవారం సస్పెన్షన్ వేటు వేసింది. ఆరంబ్ టౌన్‌షిప్‌కు చెందిన మాస్టర్ రుద్రప్రతాప్‌సింగ్ మే తొమ్మిదిన రాజీవ్ స్వగృహ 11 కేవీ ఫీడర్ సమీపంలో క్రికెట్ ఆడుతున్నాడు. ఫీడర్‌కు సంబంధించిన రింగ్ మెయిన్ యూనిట్(ఆర్ఎంయూ) సమీపంలో పడిన బాల్ తెచ్చేందుకు లోనికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ నేలపై పడి ఉన్న లైవ్ విద్యుత్ కేబుల్ తగిలి షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటనపై డిస్కం సమగ్ర విచారణకు ఆదేశించింది. బాలుని మృతికి గచ్చిబౌలి డివిజన్ తారానగర్ సెక్షన్ ఏఈ నిర్లక్ష్యం కూడా ఓ కారణమని పేర్కొంటూ ఆయనపై చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు రంగారెడ్డి జోన్ ఆపరేషన్ విభాగం సీఈఓ ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

బేకరీల్లోనూ అంతే !

ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు నీళ్లు

సాక్షి, సిటీబ్యూరో: హోటలైనా, హాస్టలైనా, స్వీట్‌షాపైనా అంతే. ఆహార పదార్థాలు విక్రయించే బేకరీల్లోనూ అదే తంతు. ఫుడ్‌సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదు. జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం నగరవ్యాప్తంగా 90 బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. లోపాలు గుర్తించారు. 80 శాంపిళ్లను లేబరోటరీ పరీక్షలకు పంపించారు. అన్ని బేకరీల్లోనూ గుర్తించిన సాధారణ లోపాలు ఉన్నాయి. లైసెన్సులు కనిపించేలా లేవు. గడువు తేదీలు లేవు. చెత్త డబ్బాలు తెరిచి ఉంచారు. ఈగల సంచారం ఉంది. ఆహార వ్యర్థాలు నేలపై ఉన్నాయి. సిబ్బంది ఆరోగ్య రికార్డులు లేవు. నీటి విశ్లేషణల రిపోర్టులూ లేవు.

'విద్యుత్' మరమ్మతులపై ముందస్తు సమాచారం ఇవ్వాలి

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, మరమ్మతు పనులపై వినియోగదారులకు ఒక రోజు ముందే సమాచారం ఇవ్వాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ సంబంధిత ఇంజనీర్లకు సూచించారు. ఆటో/బైక్‌లపై సౌండ్ బాక్సులను ఏర్పాటు చేసుకుని ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేయాలని, వినియోగదారుల మొబైల్ ఫోన్లకు ఎస్‌ఎంఎస్ ద్వారా విద్యుత్ సరఫరా నిలిపివేసే వేళలకు సంబంధించిన పూర్తి సమాచారం అందజేయాలని కోరారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా సరఫరా నిలిపివేయడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం మాన్‌సూన్ ఏర్పాట్లపై సంబంధిత ఇంజనీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు తమ పరిధిలో నిర్వహిస్తున్న మరమ్మతు పనుల షెడ్యూల్‌ను పరిశీలించడంతో పాటు విధిగా తనిఖీ చేయాలని, సిబ్బంది స్వీయ భద్రతా చర్యలు పాటించాలని, షెడ్యూల్ ప్రకారంగా పని పూర్తి చేయాలని సూచించారు.

సాంకేతిక సమస్యలతో రెండు ఎయిర్ ఇండియా విమానాలు రద్దు


శంషాబాద్: సాంకేతిక సమస్యలతో రెండు ఎయిర్ ఇండియా విమానాలు రద్దయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఏఐ 2534 విమానం హైదరాబాద్ నుంచి ముంబైకి టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్లు ఏటీసీకి సమాచారం అందించడంతో విమానాన్ని నిలిపివేసి రద్దు చేశారు. ప్రయాణికులను మరో విమానం ఏఐ 2442 విమానంలో సర్దుబాటు చేశారు. ఇందులో మొత్తం 92 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇదిలా ఉంటే హైదరాబాద్ నుంచి దుబాయ్ బయలుదేరాల్సిన ఏఐ 2204 విమానాన్ని కూడా గురువారం అర్ధరాత్రి సాంకేతిక కారణాలతో రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఈ నెల 26 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

రామంతాపూర్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి రెండు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ జరగనుందని రామంతాపూర్ ప్రభుత్వ జేఎన్ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌డెస్క్ కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ తెలిపారు. జూన్ 24 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో నమోదు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునని, జూన్ 26 నుంచి 29 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 26 నుంచి జూలై 1 వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. జూలై 4 నుంచి 6 వరకు అభ్యర్థులకు సీట్లు కేటాయించిన కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

23న ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా

బన్సీలాల్‌పేట్: విద్యా, ఉపాధి, వ్యవసాయ రంగాలపై తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 23 సోమవారం ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, కపిలవాయి దిలీప్‌కుమార్ వెల్లడించారు. కవాడిగూడ ప్రధాన రహదారి బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత నిర్బంధ హక్కు చట్టం, రాజీవ్ యువ వికాసం, వ్యవసాయ రంగంలో నకిలీ విత్తనాల అమ్మకాన్ని అరికట్టాలని కోరుతూ ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉచిత నిర్బంధ విద్య చట్టం ద్వారా 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో అమలు జరిగే 9 లక్షల మంది పేద విద్యార్థులకు విద్యాపరంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో ఆర్ఎల్డీ జాతీయ మహిళా అధ్యక్షురాలు కపిలవాయి ఇందిర, టీఆర్ఎల్డీ వర్కింగ్ ప్రెసిడెంట్ కిన్నెర సిద్ధార్థ, ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ప్రముఖ పర్యావరణ వేత్త రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కపిలవాయి దిలీప్‌కుమార్

'రాజాసాబ్' సినిమా టీజర్ విజువల్స్ చోరీ

– పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: ప్రముఖ నటుడు ప్రభాస్ హీరోగా నటించిన రాజాసాబ్ సినిమా టీజర్ విజువల్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలంటూ డబ్బింగ్ స్టూడియో ఇన్‌చార్జి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని సాగర్ సొసైటీలో ఉన్న వారాహి స్టూడియోలో రాజాసాబ్ సినిమాకు సంబంధించి విజువల్స్ భద్రపరిచారు. అయితే ఈ నెల 11వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు స్టూడియోలోకి ప్రవేశించి ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విజువల్స్‌ను చోరీ చేశారని, 13వ తేదీన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని డబ్బింగ్ ఇన్‌చార్జి ఎస్. వసంత్‌కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను ఫేస్‌బుక్‌లో శంకర్‌బాయి, కార్తీక్ ప్రభాస్ పేరుతో, ఇన్‌స్టాలో ప్రభాస్ ఆర్మీ ఫ్యాన్ పేరుతో పోస్ట్ చేశారని, తాము అధికారికంగా విడుదల చేయాల్సిన టీజర్‌కు ముందే చోరీ చేసిన ఈ టీజర్ విజువల్స్‌ను పోస్ట్ చేశారని ఆయన ఆరోపించారు. ఫుటేజీలు పరిశీలించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.

రాజ్‌భవన్ ముందు మహిళ బైఠాయింపు


నాగమణి

పంజగుట్ట: గవర్నర్‌ను కలవాలంటూ రాజ్‌భవన్ ముందు ఒక మహిళ బైఠాయించింది. గవర్నర్ అపాయింట్‌మెంట్ ఇవ్వకుంటే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటాను అంటూ రాజ్‌భవన్ గేటు ముందు బైఠాయించడంతో పోలీసులు ఆమెను పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే..రిసాలబజార్‌కు చెందిన నాగమణి శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్ వద్దకు వచ్చి గేటు ముందు బైఠాయించింది. అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది ఏం కావాలి అని అడిగితే బోరున ఏడుస్తూ తాను గవర్నర్‌ను కలవాలి అని చెప్పింది. సమస్య ఏమిటో చెప్పు అంటే నేను మీకు చెప్పను గవర్నర్‌కే చెబుతాను అంటూ అక్కడే బైఠాయించింది. దీంతో పోలీసులు వచ్చి ఆమెను స్టేషన్‌కు తరలించారు. ముంబైలో తన ఇంట్లో రూ.24 లక్షల చోరీ జరిగిందని, ఇదే విషయమై బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకోవడంలేదని, ముఖ్యమంత్రి ఇంటికి వారం రోజులు తిరిగాను, పోలీస్ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లాను అయినా ఏం ఫలితం లేదంటూ ఏదేదో చెబుతుందని పోలీసులు తెలిపారు. నాగమణి మానసికంగా తీవ్ర ఒత్తిడిలో ఉండి..పొంతన లేకుండా మాట్లాడుతుందని పోలీసులు తెలిపారు.

థాయ్ ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం

శంషాబాద్: బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన థాయ్ ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. శుక్రవారం ఉదయం బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు టేకాఫ్ తీసుకుంటున్న విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్లు దానిని వెంటనే నిలిపివేసి ప్రయాణికులను దింపేశారు. సాయంత్రం వరకూ అక్కడి నుంచి చేరుకోవాల్సిన ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకోలేదని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీగా మోహన్‌కుమార్



సాక్షి, సిటీబ్యూరో: సిటీ ట్రాఫిక్ వింగ్‌లోని సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీగా ఎస్.మోహన్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పంజగుట్ట ఏసీపీగా పని చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన మోహన్‌కుమార్ ట్రాఫిక్ ఏసీపీగా బదిలీపై వచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఆయన 1995లో ఎస్సైగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. 2009లో ఇన్‌స్పెక్టర్‌గా, 2018లో డీఎస్పీగా పదోన్నతి పొందిన మోహన్‌కుమార్ దక్షిణ మండలం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా, సూర్యాపేట డీఎస్పీగా, నగర సీసీఎస్ ఏసీపీగా పని చేశారు. గత నెల వరకు పంజగుట్ట డివిజన్ ఏసీపీగా విధులు నిర్వర్తించారు.

యోగా డేను విజయవంతం చేయండి

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. యోగా శిక్షకులు, మెడికోలు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 5,500 మంది పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, శ్రీహరి, నగర మేయర్ విజయలక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమాన్ని అధికారులంతా కలసి సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పరీక్షలు

సాక్షి, సిటీబ్యూరో: భూభారతి సంస్కరణల్లో భాగంగా రైతుల భూ తగదాలు, రిజిస్ట్రేషన్‌లు, పట్టా భూముల హద్దుల నిర్ణయం, పనుల నిమిత్తం శిక్షణ ఇచ్చిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో పరీక్షలు నిర్వహించారు. జిల్లా సర్వే అధికారి ఆధ్వర్యంలో జరిగిన పరీక్షల నిర్వహణను జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, రెవెన్యూ అధికారి వెంకటాచారి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ అనంత్‌రెడ్డి, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ రాజేష్, విజయ్ కుమార్, రంగయ్య, పలువురు సర్వేయర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కలిగించారు. చెత్తను వీధుల్లో పారవేయవద్దని, ఇంటికి వచ్చిన స్వచ్ఛ ఆటోకు అందించాలని జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య విద్యార్థులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు రావన్నారు. లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తిచేయాలి



ఖైరతాబాద్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కార్పొరేటర్ విజయారెడ్డి పరిశీలించారు. డివిజన్‌లోని లైబ్రరీ చౌరస్తా నుంచి ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం వరకు రూ.20లక్షలతో చేపడుతున్న వర్షపు నీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ ఏఈ చరణ్‌తో కలిసి పరిశీలించారు. పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే గంగ తెప్పోత్సవ ఉత్సవాలను ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సాగరతీరంలో ఉన్న గంగమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ గంగ తెప్పోత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గంగ తెప్పోత్సవం కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్ బాబు, ప్రధాన కార్యదర్శి పూస నరసింహ, కార్యనిర్వాహక అధ్యక్షుడు మంగిళి పెళ్లి రాజు, ఉపాధ్యక్షుడు గుండు బాబురావు, బైరు అనిష్ మల్కు, విశాల్ బాబు, మల్కు రవికిరణ్ బాబు, బైరు బాబురావు, యాదగిరి ఉన్నారు.

నేను వెళ్తా నాన్నోఁ.. సర్కార్ పాఠశాలకు..

ఖైరతాబాద్ జోన్‌లో పెరిగిన అడ్మిషన్లు

- ప్రభుత్వ పాఠశాలలకు క్యూ కడుతున్న విద్యార్థులు
- బడిబాటతో సత్ఫలితాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: ప్రైవేటు పాఠశాలల తాకిడితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గిపోతున్న తరుణంలో ఈ ఏడాది 2025–26 విద్యా సంవత్సరంలో అందుకు భిన్నంగా విద్యార్థుల చేరికలతో సర్కార్ బడులు కళకళలాడుతున్నాయి. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట, సోమాజిగూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 43 ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఈ ఏడాది 1856 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు పొందారు. వీరంతా ప్రైవేటు పాఠశాలల నుంచి టీసీలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం గమనార్హం. డిజిటల్ తరగతుల బోధన, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో పాటు బడిబాటలో భాగంగా ఇంటింటా నిర్వహించిన ప్రచారంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పేందుకు పెద్ద ఎత్తున ముందుకువచ్చారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఖైరతాబాద్ జోన్ పరిధిలో 92 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు అనూహ్యంగా పెరిగాయి.



ఎన్‌బీటీనగర్ గవర్నమెంట్ స్కూల్‌లో కొత్తగా అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు

ఫలితంగా ఆయా పాఠశాలలకు కొత్త కళ వస్తోంది. ప్రభుత్వం ప్రతియేటా ఒక్కో విద్యార్థిపై రూ. లక్షకు పైగా ఖర్చు చేస్తూ సకల సదుపాయాలు కల్పించడం, ఉచితంగా ఏకరూప దుస్తులు, పాఠ్య, రాత పుస్తకాలు అందజేస్తూ పోషకాలతో కూడిన మధ్యాహ్నం భోజనం అందిస్తుండటంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన బోధన అందుతుండటం.. ఇలా ఎన్నో సదుపాయాలు ఉచితంగా అందుతుండటంతో ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారు. ఉపాధ్యాయులు సైతం పిల్లల సంఖ్య పెంపుకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పెద్ద ఎత్తున ఈ విద్యా సంవత్సరం కొత్త అడ్మిషన్లు నమోదయ్యాయి.

- బంజారాహిల్స్ రోడ్డు నంబర్–7లోని గతి ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో మొత్తం 320 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది కొత్తగా 95 మంది అడ్మిషన్లు పొందారు.
- ఎన్‌బీటీనగర్ హైస్కూల్‌లో మొత్తం 468 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది కొత్తగా 118 అడ్మిషన్లు తీసుకున్నారు.
- బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీ నగర్ హైస్కూల్‌లో మొత్తం 560 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది కొత్తగా 60 మంది విద్యార్థులు చేరారు.
- సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో 560 మంది విద్యార్థులు ఉండగా కొత్తగా 181 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు.
- రాజ్‌భవన్ ప్రైమరీ స్కూల్‌లో 579 విద్యార్థులు చదువుతుండగా, ఈ ఏడాది కొత్తగా 112 మంది అడ్మిషన్లు పొందారు.
- ఫిలింనగర్‌లోని ఎంఆర్‌సీ ప్రైమరీ స్కూల్‌లో 256 మంది విద్యార్థులు చదువుతుండగా కొత్తగా 47 మంది అడ్మిషన్లు తీసుకున్నారు.
- ఖైరతాబాద్ జోన్ పరిధిలోని దాదాపు అన్ని ప్రభుత్వ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది కొత్త అడ్మిషన్లు కోసం బారులుదీరారు. చాలామంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి సర్కార్ బడుల్లో చేరుతుండటం పట్ల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పాఠశాలలోనూ ఇద్దరు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బెంచీలు ఏర్పాటు చేసుకుని నూతన అడ్మిషన్లు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులను ఇంటర్వ్యూలు చేస్తూ వారిని ప్రభుత్వ పాఠశాలలకు సన్నద్ధం చేస్తూనే అప్పటికప్పుడే ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తున్నారు.

అందరూ అంగీకరిస్తే త్వరగా ఇందిరమ్మ మోడల్ ఇళ్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్‌ను ఆనుకుని ఉన్న గురుబ్రహ్మనగర్‌బస్తీలో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణ కాలనీకి సంబంధించి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శుక్రవారం షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డితో కలిసి పర్యటించారు. గురుబ్రహ్మనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రెండుసార్లు ఇప్పటికే తనిఖీలు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇక్కడ మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థానికులంతా అంగీకరించారని, జాబితా ప్రకారం.. వీరందరికీ ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. జీ ప్లస్–3, జీ ప్లస్–5 ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. ఇక్కడ ఇళ్లు నిర్మించాలని అందరూ ఆసక్తితో ఉన్నారని తెలిపారు. త్వరలోనే ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయిస్తామన్నారు. షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ మొత్తం ఇళ్లు ఖాళీ చేసిన తర్వాతే నిర్మాణ పనులు మొదలుపెడతామన్నారు. ఎంతమంది ఉంటే అంతమందికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. మోడల్ ఇందిరమ్మ కాలనీ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. కలెక్టర్‌కు కూడా ఇక్కడ ఎంతమంది ఉన్నారనే జాబితాను కూడా పంపించడం జరిగిందన్నారు. ఎక్కువ మందికి ఇక్కడ ఇళ్లు నిర్మించేవిధంగా చూస్తున్నామన్నారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–5లోని దుర్గాభవానీనగర్‌లో కూడా అధికారులు పర్యటించారు. ఇక్కడ కూడా ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణం కోసం సర్వే చేయడం జరిగిందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు, గురుబ్రహ్మనగర్ బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



గురుబ్రహ్మనగర్‌లో పర్యటించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

లేక్‌వ్యూ పార్కులో ఆలయాల అభివృద్ధికి కృషి



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో సమావేశమైన యాదవ సంఘం నేతలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ యాదవ సంఘం సభ్యులు శుక్రవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖైరతాబాద్ డివిజన్ యాదవ సంఘం అధ్యక్షుడు కే.కుమార్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మల్లికార్జున్ యాదవ్, చైర్మన్ కృష్ణయాదవ్, ఎం.లక్ష్మణ్‌యాదవ్, ఎం.పాండుయాదవ్, మల్లేష్‌యాదవ్, జి.కృష్ణయాదవ్, ఫకీరయ్యయాదవ్, మారయ్యయాదవ్, కే.వెంకటేష్‌యాదవ్, మహేష్‌యాదవ్, సుధాకర్‌యాదవ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్‌వ్యూ పార్కులో కట్టమైసమ్మ గాలిపోచమ్మ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని సంఘం నేతలు కోరడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. హెచ్ఎండీఏ కమిషనర్‌తో మాట్లాడి అక్కడ పర్యటిస్తానన్నారు. బోనాల పండుగకు ఆలయాలకు నిధులు కూడా పెంచాలని కోరడంతో అందుకు కూడా ఎమ్మెల్యే సమ్మతించారు.

కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా మార్చాలి



మాట్లాడుతున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

– ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: బూత్‌కమిటీలను మరింత పటిష్టం చేయాలని, కాంగ్రెస్ కార్యకర్తలంతా సంఘటితమై జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా మార్చాలని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎల్లారెడ్డిగూడలోని పీజేఆర్ కమ్యూనిటీహాల్‌లో యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, షేక్‌పేట, సోమాజిగూడ డివిజన్ల బూత్‌కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని, స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారని, రానున్న ఉప ఎన్నికల్లో పార్టీకి విజయాన్ని అందించాలని కోరారు. మాజీ ఎంపీ అజారుద్దీన్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీ విజయాన్ని దక్కించుకోలేకపోయిందని, కానీ లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటిందన్నారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. నేతలు అసద్, మనోజ్‌యాదవ్, కిరణ్‌యాదవ్, శ్రీనివాసయాదవ్, చిన్నా ముదిరాజ్, మాజిద్, పలు డివిజన్ల అధ్యక్షులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

వేతన బకాయిలను విడుదల చేయాలి



వెంగళరావునగర్: శిశువిహార్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయమ్మలకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు ఎం.వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మహిళా శిశు సంక్షేమశాఖ(స్టేట్‌హోం) ఎదుట శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. యూనియన్ నేతలు లక్ష్మీబాయి, సుశీల, రాజేశ్వరి, రోజ, పద్మ, జయశ్రీ, సునంద, మంగ, కళ్యాణ శ్యామ్‌లీల తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ పక్కన కొత్త రోడ్డులో మోర్ మెడికల్స్ వెనుక ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నాలుగు రోజుల క్రితం కబ్జా చేసిన అక్రమ నిర్మాణాలను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు శుక్రవారం నేలమట్టం చేశారు. ఈ నెల 15న కబ్జాదారుడు బోగస్ డాక్యుమెంట్లు, నకిలీ సర్వే నంబర్‌తో ఇక్కడ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చుట్టూ బ్లూ షీట్లు నిర్మించారు. సర్వే నంబర్ 403/పార్ట్‌లో ఉన్న ఈ ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుడు తనదిగా పేర్కొంటున్న సర్వే నంబర్ 129/104 పేరుతో కబ్జా చేసి చుట్టూ బ్లూషీట్లు నిర్మించి తన అనుచరులను అందులో ఉంచాడు. సమాచారం అందుకున్న షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి సిబ్బందితో కలిసి ఈ అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేయడమే కాకుండా ప్రభుత్వ హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటుచేశాడు. గతంలో కూడా ఇదే కబ్జాదారుడు ఈ స్థలాన్ని ఆక్రమించి బ్లూ షీట్లు ఏర్పాటుచేయగా రెవెన్యూ అధికారులు కూల్చివేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశాడు. తిరిగి అదే కబ్జాదారుడు ఈ స్థలాన్ని మరోసారి కబ్జా చేయగా కూల్చివేశారు.



అక్రమ నిర్మాణాలు కూల్చివేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు

చేనేతకారులకు చేయూత ఇవ్వాలి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను టాలీవుడ్ వర్ధమాన నటి, అన్నపూర్ణ టాకీస్ ఫేమ్ మూవీ హిమవర్ష ప్రారంభించారు. కొలువుదీరిన చేనేతకారుల వస్త్ర ఉత్పత్తులను ఆమె తిలకించారు. చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలివిడిగా తిరిగారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ప్రత్యేకత ఉందని హిమవర్ష అన్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ 24వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతిపని బృందాలు తమ సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.



చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన హిమవర్ష

అద్దె డబ్బులను ఆలయాల అభివృద్ధికి వినియోగిస్తాం



మడిగెలను అద్దెకు ఇస్తున్న దేవాదాయశాఖ అధికారులు

శ్రీనగర్‌కాలనీ: ఆలయాలకు చెందిన ఆస్తులను ఆలయాల అభివృద్ధికి వినియోగిస్తామని, భక్తులకు అసౌకర్యం కలగకుండా పండుగలను వైభవంగా నిర్వహిస్తామని ఈఓ విఠలయ్య అన్నారు. ఎల్లారెడ్డిగూడలోని శ్రీవిజయదుర్గా దేవాలయ సముదాయంలో ఖాళీగా ఉన్న మూడు, నాలుగు మడిగెలకు శుక్రవారం ఆక్షన్ నిర్వహించి అధికమొత్తంలో మడిగెకు అద్దె చెల్లించడానికి వచ్చిన వారికి మడిగెలకు అద్దెకు అందించేశారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు అన్నారావు, ప్రేమ్‌కుమార్, ఆలయ చైర్మన్ గొంటి లక్ష్మి శ్రీనివాస్‌యాదవ్, కవిత, నరసింహ, సాయినాథ్‌యాదవ్, విక్రమ్‌యాదవ్, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: పీఆర్‌నగర్, గ్రీన్‌లాండ్స్, ఎంసీహెచ్ మార్కెట్ 11కేవీ ఫీడర్లు, మోతీనగర్, గ్రీన్‌లాండ్స్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పీఆర్‌నగర్, అవంతీనగర్ ఈస్ట్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్, రాధాసూపర్‌మార్కెట్, ఇంపీరియల్ గార్డెన్, అపరాజిత కాలనీ, విబిపీ షోరూం, లాల్‌బంగ్లా, అపరాజిత కాలనీ, సదాయిత్ మంజిల్, ఎంసీహెచ్ మార్కెట్, ఎస్ఆర్‌టీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్ సింగ్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా గణేష్ నగర్, గ్రేహౌండ్స్, బ్రాహ్మణవాడీ 11కేవీ ఫీడర్లు మోతీనగర్, గ్రీన్‌లాండ్స్, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా గణేశ్వర్, స్నేహపురికాలనీ, మోతీనగర్, బబ్బుగూడ, జీఎంఆర్, ఫ్రెటవర్ బేకరీ, స్టేటస్ ప్లాజా, వైట్‌హౌస్, మీనా బజార్, బ్రాహ్మణవాడీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

దోమల నివారణపై అవగాహన

శ్రీనగర్‌కాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం–7లోని దూద్‌ఖాన్‌బస్తీలో శుక్రవారం జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఎంటమాలజీ అధికారులు పర్యటించారు. దోమల నివారణపై బస్తీవాసులకు అవగాహన కల్పించారు. ఇంటి ప్రాంగణంలో నీరు నిలవకుండా చూసుకోవాలని, పాతటైర్లు, కుండీలు, ఇతర వస్తువులు లేకుండా చూసుకోవాలన్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ ఉపాధి అవకాశాలు

పంజగుట్ట: సమూహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వివిధ విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కార్తిక్ రెడ్డి తెలిపారు. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో దివ్యాంగులు పెద్దగా లేకపోవడం బాధాకరమని, డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన దివ్యాంగులకు సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ ఈసీ మెంబర్ విక్రాంత్‌తో కలిసి మాట్లాడారు. మణికొండలో ఉన్న తమ శిక్షణ కేంద్రంలో అనుభవజ్ఞులు అయిన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఆటోక్యాడ్, ఎక్సెల్, వర్డ్, ఏఐ, జావా, ఫొటోషాప్‌లో ఆరు నెలలు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు సమూహ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో లేదా ఫోన్: 78937 54320 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వంశీ, దినయ్ కాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించండి

నిమ్స్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ర్యాలీ

లక్డీకాపూల్: నిమ్స్‌లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిమ్స్‌లోని స్పెషాలిటీ బ్లాక్ నుంచి పంజగుట్ట మెయిన్ గేట్ వరకు యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా చేరిన కాంట్రాక్ట్ కార్మికులకు కూడా పాతవారితో సమానంగా సమాన వేతనం చెల్లించాలన్నారు. ఫిక్డ్స్ అలవెన్స్ రూపంలో చూపిస్తున్న రూ.1,445లను బేసిక్ వేతనంలో కలపాలని కోరారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సమక్షంలో జరిగిన ఒప్పందానికి భిన్నంగా ఏకపక్షంగా పాత వేజ్ స్ట్రక్చర్‌ను మార్చి జీవో నెం.68 కంటే అదనంగా ఉన్న వేతనాన్ని ఫిక్డ్స్ అలవెన్స్ రూపంలో అమలు చేయడాన్ని ఆక్షేపించారు. దీని వల్ల రోజువారీ, పండుగ సెలవులకు, ఇఎల్ లీవులకు ఇచ్చే వేతనం తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ డ్యూటీలకు ఇచ్చే వేతనం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు బాలయ్య, గోపాలరెడ్డి, డేవిడ్, వెంకటేష్, రాధిక తదితరులు పాల్గొన్నారు.



నిమ్స్‌లో సమస్యల పరిష్కారం కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఆకట్టుకుంటున్న సిల్క్ ఇండియా ఎక్స్‌పో

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో సిల్క్ ఇండియా ఎక్స్‌పో మహిళలను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేతకళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు మానస్ ఆచర్య తెలిపారు. ప్రదర్శన ఈ నెల 22 వరకూ కొనసాగుతుంది.



చీరలను తిలకిస్తున్న మహిళలు

కార్పొరేటర్ సీఎన్ రెడ్డిపై అధిష్టానానికి ఫిర్యాదు

డివిజన్ కాంగ్రెస్ నాయకులు

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ నష్టపోయే విధంగా వ్యవహరిస్తున్న రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేయనున్నట్లు డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. రహమత్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సీఎన్ రెడ్డి, అతడి అనుచరులు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై త్వరలో పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. యువజన కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉపాధ్యక్షుడు సాయిసూరజ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, మహిళా నాయకులు సువర్ణమ్మ, పర్వీన్, యువజన కాంగ్రెస్ నాయకులు శివ, ఎస్సీసెల్ నాయకులు బెన్నార్, అరుణ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

బంజారాహిల్స్: కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఉంటూ ఫుట్‌పాత్‌పై ఉంటున్న వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. భీమవరం ప్రాంతానికి చెందిన బెనర్జీ(36) మూడేళ్ల క్రితం భార్యతో గొడవ పడి హైదరాబాద్‌కు వచ్చాడు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ముందు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేస్తుండటంతో ఇక్కడే స్థిరపడ్డాడు. ఫుట్‌పాత్‌పై, అక్కడ నిర్మించిన షెల్టర్లలో నిద్రిస్తూ బతుకుతున్నాడు. శుక్రవారం ఉదయం ఎంతకూ లేకపోయేసరికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి సంబంధించి ఆరా తీయగా భీమవరంలో ఉండే భార్య సత్యవతి ఫోన్ నంబర్ దొరికింది. ఆమెతో మాట్లాడగా కొంతకాలంగా కుటుంబానికి దూరంగా హైదరాబాద్‌లో ఉంటున్నాడని ఆమె పోలీసులకు తెలిపింది. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్, శనివారం, 21, జూన్, 2025





ఇన్నాళ్లూ సినిమాలు, వెబ్ కంటెంట్‌లకు మాత్రమే పరిమితమైన పైరసీ ఉండేది.. ప్రస్తుతం.. సాహిత్యాన్ని కూడా ఈ సమస్య వేధిస్తోంది. కాలక్రమేణా పుస్తక పఠనం జీవనశైలిలో ఒక భాగంగా మారుతోంది. మరీ ముఖ్యంగా నేటి యువతలో విస్తరిస్తుండడంతో సాహిత్య రంగం కొత్త ఊపును అందుకుంటోంది. ఈ తరుణంలో యువ రచయితలు తమ భావోద్వేగాలను, జీవిత కథలు, కవిత్వం, నవలల రూపంలో ప్రజల ముందుకు తీసుకొస్తున్నారు. పుస్తకాలపై క్రేజ్ పెరగడం వారికి వెలకట్టలేని గుర్తింపును తెచ్చిపెడుతోంది. కానీ అదే పైరసీ రూపంలో సాహిత్య అభివృద్ధికి అడ్డుపడుతోంది. సాహిత్యం అనేది ఒక రచయిత హృదయ స్పందన, అది దొంగిలించదగ్గ వస్తువు కాదు. పుస్తకంపై ప్రేమ ఉంటే దానికి న్యాయం చెయ్యాలి. ప్రస్తుత జీవనశైలిలో మనం చదవడం ఎంత ముఖ్యమో, నిజాయితీగా చదవడమూ అంతే అవసరం. పైరసీ అనే భూతాన్ని తిప్పికొట్టి, రచయితల స్వరాన్ని అణచకుండా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని సాహిత్య ప్రముఖులు నినదిస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



డిట్టో.. కాపీ..

గత కొంతకాలంగా పెరిగిపోయిన బుక్ పైరసీ

- → ఈ తరంలో ట్రెండ్‌గా మారుతున్న తెలుగు రచనలు
- → సాహిత్యంలో భారీ స్థాయిలో కాపీ రైట్స్ ఉల్లంఘన
- → ఇదే అదునుగా అమ్ముడవుతున్న ఫేక్ బుక్ ప్రింట్స్
- → నగరంలో విరివిగా లభ్యమవుతున్న టాప్ సెల్లింగ్ బుక్స్
- → దీనికి పుస్తక ప్రియులే చెక్ పెట్టాలంటున్న యువ రచయితలు
- → పుస్తకాలపై పైరసీ దాడి.. యువ రచయితలకు ఓ సవాల్..

ఆన్‌లైన్ మార్కెట్లలో మంచి అమ్మకాలు సాధిస్తున్న పుస్తకాలు కొందరికి 'బిజినెస్ టార్గెట్' అయ్యాయి. కాపీరైట్ ఉన్న పుస్తకాలను ఎటువంటి అనుమతులూ లేకుండా డూప్లికేట్ ప్రింట్ చేసి, సొంత ముద్రణగా మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్ మార్కెట్‌లో ఇటీవలి కాలంలో యువ రచయితల పుస్తకాల నకిలీ కాపీలు విరివిగా లభిస్తున్నాయి. ఇదంతా డిజిటల్ యుగంలో సాహిత్యాన్ని సులభంగా దొరికే వస్తువుగా మార్చేస్తోంది. సామాజిక మాధ్యమాల్లో గుర్తింపు పొందుతున్న రచయితలు ఇప్పటికీ తమ రచనలపై సంపూర్ణ హక్కుల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి. పబ్లిషింగ్ హక్కులను దుర్వినియోగం చేస్తూ కొందరు వ్యాపారులు, ముద్రణకారులు రచయితలకు ఆర్థిక నష్టంతో పాటు మానసిక వేదనను కలిగిస్తున్నారు.

చట్టపరమైన శిక్షలు తప్పనిసరి..

ప్రస్తుత భారత చట్టాలకు చెందిన 'కాపీ రైట్ యాక్ట్' ప్రకారం రచయిత అనుమతి లేకుండా ప్రతులు తయారు చేయడం నేరమే. రచయిత హక్కులను పరిరక్షించేందుకు ఐపీఆర్ (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్) మేధో సంపత్తి హక్కులు ఉన్నాయి. పైరసీ చేసే వారిపై జరిమానాలు, జైలు శిక్షలు వంటి చర్యలు చట్టపరంగా కఠినంగా అమలు చేయాలన్నదే సాహిత్య వర్గాల డిమాండ్.



అక్షర ప్రేమికులూ.. తస్మాత్ జాగ్రత్త..

ఈ తరుణంలో పాఠకుల పాత్ర అత్యంత ముఖ్యమైనది. నకిలీ పుస్తకాలను కొని చదవడం మామూలు విషయంగా అనిపించినా, ఇది ఓ రచయిత జీవితానికి చేసిన అన్యాయం అవుతుంది. ఒరిజినల్ కాపీలను కొనుగోలు చేయడం రచయితకు ధైర్యాన్ని, ప్రోత్సాహాన్ని అందించడమే కాదు, సాహిత్యానికి చేసే గౌరవంగా నిలుస్తుంది. పుస్తకాలు నాణ్యత, ప్రింటింగ్, కవర్ పేజ్ డిజైన్, ఫాంట్ వంటి వాటిని చూసి అది నకిలీ పుస్తకమా, కాదా? అనేది సులభంగానే గుర్తించవచ్చు.



మా భవిష్యత్తు పై దాడి..

అక్షరాలనే నమ్ముకుని, రచనలే భవిష్యత్తుగా మార్చుకుంటున్న మాలాంటి యువ రచయితలకు ఈ పైరసీ ప్రమాదంగా మారింది. ఒక్కో పుస్తకానికి రెండేళ్లు, మూడేళ్లు కష్టపడి రచనలు చేస్తాం.. అలాంటిది సులభంగా నకిలీ కాపీలు ప్రింట్ చేసి మార్కెట్‌లో అమ్మేస్తుండటం అత్యంత దారుణం. నేను లెటర్స్ టు లవ్, కదలి కథలు, లిక్‌చిట్ అనే మూడు రచనలు చేశాను. ప్రస్తుతం ఈ మూడు పుస్తకాల ఫేక్ కాపీలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. నా పుస్తకాలే ఇప్పటి వరకూ 5వేల వరకూ నకిలీ ప్రింట్ చేశారని అనుకుంటున్నాను. వందల మంది రచయితలను ఈ పైరసీ భూతం వెంటాడుతోంది. ముఖ్యంగా అబిడ్స్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో ఈ పైరసీ కాపీలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. కొన్ని స్టాల్స్‌లో స్వయంగా పట్టుకున్నాను. రూ.250 విలువ గల ఈ పుస్తకాలను పైరసీ చేసే వారు ఈ చిన్న స్టాల్స్‌కు రూ.90 ల చొప్పున అమ్ముతున్నారు. వీటిని స్టాల్స్‌లో 250కు అమ్ముతున్నారు. రచయితలకు, పబ్లిషర్స్‌కు ఇది పెద్ద నష్టం. దీని పైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నాను. సాధారణంగా రచనలపై మాకొచ్చిన కొంచెం లాభాలతో ఈ పైరసీపై లీగల్‌గా పోరాడగలమా..? కాబట్టి సంబంధిత అధికారులు, చట్టపరమైన శాఖలు ఈ విషయంలో మాకు సహకారం అందించాలని కోరుతున్నాను. బుక్ లవర్స్ పుస్తకాలను కొనే సమయంలో జాగ్రత్తగా గమనించండి.. బుక్ క్వాలిటీ, కవర్ పేజీ, ఫాంట్ చూస్తే ఒరిజినల్లా? కాదా అనేది గుర్తించవచ్చు.

– కదలి సత్యనారాయణ, యువ రచయిత్రి



కొంపల్లిలో కళ్యాణ్ జ్యువెలర్స్



ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ నటులు నాగార్జున, శ్రీలీల

కుత్బుల్లాపూర్: కొంపల్లిలో కళ్యాణ్ జ్యువెలర్స్ షోరూమ్‌ను బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు అక్కినేని నాగార్జున, సినీనటి శ్రీలీల శుక్రవారం ప్రారంభించారు. సంస్థతో తనకున్న దీర్ఘకాల అనుబంధం పట్ల చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నానని నాగార్జున అన్నారు. 'నమ్మకమే జీవితం' అనే సంస్థ సిద్ధాంతం పట్ల వారి నిబద్ధత పరిశ్రమలో వారిని ప్రత్యేకంగా నిలబెట్టిందని, సేవా నైపుణ్యం, కస్టమర్లకు నమ్మకంతో అంచెలంచెలుగా ఎదిగిందన్నారు. నటి శ్రీలీల మాట్లాడుతూ కళ్యాణ్ జ్యువెలర్స్ విశ్వసనీయత, నిజాయితీ, కస్టమర్ల పట్ల అంకితభావానికి బ్రాండ్ అన్నారు. తాము గణనీయమైన మైలురాయిని చేరుకున్నామని, కస్టమర్లకు అవసరమైన సమగ్ర వ్యవస్థను నిర్మించడంలో పురోగతి సాధించామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణరామన్ అన్నారు. మేకింగ్ ఛార్జీలపై ఫ్లాట్ 50 శాతం తగ్గింపుతో పాటు 4–లెవల్ అష్యూరెన్స్ సర్టిఫికెట్‌ను అందుకుంటారని పేర్కొన్నారు. వెడ్డింగ్ జ్యువెలరీ, ముద్ర, నిమా, గ్లో, జియా, అనోఖీ, అపూర్వ, **అంతర, హేరా, రంగ్** జ్యువెలరీ అందుబాటులో ఉందన్నారు.

'క్లింకారా'ను దత్తత తీసుకున్న ఉపాసన

చార్మినార్: ప్రముఖ సినీ నటులు రామ్ చరణ్ సతీమణి, అపోలో ఆస్పత్రి వైస్ చైర్ పర్సన్ ఉపాసన జూపార్క్‌లోని తెల్ల ఆడ పులిపిల్లను ఏడాది పాటు దత్తత తీసుకున్నారు. ఈ మేరకు పార్క్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్.హీరేమత్‌కు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఉపాసన కూతురైన క్లీంకారా జన్మదినాన్ని పురస్కరించుకొని ఒకరోజు ముందుగా తన కూతురితో కలిసి జూ పార్కును సందర్శించారు. జూ పార్క్‌లోని తార అనే తెల్ల పులికి గతేడాది యశోద, కారా అనే రెండు తెల్ల పులి పిల్లలు జన్మించాయి. అప్పుడే కారాకు ఉపాసన కూతురు పేరైన క్లీంకారా అనే నామకరణం చేశారు జూ అధికారులు. శుక్రవారం నాటికి కూతురు క్లీంకారాకు రెండేళ్ల వయసు కాగా.. జూ పార్కులోని క్లీంకారా తెల్ల పులి పిల్లకు ఏడాది వయస్సు. దీంతో ఈ శుక్రవారం నుంచి ఏడాది పాటు ఈ తెల్ల పులి పిల్లను ఆమె దత్తత తీసుకున్నారు. గురువారం జూపార్కును సందర్శించిన ఆమె క్లీంకారా ఉన్న ఎన్‌క్లోజర్ వద్దకు తన కూతురితో పాటు వెళ్లి సందడి చేశారు.



ఒత్తిడిలేని విద్యతో మేలు



ట్వింకిల్ టోట్స్ ప్రారంభంలో యాంకర్ సుమ

సాక్షి, సిటీబ్యూరో: ఒత్తిడితో కూడిన విద్యావిధానం చిన్నారులకు సరికాదని ప్రముఖ యాంకర్ సుమ కనకాల అభిప్రాయపడ్డారు. కేరళకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ కైరలీ ఎడ్యుకేషన్ సొసైటీ నగర శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఏఎస్‌రావు నగర్‌లో ఏర్పాటు చేసిన 'ట్వింకిల్ టోట్స్ ప్రీ ప్రైమరీ స్కూల్'ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయి విద్యాబోధనపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. పిల్లలను ఒత్తిడి చేయకూడదని తాను నమ్ముతానని, తన పిల్లల విషయంలోనూ అదే అనుసరించానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్, కైరలీ ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్ ఈ సుకుమారన్, ప్రెసిడెంట్, కల్నల్ పి సుందరేశ్వరన్ (రిటైర్డ్) పాల్గొన్నారు.

యంగెస్ట్ వరల్డ్ రికార్డ్స్..

పలు రికార్డులతో అలరించిన నగర చిన్నారులు

సాక్షి, సిటీబ్యూరో: నగరం మరోసారి చిన్నారుల ప్రతిభకు వేదికగా మారింది. ఇద్దరు తెలివైన చిన్నారులు నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పరిధిలో ఒకరు రికార్డు బ్రేక్ చేయగా, మరొకరు రికార్డు సృష్టించారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన అద్విత్ రెడ్డి స్థాపించిన యంగెస్ట్ చెస్ కోచ్ (బేసిక్స్) రికార్డును జీడీ గోయెంకా పాఠశాల (ఎల్‌బీ నగర్)కు చెందిన వాస ఇషాన్ (4) బ్రేక్ చేశాడు. అయితే దీనికి సంబంధించి బాలికల విభాగంలో మంచు లక్ష్మి కుమార్తె మంచు నిర్వాణ సృష్టించిన రికార్డును అల్లు అర్జున్ కుమార్తె అల్లు అర్హా బ్రేక్ చేయడం విశేషం. ఈ ప్రయత్నానికి డా.పదాల కార్తిక్ రెడ్డి కోచ్‌గా వ్యవహరించగా, నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అడ్జ్యుడికేటర్ చోకలింగం బాలాజీ పర్యవేక్షించారు.

35 నిమిషాల్లో వరల్డ్ రికార్డ్..



మరో బాలుడు యంగెస్ట్ రివర్ కయాకింగ్‌లో వరల్డ్‌రికార్డ్ సృష్టించారు. శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి ధన్విన్ రెడ్డి వంగేటి (5.5 సంవత్సరాలు) వికారాబాద్ కోటిపల్లి నదిలో 4.5 కిలోమీటర్లు కేవలం 35 నిమిషాల్లో పూర్తి చేసి 'యంగెస్ట్ రివర్ కయాకింగ్ వరల్డ్ రికార్డ్' సృష్టించాడు. దీనికి కొల్లి తారకేష్ కోచ్‌గా వ్యవహరించాడు. చోకలింగం బాలాజీ అడ్జ్యుడికేటర్‌గా ఈ రికార్డును ధృవీకరించారు. ఈ రెండు ప్రపంచ రికార్డులు ప్రముఖ విద్యా సంస్థ లెర్నోరామ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పర్యవేక్షణలో సాధించగలగడం గర్వంగా ఉందని సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.



ఆర్పీఎల్ హీరోస్ హ్యాట్రిక్



ఉత్కంఠభరిత మ్యాచ్‌లో కళింగ బ్లాక్ టైగర్స్ పై విజయం

సాక్షి, సిటీబ్యూరో: జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్పీఎల్) తొలి సీజన్‌లో హైదరాబాద్ హీరోస్ మరో సంచలన విజయంతో హ్యాట్రిక్ సాధించారు. ముంబై వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హీరోస్ 43–12 స్కోరు తేడాతో కళింగ బ్లాక్ టైగర్స్‌ను చిత్తు చేసింది. వరుసగా మూడో విజయంతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన హైదరాబాద్ హీరోస్ ఈ మ్యాచ్‌లో ఏడు ట్రైలను సాధించింది. మోతు ఒపెటాయ్, జావేద్ హుస్సేన్ సాధించిన ట్రైలు హైదరాబాద్‌కు కీలకమయ్యాయి. రెండో అర్ధభాగంలో హైదరాబాద్ హీరోస్ తమదైన ముద్ర వేసింది. మూడో క్వార్టర్‌లో టెరియో తమాని, మార్క్స్ రోడిక్, జోజీ నాసోవా ఒక్కో ట్రై సాధించారు. టెరియో కన్వర్షన్ల ద్వారా మరో ఆరు పాయింట్లు అందించాడు. 16 నిమిషాల అద్భుతమైన ఆటతీరుకు హైదరాబాద్ టీం నుంచి టెరియో తమాని 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్నాడు. హైదరాబాద్ హీరోస్ శనివారం జరిగే తర్వాతి మ్యాచ్‌లో ముంబై డ్రీమర్స్‌తో, ఆదివారం జరిగే పోరులో బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్‌తో మరోసారి తలపడనుంది.

తారా యోగం





అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంట్‌డౌన్‌లో భాగంగా వేలాది మంది భాగస్వాములయ్యారు. ఇందులో సినీ తారలు కుష్బు, సాయి దుర్గ తేజ్, మీనాక్షి చౌదరి, తేజ సజ్జాలతో పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.



13

సాక్షి రియల్టీ

శనివారం
21-06-2025



పెట్టుబడి పెట్టే ముందు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

అభివృద్ధికి ఆస్కారం ఉండే చోటయితేనే బెటర్

వాణజ్య సముదాయాల్లో పెట్టే పెట్టుబడిపై 8 నుంచి 11 శాతం అద్దె గిట్టుబాటు అయితే.. ఇళ్లపై రాబడి 2 నుంచి 4 శాతం వరకే ఉంటుందని నిపుణులు చెబుతుంటారు. అధిక సరఫరా, ప్రతికూల మార్కెట్, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక ఒడిదుడుకులు తదితర కారణాలతో ప్రధాన నగరాల్లో వాణిజ్య స్థలాల ధరలు తగ్గాయి. దీంతో వీటిలో పెట్టుబడి పెట్టడానికి ఇదే సరైన సమయమని నిపుణులు సూచిస్తున్నారు. వాణిజ్య సముదాయల్లో స్థలం కొన్న తర్వాత దాన్ని అమ్ముకోగానే మెరుగైన ఆదాయం గిట్టుబాటు అవుతుంది. ఇదొక్కటే కాదు ప్రతినెలా ఆశించిన స్థాయిలో అద్దె కూడా లభిస్తుంది. అన్ని విధాలా అభివృద్ధికి ఆస్కారం ఉన్న చోట నిర్మించే వాణిజ్య నిర్మాణాల్లో స్థలం తీసుకోవాలి. కాకపోతే పెట్టుబడి పెట్టే ముందు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాకే తుది నిర్ణయానికి రావాలి.

–సాక్షి, సిటీబ్యూరో

కమర్షియల్ స్పేస్.. కొంటున్నారా?



ఇవే కీలకం..

- వాణిజ్య భవనాల్లో స్థలం తీసుకోవడం మెరుగైన నిర్ణయం అయినప్పటికీ ఇందులో పెట్టుబడి పెట్టడం ఆషామాషీ వ్యవహారం కాదు. అధ్యయనం, ముందుచూపు, ప్రణాళిక.. ఈ మూడు ఉంటేనే వీటిలో మదుపు చేయాలి.
- ఒక ప్రాంతంలో నిర్మించే వాణిజ్య సముదాయంలో స్థలం కొనడానికి వెళ్లే ముందు ఆయా స్థలానికి గిరాకీ ఉంటుందా లేదా అనే విషయాన్ని పక్కాగా అంచనా వేయాలి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మీరు కొనే భవనానికి ప్రజలు వచ్చే అవకాశం ఉందా? అనే విషయాన్ని బేరీజు వేయాలి.
- భవనాన్ని నిర్మించే డెవలపర్ గత చరిత్రను గమనించాలి. ఆయా సముదాయానికి ప్రజా రవాణా వ్యవస్థ అందుబాటులో ఉందా? భవన నిర్వహణ సక్రమంగా ఉంటుందా లేదా అనే అంశాన్ని నిశితంగా పరిశీలించాలి. ఇలాంటి భవనాల్లో నిర్వహణ మెరుగ్గా ఉంటేనే గిరాకీ ఉంటుంది.
- మీరు వాణిజ్య స్థలం కొనాలనుకున్న ప్రాంతం భవిష్యత్తులో అభివృద్ధి చెందడానికి అవకాశముందా? ఉద్యోగావకాశాలు పెరగానికి ఆస్కాముందా? ఆయా ప్రాంతంలో జనాభా పెరుగుతుందా వంటి అంశాల్ని గమనించాలి.
- మీరు కొనాలని భావించే స్థలం వాణిజ్య సముదాయంలో ఎక్కడుంది? సందర్శకులకు నేరుగా కనిపిస్తుందా? స్థలం ముందు భాగాన్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దారా? ఇలాంటి విషయాల్ని కూడా తప్పకుండా చూడాలి.
- వాణిజ్య సముదాయంలో స్థలం కొనాలన్న నిర్ణయానికి వచ్చేముందు.. నెలసరి నిర్వహణ సొమ్ము ఎంత? ఆస్తి పన్ను, భవనం బీమా వంటివి కనుక్కోవాలి. ఖాళీ లేకుండా ఉండేలా చేసుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే మనం కోరుకున్న రాబడి గిట్టుబాటవుతుంది.



కొనుగోలు @ లాంచింగ్

75 శాతం గృహ కొనుగోలుదారుల ఆసక్తి ఇదే..

గృహ కొనుగోలుదారుల అభిరుచి మారింది. గతంలో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న వాటిల్లో కొనేందుకు ఆసక్తి చూపిన కస్టమర్లు.. ప్రస్తుతం లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనేందుకు ఇష్టపడుతున్నారు. 2023లో రెడీ టూ మూవ్, లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్ల నిష్పత్తి 46:18 శాతంగా ఉండగా.. 2024 నాటికి 23:24 శాతానికి చేరింది. అలాగే రూ.కోటిన్నర ధర ఉన్న లగ్జరీ గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. 2023లో 20 శాతం మంది లగ్జరీ ఇళ్లకు ఆసక్తి చూపించగా.. 2024 నాటికి 35 శాతానికి పెరిగిందని ఫిక్కీ, అనరాక్ సర్వేలో వెల్లడించింది.

– సాక్షి, సిటీబ్యూరో



- 1, 2, 3 బీహెచ్‌కే.. ఏదైనా సరే బాల్కనీ ఉండాలి
- నాణ్యమైన నిర్మాణాలకే అత్యధికంగా మొగ్గు

బాల్కనీ మస్ట్..

1, 2, 3 బీహెచ్‌కే.. ఇళ్లు ఏదైనా సరే బాలక్నీ ఉండాల్సిందే. గృహ కొనుగోలుదారులు నిర్మాణం నాణ్యత, ప్రాంతం, ధర, వసతులతో పాటు బాల్కనీకి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో ఇంటిలోని ప్రతి అంగుళం స్థలాన్ని వినియోగించాలని భావించిన కస్టమర్లు.. ప్రస్తుతం ఎక్కువ ఓపెన్ స్పేస్ ఉండాలని కోరుకుంటున్నారు. 75 శాతం మంది బాల్కనీ ఉండే ఇళ్ల కొనుగోళ్లకే ఆసక్తి చూపించగా, 74 శాతం మంది కస్టమర్లు నాణ్యమైన నిర్మాణాలకే మొగ్గు చూపిస్తున్నారు. అనరాక్ రీసెర్చ్ దేశంలోని పలు నగరాలలో 5,510 మందిపై ఆన్‌లైన్‌లో సర్వే నిర్వహించింది. గృహాల ధరలు పెరుగుతున్నప్పటికీ కొనుగోలుదారుల విశాలమైన ఇళ్లకే ఆసక్తి చూపిస్తున్నారు. 50 శాతం మంది కస్టమర్లు 3 బీహెచ్‌కే కొనుగోలుకు ఆసక్తి చూపిస్తే.. 38 శాతం మంది 2 బీహెచ్‌కే గృహాలకు మొగ్గు చూపిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే యూనిట్లకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అధిక ధరల కారణంగా ముంబైలో 44 శాతం మంది కస్టమర్లు 2 బీహెచ్‌కేలకు, 17 శాతం 1 బీహెచ్‌కేలకు ఆసక్తి చూపిస్తున్నారు. పుణేలో 10 శాతం కొనుగోలుదారులు 1 బీహెచ్‌కే జై కొడుతున్నారు.

పెట్టుబడులకు రియలే బెటర్..

ఏటా దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఫ్లాట్ల విస్తీర్ణాలు 11 శాతం మేర పెరుగుతున్నాయి. 2022లో 1,175 చ.అ.లుగా ఉన్న సగటు ఫ్లాట్ల సైజు.. 2023 నాటికి 1,300 చ.అ.లకు పెరిగాయి. 58 శాతం మిలీనియల్స్, 39 శాతం జెన్స్–ఎక్స్ కస్టమర్లు ఇతర పెట్టుబడుల నుంచి వచ్చిన లాభాలతో ఇళ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. 57 శాతం మంది రియల్ ఎస్టేట్ అత్యంత ప్రాధాన్య పెట్టుబడిగా విశ్వసిస్తున్నారు. ఇందులోనూ 36 శాతం మంది నివాస విభాగంలో పెట్టుబడులకే ఆసక్తి చూపిస్తున్నారు. గృహ రుణ వడ్డీ రేట్లు 8.5 శాతం కంటే తక్కువగా ఉన్నంత కాలం ఇంటి కొనుగోలు నిర్ణయంపై ప్రభావం ఉండదని చెప్పారు.





అందమంతా.. అలంకరణలోనే..

సాక్షి, సిటీబ్యూరో: కొన్ని ఇళ్లు చూడ్డానికి చిన్నవిగానే ఉంటాయి. కానీ, పొదరిల్లులా అందంగా కనిపిస్తాయి. ఉన్న చిన్నపాటి స్థలంలో పొందికగా ఫర్నీచర్‌ను సర్దుకుంటేనే అది సాధ్యమవుతుందంటున్నారు ఇంటీరియర్ డిజైనర్లు. అదెలాగో ఓసారి చూద్దాం. ఇల్లు విశాలంగా కనిపించాలంటే ఇంట్లో అమర్చే ఫర్నీచర్ పొందికగా ఉండాలి. అలాగే ఆ ఫర్నీచర్ తక్కువ స్థలాన్ని ఆక్రమిస్తూ వేర్వేరు అవసరాలకు ఉపయోగపడేలా ఉండాలి. ఇలాంటి స్పేస్ సేవింగ్ ఫర్నీచర్ ఇప్పుడు మార్కెట్లో అందుబాటులో ఉంది. రబ్బర్ ఉడ్‌తో తయారు చేసే స్పేస్ సేవింగ్ ఫర్నీచర్‌కు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది వాటర్ ప్రూఫ్, స్క్రాచ్ ప్రూఫ్, టర్మైట్ ప్రూఫ్.. అలాగే ఈ ఫర్నీచర్‌ను విడి భాగాలుగా విడదీసి తిరిగి బిగించుకునే వీలుంటుంది. ఇలా రెండు మూడు సార్లు విప్పదీసి బిగించుకున్నా చెక్కుచెదరదు. ఈ ఫర్నీచర్‌కు కంపెనీలు వారంటీని సైతం అందిస్తున్నాయి.



వాల్ క్యాబినెట్స్..

వంటగది లేదా లివింగ్ రూమ్‌లో సెరామిక్ లేదా గ్లాస్‌వేర్‌ను అలంకరించటానికి వాల్ క్యాబినెట్స్ ఎంతో ఉపయోకరంగా ఉంటాయి. గోడకు ఆనించే వీలున్న ఈ స్పేస్ సేవింగ్ వాల్ క్యాబినెట్స్‌లో క్రాకరీ డిస్‌ప్లేకు వీలుగా గ్లాస్ షెల్ఫ్, ఇతర వస్తువుల కోసం సొరుగులుంటాయి. ఈ వాల్ క్యాబినెట్ టేబుల్ కూడా ఉపయోగపడుతుంది. లివింగ్ రూమ్‌లోనైతే దీని మీద ఫొటో ఫ్రేములు, ఫ్లవర్ వాజులు ఉంచుకోవచ్చు.

మినీమలిస్టిక్ డ్రెసింగ్ మిర్రర్..

ఇంట్లోని మొత్తం ఫర్నీచర్‌లో డ్రెసింగ్ మిర్రర్‌ది ప్రత్యేక స్థానం. కాబట్టి ఇల్లు ఎంత చిన్నదైనా డ్రెసింగ్ మిర్రర్ కొనకుండా ఉండలేం. అయితే దాని వల్ల ఇల్లు ఇరుగ్గా మారకుండా ఉండేలా చూసుకుంటే అవసరంతో పాటు ముచ్చటా తీరుతుంది. ఇందుకోసం స్థలం కలిసొచ్చేలా గోడకు ఫిక్స్ చేసేలా వీలుండే డ్రెస్సింగ్ మిర్రర్‌ను ఎంచుకోవాలి. ఇలాంటి మినీ మలిస్టిక్ డ్రెస్సింగ్ మిర్రర్‌ను ఎంచుకుంటే అద్దాన్ని విడిగా గోడకు బిగించి దానికింద సొరుగులున్న టేబుల్‌ను ఉంచి వాడుకోవచ్చు.

కోజీ డైనింగ్ టేబుల్

డైనింగ్ టేబుల్ కోసం ఇంట్లో డైనింగ్ ఏరియా తప్పనిసరేం కాదు. ఇల్లు ఇరుకవుతుందనే భయం లేకుండా తక్కువ స్థలంలో ఇమిడిపోయే కోజీ డైనింగ్ టేబుల్స్ ఇప్పుడు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. కేవలం 3 నుంచి నాలుగడుల వైశాల్యాన్ని మాత్రమే ఆక్రమించే నాలుగు కుర్చీల డైనింగ్ టేబులీను ఎంచుకుంటే ఇల్లు ఇరుగ్గా మారదు.

సైడ్ టేబుల్స్

గోడవారగా వేసుకునే సైడ్ టేబుల్స్ వేర్వేరు అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు. డ్రాలు, షెల్ఫ్‌లు కలిసి ఉండే ఈ సైడ్ టేబుల్‌ను పుస్తకాలు, అరుదుగా ఉపయోగించే ఇతర వస్తువుల కోసం వినియోగించుకోవచ్చు. ఈ టేబుల్ బోసిగా కనిపించకుండా దీని మీద కాస్త పెద్దవిగా ఉండే డెకరేటివ్ ఐటమ్స్‌ను అమర్చుకోవచ్చు.

హరిత నిర్మాణ సామగ్రి!

– గ్రీన్ ప్రొడక్ట్స్‌కు కూడా ఐజీబీసీ గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: కాలం ఏదైనా సరే ఇంట్లో నీరు, విద్యుత్ వినియోగం తప్పనిసరి. వేసవికాలంలో అయితే వీటి బిల్లులతో కస్టమర్ల జేబుకు చిల్లులు పడటం ఖాయం. అందుకే హరిత నిర్మాణ సామగ్రితో నిర్మించే ఇళ్లకు ఆదరణ పెరుగుతోంది. హరిత భవనాల్లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో పాటు విద్యుత్ వినియోగం 30–40 శాతం, నీటి వినియోగం 20–30 శాతం తగ్గుతుంది కూడా.

- విద్యుత్, నీటి బిల్లుల ఆదా, నిర్వహణ వ్యయం తగ్గింపు, ఆరోగ్యకరమైన వాతావరణ వంటి కారణాలతో హరిత భవనాలకు డిమాండ్ పెరిగింది. గతంలో పర్యావరణహితమైన ఇల్లు కొనాలంటే కాలుష్యం, జనాభా తక్కువగా ఉండే ప్రాంతాలకు లేక శివారు ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. కానీ, నేడు నగరంలో, హాట్‌సిటీలో ఉంటూ కూడా హరిత భవనాలు కావాలంటున్నారు కొనుగోలుదారులు. దీంతో నిర్మాణ సంస్థలు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన గృహాలనే కాదు.. ఐజీబీసీ గుర్తింపు పొందిన నిర్మాణ సామాగ్రిని, ఉత్పత్తులను వినియోగిస్తున్నాయి.

మార్కెట్‌లో 350 రకాల ఉత్పత్తులు..

నివాసాలకు, వాణిజ్య, కార్యాలయాల సముదాయాలకూ హరిత భవనాల గుర్తింపునివ్వటం మనకు తెలిసిందే. కానీ, దేశంలో తొలిసారిగా నిర్మాణ సామగ్రి ఉత్పత్తులకూ గుర్తింపు ప్రారంభించింది సీఐఐ. దీంతో కొనుగోలుదారులకు గృహాల్లోనే కాకుండా నిర్మాణ సామగ్రిలోనూ గ్రీన్ ప్రొ సర్టిఫికెట్ పొందిన ఉత్పత్తులను ఎంపిక చేసుకునే వీలుందన్నమాట. ఇప్పటి వరకు 350 ఉత్పత్తులు గ్రీన్ సర్టిఫికెట్ పొందాయి. ఏసీసీ సిమెంట్, నిప్పన్ పెయింట్స్, సెయింట్ గోబియన్ గ్లాస్, అసాహి ఇండియన్ గ్లాస్, గోద్రెజ్ ఫర్నిచ ర్, విశాఖ ఇండస్ట్రీస్ వంటివి ఉన్నాయి. దేశంలో గ్రీన్ బిల్డి ంగ్స్ ఉత్పత్తుల మార్కెట్ రూ.18 లక్షల కోట్లుగా ఉందని అంచనా.

ఓపెన్ ప్లాట్లకూ రుణాలు!

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, విల్లాలు వంటి నిర్మాణ సంబంధమైన ప్రాపర్టీలకు బ్యాంక్‌లు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ)లు గృహ రుణాలు ఇస్తుంటాయి. ఓపెన్ ప్లాట్లు, స్థలాల కొనుగోళ్లకు రుణాల మంజూరు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంటాయి. పలు థర్డ్ పార్టీ ఏజెన్సీలు ఓపెన్ ప్లాట్లకు సైతం రుణాలను మంజూరు చేపిస్తున్నాయి. ఓపెన్ ప్లాట్ల మార్కెట్ బాగుండి, మంచి అనుభవం ఉన్న డెవలపర్లకు ఫండింగ్ చేస్తుంటారు. ప్లాటింగ్ వెంచర్‌లో నిర్మాణ వ్యయం తక్కువగా ఉంటుంది. స్థలం కొన్న తర్వాత రోడ్లు, లైటింగ్, ఎలక్ట్రిసిటీ వంటి ఖర్చులకు మినహా పెద్దగా వ్యయం కాదు. అందుకే స్థలం కొనేందుకు కూడా లోన్లను ఇస్తుంటారు.

నాలుగు గోడలకు కాలం చెల్లింది..

బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల నిధుల కొరతతో రియల్టీ ప్రాజెక్ట్‌లకు రుణాలు అంత ఈజీగా దొరకడం లేదు. కొత్త ప్రాజెక్ట్‌లకు లోన్స్ సంగతి దేవుడెరుగు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లకూ ఫండింగ్ దొరకటం కష్టంగా మారింది. నాలుగు గోడల ఇంటికి కాలం చెల్లింది. కాంక్రీట్ భవనాలకు కొనుగోలుదారులు స్వస్తి పలికేశారు. సాంకేతికతను వినియోగించే టెకీ భవనాలు, ఆధునిక వసతులుండే విలాస గృహాలకు జై కొడుతున్నారు. సౌర విద్యుత్, హోమ్ ఆటోమేషన్, ఎస్‌టీపీ, రెయిన్ హార్వెస్టింగ్ వంటి ఏర్పాట్లు ఉన్న గృహాల కొనుగోళ్లకే మద్దతు పలుకున్నారు. కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు ఇద్దరూ ఈ తరహా ప్రాజెక్ట్‌ల పెట్టుబడులకే మొగ్గు చూపుతున్నారు. అందుకే డెవలపర్లు కూడా ఇలాంటి ప్రాజెక్ట్‌ల నిర్మాణాలనే చేపట్టాలి. దీంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి రుణాలు, ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు వస్తాయి.





వాల్.. కమాల్

త్రీడీ వాల్ పేపర్‌తో గదికి అందం

సాక్షి, సిటీబ్యూరో: ఇంటికి వచ్చిన అతిథులను త్రీడీ వాల్ పేపర్లతో కట్టిపడేస్తున్నారు ఇంటీరియర్ ప్రియులు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక వాల్ పేపర్లలోనూ సరికొత్త పోకడలు సంతరించుకుంటున్నాయి. నిర్వహణలో కాస్త శ్రద్ధ చూపిస్తే చాలు త్రీడీ వాల్ పేపర్ల మన్నిక బాగానే ఉంటుంది. కొత్తదైనా, పాత ఇళ్లయినా వాల్ పేపర్ల సహాయంతో ఇంటిని అందంగా అలంకరించుకోవచ్చు. మార్కెట్లో వాల్ పేపర్లు రోల్స్ రూపంలో లభ్యమవుతాయి. ఒక్క రోల్ కొంటే కనీసం 57 చ.అ. విస్తీర్ణానికి సరిపోతుంది. దీని ప్రారంభ ధర రూ.2 వేల నుంచి ఉంటుంది. గోడ సైజు 10 × 10 ఉంటే కనీసం రెండు రోల్స్ సరిపోతాయి. గోడకు అంటించడానికి అదనపు చార్జీలుంటాయి. కనీసం రూ.400 వరకు ఉంటుంది.

త్రీడీలో వాల్..

మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఇంటీరియర్ డిజైనర్లు ఎప్పటికప్పుడు కొత్త పోకడలను పరిచయం చేస్తున్నారు. ప్రధానంగా వాల్ పేపర్ల విభాగంలో త్రీడీ పేపర్స్, కస్టమైజ్డ్ వాల్ పేపర్లను మార్కెట్లోకి తీసుకొచ్చారు. ఇవి మనం కోరుకున్న డిజైన్లు, సైజుల్లో లభించడమే వీటి ప్రత్యేకత. దేవుడి బొమ్మలు, కుటుంబ సభ్యుల బొమ్మలు, తమ అభిరుచులను ప్రదర్శించే బొమ్మలు వంటివి ఇంట్లోని గోడల మీద అంటించుకోవచ్చు. త్రీడీ వాల్ పేపర్లు సుమారు 1 × 1 సైజ్ నుంచి 20 × 20 సైజ్ దాకా లభిస్తాయి. ధర చ.అ.కు రూ.120 నుంచి వరకుంటుంది. త్రీడీ వాల్ పేపర్ల నిర్వహణ కూడా చాలా సులువు. మరకలు పడితే తడి గుడ్డతో తుడిస్తే శుభ్రమవుతుంది.





వసతులు మిథ్య... పిల్లల వ్యథ



ఇది రాజధానిలోని స్కూలే..

గోడలు లేని ఈ తరగతి గది ఎక్కడో మారుమూల తండాల్లో ఉందనుకుంటే పొరపడినట్లే. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాల ఇది. పదో తరగతి వరకు 265 మంది విద్యార్థులు ఇందులో చదువుకుంటున్నారు. మన ఊరు మన బడి పథకం కింద కొత్త భవనాన్ని నిర్మిస్తామని పాత భవనాన్ని కూల్చివేశారు. బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ పనులు అర్ధాంతరంగా ఆపేయడంతో ఇలా బ్లాకు బోర్డు, గోడలు కూడా లేని తరగతి గదిలో పాఠాలు వినాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: గోడలు లేని తరగతి గదులు.. పెచ్చులూడి ఎప్పుడు కూలుతాయో తెలియని గోడలు, శిథిలావస్థకు చేరుకున్న దశాబ్దాల నాటి భవనాలు, కంపు కొడుతున్న టాయిలెట్లు, ఒకే గదిలో స్కూలు, అంగన్వాడీ విద్యార్థులకు పాఠాలు.. రాష్ట్రంలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యాలివి. ఎక్కడో మారుమూల పల్లెల్లోనే కాదు.. పట్టణాలు, నగరాల్లోని పాఠశాలల్లో కూడా ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పాఠశాలల పునఃప్రారంభంతో ఎంతో ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కనీస సౌకర్యాలు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా టాయిలెట్లు లేక చిన్నారులు గంటల తరబడి ఉగ్గబట్టుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. దీంతో విద్యార్థులు మూత్ర సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. చాలా పాఠశాలల్లో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించి, శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది.



రోజూ అదే ఇబ్బంది..

టాయిలెట్ వెళ్లేందుకు క్యూలో నిల్చున్న వీరంతా జగిత్యాల జిల్లా పెగడపల్లిలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఈ స్కూల్‌లో టాయిలెట్స్ లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రైమరీస్కూల్ టాయిలెట్లు వాడుకుంటున్నారు. రెండు స్కూళ్లకు కలిపి ఒక్కటే టాయిలెట్ ఉండటంతో ఇలా ఇబ్బందులు పడుతున్నారు.

సార్ రాలేదు.. స్కూల్ బంద్..

సిద్దిపేట జిల్లా పిట్లవాడలో ఉన్న ఈ పాఠశాలలో 26 మంది చదువుకుంటున్నారు. ఒక్కరే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. గురువారం ఆయన విధులకు రాకపోవడంతో స్కూల్ తెరుచుకోలేదు. సార్ కోసం ఎదురు చూసిన విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు.



చెట్ల కింద చదువు.. వానొస్తే సెలవు..



చెట్ల కింద పాఠాలు వింటున్న ఈ చిన్నారులు మంచిర్యాల జిల్లా భీమారం మండలం ధర్మారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. కానీ, కొత్త భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఇలా చెట్ల కింద పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడిందంటే స్కూలుకు సెలవే..

రెండురెళ్లు ఆరు..



నలుగురు విద్యార్థులు.. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న ఈ ప్రాథమిక పాఠశాల నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ఈశ్వర్‌నాయక్ తండాలోనిది. ఇక్కడ ఒకటో తరగతిలో ఇద్దరు, మూడో తరగతిలో ఒకరు, నాలుగవ తరగతిలో ఒక విద్యార్థి మాత్రమే ఉన్నారు. ఈ స్కూల్లో ఇద్దరు టీచర్లు ఉండగా, ఒకరిని మరో పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపారు.

అందరికీ అదే బడి



బడి, అంగన్వాడీ.. రెండూ కలిపి ఒకే గదిలో కొనసాగుతున్న ఈ పాఠశాల మెదక్ జిల్లా శివంపేట మండలం మగ్దంపూర్‌లోనిది. గదిలో ఒకవైపు పాఠశాల విద్యార్థులు, మరో వైపు అంగన్వాడీ చిన్నారులు కలిపి చదువులు కొనసాగిస్తున్నారు. ఈ రెండింటిలో కలిపి సుమారు 45 మంది విద్యార్థులు ఒకే గదిలో పాఠాలు వింటున్నారు.

నిత్య వేదన..



టాయిలెట్ వెళ్లేందుకు వరుసలో నిలుచున్న ఈ చిన్నారుల చిత్రం నిజామాబాద్ రూరల్ మండలం సారంగపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలోనిది. 286 మంది విద్యార్థులున్న ఈ స్కూల్‌లో ఒకే మూత్రశాల ఉంది. దీంతో టాయిలెట్‌కు వెళ్లాలంటే ఇలా క్యూ కట్టాల్సిందే.

ఒకప్పుడు ఇది బడే..



పశువుల పాకగా మారిన ఈ కట్టడం సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మెట్టుకుంటతాండ ప్రాథమిక పాఠశాల. టీచర్లు సరిగ్గా విధులకు రాకపోవడంతో ఇక్కడి 30 మంది విద్యార్థులు సమీపంలోని కృష్ణాపూర్ బడికి వెళ్తున్నారు. దీంతో విద్యార్థులు లేరనే సాకుతో అధికారులు ఈ బడిని మూసివేశారు.

వాష్‌రూం కోసం నెలకు రూ.500 ఇస్తున్నాం



మా పాఠశాలలో 51 మంది బాలికలు, 29 మంది బాలురు చదువుకుంటున్నారు. ముగ్గురు మహిళా టీచర్లు ఉన్నాం. స్కూల్‌లో టాయిలెట్లు లేకపోవడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. నెలకు రూ.500 చెల్లించి గ్రామంలోని ఓ ఇంటి వాష్‌రూంను వాడుకుంటున్నాము.

– లక్ష్మి, టీచర్, రామతీర్థం, మెదక్ జిల్లా.

మూత్రశాలలు నిర్మించాలి



మా పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. వెంటనే వాటిని నిర్మించాలి.

– అవంతిక, విద్యార్థిని, జిరాయత్‌నగర్, నిజామాబాద్ జిల్లా.

ప్రభుత్వ పాఠశాలల వివరాలివీ...

26,040	మొత్తం సర్కారీ స్కూళ్లు
1,07,259	ఉపాధ్యాయుల సంఖ్య
21,50,626	విద్యార్థుల సంఖ్య

ఏడెకరాల వరకు రైతు భరోసా నిధులు జమ

వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తొమ్మిది రోజుల్లో వానాకాలం రైతుభరోసా సహాయానికి పూర్తి నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా శుక్రవారం ఐదో రోజు ఏడు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు రైతుభరోసా నిధులను విడుదల చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం మొత్తం రూ.905.89 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసినట్టు తెలిపారు. దీని ద్వారా 2.64 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని పేర్కొన్నారు. మొత్తంగా ఐదు రోజుల్లో రూ.7,310.59 కోట్లు విడుదల చేశామని, ఇప్పటివరకు 65.12 లక్షల మంది రైతులు రైతు భరోసా సహాయాన్ని అందుకున్నట్టు తుమ్మల వెల్లడించారు. వ్యవసాయ భూమి ఎన్ని ఎకరాలు ఉందన్న దానితో సంబంధం లేకుండా మిగిలిన రైతులకు కూడా రైతు భరోసా సహాయం అందజేస్తామన్నారు.

వ్యవసాయానికి ఏఐ సాంకేతికత

వ్యవసాయరంగంలో ఏఐ సాంకేతికతను వాడే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఏఐ సాంకేతికతను వాడుకునే విధానంపై ఏఐ సంస్థల ప్రతినిధులతో మంత్రి వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇక్రిశాట్ నుంచి హాజరైన ప్రతినిధులు తాము ప్రయోగిస్తున్న ఉపగ్రహ ఛాయాచిత్రాల వివరాలు, దాని ఆధారంగా వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న సేవలను ముఖ్యంగా పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయడంలో తాము అవలంబిస్తున్న పద్ధతులను మంత్రికి వివరించారు. సమావేశంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సన్నద్ధం కావాలి

జిల్లా, పార్లమెంట్, అసెంబ్లీ, మండలాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమిస్తాం: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న 'స్థానిక' ఎన్నికల సమరానికి భారతీయ జనతా పార్టీ సన్నద్ధమవుతోంది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను లక్ష్యంగా చేసుకొని విజయం సాధించేందుకు క్షేత్రస్థాయి నాయకత్వాన్ని సంసిద్ధం చేసేందుకు వ్యూహాత్మక కార్యాచరణను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పదాధికారులతో వర్క్‌షాప్ నిర్వహించింది. అంతకుముందు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ సునీల్ భన్సల్, అభయ్‌పటేల్ పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీకి కలిసొచ్చే అంశాలు, మెరుగుపరుచుకోవాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీ గెలుపొందిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పట్ల ప్రస్తుత పరిస్థితి,



తాజాగా రాజకీయ పరిణామాలు తదితరాలపై సమీక్షించారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధిపైనా చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ స్థాయి నుంచి జెడ్పీ చైర్మన్ వరకు ఫోకస్ ఉంచాలని, అన్ని స్థానాల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోందని, ఆరు గ్యారంటీల అమలు దిశగా బీజేపీ పోరాటం చేయాల్సి ఉందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని, బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని చెప్పారు. ఈ నెల 25న ఎమర్జెన్సీ డేకు వ్యతిరేకంగా జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్త నాయకత్వం వచ్చాక జిల్లా కమిటీలు పూర్తి చేసుకోవాలన్నారు.

రాష్ట్రమంతా పర్యటించండి : సునీల్ భన్సల్

బీజేపీ ప్రజాప్రతినిధులకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ భన్సల్ దిశానిర్దేశం చేశారు. కీలక నేతలంతా తెలంగాణ వ్యాప్తంగా పర్యటించాలని, లోకల్ బాడీ ఎన్నికలకు రూట్‌మ్యాప్ తయారు చేసుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్‌ల నియామకం పూర్తవుతుందని, ఆ తర్వాత పార్లమెంట్, జిల్లా, మండల స్థాయిలో ఎన్నికల కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జూలై మొదటి వారంలో రాష్ట్రస్థాయి లోకల్ బాడీ ఎన్నికల వర్క్‌షాప్ నిర్వహిస్తామని, జిల్లా, మండల స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని పార్టీ నేతలకు చెప్పారు.

మిలిటరీ కాలేజ్‌లో 'చొరబాటు'

ఎంసీఈఎంఈలో నలుగురు హల్‌చల్

- క్యాంటీన్‌తోపాటు సైనికుల వీడియో చిత్రీకరణ... అదుపులోకి తీసుకున్న సెక్యూరిటీ సిబ్బంది
- ఉద్యోగాల పేరుతో టోకరా వేయడానికే అని గుర్తింపు
- కేసు నమోదు చేసిన తిరుమలగిరి పోలీసులు

సాక్షి, హైదరాబాద్: అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే సికింద్రాబాద్‌లోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎంసీఈఎంఈ)లోకి నలుగురు సాధారణ పౌరులు అక్రమంగా ప్రవేశించి హల్‌చల్ చేశారు. క్యాంటీన్‌తో పాటు అక్కడి సైనికులను ఫొటోలు, వీడియోలు తీశారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది నలుగురినీ అదుపులోకి తీసుకుని తిరుమలగిరి పోలీసులకు అప్పగించారు. వారిపై కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేశారు. ఉద్యోగాల పేరుతో మోసాలు చేయడానికి, క్యాంటీన్ నుంచి చౌక ధరకు వస్తువులు కొనుగోలు చేయడానికి వీళ్లు వచ్చినట్లు సమాచారం. ఉత్తర భారతానికి చెందిన రాకేశ్‌కుమార్.. ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ రజత్‌కుమార్ మిశ్రాగా నకిలీ గుర్తింపుకార్డు తయారు చేసుకొని తన స్వస్థలంలో భద్రతా బలగాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని అనేక మందిని మోసం చేశాడు. తన స్నేహితుడైన ఆశిష్ కుమార్‌తో కలిసి ఇటీవల హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న ఆలియా అబ్బాసీ, నగ్మా బానో మహ్మద్ అలీలతో వీరికి పరిచయం ఉంది. తాను ఎయిర్‌ఫోర్స్ అధికారినని, మిలిటరీ క్యాంటీన్ నుంచి తక్కువ ధరకు వస్తువులు కొనిపెడతానని చెప్పి ముగ్గురిని గురువారం మధ్యాహ్నం ఎంసీఈఎంఈ వద్దకు తీసుకువచ్చాడు. ఎంఐ టెక్నోచౌక్ గేటు వద్ద విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి తన నకిలీ గుర్తింపుకార్డు చూపించి మిగతా ముగ్గురిని తీసుకుని లోపలకు ప్రవేశించాడు. క్యాంటీన్‌తో పాటు అక్కడ ఉన్న సైనికులను ఫొటోలు, వీడియోలు తీసి, తన స్వస్థలంలో యువతకు వాటిని చూపించి, వారంతా తన ద్వారానే ఉద్యోగాలు పొందారని చెప్పాలనేది రాకేశ్‌కుమార్ పథకమని పోలీసులు తెలిపారు. అయితే, వీరి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో సెక్యూ రిటీ సిబ్బంది అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఎంసీఈఎంఈ ఇన్‌చార్జ్ లెఫ్టినెంట్ కల్నల్ ఏకే ధండా ఫిర్యాదు మేరకు తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలియా అబ్బాసీ, నగ్మా బానో మహ్మద్ అలీలను అల్వాల్‌లోని సఖి కేంద్రానికి తరలించారు. రాకేశ్, అజయ్‌లను సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లి నిఘా, మిలిటరీ ఇంటెలిజెన్స్ వింగ్ అధికారులతో కలిసి విచారించారు. ఈ ఘటనలో ఎలాంటి ఉగ్రకోణం లేదని తేలడంతో అరెస్టు చేశారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు.

నేను మంత్రిగా ఉంటే తట్టుకోలేకపోతుండు

కడియంపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, వరంగల్: 'కడియం శ్రీహరి నేను మంత్రిగా ఉంటే తట్టుకోలేకపోతుండు. పదేపదే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దగ్గర నా మీద చాడీలు చెప్తుండు'అంటూ మంత్రి కొండా సురేఖ.. కడియం శ్రీహరిపై నిప్పులు చెరిగారు. శుక్రవారం ఆమె మీడియాతో చిట్‌చాట్ చేస్తూ 'నాకు అదృష్టం ఉంది కాబట్టి మంత్రినయ్యాను. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన కూడా మంత్రి అయ్యాడు. తరచూ నేను దిగిపోవాలని మాట్లాడటం సరికాదు'అని అన్నారు. నా కూతురికి అదృష్టం లేక ఎమ్మెల్యే కాలేదని, కడియం శ్రీహరి కూతురికి అదృష్టం ఉండి ఎంపీ అయ్యిందన్నారు. నా మంత్రి పదవి పోతదని కడియం ప్రచారం చేస్తుండని, టీడీపీ, బీఆర్ఎస్‌లో చెప్పుడు మాటలతో సాగించుకున్నట్లు కాంగ్రెస్‌లోనూ సాగించాలని చూస్తున్నాడని, కానీ ఆయన మాయలు ఇక్కడ సాగవని చెప్పారు. భద్రకాళి ఆలయం ఎవరి సొత్తూ కాదని, కొందరు తమ సొత్తు అన్నట్లు ఫీల్ అవుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడడం సరికాదని, ఆయన అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలు నిర్వహించేందుకు గతంలో తీసుకున్న నిర్ణయం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. రాజకీయ విభేదాలను అమ్మవారికి ముడిపెట్టి ఇబ్బందులు సృష్టిస్తారనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు.

24న టీపీసీసీ పీఏసీ భేటీ

స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ నిర్మాణం, రాజకీయ పరిణామాలపై చర్చ... జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక పద్ధతి ప్రకారం జరుగుతుంది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 24వ తేదీన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం జరగనుంది. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతోపాటు మంత్రులు పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశం అనంతరం పీసీసీ సలహా కమిటీ సమావేశం కూడా జరుగుతుంది. ఆ తర్వాత కొత్తగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమావేశం ఉంటుందని, ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేస్తారని వెల్లడించాయి. కాగా, రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ నిర్మాణం, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలపై చర్చ జరుగుతుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

వరంగల్ గొడవపై పరిశీలకుల నివేదిక అడిగాం

శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ గొడవలపై స్పందించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఏం మాట్లాడారన్న దానిపై ఆ నియోజకవర్గ పరిశీలకుల నుంచి నివేదిక కోరామని, ఈ నివేదిక మేరకు ముందుకు వెళతామని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నేతలు ముందుకు రావడంలో తప్పేమీ లేదని, అయితే అభ్యర్థి ఎంపిక పద్ధతి ప్రకారం జరుగుతుందని చెప్పారు. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ చేసిన సిఫారసుల నుంచి ఏఐసీసీ అభ్యర్థిని నిర్ణయిస్తుందన్నారు. ఇక, ఫోన్‌ట్యాపింగ్ కేసులో తనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరువు నష్టం నోటీసులు పంపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసలు కేటీఆర్‌కు పరువు ఉంటే దానికి నష్టం జరుగుతుందని, ఆయనకు పరువు ఉందో లేదో ముందు తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు

'కొండా'పై తాడో పేడో!

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇంట్లో కాంగ్రెస్ సీనియర్ల భేటీ
- కొండా మురళి వ్యాఖ్యలపై ఎమ్మెల్యేల సీరియస్

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఓరుగల్లు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత రాజకీయాలు ముదిరి పాకాన పడ్డాయి. మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులపై ఆ పార్టీ సీనియర్లు సీరియస్‌గా స్పందించారు. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లతోపాటు ఏఐసీసీ నేతలకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. గురువారం కొండా మురళి ఆ పార్టీ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరిలపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించగా, శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఇంట్లో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ భేటీ అయ్యారు. కొండా దంపతుల వైఖరిపై అమీతుమీ తేల్చుకునేందుకు ఆ నేతలు సిద్ధమైనట్టు సమాచారం.

కొండా వర్సెస్ వరంగల్ ఎమ్మెల్యేల పంచాయితీపై ఆరా

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి వర్సెస్ వరంగల్ ఎమ్మెల్యేల పంచాయితీపై కాంగ్రెస్ పార్టీ ఆరా తీసినట్టు తెలిసింది. కొండా మురళి చేసిన ఆరోపణలపై కూడా అధిష్టానం రంగంలోకి దిగినట్టు చెబుతున్నారు. నాయిని రాజేందర్‌రెడ్డికి టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఫోన్ చేసి ఆరా తీసినట్టు తెలిసింది. కొండా దంపతుల పంచాయితీపై ద్విసభ్య కమిటీ వేసే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది.

పార్టీ మంచి చెడులు చర్చించుకున్నాం: నాయిని

భేటీ అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. పార్టీ మంచి చెడులు చర్చించుకున్నామని, సీనియర్లు ఎక్కడ పడితే అక్కడ వివాదాస్పదంగా మాట్లాడటం సరికాదన్నారు. బీసీ కార్డు అడ్డం పెట్టుకొని మాట్లాడతామనడం సరికాదని, ఏదైనా సమస్య ఉంటే పార్టీలో అంతర్గతంగా మాట్లాడుకోవాలని సూచించారు. ఇప్పటికైనా అధిష్టానం ఆలోచన చేయాలని, అధిష్టానాన్ని కలిసి ఫిర్యాదు చేస్తామని నాయిని స్పష్టం చేశారు.

యోగాకు మతాన్ని ఆపాదించొద్దు

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం: వెంకయ్యనాయుడు • ఎల్బీ స్టేడియంలో అట్టహాసంగా ప్రపంచ యోగా దినోత్సవం



శుక్రవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన యోగా డేలో పాల్గొన్న ఔత్సాహికులు

సాక్షి, హైదరాబాద్: యోగాకు మతాన్ని ఆపాదించొద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఎల్బీ స్టేడియంలో అట్టహాసంగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'యోగా యువత జీవితంలో భాగం కావాలి. భారతదేశాన్ని మరింత శక్తివంతంగా ముందుకు తీసుకెళ్లాలి. ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం ప్రధాని ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో శనివారం ప్రధాని పాల్గొంటారు. ముందస్తుగా హైదరాబాద్‌లో కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ రోజు ప్రపంచ ప్రజలంతా శాంతి, ఆరోగ్యంగా ఉండాలన్నదే యోగా లక్ష్యం. యోగా మార్గంలో ప్రపంచాన్ని ఏకం చేయాలి'అన్నారు. భారత్‌తో పాటు పాశ్చాత్య దేశాల ప్రజలు పని ఒత్తిడితో సతమతమవుతున్నారని, వారందరికీ యోగా ఒక థెరపీ, మెడిసిన్, రెమిడీ, సాయం చేస్తుంది, నేర్పిస్తుందని, అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తుందన్నారు.

- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ భారత్‌లో పుట్టిన యోగా ప్రపంచమంతా వ్యాపించిందన్నారు. కరోనా సమయంలో ప్రాణాయామం ఎందరినో కాపాడిందని, క్రమశిక్షణగా జీవించాలంటే యోగా అవసరమని తెలిపారు. ప్రపంచానికి ఎన్నో విలువలు పంచి పెట్టాం...అద్భుతమైన యోగాను పరిచయం చేశామన్నారు.
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రధాని అయిన తర్వాత ప్రపంచానికి వచ్చిన బహుమతి యోగా అన్నారు. 200 దేశాలు యోగాను గుర్తించాయి..ఆచరిస్తున్నాయన్న అంశం భారతీయుడిగా గర్విస్తున్నానని చెప్పారు. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, మానసికంగా, శారీరకంగా బాగుంటే మన ఆరోగ్యం బాగుంటుంది.. మన కుటుంబం, సమాజం, ప్రపంచం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సినీ నటులు ఖుష్బూ, మీనాక్షి చౌదరి, సాయిదుర్గ తేజ్, విద్యా, సామాజిక సంస్థలు పాల్గొన్నాయి.

15

సాక్షి ఫ్యామిలీ

హైదరాబాద్
శనివారం ॥ 21-6-2025

నాదమే జీవనం

నేడు వరల్డ్ మ్యూజిక్ డే

కోయిల ఊరికే ఉండదు... పాడుతుంది.
గాలి కూడా కామ్‌గా కూర్చోదు... సవ్వడి చేస్తుంది.
వినాలే గానీ... కిటికీ పరదా చప్పుడు కూడా సంగీతమే!
ఆనందమో, చిరు సంతోషమో కలిగినప్పుడు...
ప్రతి గొంతూ కూని రాగం తీస్తుంది. సంగీతం లేకపోతే... ఈ జగతి ఉత్త శూన్యం.
సప్త స్వరాలే... ఉచ్ఛ్వాస నిశ్వాసలు. 'వరల్డ్ మ్యూజిక్ డే' సందర్భంగా
ఒక పాటకో, ఒక గళానికో, ఒక స్వరానికో కృతజ్ఞత చెప్పకోకపోతే ఎలా..?
నాదమే జీవనంగా బతుకుతున్న నలుగుర్ని కలవకపోతే ఎలా..!

ఊపిరి ఉన్నంతవరకూ పాటే నా ప్రపంచం

- సంగీతదర్శకురాలు శ్రీలేఖ



● మ్యూజిక్ డైరెక్టర్‌గా ప్రతి క్షణం, ప్రతి నిమిషం, ప్రతి రోజూ సంగీతాన్ని ఆస్వాదిస్తాను... ఆనందిస్తాను. ఊపిరి ఉన్నంతవరకు పాటలతో సెలబ్రేట్ చేసుకుంటాను. పాటే నా ప్రపంచం. సంగీతం తప్ప నాకు వేరే ప్రపంచం తెలియదు. సంగీతాన్ని రోజూ ఇష్టపడుతున్నప్పటికీ 'వరల్డ్ మ్యూజిక్ డే' సందర్భంగా నాకు నచ్చిన పాటలను మరింత ఎక్కువగా వింటాను. నేను కంపోజ్ చేసిన పాటలను నెమరు వేసుకుంటాను... ఇలా చేసి ఉంటే బాగుండేది, అలా చేసి ఉంటే బాగుండేది... ఇలా రకరకాలుగా నా పాటలను విశ్లేషించుకుంటాను.

● అప్పట్లో లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఎక్కువగా ఉండేవి. ప్రొడ్యూసర్, డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్‌లు ఎక్కువగా కోరుకునేవారు కూడా. పాటలు కూడా అలాగే ఉండేవి. రికార్డింగ్, సాంగ్ రికార్డింగ్‌లో నేను కూడా లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఉపయోగించాను. వివిధ లైవ్ ఇన్‌స్ట్రుమెంట్లతో హాల్ మొత్తం సందడిగా, పండగ వాతావరణంతో ఉండేది. ప్రతిరోజూ ఒక పండగలా ఉండేది. ఎవరికి వారు బిజీ కావడం, లైవ్ ఇన్‌స్ట్రుమెంట్ రిక్వైర్డ్ సాంగ్స్ రాకపోవడం, డీజే టైప్ పాటలు, రెట్రో, హిప్ హాప్‌లాంటివి వచ్చి లైవ్ అవసరం లేకుండా పోయింది. ఒకవేళ అవసరం ఉన్నా ఎక్కడున్న వారు అక్కడ, ఎవరికి టైమ్ ఉన్నప్పుడు వారు పాడి, వాయించి పంపుతున్నారు. వాటిని తరువాత మిక్స్ చేస్తున్నారు. అంతా డిజిటలైజ్డ్ అయిపోయింది. ఇది ఎంతవరకు వెళుతుందో మాత్రం తెలియదు.

● ఫుల్ ఆర్కెస్ట్రా ఉన్నప్పుడు సాంగ్ స్ట్రక్చర్ ఇలా రాబోతుందని తెలిసేది. ఎందుకంటే సింగర్స్‌తో సహా లైవ్ ఉండేది. స్ట్రక్చర్ గురించి ఇప్పుడు మ్యూజిక్ డైరెక్టర్‌కే తెలియడం లేదు. అక్కడొక ముక్క, ఇక్కడొక ముక్క, పల్లవి ఒకరు చేస్తారు... బీజియమ్ ఒకరు చేస్తారు. ఫైనల్ వచ్చే వరకు కూడా సాంగ్ ఎలా వస్తుంది? అనేది మ్యూజిక్ డైరెక్టర్‌కి తెలియడం లేదు. మార్పులు, చేర్పులు చేయాలంటే అదొక తతంగం. సో... సాంకేతిక అభివృద్ధి పరంగా మైనస్ ఉంది. కాకపోతే పని గంటలు తగ్గుతాయి. అలాంటి ప్లస్‌లూ ఉన్నాయి.

● సీనియర్ మ్యూజిక్ డైరెక్టర్స్ అందరితోనూ బాగుంటాను. కోటిగారు, వందేమాతరం శ్రీనివాస్ గారు, కీరవాణి అన్నయ్య, మణిశర్మగారు... ఇలా ఎంతోమంది చిన్నప్పటి నుంచి నన్ను చూసి ఉన్నారు కాబట్టి, అందరికీ నేను పెట్. అందరూ నన్ను అభిమానిస్తారు.

● నా సినిమాల్లో నాకు సంతృప్తినిచ్చినవి చాలా ఉన్నాయి. ఉదాహరణకు 'ధర్మచక్రం, తాజ్ మహల్, ప్రేమించు, ప్రేయసి రావే, శివయ్య' వంటివి. మొన్న వచ్చిన 'హిట్-2'లో 'ఉరికే ఉరికే' సాంగ్ బ్లాక్ బస్టర్. నా కెరీర్‌లో ఎక్కువగా మంచి సినిమాలకు పని చేసే చాన్స్ రావడం నా అదృష్టం.

● నేను సినిమా ఒప్పుకోవడానికి మూడు విషయాల గురించి ఆలోచిస్తాను. మొదటిది కథ. జనరల్‌గా కథే కదా హీరో. కథ ఎలా ఉంది. ఏ జానర్‌లో ఉంది. డైరెక్టర్ ఫ్యాషనేట్‌గా తీయగలరా? ప్రాపర్‌గా రిలీజ్ చేయగలరా? వీటి గురించి ఆలోచిస్తాను.
● మహిళలు, పురుషులు అని కాదు... సినిమా ఫీల్డ్‌లోకి రావాలంటే ఎవరికైనా అది అంత తేలికైన విషయం కాదు. కమర్షియల్ ఫీల్డ్ కాబట్టి ఇంట్లో అందరినీ ఒప్పించాలి. చాలా టాస్కులు ఉంటాయి. దేవుడి దయ వల్ల ఆ టాస్కులన్నీ దాటుకొని ఇప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా ఉన్నాను.

● ఏఐ (కృత్రిమ మేధ) గురించి విన్నాను. ఎంత ఏఐ వాడినా, ఎలా చేసినా తెలిసిపోతుంది. హ్యూమన్ ఎమోషన్ ఏఐ ఇవ్వలేదు. మనిషి కంపోజ్ చేసి ఇచ్చినంత ఏఐ ఇవ్వలేదు.

● సినిమా రంగంలో రావడానికి నేను వచ్చిన టైమే కష్టం అనుకుంటే ఇప్పుడు మరింత కష్టం అయింది. ఎంతోమంది డైరెక్టర్స్, సింగర్స్, కంపోజర్స్ వస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాగా కష్టపడాలి. ఇక మనం ఏ స్థాయికి వెళతామనేది అది మన అదృష్టంపై ఆధారపడి ఉంటుంది.

– డి.జి. భవాని

మనసుని తాకాలంటే మెలోడీ బెస్ట్

- సంగీతదర్శకుడు అనూప్ రూబెన్స్



● ప్రపంచ సంగీత దినోత్సవాన్ని జూన్ 21న వరల్డ్ వైడ్‌గా జరుపుకుంటారు. మనకు కూడా ఇక్కడ మ్యూజిక్ డే సెలబ్రేషన్స్‌ని చేస్తుంటారు. కానీ, నాకైతే ప్రతి రోజూ సంగీత దినోత్సవమే. ఎందుకంటే ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకూ సంగీతంతోనే ఉంటాను కాబట్టి.

● సంగీతంలో అప్పటికీ, ఇప్పటికీ టెక్నాలజీ వైజ్, వర్కింగ్ వైజ్ చాలా మార్పులొచ్చాయి. మ్యూజిక్ ఎప్పుడూ మెలోడీ వైజ్ మెలోడీనే ఉంటుంది... దాన్ని ఏదీ రీ ప్లేస్ చేయలేదు. గతంలో లైవ్‌లో అందరం ఒకే సారి రికార్డ్ చేసేవాళ్లం. ఇప్పుడు బిట్ బిట్‌గా, సిస్టమ్ ద్వారా చేస్తున్నాం. ఒక పదం పదం పరంగా కూడా రికార్డింగ్ చేస్తున్నాం. అలాగే ఏఐ ద్వారా వాయిస్ మాడ్యులేషన్స్‌లో కూడా మార్పులొస్తున్నాయి.

● సాంకేతికంగా ఎప్పటికప్పుడు మార్పులు వస్తుంటాయి. దానికి తగ్గట్టుగానే పని చేయాల్సి ఉంటుంది. అయితే ముందు రోజుల్లో లైవ్ రికార్డింగ్స్ ఉన్నప్పుడు ఒకటేసారి మొత్తం ఆర్కెస్ట్రా, సింగర్స్ అంతా కలిసి ఒక టేక్‌లో అయిపోయేది. అది ఒక రకంగా సులభంగా ఉండేది. ఎందుకంటే... గతంలో ఫ్లూట్ బిట్, వీణ బిట్, తబలా బిట్ ఇది... అని ఒక ప్రాపర్‌గా సెట్ చేసుకుని కంపోజ్ చేసేవారు. ఇప్పుడు టెక్నాలజీ వచ్చిన తర్వాత చాలా ఆప్షన్స్ వచ్చాయి. ఒక్కొక్క ట్యూన్ సెలక్షన్స్‌కే చాలా రోజులు పట్టేస్తోంది. అంటే ఎక్కువ ట్యూన్స్ ఎంచుకునే అవకాశం ఉండటంతో ఇంకా ఏదో మంచిది దొరుకుతుంది, ఇంకా కొత్త ట్యూన్ దొరుకుతుంది అని. ఈ ప్రాసెస్ కొంచెం కాంప్లికేటెడ్. అయితే ఈ టెక్నాలజీ పరంగా సౌలభ్యం ఏంటంటే టైమింగ్స్. సింగర్ లేదా మ్యూజిషియన్ టైమ్‌కి అందుబాటులో లేకున్నా, ఇతర దేశంలో ఉన్నా వారు పాడటం లేదా వాయించి పంపితే మేము ఇక్కడ యాడ్ చేస్తాం. ఒక రకంగా ఇది అడ్వాంటేజ్.

● ఒక్కో మ్యూజిక్ డైరెక్టర్‌కి ఒక్కో శైలి ఉంటుంది. నా పరంగా వచ్చేసరికి నేనెప్పుడూ మెలోడీని ప్రేమిస్తాను. ఏ పాట కంపోజ్ చేసినా కూడా మెలోడీకి తొలి ప్రాధాన్యం ఇస్తాను. ఎందుకంటే మనకు సంగీతం అనగానే మొదట టచ్ అయ్యేది మనసు. మెలోడీయే మనకు ఎక్కువ రోజులు గుర్తుంటుందని బలంగా నమ్ముతాను. నా తొలి ప్రాధాన్యం ఎప్పుడూ మెలోడీయే. కానీ, కథ, సందర్భం, అవసరాన్ని బట్టి అక్కడ మాస్ సాంగ్ లేదా బీట్ సాంగ్ ఇస్తుంటాను.

● ఇప్పుడొస్తున్న యువ సంగీత దర్శకులు చాలా బాగా పని చేస్తున్నారు. అయితే ఆరోగ్యకరమైన పోటీ అనేది చాలా అవసరం. ఎందుకంటే.. ఒక్కొక్కరికి ఒక్కో శైలి ఉంటుంది. ఒక్కొక్కరిలో ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. వైవిధ్యమైన స్టైల్స్, ఫీల్స్ వినడానికి అవకాశం ఉంటుంది. అలాగే ఇంకా మనం ఏదో చేయాలి? అనే ఉత్సాహం ఉండాలి. అయితే పోటీ ఆరోగ్యకరంగా ఉండాలి.

● నేను చిన్నప్పటి నుంచి ఇళయరాజా సార్, ఏఆర్ రెహమాన్ సార్ పాటలు వింటూ పెరిగాను. వాళ్ల వర్కింగ్ స్టైల్, లైఫ్ స్టైల్.. చెప్పాలంటే వాళ్లే నాకు స్ఫూర్తి. నాకే కాదు ఇప్పుడు కొత్తగా వచ్చే చాలా మంది సంగీత దర్శకులకు, అలాగే ఇప్పుడు ఉన్న వారికి కూడా. నేను మాత్రం ఆర్‌డీ బర్మన్‌గారు, ఇళయరాజా సార్, ఏఆర్ రెహమాన్‌గారు.. వాళ్ల వద్ద నుంచి చాలా నేర్చుకున్నాను.
● సినిమా ఒప్పుకోవాలంటే నా తొలి ప్రాధాన్యత కథే. అయితే కొన్నిసార్లు బ్యానర్, హీరో, డైరెక్టర్ వేల్యూ కూడా ఉంటాయి. అయితే ఎవరైనా కొత్తవాళ్లు, కొత్త ప్రొడక్షన్ హౌస్ వాళ్లు నన్ను కలిస్తే మాత్రం ముందు కథ విని, నచ్చితే ఒప్పుకుంటాను.

● నా కెరీర్‌లో దాదాపు 90 సినిమాలు చేశాను. అయితే ఓ సంతృప్తి అనేది సినిమా విజయం వల్ల ఉంటుంది... కథ వల్ల ఉంటుంది. ఆ స్టోరీ జనాల్లోకి బాగా వెళ్లడం, మన పాటలు బాగా హిట్ అయితే అదో సంతృప్తి ఉంటుంది. నా సినిమాల్లో అలా సంతృప్తి ఇచ్చిన వాటిలో 'ప్రేమకావాలి, మనం, ఇష్క్, గోపాల గోపాల, టెంపర్' వంటివి చాలా ఉన్నాయి.

● ప్రస్తుతం కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న సంగీత దర్శకులు, సింగర్స్‌లో చాలా మంచి ప్రతిభ ఉంది. ఇప్పుడు మీడియా, సోషల్ మీడియా పరిధి బాగా పెరిగింది. దాని వల్ల స్టార్ వేల్యూ, పాపులారిటీ అన్నది గతంతో పోలిస్తే ఇప్పుడు చాలా సులభం అయింది. అయితే కొత్తవాళ్లకు అంకితభావం... ప్రధానంగా ఓపిక అనేది ఉండాలి. అప్పుడే మన లక్ష్యం అనేది చేరుకుంటాం. ప్రతి ఒక్కరికి ఒక్కో టైమ్ ఉంటుంది... మన సమయం వచ్చినప్పుడు ఆ లక్ష్యాన్ని చేరుకుంటాం.

● ప్రస్తుతం 'వారాహి' అనే సినిమా చేస్తున్నాను. అలాగే తేజగారి చిత్రంతో పాటు అర్జున్‌గారి సినిమా చేస్తున్నాను. మరో ఐదారు సినిమాలు కూడా ఒప్పుకున్నాను.

– దేరంగుల జగన్ మోహన్

లైవ్ రికార్డింగ్‌లో డెప్త్ ఉంటుంది

- సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల



● సంగీత దర్శకుడిగా ప్రతిరోజునీ నా ఫస్ట్ డే మ్యూజిక్ డైరెక్షన్‌లానే భావిస్తాను. ప్రతిరోజూ ఓ స్ట్రగులే. అందుకే అప్‌గ్రేడ్ అవుతుంటాను. ప్రజలు ఎలాంటి సంగీతాన్ని ఇష్టపడుతున్నారో తెలుసుకుని, కొత్త తరహా సంగీతాన్నందించాలన్నదే నా తపన.

● మనం ఆనందంలో ఉన్నప్పుడు పాట వింటాము. దుఃఖంగా ఉన్నప్పుడూ పాట వింటాము. మన భావాలను పంచుకోవాలనుకున్నప్పుడు మ్యూజిక్‌తో తెలియజేస్తాం. ఇలా పలు రకాలుగా సంగీతం అనేది మన జీవితంలో ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.

● దశాబ్ద కాలానికి పైగా సంగీతరంగంలో రాణిస్తున్నాను. ఈ రంగంలో టెక్నాలజీ అప్‌డేట్ అవుతూ వస్తోంది. టెక్నాలజీని మనం ఎంత వరకు కరెక్ట్‌గా వాడాం అన్నది జాగ్రత్తగా గమనించుకుంటుంటే అడ్వాంటేజ్‌గానే ఉంటుంది. కొన్నిసార్లు డిస్‌అడ్వాంటేజ్ కూడా ఉంటుంది. ఎందుకంటే ఒరిజినాలిటీ అనేది ఎప్పుడూ మిస్ కాకూడదు. మ్యూజిక్ అనేది హ్యూమన్ టచ్‌తో సంబంధం ఉన్న అంశం. అలాగే సంగీత దర్శకులకు ఏఐ ఉపయోగపడుతుంది. కానీ మనం దాన్ని ఎంతవరకు వినియోగిస్తున్నాం అన్నది చూసుకోవాలి.

● ఇండస్ట్రీలో ఉన్న పోటీతత్వాన్ని గమనిస్తుంటాను. ఫస్ట్ నాకు నేను పోటీగా ఉండాలనుకుంటాను. ఎంత మంది ఉన్నా కూడా మనకు మనం పోటీగా ఉన్నప్పుడే మనం ముందుకు వెళ్లగలం. ఇండస్ట్రీలో సంగీతదర్శకుల మధ్య ఉండే పోటీని చూసి ఉలిక్కిపడను. నేను ఎదగడానికి ఏం చేయాలి అని చూస్తాను తప్ప పక్కన ఇంకెవరో వచ్చారని కంగారు పడను.

● డిజిటల్ సాయంతో మ్యూజిక్ చేయడం కొంతవరకు సౌకర్యంగానే ఉంటుంది. కానీ లైవ్ రికార్డింగ్స్ అనేవి మాత్రం డెప్త్ క్రియేట్ చేస్తాయి. ఎంత చెప్పినా లైవ్ లైవే... దాంట్లో తిరుగులేదు. నేను గిటారిస్ట్‌ని. లైవ్ అంటే ఏంటో నాకు తెలుసు. ఎంత టెక్నాలజీ వాడినా కూడా లైవ్ అన్నది లైవే. డిజిటలైజ్ వల్ల పని సులభం అవ్వొచ్చు. కానీ లైవ్ రికార్డింగ్ అనేది మ్యూజిక్‌ను నిలబెడుతుంది.

● శ్రోతలకు లిరిక్స్ వినిపించేలా మనం సంగీతం ఇవ్వాలి. ఆ పాటకు లిరిక్స్ చాలా ముఖ్యమని, లిరిక్‌దే ప్రథమ స్థానమని భావిస్తాను. నా సినిమాల్లోని పాటల్లో లిరిక్స్ ఆడియన్స్‌కు వినిపించాలనే ప్రయత్నిస్తుంటాను. లిరిక్స్ ఆడియన్స్‌కు అర్థమైతే, అప్పుడు ఆ లిరిక్‌కు మ్యూజిక్ డైరెక్టర్ ఈ తరహా మ్యూజిక్ ఇచ్చాడని వారికి అర్థమౌతుంది. అదే లిరిక్ అర్థం కాకుండా మనం మ్యూజిక్ ఇస్తే ఎందుకు లిరిక్ అర్థం కావడం లేదని పిస్తుంది. లిరిక్ అర్థమైనప్పుడే సినిమాలోని సందర్భం మ్యూజిక్‌తో ఆడియన్స్‌కు మరింత చేరువ అవుతుంది.

● నేను సినిమా ఒప్పుకోవాలంటే కథను మాత్రమే చూస్తాను. అలాగే నేను ఉపయోగించే ఇన్‌స్ట్రుమెంట్స్ సినిమా టు సినిమా మారిపోతుంటాయి. కథ, ఆ సినిమా హీరో, ఆ హీరో బాడీ లాంగ్వేజ్‌ని బట్టి ఎలాంటి స్టైల్ క్రియేట్ చేయవచ్చు, డైరెక్టర్ ఏ విధమైన మ్యూజిక్ ఆశిస్తున్నారు. ఇటువంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ట్యూన్స్ చేస్తాను. ● 'మేజర్, నాంది, గూఢచారి, కృష్ణ అండ్ హిజ్ లీలా, డీజే టిల్లు' వంటి చిత్రాలు ఓ సంగీతదర్శకుడిగా నా కెరీర్‌లో ఎక్కువ సంతృప్తినిచ్చాయి.

● సినిమాలో సౌండ్ అనేది డిజైన్ చేసినప్పుడు ఫస్ట్ నుంచి లాస్ట్ వరకు ఒకే మ్యూజిక్ డైరెక్టర్ ఉంటే మంచిది. ఒక సినిమాకు ఇద్దరు... ముగ్గురు మ్యూజిక్ డైరెక్టర్స్ వర్క్ చేసే విధానానికి నేను వ్యతిరేకిని. ఇది నా సొంత అభిప్రాయం. అయితే కొన్నిసార్లు ఒక సినిమాకు ఇద్దరు... ముగ్గురు మ్యూజిక్ డైరెక్టర్స్ వర్క్ చేసినప్పుడు అది వర్కౌట్ అయ్యింది. అలాంటప్పుడు ఒక సినిమాకు ఒకే సంగీత దర్శకుడు పని చేయాలని చెప్పడానికి నేనెవర్ని. కానీ... చేస్తే మొత్తం సినిమా చేయాలని నేను కోరుకుంటాను. ఈ విషయంపై నా స్టాండ్ ఏంటంటే... నాకు వ్యక్తిగతంగా ఇష్టం లేదు. కానీ సంగీత దర్శకుల్లో నేను ఒక భాగమే. ఎవరైనా వచ్చి, ఫలానా సినిమాలో ఒకే ఒక్క సాంగ్ చేయమన్నా చేస్తాను.

● మ్యూజిక్ రంగంలో స్థిర పడాలనుకునే కొత్త తరం వారికి నేను చెప్పేది ఒక్కటే. ఒక్కసారి డిసైడ్ అయితే వెనక్కి తిరిగి చూడొద్దు. నిత్యం కష్టపడాలి. ఫోకస్‌గా ఉండాలి. ప్రతిక్షణం మ్యూజిక్ పైనే ఫోకస్ పెట్టి పని చేయాలని చెబుతాను.

● వరల్డ్ మ్యూజిక్ డేని సెలబ్రేట్ చేసుకుంటాను. ఈ సందర్భంగా నా సహచర మ్యూజిషియన్స్ అందరికీ విషెస్ చెబుతున్నాను. అందరికీ అవకాశాలు రావాలని, అందరూ సక్సెస్ కావాలని, అందరూ ఎదగాలని కోరుకుంటాను. ప్రస్తుతం అడివి శేష్‌గారి 'గూఢచారి 2, ఆది సాయికుమార్‌గారి 'శంబాల' సినిమాలు చేస్తున్నాను. మరో ఆరు సినిమాలు లైనప్‌లో ఉన్నాయి.

– మునిమి శివాంజనేయులు

● నేడు యోగా డే

హెల్దీగా.. హ్యాపీగా...



మహిళల ఆరోగ్యానికి, అంతర్గత ఆనందానికి మేలైన సాధనంగా యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. నేడు యోగా డే సందర్భంగా కొన్ని ఆసనాలు...

1. కోణాసనం: సైడ్ యాంగిల్ పోజ్ గా పిలిచే ఈ ఆసనం వేస్తే.. శరీరం బాగా స్ట్రెచ్ అవుతుంది. కాళ్లు, చేతులకు బలం చేకూరుతుంది. వెన్ను నొప్పి, సయాటికా సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

2. వృక్షాసనం: నిటారుగా నిల్చొని, ఒక పాదాన్ని రెండవ కాలు మధ్యకి తీసుకొచ్చి, రెండు చేతులు తలమీదుగా పూర్తిగా పైకి నమస్కారం భంగిమలో తీసుకోవాలి. ఈ ఆసనం వల్ల మానసిక సమతుల్యత ఏర్పడి ఏకాగ్రత పెరుగుతుంది.

3. పాద హస్తాసనం: నిటారుగా నిల్చొని, శరీరాన్ని ముందుకు వంచి, చేతులను పాదాలకు, తలను మోకాళ్లకు ఆనించాలి. దీనివల్ల నరాల వ్యవస్థ చురుకుగా మారి.. రక్త ప్రసరణ మెరుగవుతుంది.

4. అర్ధ మత్స్యేంద్రాసన: మ్యాట్ పైన కూర్చొని, ఎడమ కాలుని కుడి తొడ పక్క గా తీసుకొచ్చి, నేల మీద ఉంచాలి. ఎడమ చేతిని ఎడమ మోకాలు నుంచి తీసుకొచ్చి, పాదం పట్టుకోవాలి. కుడి చేతిని నిటారుగా నేల మీద ఉంచాలి. ఈ ఆసనం వల్ల ఆక్సిజన్ లెవెల్స్ పెరిగి ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది.



5. సేతు బంధాసన: దీనిని బ్రిడ్జ్ పోజ్ అంటారు. ఇది కటి భాగం, గర్భాశయం, వెన్నుకి చాలా మంచిది. ఇది కటి కండరాలను బలోపేతం చేస్తుంది. పునరుత్పత్తి అవయవాలకు రక్త ప్రసరణను పెంచుతుంది.

6. మార్జాలాసనం: క్యాట్-కౌ పోజ్ గా పిలిచే ఈ ఆసనం వెన్నెముక బలానికి, ఒత్తిడిని తగ్గించడంలోనూ సహాయపడుతుంది కటి కండరాలను ఫ్లెక్సిబుల్‌గా చేస్తుంది.

7.బాలాసన: చైల్డ్ పోజ్ పెద్దలకు కూడా మేలు చేస్తుంది. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, విశ్రాంతికి సహాయపడుతుంది. ఈ ఆసనం వెన్నునొప్పిని తగ్గించి, మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

8. భుజంగాసన: కోబ్రా పోజ్ గా పిలిచే ఈ ఆసనం ఛాతీ, వెన్ను భాగాలను బలోపేతం చేస్తుంది. ఇది శ్వాసను మెరుగుపరుస్తుంది. శక్తిని పెంచుతుంది.



9. త్రికోణాసన: ట్రయాంగిల్ పోజ్ వల్ల పాదాలు, కాళ్ళు, చేతులు, వెన్నును బలోపేతం అవుతాయి. శరీరానికి సమతుల్యతను అందిస్తుంది.

10. మాలాసన: దీనిని గార్లాండ్ పోజ్ అంటారు. రెండు కాళ్లను వెడల్పుగా ఉంచి, మోకాళ్ళ వరకు వంగి, చేతులను నమస్కారం స్థితికి తీసుకురావాలి. ఈ ఆసనం సాధన చేయడం వల్ల రుతుక్రమమం, మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి. తొడ కండరాల శక్తి పెరుగుతుంది.

ఈ ఆసనాలను రోజూ సాధన చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరి శారీరక ఆరోగ్యం అభివృద్ధి అవుతుంది ఫలితంగా జీవన శైలిలో మంచి మార్పులు కలుగుతాయి.



- అనూష రాకేష్,
యోగా ట్రైనర్, హైదరాబాద్



బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 20న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,610
బంగారం (22 క్యారెట్లు)	91,450
వెండి	1,08,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,01,850
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,09,300
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,00,480
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,850
బంగారం (22 క్యారెట్లు)	94,860
వెండి	1,09,300
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,800
బంగారం (22 క్యారెట్లు)	89,980
వెండి	1,06,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,470
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

వంటిల్లు

కొబ్బరి పాలతో కొత్తగా..!




కొబ్బరి పాలతో ఏ వంటకాలు చేసుకున్నా గమ్మత్తైన రుచి వస్తుంది. అందుకే వాటితో ఎన్నోరకాల ఆరోగ్యకరమైన స్నాక్స్ చేసుకోవచ్చు. అవి కేవలం రుచిగా ఉండటమే కాకుండా, కొబ్బరి పాలతో పోషకాలు కూడా లభిస్తాయి. ఇక్కడ 5 సింపుల్, వెరైటీ స్నాక్స్ ఉన్నాయి. చూద్దాం!

కొబ్బరి పాల ఖీర్



ఒక మందపాటి గిన్నెలో మూడు కప్పుల కొబ్బరి పాలు తీసుకుని సన్న మంటపై వేడి చేసుకోవాలి. అందులో తగినంత బెల్లం లేదా పంచదార వేసి కరిగించాలి. కొద్దిగా ఉడికిన సగ్గుబియ్యం లేదా వేయించిన సేమియా వేసి చిక్కబడే వరకు ఉడికించాలి. ఏలకుల పొడితో పాటు అభిరుచిని బట్టి వేయించిన జీడిపప్పు, కిస్మిస్‌తో అలంకరించి వేడివేడిగా లేదా చల్లగా సర్వ్ చేసుకోవచ్చు.

కొబ్బరి పాల జెల్లీ



నాలుగు కప్పుల కొబ్బరి పాలను స్టవ్ మీద పెట్టి, చిన్న మంటపై గరిటెతో తిప్పుతూ కాగించాలి. ఇప్పుడు దానిలో సరిపడా పంచదారతో పాటు కొద్దిగా అగార్-అగార్ కలిపి బాగా ఉడికించాలి. అగార్ అగార్ పూర్తిగా కలిసిన తర్వాత, ఒక గిన్నెలోకి లేదా పుడ్డింగ్ మౌల్డ్‌లలో పోసి చల్లబడిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. గట్టిపడిన తర్వాత సర్వ్ చేసుకోవచ్చు. అభిరుచిని బట్టి ఈ మిశ్రమం ఫ్రిజ్‌లో పెట్టే ముందు నేతిలో వేయించిన డ్రై ఫ్రూట్స్ ముక్కలు కలుపుకోవచ్చు. లేదంటే జెల్లీని సర్వ్ చేసుకునే ముందు నచ్చిన విధంగా గార్నిష్ చేసుకోవచ్చు.

కొబ్బరి పాల చెక్కలు



నాలుగు కప్పుల బియ్యప్పిండిలో కొబ్బరి పాలు, సరిపడా ఉప్పు, కారంతో పాటు కొద్దిగా జీలకర్ర, కొద్దిగా కరివేపాకు తరుగుతో కలిపి గట్టి పిండిలా కలుపుకోవాలి. ఈ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి, చేతితో అప్పాలుగా ఒత్తుకోవాలి. వీటిని వేడి నూనెలో దోరగా వేయించుంటే సరిపోతుంది.

కొబ్బరి పాల జ్యూస్



ఒక మిక్సీ బౌల్ తీసుకుని.. అందులో రెండు కప్పుల కొబ్బరి పాలు, నచ్చిన పండ్లు (అరటిపండు, మామిడిపండు, పైనాపిల్ వంటివి) వేసుకుని మిక్సీ పట్టుకోవచ్చు. అనంతరం దానిలో కొద్దిగా తేనె లేదా బెల్లం, కావాలంటే కొన్ని ఐస్ క్యూబ్స్ వేసి, మళ్లీ మిక్సీ పట్టుకుని, మెత్తగా పేస్ట్‌లా చేసుకుని నచ్చిన విధంగా గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి.

● గైడెన్స్



తీవ్రమైన వ్యాయామాలు, కఠినమైన ఆహార నియమాలతో బరువు తగ్గడం అంటే శిఖరాన్ని అధిరోహించేందుకు చేసే కసరత్తులా అనిపిస్తుంది. ముఖ్యంగా బిజీ జీవనశైలిలో అధికబరువుపై ధ్యాస, జిమ్‌కి వెళ్లి వ్యాయామాలు చేయడం పెద్ద యుద్ధమే అనిపిస్తుంది. పోషకాహార నిపుణురాలు ఉదిత అగర్వాల్ జిమ్‌కి వెళ్లకుండానే 30 కిలోల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచింది. తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ముఖంలోని కొవ్వును సహజంగా తగ్గించడంలో సహాయపడే కొన్ని సాధారణ చిట్కాలనూ, తీసుకోదగిన ఆహారాలను మన ముందుంచింది.

బరువు తగ్గినా ముఖం కళ తప్పకుండా..

''నా చిన్నతనం నుంచీ అధికబరువు సమస్యను ఎదుర్కొన్నాను. ఆరోగ్య సమస్యల బారిన పడ్డాను. జుట్టు రాలిపోయేది, ముఖంపై యాక్నె ఉండేది. పాతికేళ్లు వచ్చేసరికి వంద కేజీలకు పైగా బరువు పెరిగాను. జిమ్‌కి వెళ్లకుండా బరువు తగ్గాలనుకున్నాను. ఎనిమిది నెలల్లో 30 కేజీల బరువు తగ్గాను. కానీ, మేని చర్మం సాగినట్టు, ముఖంలోని కొవ్వునూ కోల్పోయి, సన్నబడి, కళ తగ్గినట్టుగా అనిపించింది. ఈ సమస్య దరిచేరకుండా జాగ్రత్త పడ్డాను.

తీసుకునే ఆహారంలో మొత్తం కొవ్వుపై దృష్టి పెట్టాలి. ఎన్ని కేలరీలు ఉన్నాయో, దానికంటే అదనపు కేలరీలను బర్న్ చేయాలని గుర్తించాలి. అప్పుడు కేలరీలు తీసుకోవడం తగ్గిస్తారు.

- ఉత్తమ ఫలితాల కోసం ఆరోగ్యకరమైన ఆహారం + క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం రెండూ జీవనశైలిలో భాగం చేసుకోవాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి. ఉప్పు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకోకూడదు.
- అధిక ప్రోటీన్ తీసుకోవడం ద్వారా కొవ్వు తగ్గుతుంది. కడుపు నిండుగా ఉంటుంది.
- ఆరోగ్యకరమైన కొవ్వులు మొలకెత్తిన గింజలు, విత్తనాలలో ఉంటాయి.
- నీళ్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే పండ్లు – కూరగాయలను తీసుకోవాలి.
- రోజూ కనీసం 2–3 లీటర్ల నీళ్లు తాగాలి.

ఒత్తిడిని తగ్గించడం - హాయిగా నిద్రపోవడం

ఒత్తిడి కార్టిసాల్‌ను పెంచుతుంది, ఇది కొవ్వు పేరుకుని పోయేలా చేస్తుంది. ప్రతి రాత్రి 7 నుంచి 9 గంటల సేపు నిద్రపోయేలా చూసుకోండి. నిద్ర సరిగా లేకపోవడం వల్ల శరీరం నీరు పట్టినట్టుగా కనిపిస్తుంది.

ముఖ వ్యాయామాలు - టోనింగ్

- ఈ వ్యాయామాలు చర్మం నునుపును మెరుగుపరుస్తాయి
- బుగ్గలు ఉబ్బినట్టుగా ఉంటే, మునివేళ్లతో మృదువుగా వెనక్కి మర్దనా చేయాలి.
- పళ్ళు బిగించి, నవ్వుతూ, 10 సెకన్ల పాటు అలాగే ఉంచాలి.
- 'ఫిష్ ఫేస్' ప్రయత్నించాలి. అంటే, బుగ్గలను లోపలికి పీల్చుకొని, కొన్ని సెకన్లపాటు ఉంచాలి.

చక్కెర పానీయాలకు దూరం

మద్యం చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. నీటిని చేరుస్తుంది. చక్కెర పానీయాలలో అధిక కేలరీలు ఉంటాయి. ఇవి ఒంట్లో ఎక్కువ కొవ్వు నిల్వలను చేరుస్తాయి.

పై జాగ్రత్తలన్నీ తీసుకొని, బాడీ ఫిట్‌నెస్‌ను కాపాడుకున్నాను. డైటీషియన్ కోర్సు కూడా పూర్తి చేశాను. నాపై నేను తీసుకున్న ఈ ప్రత్యేక శ్రద్ధ నన్ను నాజూగ్గా మార్చింది.



ఉదిత అగర్వాల్

బరువు తగ్గడానికి 12 రకాల ఆహార పదార్థాలు

కూరగాయలు (కేలరీలు చాలా తక్కువ)

1. దోసకాయ – 100 గ్రాములకు16 కిలో కేలరీలు లభిస్తాయి. హైడ్రేటింగ్, క్రంచీ, సలాడ్స్, స్నాక్స్ చేయడానికి సరైనది.
2. గుమ్మడికాయ – 100 గ్రాములకు 17 కిలో కేలరీలు తేలికైనది, చాలా రకాలు చేయవచ్చు.
3. లెట్యూస్– 100 గ్రాములకు 15 కిలో కేలరీలు ర్యాప్‌లకు, సలాడ్ బేస్‌గా అనువైనది.
4. పాలకూర – 100 గ్రాములకు 23 కిలో కేలరీలు ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది, స్మూతీలు, సాగ్ లేదా సాటీయింగ్‌కు సరైనది.
5. కాలీఫ్లవర్ – 100 గ్రాములకు 25 కిలో కేలరీలు అన్నం, పిజ్జా క్రస్ట్ లేదా సబ్జీలలో ఉపయోగించవచ్చు. పండ్లు (సహజంగా తీపి – తక్కువ కేలరీలు)
6. పుచ్చకాయ – 100 గ్రాములకు 30 కిలో కేలరీలు వేడి వాతావరణం ఉన్నప్పుడు మరీ మంచిది.
7. స్ట్రాబెర్రీలు – 100 గ్రాములకు – 32 కిలో కేలరీలు తీపి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, జీర్ణక్రియకు మంచిది.
8. బొప్పాయి – 100 గ్రాములకు 43 కిలో కేలరీలు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చాలా కడుపు నిండుగా ఉంటుంది.
9. ఉడికించిన గుడ్డులోని తెల్లసొన – గుడ్డులోని తెల్లసొనకు – 17 కిలో కేలరీల స్వచ్ఛమైన ప్రోటీన్, కొవ్వు ఉండదు. కండరాల నిర్వహణకు సరైనది.
10. వెన్నలేని పెరుగు (తక్కువ కొవ్వు) – 100 గ్రాములకు 59 కిలో కేలరీలు ప్రోటీన్ అధికంగా ఉంటుంది, జీర్ణాశయ ఆరోగ్యానికి మంచిది.
11. టోఫు (లైట్ లేదా తక్కువ కొవ్వు) – 100 గ్రాములకు 70 కిలో కేలరీలు మొక్కల ఆధారిత ప్రోటీన్, మృదువైనది మరియు సంతృప్తికరంగా ఉంటుంది.
12. ఎయిర్–పాప్డ్ పాప్‌కార్న్ (ఉప్పు, వెన్న లేనిది) – కప్పుకు 30 కిలో కేలరీలు.

తాను ఇవన్నీ ఫాలో అయాను కాబట్టే బరువు తగ్గినా ముఖం కళ తప్పకుండా కాపాడుకోగలిగాను అని చెబుతోంది ఉదితా అగర్వాల్.



బాలనెరుపా? బీ కేర్ ఫుల్!

పూర్వం రోజుల్లో జుట్టు కాస్త తెల్లబడితే, వయసు పైబడుతోందనడానికి సంకేతంగా భావించి దానిని హుందాగా తీసుకునేవారు. మరీ చిన్నవయసులోనే తెల్ల వెంట్రుకలు వస్తే బాలనెరుపు కాబోలు అని సరిపెట్టుకునేవాళ్లు. ప్రస్తుత కాలంలో నెరుపు చిన్న వయసులోనే మొదలవుతోంది. అలాగని ఇప్పుడిదంతా మామూలే అని సరిపెట్టుకోవలసిన అవసరం లేదు. ఈ సమస్యకు మూల కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దుకుంటే, బాలనెరుపును దూరం చేసుకుని నిగనిగలాడే కురులను సొంతం చేసుకోవచ్చునంటున్నారు పరిశోధకులు.

25 ఏళ్ల లోపు వయసులో కొందరికి తల మొత్తంగా అక్కడక్కడా వెంట్రుకలు నెరిస్తే, ఇంకొందరికి చెంపల దగ్గర, తలలో ఏదో ఒకచోట వెంట్రుకలు నెరుస్తాయి. అయితే అది ఎలాంటి నెరుపైనా పాతికేళ్ల లోపు కనిపిస్తే కచ్చితంగా బాల నెరుపే! ఈ నెరుపు ఎవరికైనా రావొచ్చు.

కాలానుగుణ మార్పుల ప్రభావం

వాతావరణం, ఆహార కాలుష్యం, ఒత్తిడి... బాల నెరుపు తీవ్రత కాలక్రమేణా పెరగడానికి ప్రధాన కారణాలు! పూర్వంతో పోల్చుకుంటే ఆహారంలో కృత్రిమత్వం పెరిగింది. వాతావరణంలో కాలుష్యమూ పెరిగింది. మానసిక ఒత్తిడికీ కొదవ లేదు. ఇవన్నీ కాలక్రమేణా బాల నెరుపు తీవ్రమవడానికి దారితీశాయి.

ఇవీ కారణాలు

జన్యుపరంగా ఈ లక్షణం సంక్రమించి ఉంటే, తల్లితండ్రులకు ఏ వయసులో తెల్ల వెంట్రుకలు కనిపించాయో, అదే వయసుకు పిల్లల్లో కూడా మొదలవుతాయి.

పోషకాల లోపం ప్రధాన కారణం

ప్రొటీన్ లోపం ఉన్నా, ఐరన్ తగ్గి అనీమియాకు లోనైనా, కాపర్ లోపం ఉన్నా వెంట్రుకలు తెల్లగా మారతాయి. ఈ లోపాల తీవ్రత ఏ వయసులో పెరిగితే ఆ వయసులో తెల్ల వెంట్రుకలు కనిపించడం మొదలవుతుంది. పిల్లల్లో ఈ సమస్య సర్వసాధారణం. ఇంటి భోజనానికి బదులుగా బయటి చిరుతిళ్లు తినే పిల్లల్లో పోషకాహార లోపం చివరకు తెల్ల వెంట్రుకల రూపంలో బయల్పడుతుంది.

చదువు ఒత్తిడీ కారణమే!

ఇటీవలి కాలంలో పిల్లల్లో ప్రి మెచ్యూర్ గ్రేయింగ్ పెరగడానికి ప్రధాన కారణం చదువు ఒత్తిడి. మార్కుల కోసం, అదే పనిగా చదవమని ఒత్తిడి చేసినా, మెలనిన్ పరిమాణం తగ్గి వెంట్రుకలు తెల్లబడతాయి.

కారణం తెలిస్తే చికిత్స సులువు

బాల నెరుపుకు అసలు కారణాన్ని కనిపెట్టగలిగితే సమస్య పరిష్కారం సులభమవుతుంది. ఇందుకోసం ఏ పోషకలోపం ఉందో పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. థైరాయిడ్, అప్లాస్టిక్ ఎనీమియాలను గుర్తించే పరీక్షలూ చేయక తప్పదు. అలాగే ఈ నెరుపు వంశపారంపర్యంగా సంక్రమించిందేమో గమనించాలి. జన్యు సమస్యలనూ అంచనా వేయాలి. పరీక్షల్లో ఇవేవీ కారణాలు కావని తేలితే ఒత్తిడిని ప్రధాన కారణంగా భావించాలి.

పిల్లలకు బాల్యం నుంచే ఒత్తిడి లేని జీవితం గడిపేలా చూడాలి. పౌష్టికాహారం ఇవ్వాలి. అప్పుడే బాల నెరుపును జయించవచ్చు. డోంట్ వర్రీ!

● హెల్త్ టిప్స్

సబ్జాగింజలను డైలీ ఆహారం తీసుకోవడం వల్ల మలబద్ధకం, రక్తపీడనం, అధిక బరువు సమస్యలు తగ్గుతాయి. నీరసంగా ఉన్నప్పుడు గింజలు వేసిన నీళ్లు తాగడం వల్ల నీరసం తగ్గి యాక్టివ్‌గా ఉంటారు. ఈ గింజల్లో ఉన్న క్యాల్షియం, మ్యాంగనీస్, ఫాస్ఫరస్‌లు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. క్రమం తప్పకుండా సబ్జాగింజలను నానపెట్టుకుని తాగితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి. ● శరీరం మీద దద్దుర్లు దురదతో బాధిస్తుంటే.. కొబ్బరినూనెలో కొద్దిగా అలోవెరా జెల్ వేసి బాగా కలిపి దద్దుర్ల పైన ఆయింట్‌మెంట్‌లా రాస్తే ఉపశమనం లభిస్తుంది.



సాక్షి సినిమా



● నాగచైతన్య

మజిలీ దర్శకుడితో మళ్లీ?

నాగచైతన్య కెరీర్‌లోని 25వ చిత్రానికి సంబంధించిన పనులు ఊపందుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' (పరిశీలనలో ఉన్న టైటిల్) అనే మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నాగచైతన్య కెరీర్‌లో ఇది 24వ చిత్రం. కాగా తన కెరీర్‌లోని 25వ సినిమాకి సంబంధించి మంచి కథ కోసం చూస్తున్నారట నాగచైతన్య. ఓ దశలో కిశోర్ అనే ఓ కొత్త దర్శకుడి కథకు ఈ హీరో ఓకే చెప్పారని, ఈ కథతో తెరకెక్కేదే నాగచైతన్య కెరీర్‌లో 25వ మైలురాయి చిత్రం అవుతుందనే ప్రచారం సాగింది. కానీ తనకు 'మజిలీ' వంటి హిట్ ఫిల్మ్ ఇచ్చిన శివ నిర్వాణతో 25వ సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నారట నాగచైతన్య. ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, పూర్తి కథ సిద్ధమైన తర్వాత శివ నిర్వాణతో సినిమా చేసే విషయమై నాగచైతన్య ఓ నిర్ణయం తీసుకుంటారని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది. మరి... శివ నిర్వాణతో నాగచైతన్య కాంబినేషన్ రిపీట్ అవుతుందా? నాగచైతన్య 25వ సినిమా ఏ దర్శకుడితో ఉంటుంది? అనే వివరాలు తెలియాలంటే కొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే.



● రజనీకాంత్

మైసూర్‌లో ముత్తువేల్

మైసూర్‌లో ల్యాండ్ అయ్యారు ముత్తువేల్ పాండియన్. హీరో రజనీకాంత్–దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'జైలర్ 2'. వీరి కాంబినేషన్‌లోనే 2023లో వచ్చిన హిట్ ఫిల్మ్ 'జైలర్'కు సీక్వెల్‌గా 'జైలర్ 2' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మాజీ జైలర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో నటిస్తున్నారు రజనీకాంత్. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ మైసూర్‌లో జరుగుతోంది. రజనీకాంత్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరో వారం రోజుల పాటు మైసూర్‌లోనే ఈ సినిమా చిత్రీకరణ జరుగుతుందట. అలాగే 'జైలర్' తొలి భాగంలో నటించిన శివ రాజ్‌కుమార్, 'జైలర్ 2'లో కూడా భాగమయ్యారని, ఈ మైసూర్ షెడ్యూల్‌లోనే రజనీకాంత్ – శివ రాజ్‌కుమార్‌ల కాంబినేషన్‌లో సన్నివేశాలను కూడా చిత్రీకరించడానికి ప్లాన్ చేశారని సమాచారం. రమ్యకృష్ణ, మిర్నా మీనన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది. కాగా రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కూలీ' ఆగస్టు 14న విడుదల కానున్న సంగతి తెలిసిందే.



● జాన్వీ



● జాన్వీ, ఖుషీ

హ్యాపీగా... జాలీగా...

సినిమా షూటింగ్‌లతో బిజీ బిజీగా ఉండే నటీనటులు కాస్త విరామం దొరికిందంటే చాలు హాలిడే ట్రిప్ కోసం విదేశాల్లో వాలిపోతుంటారు. అక్కడ హ్యాపీగా జాలీగా ఎంజాయ్ చేస్తుంటారు. ఆ ఫొటోలని తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తుంటారు. జాన్వీ కపూర్ ప్రస్తుతం లండన్‌లో విహరిస్తున్నారు. తన సోదరి ఖుషీ కపూర్‌తో కలిసి వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నారామె. అయితే ఈ హాలిడే ట్రిప్‌లో జాన్వీ కపూర్‌తో పాటు ఆమె బాయ్ ఫ్రెండ్ శిఖర్ పహారియా కూడా ఉండటం విశేషం. లండన్ వీధుల్లో వీరిద్దరూ చేతిలో చెయ్యేసి కబుర్లు చెప్పుకుంటూ నడిచి వెళుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇదిలా ఉంటే... జాన్వీ కపూర్ ప్రస్తుతం తెలుగులో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. 2026 మార్చి 27న 'పెద్ది' విడుదల కానుంది. అలాగే హిందీలో 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారీ, పరమ్ సుందరి' వంటి సినిమాల్లో నటిస్తూ జాన్వీ బిజీగా ఉన్నారు. ఈ చిత్రాల షూటింగ్స్‌కి కాస్త విరామం రావడంతో... షార్ట్ ట్రిప్‌ని ప్లాన్ చేసుకున్నారు జాన్వీ.

హైదరాబాద్‌లో వారణాసి!

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ అంతర్జాతీయ స్థాయి సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ఈ వారంలో హైదరాబాద్‌లో మొదలైందని సమాచారం. ఈ షెడ్యూల్ కోసం మేకర్స్ హైదరాబాద్ శివార్లలో భారీ సెట్స్‌ను క్రియేట్ చేశారని తెలిసిందే. ఇందులో భాగంగా వారణాసి నగరాన్ని తలపించేలా భారీ సెట్స్ వేశారని భోగట్టా. ఈ సెట్స్‌కు రూ. 40 కోట్లకు పైనే అయ్యిందని టాక్. అంతేకాదు... ఈ సినిమాలోని మేజర్ సన్నివేశాల చిత్రీకరణ ఈ సెట్స్‌లోనే జరుగుతుందని, అందుకే ఈ స్థాయిలో ఖర్చు పెట్టారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత టీమ్ ఫారిన్‌కి వెళుతుందని, అక్కడి ఫారెస్ట్ లొకేషన్స్‌లో యాక్షన్ సీక్వెన్స్‌లను ప్లాన్ చేశారనే టాక్ వినిపిస్తోంది.



● మహేశ్‌బాబు

సూర్య నలుపు!

సూర్య హీరోగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'కరుప్పు' (నలుపు) అనే టైటిల్ ఖరారైంది. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి, సుప్రీత్ రెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సూర్య కెరీర్‌లోని ఈ 45వ సినిమాను భారీ బడ్జెట్‌తో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించి, టైటిల్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో ఓ దేవత విగ్రహం ముందు సూర్య కత్తి పట్టుకుని కనిపిస్తున్నారు. ''కొంత గ్యాప్ తర్వాత సూర్య, త్రిష కలిసి మళ్లీ ఈ సినిమా కోసం కలిసి వర్క్ చేస్తున్నారు. చిన్న ప్యాచ్ వర్క్ మినహా షూటింగ్ మొత్తం పూర్తయింది. మరోవైపు ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు ఛాయాగ్రాహకుడిగా చేస్తున్నారు.



● సూర్య

ఓటీటీ ఇది చూడొచ్చు

ప్రతి భారతీయుడు తెలుసుకోవాల్సిన నిజం

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం కేసరి చాప్టర్ 2 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన ముందు చరిత్రను మనం అక్షరాల రూపంలోనే తెలుసుకోగలం. చరిత్రలో ఉన్న ఆ అక్షరాలు జరిగింది జరిగినట్టుగా కొంతవరకే తెలియజేయగలవు. ఇంకో విషయం ఏమిటంటే... ఆ అక్షరాలలో అప్పటి భావోద్వేగాలను పూర్తిగా అనుభూతి పొందలేం. అంతే కాదు చరిత్రకు ఎక్కని ఎన్నో విషయాలు ఉంటాయి. ఇప్పటి తరానికి, రేపటి భవిష్యత్తుకు చరిత్రలో లేని ఓ పేజీని మనకు పరిచయం చేసే ప్రయత్నమే 'కేసరి చాప్టర్ 2 సినిమా. బ్రిటిష్ కాలం నాటి ఈ సినిమా కథ ప్రతి భారతీయుడి భావోద్వేగాన్ని తట్టిలేపుతుందనడంలో సందేహం లేదు. 1919 ఏప్రిల్ 13న పంజాబ్‌లోని జలియన్‌వాలా బాగ్ ప్రాంతంలో చరిత్ర మరచిపోలేని మారణహోమం జరిగింది. బ్రిటిష్ జనరల్ డయ్యర్ తన మందీ మార్బలంతో అమాయకులైన పంజాబీల మీద విచక్షణా రహితంగా కాల్పులు జరిపి ఎన్నో ప్రాణాలు బలిగొన్నాడు. ఈ ఘటనను అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యం చాలా తేలికగా తీసుకుని డయ్యర్‌ను అభినందించింది. ఇది ఇప్పటివరకూ మనకందరికీ తెలిసిన విషయం. 'కేసరి చాప్టర్ 2' సినిమా 'ది అన్ టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్‌వాలా బాగ్' అనే ట్యాగ్ లైన్‌తో విడుదలైంది. అంటే ఈ ఘటన వెనక మనకు తెలియని ఓ కథను చెప్పారు. అప్పటి సంఘటనకు సంబంధించి బ్రిటిష్ ప్రభుత్వంచే గౌరవించబడ్డ భారతీయుడు సర్ శంకరన్ నాయర్ ఈ విషయంపై కోర్టులో జనరల్ డయ్యర్‌కు వ్యతిరేకంగా కేసు వాదిస్తాడు. బ్రిటిష్ ప్రభుత్వంలో బారిస్టర్‌గా ఉన్న వ్యక్తి బ్రిటిష్ సామ్రాజ్యానికి సవాలుగా మారి జలియన్‌వాలా బాగ్‌కి సంబంధించిన తెలియని విషయాలను ప్రపంచం ముందుకు ఎలా తీసుకొచ్చాడు? అన్నదే ఈ 'కేసరి చాప్టర్ 2'. మనకు ఇంతవరకు తెలియని చాలా విషయాలను ఈ సినిమాలో చూపించారు దర్శకుడు. కరణ్ సింగ్ త్యాగి కథ రాసి, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించారు. మరో ముఖ్య పాత్రలో మాధవన్ కూడా నటించి, మెప్పించారు. జలియన్‌వాలా బాగ్ సంఘటన జరిగి ఇప్పటికి దాదాపు 105 సంవత్సరాలు పైనే. తప్పు జరిగిన తరువాత దానిని సరిదిద్దుకోవడానికి క్షమాపణ చెప్పడం సంస్కారం. అటువంటి ప్రయత్నం ఇప్పటికైనా బ్రిటన్ ప్రభుత్వం చేయాలని సినిమా ఆఖర్లో ఓ కార్డు రూపేణా చూపడం అభినందనీయం. మొన్న మార్చి నెలలో బ్రిటన్ పార్లమెంట్‌లో అక్కడి ప్రజా ప్రతినిధి కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించడం విశేషం. హాట్ స్టార్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ 'కేసర్ చాప్టర్ 2' ప్రతి భారతీయుడు తప్పనిసరిగా చూడాల్సిన సినిమా. – హరికృష్ణ ఇంటూరు

సాక్షి **బిజినెస్**
శనివారం
21-6-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు బుధవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,046	319
82,408	25,112

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,448	▽	96
డోజోన్స్	42,251	▲	80
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,775	▽	17
డాక్స్	23,351	▽	293
షాంఘై	3,356	▽	2
నికాయ్	38,403	▽	85

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.20	87.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.60	118.50
€	యూరో	ఎస్‌బీఐ	98.55	101.30
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.93	60.45
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.55	58.38
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.01	69.70
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.19	12.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.68	24.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.18	13.01

చమురు రేట్లకు యుద్ధం సెగ



ఆరు నెలల గరిష్టానికి ధర

ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో ముడిచమురు రేట్లు భగ్గుమన్నాయి. యుద్ధం మొదలైన గత శుక్రవారం నాడు (జూన్ 13న) ఒకే రోజున ఏకంగా 11 శాతం ఎగిసింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ రేటు ఎకాయెకిన 70.50 డాలర్ల నుంచి 78.50 డాలర్లకు పెరిగి, ఆరు నెలల గరిష్టానికి చేరింది. వారం రోజులుగా ఆ గరిష్ట స్థాయిలోనే తిరుగుతోంది. యుద్ధం ఇదే విధంగా కొనసాగి, చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ గానీ మూసివేస్తే ముడి చమురు రేట్లు 120–130 డాలర్ల వరకు కూడా ఎగిసే అవకాశం ఉందని అంచనాలు నెలకొన్నాయి. ఒకవేళ అదే జరిగితే, దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్లకూ రెక్కలు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

హెచ్‌డీబీ @ రూ. 700-740

- ఈ నెల 25–27 మధ్య ఐపీవో
- కంపెనీ విలువ రూ. 61,400 కోట్లు

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 700–740 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 25న ప్రారంభంకానున్న ఇష్యూ 27న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 10,000 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. ఇష్యూ ద్వారా రూ. 12,500 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 20 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌లో ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 94.36 శాతం వాటా కలిగి ఉంది. అనుబంధ సంస్థ విలువను రూ. 61,400 కోట్లుగా బ్యాంక్ మదింపు చేసింది. కాగా.. ఈక్విటీ జారీ నిధులను టైర్–1 మూలధన పటిష్టతకు హెచ్‌డీబీ కేటాయించనుంది. తద్వారా బిజినెస్ వృద్ధికి వీలుగా రుణాల విడుదల తదితర భవిష్యత్ పెట్టుబడి అవసరాలకు వినియోగించనుంది. జులై 2న బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో లిస్ట్‌కావచ్చు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఎయిరిండియాకు డ్రీమ్‌లైనర్ క్రాష్ సెగ | మౌలిక రంగంలో మరింత తగ్గిన వృద్ధి

బుల్ బ్యాక్ ర్యాలీ

- దిగువస్థాయిల్లో భారీ కొనుగోళ్లు
- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- 18 పైసలు కోలుకున్న రూపాయి
- ఒక శాతానికి పైగా లాభపడిన సూచీలు



ముంబై: దిగువ స్థాయిల్లో భారీ ఎత్తున కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. సెన్సెక్స్ 1,046 పాయింట్లు పెరిగి 82,408 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 319 పాయింట్లు బలపడి 25,112 వద్ద నిలిచింది. దీంతో సూచీల వరుస మూడురోజుల నష్టాలకు బ్రేక్ పడింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు క్రమంగా లాభాల్లోకి మళ్లాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,133 పాయింట్లు ఎగసి 82,494 వద్ద, నిఫ్టీ 343 పాయింట్లు బలపడి 25,136 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 1% వరకు పెరిగాయి. అమెరికా మార్కెట్లు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- రూపాయి విలువ రెండునెలల కనిష్టం నుంచి కోలుకుంది. డాలర్ మారకంలో 18 పైసలు బలపడి 86.55 వద్ద స్థిరపడింది. ఎఫ్‌ఐఐల కొనుగోళ్లు, క్రూడాయిల్ ధరలు దిగిరావడం, డాలర్ ఇండెక్స్ బలహీనత కలిసొచ్చాయి.
- అన్ని రంగాల షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో టెలికమ్యూనికేషన్ 3%, రియల్టీ 2%, ఐటీ 1.5% పెరిగాయి. సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లూ లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్ (3.27%), మహీంద్రాఅండ్‌మహీంద్రా (2.93%), పవర్‌గ్రిడ్ (2.38%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (2.16%), నెస్లే ఇండియా (2%) షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి.
- ఓస్వాల్ పంప్స్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.614)తో పోలిస్తే 3% ప్రీమియంతో రూ.632 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 6% ఎగసి రూ.649 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 2% లాభంతో రూ.625 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.7,122 కోట్లుగా నమోదైంది.
- అన్నదమ్ములు దయానిధి, కళానిధి మారన్ మధ్య విభేదాలు రచ్చకెక్కడంతో సన్‌టీవీ నెట్‌వర్క్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఇంట్రాడేలో 5% పతనమై రూ.582 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆఖరికి 1% నష్టంతో రూ.607 వద్ద ముగిసింది.
- బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, సహకార బ్యాంకులు మౌలిక రంగ ప్రాజెక్టులు, మౌలికేతర ప్రాజెక్టులకు మంజూరు చేసే రుణాలకు సంబంధించి ఆర్‌బీఐ వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభ తేదీ విషయంలో వెసులుబాటు కల్పించింది. దీంతో ఆర్‌ఎఫ్‌సీ, హడ్కో 5%, ఇరెడా 4%, ఆర్‌ఈసీ 3%, ఐఆర్‌ఎఫ్‌సీ 1% లాభపడ్డాయి.

చిన్న పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల జోరు

- విస్తృతంగా 5జీ సేవలు, చౌకగా ఫోన్లు లభిస్తుండటమే కారణం
- మీడియాటెక్ ఇండియా ఎండీ అంకు జైన్ వెల్లడి
- కొత్త డైమెన్సిటీ 8450 చిప్‌సెట్ ఆవిష్కరణ





న్యూఢిల్లీ: ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగం గణనీయంగా పెరుగుతోందని అంతర్జాతీయ సెమీకండక్టర్ దిగ్గజం మీడియాటెక్ ఇండియా ఎండీ అంకు జైన్ వెల్లడించారు. 5జీ సేవల విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు చౌకగా లభిస్తుండటం, కనెక్టెడ్ ఉపకరణాలకు డిమాండ్ నెలకొనడం తదితర అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ ఉపకరణాలకు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు, టెక్నాలజీ రంగం, యువత వృద్ధి చోదకాలుగా ఉండబోతున్నాయని జైన్ చెప్పారు. నెక్స్ట్–జనరేషన్ స్మార్ట్‌ఫోన్ల సామర్థ్యాలను పెంచే డైమెన్సిటీ 8450 చిప్‌సెట్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ వివరాలు చెప్పారు. టీవీలు, స్పీకర్లు, ఫ్రిజ్‌లు మొదలైన ఉపకరణాల్లోనూ ఏఐ చిప్‌సెట్లను ఉపయోగిస్తున్న నేపథ్యంలో స్మార్ట్ హోమ్ మార్కెట్లో కూడా తమకు ప్రాధాన్యం పెరుగుతోందని జైన్ చెప్పారు. దేశీయంగా సెమీకండక్టర్ల తయారీని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం సరైన దిశలోనే ముందుకెళ్తోందని తెలిపారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల కొరతపై స్పందిస్తూ తమ సరఫరా వ్యవస్థకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు వేసుకుంటున్నామని జైన్ వివరించారు.

కొత్త విభాగాల్లోకి విస్తరణ ..

ఆటోమోటివ్, శాటిలైట్ కమ్యూనికేషన్స్‌లాంటి కొత్త విభాగాల్లోకి కూడా విస్తరిస్తున్నామని జైన్ తెలిపారు. ఎలక్ట్రిక్ టూ వీలర్లకు 4జీ స్మార్ట్ క్లస్టర్లను రూపొందించేందుకు జియోథింగ్స్‌తో జట్టు కట్టామని, స్కోడా స్లావియా, టాటా పంచ్ ఈవీలాంటి కార్లకు ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టంలపైనా దృష్టి పెడుతున్నామని చెప్పారు. భారత్‌లో శాటిలైట్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వ్యవస్థ విస్తరించే కొద్దీ తమ చిప్‌సెట్స్‌కు కూడా డిమాండ్ పెరుగుతుందని పేర్కొన్నారు. భారత మార్కెట్లో మరిన్ని పెట్టుబడులకు, ఇంజనీరింగ్ సిబ్బంది సంఖ్యను పెంచుకునేందుకు మీడియాటెక్ కట్టుబడి ఉందని చెప్పారు. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రకారం భారత స్మార్ట్‌ఫోన్ చిప్‌సెట్ మార్కెట్లో మీడియాటెక్ సంస్థకు 45 శాతం, క్వాల్‌కామ్‌కి 32 శాతం వాటా ఉంది. 2004లో మీడియాటెక్ భారత్‌లో తమ తొలి పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం బెంగళూరు, నోయిడా కార్యాలయాల్లో 1,000 మంది పైగా ఇంజనీర్లు ఉన్నారు.

విదేశీ ఆదాయం వెల్లడించని వారిపై చర్యలు

కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన



న్యూఢిల్లీ: విదేశీ ఆదాయం, ఆస్తులను వెల్లడించని పన్ను చెల్లింపుదారులపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. 5,483 మంది పన్ను చెల్లింపుదారుల తమకు రూ.29,208 కోట్ల విదేశీ ఆదాయం, మరో రూ.1,090 కోట్ల అదనపు ఆదాయం ఉందంటూ ఆలస్యపు రిటర్నులు దాఖలు చేసినట్టు తెలిపింది. ఆదాయపన్ను శాఖ నోటీసులకు స్పందించని పన్ను చెల్లింపుదారులపై చట్ట పరిధిలో సరైన చర్యలను పరిశీలిస్తున్నట్టు వెల్లడించింది. స్విస్ బ్యాంకుల్లో భారతీయుల ఆస్తుల మూడింతలు పెరిగి 2024 చివరికి 3.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌కు (రూ.37,600 కోట్లు) చేరినట్టు స్విస్ నేషనల్ బ్యాంక్ ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ ఈ ప్రకటన చారీ చేయడం గమనార్హం. 2024–25 అసెస్‌మెంట్ సంవత్సరం ఐటీఆర్‌లలో పన్ను చెల్లింపుదారులు ప్రకటించిన విదేశీ ఆస్తులు, ఆదాయం గణనీయంగా పెరిగిపోవడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్థిక శాఖ పేర్కొంది. ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పన్ను చెల్లింపుదారులు తమ విదేశీ ఆస్తులు, ఆదాయం వివరాలను స్వచ్ఛందంగా వెల్లడించేందుకు ముందుకు వస్తున్నట్టు, తమ ఐటీఆర్‌లను సమీక్షించుకుంటున్నట్టు తెలిపింది.

సాక్షి **స్పోర్ట్స్**



సాయి సుదర్శన్ @ 317

తమిళనాడు బ్యాటర్ సాయి సుదర్శన్ ఈ మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. 24 ఏళ్ల సాయి భారత్ తరఫున టెస్టు ఆడిన 317వ ఆటగాడిగా గుర్తింపు పొందాడు. భారత సీనియర్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అతనికి టెస్టు క్యాప్‌ను అందించాడు. దురదృష్టవశాత్తూ కెరీర్ తొలి ఇన్నింగ్స్ అతనికి కలిసి రాలేదు. నాలుగు బంతులే ఎదుర్కొన్న అతను 'సున్నా'కే వెనుదిరిగాడు. టెస్టు అరంగేట్రానికి ముందు సాయి భారత్ తరఫున 3 వన్డేలు, 1 టి20 మ్యాచ్ ఆడాడు. మరోవైపు ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ నాయర్ భారత్ తరఫున ఆడే అవకాశం దక్కించుకున్నాడు. టీమ్ మేనేజ్‌మెంట్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌కు ప్రాధాన్యతనిచ్చి తుది జట్టులో శార్దుల్ ఠాకూర్‌ను తీసుకుంది. ఈ స్థానం కోసం పోటీ పడిన ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి స్థానం లభించలేదు. శార్దుల్ 2023 డిసెంబర్‌లో చివరి టెస్టు ఆడాడు. మరోవైపు ఏకైక స్పిన్నర్‌గా జడేజాను కొనసాగించడంతో కుల్దీప్ యాదవ్‌ను కూడా ఎంపిక చేయలేదు.

బ్యాటింగ్‌తో అదరగొట్టారు



5 విజయ్ హజారే, గావస్కర్, వెంగ్‌సర్కార్, కోహ్లి తర్వాత కెప్టెన్‌గా తొలి టెస్టులో సెంచరీ చేసిన ఐదో భారత సారథి గిల్

గిల్ సెంచరీ అభివాదం

పంత్

భారత టెస్టు క్రికెట్‌లో కొత్త అధ్యాయం ఘనంగా మొదలైంది. అంచనాలకు మించిన ఆటతో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. సీనియర్లు తప్పుకున్నా... జట్టును ముందుకు తీసుకెళ్లేందుకు తాము సరైనోళ్లమని యువ ఆటగాళ్లు నిరూపించారు. అసాధారణ బ్యాటింగ్‌తో ముందుగా యశస్వి జైస్వాల్, ఆపై కెప్టెన్‌గా తొలి పరీక్షలో శుబ్‌మన్ గిల్ సెంచరీలు బాది సత్తా చాటగా, రిషభ్ పంత్ తన విలువను ప్రదర్శించాడు. హెడింగ్లీ పిచ్‌పై ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయిన ఇంగ్లండ్ బౌలర్లందరినీ ఒక ఆటాడుకున్న మన బ్యాటర్లు భారీ స్కోరుతో మొదటి రోజును గొప్పగా ముగించారు.

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 359/3

- గిల్, జైస్వాల్ శతకాలు
- పంత్ అర్ధసెంచరీ
- ఇంగ్లండ్‌తో మొదటి టెస్టు

లీడ్స్: ఇంగ్లండ్‌తో మొదలైన తొలి టెస్టులో మొదటి రోజు భారత్ భారీ స్కోరుతో చెలరేగింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ శుక్రవారం ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (175 బంతుల్లో 127 బ్యాటింగ్; 16 ఫోర్లు, 1 సిక్స్), ఓపెనర్ యశస్వి జైస్వాల్ (159 బంతుల్లో 101; 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో చెలరేగగా, వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ (102 బంతుల్లో 65 బ్యాటింగ్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. టెస్టుల్లో జైస్వాల్‌కు ఇది ఐదో సెంచరీ కాగా, గిల్‌కు ఆరో శతకం. జైస్వాల్, గిల్ మూడో వికెట్‌కు 129 పరుగులు జోడించారు. ఆ తర్వాత గిల్, పంత్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 138 పరుగులు జత చేశారు.

సిరీస్‌లో శుభారంభం...

ఓపెనర్లు జైస్వాల్, కేఎల్ రాహుల్ (78 బంతుల్లో 42; 8 ఫోర్లు) జట్టుకు సరైన ఆరంభాన్ని అందించారు. ఇంగ్లండ్ బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడంతో వీరిద్దరు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తూ చకచకా బౌండరీలు బాదారు. ఒకదశలో అసహనంతో జైస్వాల్ 23 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇంగ్లండ్ ఏమాత్రం అవకాశం లేకపోయినా... ఎల్బీ డబ్ల్యూ కోసం రివ్యూ కోరి విఫలమైంది. తొలి గంటలో భారత్ 9 ఫోర్లతో 44 పరుగులు చేసింది. ఎట్టకేలకు లంచ్ విరామానికి ముందు ఇంగ్లండ్‌కు ఊరట దక్కింది. ఆరు బంతుల వ్యవధిలో రాహుల్, తొలి టెస్టు ఆడుతున్న సుదర్శన్ (0) అవుట్ కాగా... లంచ్ సమయానికి జట్టు స్కోరు 92/2కు చేరింది.

భారీ భాగస్వామ్యం...

విరామానంతరం 96 బంతుల్లో జైస్వాల్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఈ సెషన్‌లో జైస్వాల్, గిల్ ప్రత్యర్థి బౌలర్లను పూర్తిగా ఆడుకున్నారు. ఓవర్‌కు దాదాపు ఐదు పరుగుల రన్‌రేట్‌తో పరుగులు రాబట్టి ప్రత్యర్థిపై ఆధిక్యం ప్రదర్శించారు. వోక్స్ వేసిన రెండు ఓవర్లలో గిల్, జైస్వాల్ చెరో 3 ఫోర్లు బాది ధాటిని ప్రదర్శించారు. 56 బంతుల్లో గిల్ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. మరోవైపు జోరు పెంచిన జైస్వాల్ కార్స్ ఓవర్లో 3 ఫోర్లు కొట్టి 99కు చేరుకున్నాడు. తర్వాతి బంతిని సింగిల్ తీసిన అతను 144 బంతుల్లో సెంచరీ మార్క్‌ను చేరుకొని సంబరాలు చేసుకున్నాడు. 50 నుంచి 100కు చేరడానికి జైస్వాల్ 48 బంతులే (8 ఫోర్లు, 1 సిక్స్‌తో) తీసుకోవడం విశేషం.

పంత్ జోరు...

టీ తర్వాత రెండో ఓవర్లోనే భారత్ వికెట్ కోల్పోయింది. జైస్వాల్‌ను స్టోక్స్ బౌల్డ్ చేయడంతో భారీ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత గిల్, పంత్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించగా...గిల్ చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. బషీర్ ఓవర్లో పంత్ వరుసగా 4, 6 బాదడంతో స్కోరు 300కు చేరుకోగా... టంగ్ ఓవర్లో కవర్స్ దిశగా ఆడి గిల్ 140 బంతుల్లో శతకాన్ని అందుకున్నాడు. ఇంగ్లండ్ కొత్త బంతిని తీసుకున్న తర్వాత తొలి ఓవర్లోనే పంత్ హాఫ్ సెంచరీ (91 బంతుల్లో) పూర్తయింది. ఎంత ప్రయత్నించినా ...పేలవ బౌలింగ్‌తో ఇంగ్లండ్ ఈ జోడీని విడదీయలేకపోయింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) స్టోక్స్ 101; రాహుల్ (సి) రూట్ (బి) కార్స్ 42; సాయి సుదర్శన్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0; గిల్ (బ్యాటింగ్) 127; పంత్ (బ్యాటింగ్) 65; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (85 ఓవర్లలో 3 వికెట్లకు) 359. వికెట్ల పతనం:** 1-91, 2-92, 3-221. **బౌలింగ్:** వోక్స్ 19-2-89-0, కార్స్ 16-5-70-1, టంగ్ 16-0-75-0, స్టోక్స్ 13-1-43-2, బషీర్ 21-4-66-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



యశస్వి సెంచరీ సంబరం

ఇంగ్లండ్ పశ్చాత్తాపం!



'కాస్త క్రికెట్ బుర్ర వాడేవారు ఎవరైనా ఇక్కడ టాస్ గెలిస్తే బ్యాటింగ్ తీసుకుంటారు'... ఇంగ్లండ్ నిర్ణయంపై మాజీ కెప్టెన్ మైక్ అథర్టన్ వ్యాఖ్య ఇది. మరో మాజీ కెప్టెన్ కుక్ కూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశాడు. తీవ్రమైన ఎండ, పొడిగా ఉన్న పిచ్, స్వింగ్‌కు ఏమాత్రం అవకాశం లేని వాతావరణం, పెద్దగా అనుభవం లేని బౌలర్లు... ఇలాంటి స్థితిలో టాస్ గెలిచి స్టోక్స్ బౌలింగ్ ఎంచుకునే సాహసం చేశాడు. హెడింగ్లీ మైదానంలో గత ఆరు టెస్టుల్లో ముందుగా బౌలింగ్ చేసిన జట్టే గెలిచింది. కానీ శుక్రవారం పరిస్థితి వాటికి భిన్నం. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడటం చూస్తే తాము చేసిన తప్పేమిటో ఇంగ్లండ్‌కు అర్థమై ఉంటుంది.

పెనాల్టీ పరుగులు...7 బంతుల ఓవర్!

→ 45 పరుగుల వద్ద జైస్వాల్‌కు అదృష్టం కలిసొచ్చింది. కార్స్ వేసిన యార్కర్‌ను అతను చివరి నిమిషంలో నిలువరించగలిగాడు. ఇంగ్లండ్ అప్పీల్‌కు సిద్ధమైన తరుణంలో అంపైర్ దానిని 'నోబాల్'గా ప్రకటించాడు. ఆ తర్వాత రీప్లే చూస్తే బంతి ముందుగా అతని ప్యాడ్‌కు తాకినట్లు తేలింది. 'నోబాల్' కాకపోతే అది కచ్చితంగా అవుట్‌గా తేలేది. → గిల్ 1 పరుగు వద్ద ఉన్నప్పుడు కార్స్ బౌలింగ్‌లో కష్టసాధ్యమైన సింగిల్ కోసం ప్రయత్నించాడు. అయితే గిల్ చాలా దూరంలోనే ఉన్నా... పోప్ వేసిన త్రో నేరుగా వికెట్లకు తాకకపోవడంతో రనౌట్ కాకుండా తప్పించుకున్నాడు. ఓవర్‌త్రో బౌండరీని చేరడంతో మరో నాలుగు పరుగులు జట్టు ఖాతాలో చేరాయి. → టీ విరామానికి ముందు స్టోక్స్ వేసిన చివరి ఓవర్లో స్లిప్ ఫీల్డర్ రూట్ బంతిని ఆపే క్రమంలో దానిని పక్కకు తోశాడు. అది అక్కడే పెట్టిన వికెట్ కీపర్ హెల్మెట్‌ను తాకడంతో భారత్‌కు ఐదు పెనాల్టీ పరుగులు అదనంగా లభించాయి. ఈ గందరగోళంలో అంపైర్ లెక్క తప్పడంతో ఈ ఓవర్లో స్టోక్స్ 7 బంతులు వేశాడు. → ఇటీవలి అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళి అర్పిస్తూ మ్యాచ్ ఆరంభానికి ముందు నిమిషం పాటు మౌనం పాటించిన ఇరు జట్ల ఆటగాళ్లు భుజానికి నల్ల బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

అక్కడ ట్రాఫిక్ జామ్... ఇలా వెళ్లండి!

త్వరలో అలర్ట్స్ ఇవ్వనున్న గూగుల్ మ్యాప్స్

ట్రాఫిక్ వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఆ సంస్థకు..

ప్రస్తుతం ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల అమలు



సాక్షి, హైదరాబాద్: నగరంలోని ప్రధాన రహదారిలోని ఓ ప్రాంతంలో ధర్నా, మరో రోడ్డులో యాక్సిడెంట్ జరిగింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ విషయం సీసీ కెమెరాలు, హైరైజ్ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ పోలీసులకు తెలుస్తుంది. కానీ ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహన చోదకులకు తెలియదు. దీంతో వారు ఆ ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. అలా కాకుండా ముందే ఆ విషయం తెలిస్తే..మరో ప్రత్యామ్నాయ మార్గంలో వెళతారు. హైదరాబాద్ పోలీసులు–గూగుల్ ఇండియా ప్రతినిధులు కసరత్తు చేశారు. కొన్ని మార్గాల్లో ప్రయోగాత్మకంగా కూడా అమలు చేశారు. త్వరలో హైదరాబాద్ అంతా విస్తరించే ఆలోచనలో ఉన్నారు.

జంక్షన్‌లో మూడు, నాలుగు రోడ్లు

సాధారణంగా ప్రతి ట్రాఫిక్ జంక్షన్‌లోనూ మూడు, నాలుగు రోడ్లు ఉంటాయి. ఒక్కో రోడ్డుకు నిర్ణీత సమయం గ్రీన్ లైట్, రెడ్ లైట్ వెలుగుతూ 'సిగ్నల్స్ సైకిల్'నడుస్తుంది. అన్ని రోడ్లలోనూ, అన్ని వేళల్లో వాహనాల రద్దీ ఒకేలా ఉండదు. అయినా ట్రాఫిక్ సిగ్నల్స్ సైకిల్‌లో మార్పు ఉండదు. అలా ఉండాలంటే వాటిని క్షేత్రస్థాయి సిబ్బంది మాన్యువల్‌గా ఆపరేట్ చేయాలి. ఇలాంటి అనేక సమస్యలకు గూగుల్ సంస్థ పరిష్కారం చూపనుంది. హైదరాబాద్ పోలీసులు–గూగుల్ ఇండియా ప్రతినిధులు కొన్ని జంక్షన్లు, రూట్లలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న విధానం త్వరలోనే నగరవ్యాప్తంగా అమలు కానున్నట్టు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు.

ఐటీఎంఎస్ సహకారంతో సిగ్నలింగ్

ట్రాఫిక్ సిగ్నల్స్ అనుసంధానించి ఉండే సర్వర్‌కు ఏ జంక్షన్‌లోని.. ఏ రహదారిలో ఎంత ట్రాఫిక్ ఉంది అనేది సాంకేతికంగా తెలుస్తుంది. దీనికోసం ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టంలో (ఐటీఎంఎస్) అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోలింగ్ సిస్టం (ఏటీసీఎస్) విధానం అమలవుతుంది. ఈ విధానంలో ఓ మార్గంలో ఉన్న నాలుగైదు జంక్షన్లు అనుసంధానం అవుతాయి. ఆయా చౌరస్తాల్లో ఎటు నుంచి ఎంత ట్రాఫిక్ వస్తుందనేది లెక్కించడానికి అవసరమైన పరిజ్ఞానం ట్రాఫిక్ కెమెరాల్లో ఉంటుంది. ఇవన్నీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి ఉంటాయి. అక్కడి సర్వర్‌లో ఉండే సాఫ్ట్‌వేర్ ఈ వాహనాల సంఖ్య ఆధారంగా ఏఏ మార్గాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటే ఆ రూట్లకు ఎక్కువ సేపు గ్రీన్‌లైట్ పడేలా చేస్తుంది. అయితే గరిష్టంగా 100 సెకన్లు మాత్రమే ఇది ఉంటుంది. ఆపై రొటేషన్‌పై సిగ్నల్ సైకిల్ మొదలవుతుంది.

మ్యాప్స్ ద్వారానే అలర్ట్స్ కూడా...

ఇప్పటికే గూగుల్ మ్యాప్స్‌లో ఆయా మార్గాల్లో ఉన్న రద్దీ కనిపిస్తూ ఉంటుంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉన్న సెల్‌ఫోన్ల ద్వారా ఈ రద్దీని గూగుల్ సంస్థ గుర్తిస్తోంది. ట్రాఫిక్ పోలీసుల డేటాతో గూగుల్ సర్వర్ అనుసంధానం చేస్తున్నారు. ఇలా నగరంలోని వివిధ మార్గాల్లో ఉన్న వాహనాల రద్దీ వివరాలు గూగుల్‌కు చేరతాయి. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినా, రోడ్డు ప్రమాదం జరిగినా, నిరసన కార్యక్రమం ఉన్నా కూడా తెలుస్తాయి. ఈ వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే గూగుల్ సర్వర్ మ్యాప్స్‌కు అనుసంధానం చేస్తుంది. తద్వారా ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్న వాహనచోదకులను గుర్తించడంతోపాటు ట్రాఫిక్ జామ్‌పై అలర్ట్ ఇస్తుంది. దాదాపు రెండు మూడు కిలోమీటర్ల ముందే ఈ సమాచారం ఇవ్వడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాన్నీ సూచిస్తుంది. ఈ విధానం అమలులోకి వస్తే సిగ్నల్స్ అన్నీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని (సీసీసీ) సర్వర్ ఆధారంగా పనిచేస్తాయి. కేవలం అవసరమైనప్పుడు మాత్రమే జంక్షన్లను మాన్యువల్‌గా ఆపరేట్ చేస్తారు.

ఒక రోజు.. ఒక ఊరు.. కదిలిన యంత్రాంగం



ఒకే ఒక్కడు సినిమాలో ఒక్కరోజు ముఖ్యమంత్రి సహా అధికార యంత్రాంగమంతా కదిలి అర్హులకు సంక్షేమ పథకాలు అందించినట్లు.. పెద్దపల్లి జిల్లాలో కలెక్టర్‌తోపాటు అధికార యంత్రాంగం మొత్తం శుక్రవారం మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చేరింది. మీసేవ, ఆధార్ సేవలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ అర్హులకు రేషన్, ఆధార్‌కార్డులు, కులం, ఆదాయ సర్టిఫికెట్స్, పోస్టల్ ఇన్సూరెన్స్‌లు, బ్యాంక్ అకౌంట్స్, హెల్త్ చెకప్స్.. ఇలా అన్నీ ఒకే చోట ఏర్పాటు చేశారు. పీఎం ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్‌లో భాగంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందిస్తామని తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

మా ఊరికి ప్రైవేట్ స్కూల్ బస్సులు రావొద్దు

- పెద్దపల్లి జిల్లా ఊశన్నపల్లిలో అడ్డుకున్న గ్రామస్తులు
- ప్రభుత్వ బడికే పిల్లలను పంపాలని తల్లిదండ్రులకు వినతి



ప్రైవేట్ స్కూల్ బస్సులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్ (పెద్దపల్లి) : పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఊశన్నపల్లిలో శుక్రవారం ప్రైవేటు స్కూళ్ల బస్సులను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ ఊరికి ప్రైవేటు స్కూల్ బస్సులు రావద్దని, గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని తల్లిదండ్రులను కోరారు. ఉదయం స్కూల్ బస్సులు వచ్చే సమయానికి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుమికూడిన కొందరు గ్రామస్తులు.. బస్సులు ఎక్కుతున్న పిల్లలను దించివేశారు. దీంతో గ్రామస్తులంతా అక్కడికి చేరుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య ఈ విషయాన్ని ఎంఈఓ మహేశ్‌కు తెలపటంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రైవేటు స్కూళ్లకు వెళ్తున్న పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ బడికి పంపించాలని కోరారు. అనుమతులు లేకుండా పిల్లలను తరలిస్తున్న వ్యాన్ల డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊశన్నపల్లి పాఠశాల ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ, విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని, కలెక్టర్ చేతుల మీదుగా 'బెస్ట్ స్కూల్' 'ఛాంపియన్ స్కూల్' అవార్డులు పొందారని ఎంఈఓ గుర్తు చేశారు. తల్లిదండ్రులు నిజం తెలుసుకొని తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని కోరారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



BANTIA
Furnitures
సఫారీ సోఫా సెట్ : 3 + 2 + దివాన్ (8 సీటర్) + ఉచితం సెంటర్ టేబుల్
MRP ₹62,999
Sale ₹ 23,333
PER DAY EMI ₹25
రిక్లైనర్ సోఫా సెట్
2 రిక్లైనర్స్‌తో 3 సీటర్
+ 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్ & కన్సోల్ టేబుల్
MRP ₹1,49,499
Sale ₹ 69,999
PER DAY EMI ₹75
స్టోరేజ్‌తో బెడ్ + 10" యూరో టాప్ స్ప్రింగ్ మ్యాట్రెస్
విలువ రూ. 15,000 గలవి ఉచితం
MRP ₹42,999
Sale ₹ 24,999
PER DAY EMI ₹27
హాయ్ : టేకఉడ్ క్వీన్ సైజ్ బెడ్
MRP ₹46,999
Sale ₹ 22,222
PER DAY EMI ₹24
ప్రీమియం క్వాలిటీ మ్యాట్రెస్
సింగిల్ : MRP ₹ 7,299 ₹ 2,999
క్వీన్ : MRP ₹ 16,499 ₹ 6,999
కింగ్ : MRP ₹ 21,199 ₹ 8,999
ప్రీమియం
క్వాలిటీ
క్వీన్ సైజ్ బెడ్
MRP ₹43,499
Sale ₹ 9,999
PER DAY EMI ₹11
ఉచితం
10" స్ప్రింగ్ మ్యాట్రెస్,
పిల్లో టాప్
విలువ రూ. 15,000
గ్లాస్
డైనింగ్ టేబుల్
4 చైర్స్‌తో
MRP ₹33,999
Sale ₹ 14,999
PER DAY EMI ₹16
6 చైర్స్‌తో
₹ 22,222
గ్లాస్ డైనింగ్ టేబుల్
4 చైర్స్‌తో
MRP ₹32,499
Sale ₹ 13,999
PER DAY EMI ₹15
6 చైర్స్‌తో
₹ 21,999
యాంటియాక్ : సాలిడ్ ఉడెన్ డైనింగ్
టేబుల్ 6 సీటర్ (4 చైర్స్ + 1 బెంచ్)
MRP ₹55,999
Sale ₹ 24,999
PER DAY EMI ₹27
మార్బుల్
డైనింగ్ టేబుల్
4 చైర్స్‌తో
MRP ₹25,499
Sale ₹ 12,999
PER DAY EMI ₹14
6 చైర్స్‌తో ₹ 14,999
ప్రీమియం క్వాలిటీ వార్డ్ రోబ్
మిర్రర్‌తో
2 డోర్
MRP ₹ 27,449
₹ 8,999
PER DAY EMI ₹10
మిర్రర్‌తో
3 డోర్
₹ 12,999
2 మిర్రర్స్‌తో 4 డోర్ ₹ 16,999


కరీంనగర్ షోరూం ఇప్పుడు ప్రారంభమైనది !
లోన్
& ఎక్స్ఛేంజ్ మేళా
సిబిల్ గురించి చింతించవద్దు. 600 సిబిల్ స్కోర్‌తో లోన్స్/ఇఎంఐ
డౌన్‌పేమెంట్ మరియు ఇఎంఐ స్కీమ్
నెలల సంఖ్య | డౌన్ పేమెంట్
8 | 0
10 | 0
10 | 2
12 | 4
18 | 6
24 | 0
50% వరకు తగ్గింపు
త్వరపడండి!
2 రోజులు మాత్రమే!!
లగ్జరీ సోఫా సెట్
3+2+ ఉచితం రిక్లైనర్
ఉచితం రూ. 20,000/- విలువ గల రిక్లైనర్
MRP ₹61,999
Sale ₹ 29,999
PER DAY EMI ₹32
బ్రెజిల్ సోఫా సెట్:
3+2+ ఉచితం సెంటర్ టేబుల్ విలువ రూ. 7,000
MRP ₹39,499
Sale ₹ 17,999
PER DAY EMI ₹19
రిక్లైనర్ సోఫా సెట్: 3 + 2 + 1 : 2 రిక్లైనర్స్‌తో 3 సీటర్ + 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్ + రిక్లైనర్‌తో 1 సీటర్
MRP ₹2,09,999
Sale ₹ 89,999
PER DAY EMI ₹97
బెడ్‌రూం సెట్ : బాటమ్ స్టోరేజ్‌తో బెడ్ + బెడ్‌సైడ్ టేబుల్ + మిర్రర్‌తో 2 డోర్ వార్డ్‌రోబ్
MRP ₹44,999
Sale ₹ 19,999
PER DAY EMI ₹22
L టైప్/కార్నర్ సోఫా సెట్ (7 సీటర్)
MRP ₹52,999
Sale ₹ 22,222
PER DAY EMI ₹24
రాకీ సోఫా 3 + 2 + 1
MRP ₹62,499
Sale ₹ 29,999
PER DAY EMI ₹32
ప్రీమియం క్వాలిటీ షూ ర్యాక్
2 డోర్: MRP ₹ 7,299 ₹ 2,999
3 డోర్: MRP ₹ 11,499 ₹ 3,999
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
బాంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
79950 00930, 040-27841562 79933 33351
◆ ఎ.ఎస్. రావ్ నగర్ ◆ అత్తాపూర్ ◆ బోడుప్పల్ ◆ దిల్‌సుఖ్‌నగర్ ◆ హైటెక్ సిటీ ◆ కర్మన్‌ఘాట్
◆ కొంపల్లి ◆ కూకట్‌పల్లి ◆ నాగోల్ ◆ సికింద్రాబాద్ ◆ వరంగల్ ◆ విజయవాడ ◆ www.bantia.in

సాక్షి ప్లస్
శనివారం । 21-6-2025



బీబీపేట గ్రామం

నిజాం మెచ్చిన 'బీబీపేట' పాన్!

అప్పట్లో తమలపాకుల తోటలకు ప్రసిద్ధి ● నేడు సాగునీరు కరువై పంట వదిలేసిన రైతులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బీబీపేట.. ఈ పేరు వినగానే అందరికీ గుర్తుకువచ్చేది తమలపాకుల తోటలు. నిజాం కాలంలోనే ఇక్కడి పెద్ద చెరువు కింద తమలపాకుల తోటలు ఉండేవి. తాతల కాలం నుంచి తమలపాకులు పండించిన కామారెడ్డి జిల్లా బీబీపేట రైతులు సాగునీటి కష్టాలతో పంట సాగును వదిలేశారు. అయితే తమలపాకులతో ఉన్న అనుబంధాన్ని తెంచుకోలేని రైతులు.. ఇప్పుడు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని ఆకులు అమ్ముతూ పూటగడుపుతున్నారు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలకు సరిహద్దుల్లో ఉన్న బీబీపేట గ్రామంలో 2,532 కుటుంబాలు ఉండగా, 11,312 మంది జనాభా ఉంది. ఇక్కడ అత్యధిక కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. గ్రామ రైతులు నిజాం కాలం నుంచే తమలపాకులను పండించేవారు. దాదాపు ఏడు గ్రామాలకు సాగునీటినందించే బీబీపేట పెద్ద చెరువు కింద తమలపాకుల తోటలు సాగు చేసేవారు. ఇక్కడ పండించిన తమలపాకుల్లో ఘాటు ఎక్కువగా ఉండేదని



అప్పట్లో తమలపాకుల తోటలు సాగైన భూమి

చెబుతారు. నిజాం నవాబు కుటుంబానికి కూడా ఇక్కడి నుంచి తమలపాకులు వెళ్లేవి. వీటిని నిజాం నవాబు కూడా ఎంతో ఇష్టపడేవారని చెబుతారు. పెద్ద చెరువు కింద దాదాపు 140 ఎకరాల్లో తమలపాకుల తోటలు పెంచేవారు. ఇక్కడ పండించిన తమలపాకులను అప్పట్లో హైదరాబాద్, నాందేడ్, విజయవాడ, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు.

ఉమ్మడిగా తోటల పెంపకం

తమలపాకుల తోటలను రైతులు ఉమ్మడిగా పెంచేవారు. ఒక ఎకరం భూమిలో పది నుంచి పదిహేను మంది రైతులు కలిసి పంట సాగు చేసేవారు. తోట పెంచడమే కాదు ఆకులను తెంపడం, వాటిని రవాణా చేయడం, అమ్మడం వంటి పనులు చేయడానికి ఎక్కువ మంది అవసరం ఉంటుండడంతో రైతులు ఉమ్మడిగా పంట పండించేవారు. తద్వారా ఏ ఇబ్బంది లేకుండా ఉండేది. కొందరు రైతులైతే కూలీల అవసరం లేకుండానే వారి కుటుంబ సభ్యులే కలిసి పంట సాగు నుంచి తెంపడం, అమ్మడం దాకా వాళ్లే చేసుకునేవారు. వందలాది మంది రైతులు పంటల సాగులో పనిచేసేవారు. తమలపాకు తోటల ద్వారా గ్రామంలో కూలీలకు కూడా ఎంతో ఉపాధి లభించేది. తమలపాకు తోటలతో ఆ కుటుంబాలన్నీ ఉన్నతంగా బతికేవి. అయితే 1995 ప్రాంతంలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులతో చెరువు నిండకపోవడంతో రైతులు తమలపాకుల తోటల సాగుకు దూరమయ్యారు. దశాబ్దాల పాటు తమలపాకుల తోటలతో బతికిన రైతులు, నీళ్లు లేక పంట భూములను పడావుగా వదిలేయాల్సి వచ్చింది.

దిగుమతి చేసుకుని అమ్ముకుంటున్న రైతులు: తమలపాకుల తోటలతోనే జీవనం సాగించిన ఎన్నో కుటుంబాలు తోటలు పెంచడం మానేసినప్పటికీ వ్యాపారాన్ని మానలేకపోయాయి. దీంతో ఆయా కుటుంబాలవారు ఇతర ప్రాంతాల నుంచి తమలపాకులను తెప్పించుకుని విక్రయిస్తున్నారు. కామారెడ్డి, దోమకొండ, సిరిసిల్ల, మాచారెడ్డి, గంభీరావుపేట, రామాయంపేట తదితర ప్రాంతాలకు బీబీపేట రైతులు వెళ్లి తమలపాకులు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు తమలపాకులు పండించి, ఎగుమతి చేసిన రైతులు ఇప్పుడు దిగుమతి చేసుకుని అమ్ముకునే దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ తమలపాకులు పండినపుడు హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట తదితర ప్రాంతాలకు వెళ్లి అమ్మేవారు. నాందేడ్ ప్రాంతం నుంచి వ్యాపారులు వచ్చి తమలపాకులను కొనుగోలు చేసుకుని తీసుకెళ్లేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు తలకిందులై రైతులు తమలపాకులను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.



తమలపాకులతోనే జీవనం

నా వయసు 83 ఏండ్లు. మా తాతల కాలం నుంచి తమలపాకుల తోటలు ఉండేవి. నేను 30 ఏళ్లపాటు పెంచిన. ఆకుతోటమీదనే బతికినం. ఆకులను తలమడ్ల రైల్వే స్టేషన్ దాకా ఎడ్ల బండ్లమీద తీసుకుపోయి అక్కడి నుంచి రైలులో పట్నం తీసుకుపోయి అమ్ముతుంటిమి. కొందరు పంట మీద వడ్లు పెట్టేటోళ్లు. మా ఊరికి ఎక్కడెక్కడి నుంచో బ్యారగాళ్లు అచ్చి ఆకులు కొనుక్కొని పోయేటోళ్లు. బీబీపేట అంటేనే తమలపాకుల తోటలు గుర్తు చేసేటోళ్లు. మా ఊరికి ఎంతో పేరుండేది. నీళ్ల కరువుతోని తోటలు బందుజేసినం. ఇగ తోటల ముచ్చటనే లేకుండాపోయింది. ఇప్పుడు మా మనుమడు హైదరాబాద్ నుంచి తమలపాలకులు తీసుకువచ్చి ఇస్తే బస్టాండ్ దగ్గర కూర్చుని అమ్ముతున్న.

– కుర్ల నారాయణ, బీబీపేట



యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్, వన్ ప్రాక్టీస్' ఇతివృత్తంగా జరుపుకొంటున్నామని, ఇది ప్రపంచ సమగ్ర శ్రేయస్సును ప్రోత్సహించడంలో, మానవాళి–ప్రకృతి మధ్య సామరస్యాన్ని పెంపొందించడంలో ఉన్న ప్రాధాన్యాన్ని ఎత్తిచూపుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుసంపన్న పురాతన భారతీయ వారసత్వంలో యోగా అంతర్భాగమని, ఇది సాధకుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగుపరిచే సామర్థ్యం కలిగి ఉందని తెలిపారు. యోగా నిత్య సాధన ద్వారా శరీరం, మనసు మధ్య సమన్వయం కుదురుతుందన్నారు. జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినంగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ద్వారా గుర్తించేలా చేసినందుకు ప్రధాని మోదీకి గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు.

'పంచాయతీ' భవనాల్లో పోస్టాఫీసుల ఏర్పాటుకు సహకరించాలి

సీఎస్‌కు చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యాలయాల్లో పోస్టాఫీసుల ఏర్పాటుకు పూర్తి సహకారం అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన సచివాలయంలో సీఎస్‌తో భేటీ అయ్యారు. 1,014 గ్రామపంచాయతీ కార్యాలయ భవనాల్లో తపాలా కార్యాలయాలకు చోటు కల్పించటంతో ఏర్పాటు చేశామని, మరో 4,429 పోస్టాఫీసుల ఏర్పాటుకు కూడా గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాల్లో అవకాశం కల్పించేలా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని విన్నవించారు. తపాలాశాఖ భూముల మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేసేలా కూడా వారికి సూచించాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రారంభమైన 'నో యువర్ పిన్ కోడ్', నో యువర్ డిజిపిన్' కార్యక్రమాల గురించి సీఎస్‌కి వివరించారు. విపత్తు సహాయం, ఆరోగ్యం, పోలీసు, పౌర సరఫరాలు, రెవెన్యూ వంటి రాష్ట్ర ప్రభుత్వ శాఖల సేవల్లో దీన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టు ఊరట

4 కేసుల్లో ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. పలు కేసుల్లో ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా కేసుల్లో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే 14కు వాయిదా వేసింది. 2021, నవంబర్ 15న నల్లగొండ పట్టణ సమీపంలోని అర్జాలబావి నుంచి బండి సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు కరోనా సమయంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి భారీ ర్యాలీ నిర్వహించారన్న ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో, అదేరోజు వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద ర్యాలీ నిర్వహించినందుకు ఎంపీడీవో దేవిక ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ పీఎస్‌లో కేసు నమోదైంది. మరుసటి రోజు(16న) చివ్వెంలలో ర్యాలీ నిర్వహించారని తహసీల్దార్ రంగారావు ఫిర్యాదుతో అక్కడి పీఎస్‌లో మరో కేసు నమోదు చేశారు. దీంతోపాటు మరో కేసును కొట్టివేయాలని కోరుతూ బండి సంజయ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

నోరు జాగ్రత్తగా వాడకపోతే తీవ్ర పరిమాణాలు

బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసం కేసీఆర్, కేటీఆర్‌లపై కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు ధ్వజమెత్తారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ నేతలు బొమ్మెర రామ్మూర్తి, రవినాయక్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్‌గా కాంతం ఉన్నప్పుడు దందాలు, వసూళ్లే లక్ష్యంగా పని చేశారని ఆరోపించారు. రాజకీయంగా ఏదైనా ఉంటే చర్చించాలని, వ్యక్తిగత విమర్శలు మానాలని హితవు పలికారు. తాము తలచుకుంటే ఆయన ఎక్కడా తిరగలేడని, నోరు జాగ్రత్తగా వాడకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. కాంతం చేసిన తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బొమ్మెర రామ్మూర్తి మాట్లాడుతూ అసభ్యంగా మాట్లాడితే కాంతం నాలుక చీరేస్తామని, అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే తమ వైఖరి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. దళిత నేత ముసుగులో ఏం మాట్లాడినా చెల్లుతుందనుకోవద్దని, తాము కూడా దళితులమేనన్నారు.

కేసీఆర్ అంటే ట్రిపుల్ ఆర్ స్కీమ్స్... రేవంత్ అంటే ట్రిపుల్ ఆర్ స్కామ్స్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ అంటే ట్రిపుల్ ఆర్ స్కీములని, రేవంత్‌రెడ్డి అంటే ట్రిపుల్ ఆర్ స్కాములని ప్రజలు అనుకుంటున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మూడురంగుల జెండాతో కాంగ్రెస్ పార్టీ దందాలు చేస్తోందని, ఏఐసీసీ అంటే ఆలిండియా కరప్షన్ సెంటర్ అని, పీసీసీ అంటే ప్రదేశ్ కరప్షన్ సెంటర్ అని అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్య సలహాదారులు కనీసం 5వేల కోట్ల రూపాయలకు తక్కువ కమిషన్ తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఓ బిల్డర్‌ను బ్లాక్ మెయిల్ చేసేందుకు కోర్టులో పిల్ వేశారని, స్కామ్‌ల ద్వారా వసూలు చేసిన డబ్బు రాహుల్ గాంధీకి వెళ్తోందన్నారు. రేవంత్‌రెడ్డి అనుచరుడు ఫహీం ఖురేషి మరో నయీమ్‌గా మారారని, లియోనియా రిసార్ట్‌లో రూ.10వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని జీవన్‌రెడ్డి ఆరోపించారు.

నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

మహిళా మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందగా, పలువురు తప్పించుకున్నారు. నారాయణపూర్ జిల్లాలోని అమాటోలా– కల్పార్ గ్రామాల అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారంపై అందిన సమాచారంతో జిల్లాకు చెందిన డీఆర్‌జీ, బీఎస్ఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు మొదలుపెట్టగా, పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందగా, 303 రైఫిల్, బీజీజీఎల్ లాంచర్, రెండు కిట్‌బ్యాగులు, వాకీటాకీతో పాటు ఇతర మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఘటనాస్థలి నుంచి పలువురు తప్పించుకున్నారనే సమాచారంతో కూంబింగ్ ముమ్మరం చేశారు. కాగా, మృతిచెందిన మావోయిస్టు పీఎల్‌జీఏ కంపెనీ–7కు చెందిన కమాండర్‌గా గుర్తించినా పేరు, వివరాలను పోలీసులు వెల్లడించలేదు.



మత్తు వదిలించేలా!

నేటి నుంచి 26 వరకు యాంటీ-డ్రగ్ అవగాహన వారోత్సవాలు

టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మత్తుపదార్థాల వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పించే లక్ష్యంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించింది. ఈనెల 26న అంతర్జాతీయ డ్రగ్ డేను పురస్కరించుకుని ఆరు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని టీజీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో యాంటీ–డ్రగ్ అవగాహన వారోత్సవాలు–ఫొటో ఎగ్జిబిషన్, స్టాల్స్, యాంటీ డ్రగ్ సోల్జియర్స్ సెల్ఫీ బూత్, డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా రూపొందించిన పలు అవగాహన వీడియోలు, విడుదల తదితర కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలను డీజీపీ జితేందర్ ప్రారంభించనున్నట్టు చెప్పారు. శనివారం నుంచి ఈనెల 24 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈనెల 25న జలవిహార్‌లో ప్రత్యేక సమావేశంతోపాటు ఎగ్జిబిషన్, మానవహారం తదితర కార్యక్రమాలు, ఈనెల 26న శిల్పకళావేదికలో స్టాల్స్ ఏర్పాటు, భారీ స్థాయిలో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. టీజీఏఎన్‌బీతోపాటు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంలో భాగంగా విద్యార్థులు, యువతలో మత్తుపదార్థాలతో వచ్చే ఇబ్బందులపై అవగాహన పెంచేందుకే ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సందీప్ శాండిల్య తెలిపారు.

నిర్మాణం పూర్తయినా ప్రారంభంలో జాప్యమెందుకు?

అలంపూర్ హాస్పిటల్‌పై సర్కార్‌కు హైకోర్టు నోటీసులు

తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా

సాక్షి, హైదరాబాద్: జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయినా ఎందుకు ప్రారంభించడం లేదని సర్కార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. రెండు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు వైద్య శాఖ ముఖ్యకార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వ మెడికల్ సైన్సెస్ మౌలిక సదుపాయాల అభివృద్ధి డైరెక్టర్, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్, జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో తదితరులకు నోటీసులు జారీ చేస్తూ.. విచారణ వాయిదా వేసింది. అలంపూర్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయినా సిబ్బందిని కేటాయించి ప్రారంభించడంలో అసాధారణ జాప్యం జరుగుతోందంటూ జోగులాంబ గద్వాల్ జిల్లా ఐజాకు చెందిన సామాజిక కార్యకర్త ఎస్.రామచంద్రారెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రూ.21 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం పూర్తయి 18 నెలలు కావొస్తున్నా ప్రజలు వైద్యం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



దీనిపై పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఆస్పత్రి పూర్తయినా ప్రారంభించకపోవడాన్ని తప్పుబట్టింది. అనుమతి ఇవ్వకపోవడానికి కారణాలను తెలియజేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

బనకచర్లపై కేసీఆర్ ఎందుకు మాట్లాడరు?

● తప్పులు దిద్దుకునేందుకే హరీశ్ పిచ్చికూతలు: అద్దంకి ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: బనకచర్లపై కేసీఆర్ ఎందుకు నోరు విప్పడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కృష్ణాజలాల్లో 299 టీఎంసీల వాటాకు ఆయన ఎందుకు అంగీకరించారని, గోదావరిలో 3వేల టీఎంసీలు మిగులు జలాలు న్నాయని ఆయనకు చెప్పిందెవరని నిలదీశారు. సీఎంగా ఉన్నప్పుడు ఆయన కృష్ణాజలాలు తెలంగాణకు, గోదావరి జలాలు ఆంధ్రప్రదేశ్‌కు అనే తరహాలో మాట్లాడారని, బేసిన్లు, బేషజాలు లేవని ప్రకటించారని గుర్తు చేశారు. మిగులు జలాల ప్రాతిపదికన ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని నాడు కేసీఆర్ ఎందుకు చెప్పలేదని, దానిపై హరీశ్‌రావు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చేసిన తప్పులు దిద్దుకునేందుకే హరీశ్‌రావు బనకచర్లపై మాట్లాడుతున్నారని, ఇప్పుడు పిచ్చికూతలు కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవితల శని అవసరమా అని ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని, తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి ఉందని ఎమ్మెల్సీ దయాకర్ చెప్పారు.

భార్గవికి భద్రత ఇవ్వాలి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బాధితులకు రక్షణ కల్పించడం పోలీసుల బాధ్యత అని హైకోర్టు స్పష్టంచేసింది. సూర్యాపేటకు చెందిన కోట్ల భార్గవికి పోలీసు భద్రత అందించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. సూర్యాపేటలోని మామిళ్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ (ఎస్సీ), కోట్ల భార్గవి (బీసీ) గతేడాది ప్రేమించి పెళ్లి చేసుకోగా.. జనవరిలో కృష్ణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఇంట్లో వారికి ఇష్టం లేకుండా తమ సోదరి కులాంతర వివాహం చేసుకోవడంతో కృష్ణను భార్గవి సోదరులే పక్కా ప్రణాళికతో హత్య చేశారని పోలీసులు వారిని అరెస్టు చేశారు. నిందితులు బెయిల్‌పై వచ్చి తనను కూడా హత్య చేస్తామని బెదిరిస్తున్నారని, తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని గన్‌మెన్‌తో రక్షణ అందించాలని ఎస్పీని కోరినా స్పందించడం లేదంటూ భార్గవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. భార్గవికి రక్షణ కల్పించడం పోలీసు విధి అని నివేదించారు. ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) చట్టంలోని సెక్షన్ 15ఏ(1) ప్రకారం రక్షణ కల్పించాలని రాష్ట్రాన్ని ఆదేశించిందని నొక్కి చెప్పారు. ప్రభుత్వం తరఫున ఏజీపీ లక్ష్మీకాంతరెడ్డి వాదనలు వినిపిస్తూ.. బాధితురాలికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆమె ఇంటి వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు పెట్రోలింగ్ కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పుడు బాధితురాలు హైదరాబాద్‌కు మారారని, ఆమె సమర్పించిన వినతిపత్రం పరిశీలనలో ఉందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వినతిపత్రంపై నిర్ణయం తీసుకునే వరకు రక్షణనివ్వాలని ఆదేశించారు.

దివ్యాంగుల సంక్షేమంపై చర్చకు సిద్ధం

తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య



సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ (టీవీసీసీ) చైర్మన్ ముత్తినేని వీరయ్య స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపట్టలేని పలు కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఈ చర్చకు రావాలని సవాలు విసిరారు. ఈ చర్చలో పాల్గొంటే బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలను ఆధారాలతో సహా బహిర్గతం చేస్తానన్నారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 పార్లమెంట్ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో దివ్యాంగుల సంక్షేమానికి కనీస ప్రాధాన్యం ఇవ్వని బీజేపీ ఇప్పుడు దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వీరయ్య ఎద్దేవాచేశారు. వికలాంగుల హక్కుల చట్టం–2016ను కనీసం అమలు చేయని పరిస్థితి ఉందన్నారు.

విదేశీయులకు ప్రియమైన బంగినపల్లి

ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఉలవపాడు మామిడి విదేశీయులకు సైతం నోరూరిస్తోంది. ఈ ఏడాది కూడా ఉలవపాడు బంగినపల్లె రకం మామిడి అమెరికా, యూకెలకు ఎగుమతులు చేస్తున్నారు. నెల్లూరు జిల్లా ఉలవపాడులోని బీ ష్యూర్ అగ్రి ఎక్స్‌పోర్ట్స్ ఆధ్వర్యంలో ఈ రెండు ప్రాంతాలకు ఎగుమతులు చేశారు. నాణ్యతలో ఎంపిక జరిగి వారి క్వాలిటీ కి అనుగుణంగా ఉన్న కాయలను మాత్రమే ఎగుమతులు చేశారు. బెంగళూరు లోని క్వాలిటీ తనిఖీ కేంద్రం నుంచి ఈ కాయలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. ఉలవపాడు ప్రాంతం నుంచి ప్రధానంగా బంగినపల్లె, రసాలు రకాలు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఏడాది సుమారు 10 టన్నుల పైనే ఎగుమతి అయ్యాయి. బంగినపల్లె రకం కవర్ కట్టిన కాయలు కేజీ రూ.140, కవర్ కట్టని కాయలు కేజీ రూ.100 చొప్పున నాణ్యత ఉన్న కాయలు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి క్వాలిటీ టెస్ట్ చేసి ఎగుమతులు చేశారు.

– ఉలవపాడు


ఎగుమతికి సిద్ధమైన నాణ్యమైన కాయలు

ఉలవపాడు మామిడి విదేశాలకు ఎగుమతి
- అమెరికా, యూకేకు ఎగుమతులు
- 10 టన్నుల పైన ఎగుమతులు
- నాణ్యమైన రకం ఎగుమతి

నాణ్యతే కీలకం

విదేశాలకు ఎగుమతులలో నాణ్యతే ప్రధానం. కాయలను ముందుగా కోసిన తరువాత వాటిలో తేమ ఇంకే వరకు కాయలను తిరగబెట్టి ఉంచాలి. తరువాత మచ్చలేకుండా ఉన్న కాయలను ఎంచుకోవాలి. తియ్యదనం కూడా కాస్త తక్కువగా ఉండాలి. విదేశాలలో తినే కాయలకు కాస్త తీపి తక్కువగా ఉండేలా చూసుకోవాలి. కవర్ కట్టిన కాయలలో వడగాలి, ఎండ తగలదు కాబట్టి తీపి శాతం తక్కువగానే ఉంటుంది. కానీ కవర్ కట్టని కాయలనే విదేశాలలో ఉన్న భారతీయులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇలా గ్రేడింగ్ అయిన కాయలను బెంగళూరులోని క్వాలిటీ కంట్రోల్ లో తనిఖీ చేస్తారు. నాణ్యమైన రకంగా గుర్తించిన కాయలను విమానాలలో విదేశాలకు ఎగుమతులు చేస్తారు. విదేశాలలో ఈ కాయలను హన్స్‌లెట్ లోని జీఓకారో లిమిటెడ్ వారు దిగుమతి చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. 3 కేజీలు, 4 కేజీల బాక్స్‌లలో వీటిని ఎగుమతి చేస్తారు. ఒక్కో బాక్స్‌లో షుమారు 7 నుంచి 9 కాయలు పట్టేలా ప్యాకింగ్ చేస్తారు. ఇక్కడ షుమారు ఈ బాక్స్ విలువ రూ.450 నుంచి రూ.550 వరకు ఉంటుంది. ఈ కాయలు అమెరికాలో 57 డాలర్లకు అమ్ముతారు.అంటే షుమారు రూ.4500 పడుతుంది. 9 కాయలను రూ.4500 కు అమ్ముతారు. అంటే ఒక్కో కాయ రూ.500 చొప్పున విదేశాలలో అమ్ముడవుతుంది. యూకేలో షుమారు 21 పౌండ్ల వరకు రేటు పలుకుతుంది. ఉలవపాడు బంగినపల్లె రకం మామిడి కాయ విదేశాలలో రేటు చూసి గర్వపడాల్సిందే.


ముందుగా కాయలను ఇలా తేమ దిగే వరకు ఉంచే విధానం

నాణ్యత గల కాయలు ఎగుమతులు చేస్తున్నాం




మా కంపెనీ ద్వారా విదేశాలకు మామిడి కాయలు ఎగుమతులు చేస్తున్నాం. రైతులు నాణ్యత గల కాయలు ఉంటే వాటిని బెంగళూరులో క్వాలిటీ చూసి పంపిస్తాం. ఈ ఏడాది అమెరికా, యూకేకు పంపించాం. కాయలు అద్భుతంగా ఉన్నాయని కొనుగోలు చేసిన కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

– వై.బాలచందర్, బీష్యూర్ అగ్రి ఎక్స్‌పోర్ట్స్, ఉలవపాడు

క్లుప్తంగా...

వైభవంగా శ్రీ వకుళామాత ఆలయ తృతీయ వార్షికోత్సవం



తిరుపతి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో శ్రీ వకుళామాత ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి సమీపాన పేరూరు బండపై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి తల్లియైన శ్రీ వకుళామాత ఆలయంలో శాస్త్రోక్తంగా ఉదయం నుండి రాత్రి వరకు కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 5.30 గం.ల నుండి 6 గంటల వరకు సుప్రభాతం, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు నిత్య కైంకర్యాలు, మూలవర్లకు అభిషేకం, అలంకారం, నివేదన చేపట్టారు. ఉదయం 9 నుండి 11 గం.ల వరకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనము, అంకురార్పణం, మహా శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు.ఉదయం 11 నుండి ఉత్సవ మూర్తులకు అష్టోత్తర శత కలశాభిషేకం, 12 గం.ల నుండి శుద్ధి, అక్షతారోపణ, బ్రహ్మఘోష, ఆచార్య బహుమానం చేపట్టారు.

నేడు విశాఖలో 'సిడ్స్' సదస్సు ప్రారంభం

గుంటూరు మెడికల్: క్లినికల్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సిడ్స్) ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్ సదస్సును శనివారం విశాఖపట్నంలో ప్రారంభిస్తున్నట్లు ప్రముఖ ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, సిడ్స్ ప్రెసిడెంట్, గుంటూరు హెల్ప్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కోనగంటి కల్యాణ చక్రవర్తి తెలిపారు. అరండల్‌పేటలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన సదస్సు వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిజీషియన్లు, క్రిటికల్ కేర్ స్పెషలిస్టులు, మైక్రో బయాలజిస్టులు, పీజీ వైద్య విద్యార్థులు సదస్సుకు హాజరవుతారని పేర్కొన్నారు. విశాఖపట్నం హోటల్ గ్రీన్ పార్క్‌లో జరిగే సదస్సులో యాంటీబయోటిక్స్‌లో వచ్చిన ఆధునిక మందులు, చికిత్స పద్ధతుల గురించి వివరిస్తారన్నారు. 'రైట్ డ్రగ్ – రైట్ టైమ్– రైట్ స్టేజ్' అనే నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పశ్చిమగోదావరి దంపతులు వారణాసిలో ఆత్మహత్య

కాళ్ల: పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు వీమల్లు గంగారావు (75), అప్పాయమ్మ (70) వారణాసిలో గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లిన వీరు అక్కడే చనిపోవాలని నిర్ణయించుకున్నారు. అక్కడ పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. దీనిపై వారణాసి పోలీసులు భీమవరం పోలీసులకు సమాచారం అందించారు. ఈ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాళ్ల పోలీసులు మృతుల బంధువులకు శుక్రవారం సమాచారం అందించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ మండలానికి చెందిన విద్యార్థినికి ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై ఏలూరు రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక ప్రాంతానికి చెందిన ఘంటసాల వెంకట శ్రీనివాస్ మండలానికి చెందిన బాలికతో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం పెంచుకున్నాడు. బాలికను ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మించాడు. ఈ నెల 18న బాలికను తనతో తీసుకెళ్లి యువకుడి బంధువు ఇంట్లో ఉంచాడు. 19న రాత్రి వేళ బాలిక తన ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు శుక్రవారం ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ఆదేశాలతో ఏలూరు రూరల్ ఎస్‌ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాధితుల అణచివేత.. దారుణాల దాచివేత

కుప్పంలో మహిళలపై వరుస దౌర్జన్యాలు

ముఖ్యమంత్రి ఇలాకాలో పేట్రేగిపోతున్న పచ్చ మూకలు | ఏడాదిలో వెలుగు చూసిన మూడు దారుణాలు | నిందితులతో పాటు బాధితుల పైనా కేసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నా, హోం మంత్రిగా ఓ మహిళ ఉన్నా కుప్పంలో మహిళలకు మాత్రం రక్షణ కరువైంది. 'రెడ్ బుక్' పాలనలో రాజ్యాంగం, చట్టాలు, విలువలను గాలికి వదిలేసి పచ్చ శాసనాలనే అధికార యంత్రాంగం పాటిస్తోంది. తాము ఏం చేసినా అడిగేవారు లేరనే విచ్చలవిడితనంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆటవికంగా ప్రవర్తిస్తున్నారు. మహిళలపై కనీస గౌరవం, కనికరం లేకుండా దౌర్జన్యకాండను కొనసాగిస్తున్నారు. కుప్పం మున్సిపాలిటీలోని ఒకటవ డివిజన్ నారాయణపురంలో రూ.80 వేల అప్పును తీర్చటం ఆలస్యమైందని శిరీష అనే మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన విషయం సంచలనంగా మారింది. ఆమెను బూతులు తిడుతూ, కొడుతూ, తన చంటి బిడ్డ ఏడుస్తున్నా కనికరం చూపని వైనాన్ని కొందరు స్థానికులు వీడియో తీయటంతో విషయం వెలుగులోకి వచ్చింది. సోమవారం జరిగిన ఈ దురాగతం మీడియాలో ప్రముఖంగా రావటంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు పూనుకున్నప్పటికీ బాధితురాలికి జీవిత కాలం మరువలేని దారుణమైన అవమానంగా ఈ ఘటన మిగిలింది. భర్త చేసిన అప్పును సకాలంలో తీర్చలేదని టీడీపీకి చెందిన మునికన్నప్ప కుటుంబం ఈ నీచమైన చర్యకు పాల్పడింది. అధికారంలోని తమను అడిగేవారు లేరనే అహంతో మానవత్వం మరచి రెచ్చిపోయారు.


నారాయణపురంలో తాళ్లతో శిరీషను చెట్టుకు కట్టేసిన వైనం(ఫైల్)

వెంకటేష్‌పురంలోనూ అదే దారుణం

శాంతిపురం మండలం మఠం పంచాయతీ వెంకటేష్‌పురంలో ముగ్గురు మహిళలు, ముగ్గురు బాలికలపై గత నెల 31న హేయమైన రీతిలో దాడి జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరి మధ్య ఉన్న ఆస్తుల వివాదంలో స్థానిక టీడీపీ నాయకుడు సల్లాపురి జోక్యం చేసుకుని ఈ దారుణానికి ఒడిగట్టారు. పార్వతమ్మ కుటుంబానికి తన తోటి కోడలు అనసూయమ్మతో ఉన్న వివాదంలో పచ్చ మూక రౌడీయిజానికి దిగి మహిళలు, బాలికలను చితకబాదింది. పార్వతమ్మ, ఇందిరమ్మలతో పాటు బాలికలు ఉమాదేవి, ఉషారాణి, శ్వేతలను విచక్షణారహితంగా కొట్టారు. దీనికి సంబంధించిన వీడియోలు బయటకు రావడంతో పోలీసులు టీడీపీ నాయకుడి వర్గీయులతో పాటు బాధిత వర్గంలోని నలుగురి మీద కేసులు నమోదు చేశారు.


వెంకటేష్‌పురంలో మహిళలపై టీడీపీ నాయకుల దాడి(ఫైల్)

అప్పు తీర్చలేదని మహిళ నిర్బంధం

కడపల్లి పంచాయతీలోని పోడూరుకు చెందిన వ్యక్తి అప్పు తీర్చలేదని తన భార్యను మండల కేంద్రంలో నిర్బంధించిన ఘటన ఫిబ్రవరిలో జరిగింది. పోడూరుకు చెందిన తిరుపతి అనేవ్యక్తి తుమ్మిశికి చెందిన ఓ టీడీపీ నాయకుడి వద్ద అప్పు తీసుకున్నాడు. ఫిబ్రవరి 15న భార్య ఆరతితో కలిసి శాంతిపురానికి వచ్చిన తిరుపతితో అప్పు విషయమై టీడీపీ నాయకుడు గొడవ పెట్టుకున్నాడు. అప్పు తీర్చేసి భార్యను తీసుకుపొమ్మని ఆరతిని లాక్కెళ్లి గదిలో బంధించాడు. ఈ ప్రయత్నంలో ఆమె బట్టలు కూడా చిరిగిపోయాయి. ప్రతిఘటిస్తుండగా భర్త తిరుపతి తలపై నిందితుడు ఇనుప రాడ్డుతో కొట్టడంతో గాయమైంది. విషయం తెలుసుకున్న బాధితుల బంధువులు పెద్ద సంఖ్యలో మండల కేంద్రానికి చేరుకోవటంతో పరిస్థితి చేయి దాటుతోందని గమనించి ఆరతిని విడిచిపెట్టాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో కేసు నమోదు కాలేదు. రూ 2.20 లక్షలు బాధితులు ఇచ్చేలా పచ్చ పెద్ద మనుషులు సెటిల్మెంట్ చేశారు. ఇలా వరుసగా కుప్పంలో మహిళలపై పసుపు చొక్కాల దౌర్జన్యకాండ కొనసాగుతోంది.


శాంతిపురంలో టీడీపీ నాయకుడు నిర్బంధించిన ఆరతి(ఫైల్)

దళారుల పంట పండుతోంది!

దళారీ వ్యవస్థ.. ఉద్యాన పంటల మార్కెట్‌ను శాసిస్తోంది. వారు చెప్పిందే ధర. మార్కెట్‌ను తమ కనుసన్నల్లోనే నడుపుతున్నారు. గతంలో దళారీ అంటే రైతుకు, వ్యాపారులకు మధ్య వారధిలా వ్యవహరిస్తూ ఇరువురిని ఒప్పించి పదో పరకో సంపాదించుకునేవారు. అయితే ప్రస్తుతం సీను మారిపోయింది. బొప్పాయి, అరటి, మిరప, పసుపు, తమలపాకులు.. ఇలా ఉద్యాన పంట ఏదైనా వారు చెప్పినట్లు రైతులు, వ్యాపారులు వినాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు కమీషన్ మీద ఆధారపడిన వీరు చివరకు వ్యాపారుల మాటున రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు.


అరటి కాయలను ఎగుమతి చేసేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు

రైతుల కష్టం దర్జాగా దోపిడీ | వ్యాపారుల మాటున మోసం చేస్తున్న వైనం | సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్న దళారీ వ్యవస్థ | బొప్పాయి, అరటి రైతులకు తీవ్ర నష్టం

ఆళ్లగడ్డ: అన్నదాతల అవసరాన్ని, అమాయకత్వాన్ని దళారులు ఆదాయ మార్గంగా మార్చుకుని దర్జాగా దోపిడీ చేస్తున్నారు. పంట పండించడం వరకే రైతు హక్కు. మిగతాదంతా దళారుల దయపైనే ఆధారపడి ఉంటోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నంద్యాల జిల్లాలో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతోంది. జిల్లా మొత్తం ఎటు చూసినా అరటి, బొప్పాయి, మామిడి, నిమ్మ, దానిమ్మ, కర్బూజ, మామిడి, జామ, సపోట, దానిమ్మ, కలింగర (పుచ్చ).. వంటి పండ్ల తోటలతో పాటు పసుపు, మిరప వంటి ఉద్యాన పంటలు సైతం విపరీతంగా సాగవుతున్నాయి. ఎక్కువగా ఆళ్లగడ్డ, డోన్, నంద్యాల తదితర ప్రాంతాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో బొప్పాయి 20 వేల ఎకరాలు, అరటి 40 వేల ఎకరాలు, నిమ్మ 5 వేల ఎకరాల్లో ఉంది. అయితే ఇందులో ఆళ్లగడ్డ ప్రాంతంలోనే అత్యధికంగా అరటి పంట 20,224 ఎకరాలు, బొప్పాయి 10,428 ఎకరాలు, నిమ్మ 3,500 ఎకరాల్లో సాగులో ఉంది. ఈ పంటల సాగుకు పెట్టుబడి ఏటేటా రెట్టింపు అవుతోంది. ఉద్యాన పంట ఏదైనా దిగుబడులు విక్రయించే సరికి రైతులకు చివరకు మిగిలేది నష్టం.. దుఃఖమే. దళారులు అన్నదాతల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నారు. మార్కెట్‌లో ధర లేదంటూ కథలు చెబుతూ మద్దతు ధర దక్కకుండా చేస్తున్నారు. ప్రభుత్వం జిల్లాలో ఎక్కడా మార్కెటింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో దిగుబడులు బాగున్నా ధర ఆశించిన మేర లభించకపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో బొప్పాయి టన్ను రూ. 20 వేలు ఉండగా ప్రస్తుతం రూ. 4 నుంచి రూ. 5 వేలకు ధర పడిపోయింది. అరటి టన్ను రూ .26 వేల ధర పలకగా దళారులంతా సిండికేట్‌గా మారి ప్రస్తుతం రూ. 4 వేలకు కొనుగోలు చేస్తున్నారు.

గద్దల్లా వాలిపోతారు..

అరటి, బొప్పాయి పంటలు సాగు చేయాలంటే ఎకరాకు కనీసం రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు, తెగుళ్ల, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను బతికించుకున్నా దిగుబడి విక్రయ సమయానికి దళారులు గద్దల్లా వచ్చి వాలిపోతారు. వ్యాపారులు అస్సలు గ్రామాల్లో కనిపించక పోయేసరికి దళరులు నిర్ణయించిన మేరకు పంటను విక్రయించాల్సి వస్తోంది. తమకు ఉపాధి కల్పిస్తూ తమ కుటుంబానికి కడుపునిండా అన్నం పెడుతున్నారన్న జాలి కూడా లేకుండా పుడమి పుత్రులను నిట్ట నిలువునా ముంచేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసి పంట పండించిన వారికి దళారుల (కమీషను దారులు) కారణంగా పెట్టుబడులు కూడా దక్కని దయనీయ పరిస్థితి నెలకొంటుంది.

రూ. కోట్లు దళారుల పాలు

జిల్లాలో వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. అయితే ఏ పంటకు సంబంధించిన దిగుబడిని విక్రయించుకునేందుకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా మార్కెటింగ్ సౌకర్యం లేదు. అరటి, బొప్పాయిలే 60 వేల ఎకరాల వరకు సాగులో ఉంది. ఎకరాకు 40 టన్నుల దిగుబడి వచ్చిన 24 లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్నుకు రూ. 2 వేల వరకు కమీషన్ అనుకున్నా ఏకంగా రూ. 48 కోట్ల వరకు దళారులు చెమటచుక్క బయటకు రాకుండా దోచుకుంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ మోసంపై దృష్టి సారించి స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

వ్యాపారులను రానివ్వకుండా..

గత పదేళ్ల క్రితం వరకు బొప్పాయి, అరటి సీజన్ ప్రారంభమవడానికి ఓ నెల ముందు నుంచే ఈ ప్రాంతం వ్యాపారులతో కళకళలాడేది. ముంబాయి, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, కలకత్తా తదితర ప్రాంతాలకు చెందిన వారితో పాటు నేపాల్, చైనా వంటి ఇతర దేశాలకు చెందిన పెద్ద పెద్ద వ్యాపారులు సైతం చాగలమర్రి, ఆళ్లగడ్డ, ఆలమూరు, నంద్యాల ప్రాంతాల్లో నెలల తరబడి మకాం వేసి దళారుల మధ్య వర్తిత్వంతో దిగుబడి కొనుగోలు చేసేవారు. అయితే ఇప్పుడు దళారులే వ్యాపారుల అవతారమెత్తి అసలు వ్యాపారులను రైతుల వద్దకు వెళ్లనీయకుడా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దళారులంతా సిండికేట్‌గా మారి ధరను నిర్ణయించి రైతులను మోసం చేస్తున్నారు.


బొప్పాయి కోత కోసి ప్యాక్ చేస్తున్న దృశ్యం

కష్టం రైతులది.. సంపాదన దళారులది



5 ఎకరాలు బొప్పాయి సాగు చేయాలంటే సుమారు రూ. 10 లక్షల వరకు ఖర్చు అవుతుంది. పెట్టుబడి వస్తే చాలనీ అనుకుంటాం. కాని దళారులు నెల, రెండు నెలల్లో ఐదెకరాల సరుకుతో కనీసం రూ.3 లక్షలు సంపాదిస్తాడు. వారు అడిగిన ధరకు ఇవ్వాల్సిందే. లేకుంటే తోటలోనే మాగిపోతాయి. అధికారులు చర్యలు తీసుకుని దళారుల దందాను అరికట్టాలి.

– రాంగురెడ్డి, రైతు

లేటరైట్ రైట్ రైట్..

- నాగులకొండ అటవీ ప్రాంతంలో కొండలు పిండి
- చినబాబు కనుసన్నల్లో మైనింగ్
- మెట్టలో సహజ వనరుల దోపిడీ
- గిరిపుత్రులకు గుండు సున్నా
- ఉపాధీ లేదు.. ఉద్యోగాలూ లేవు


గిరిజనాపురం అటవీ ప్రాంతంలో జరుగుతున్న మైనింగ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారం అండతో వేల కోట్ల రూపాయల విలువైన సహజ వనరులు సరిహద్దులు దాటి తరలిపోతున్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో ఉప ప్రణాళికా ప్రాంతమైన వంతాడ సమీపంలోని గిరిజనాపురం నాగులకొండ అటవీ ప్రాంతంలో అక్రమార్కులు కొండలు పిండి చేస్తున్నారు. అధికార పార్టీ అండదండలతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా వందలకొద్దీ టిప్పర్లతో గ్రావెల్, లేటరైట్ తరలించుకుపోతున్నారు.

ఏం జరిగిందంటే..

గిరిజనాపురం అటవీ ప్రాంతంలో సుమారు 250 ఎకరాల్లో 2014లో లేటరైట్ ఖనిజం తవ్వకాలకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఒక ప్రైవేటు కంపెనీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అప్పటి నుంచీ 2019 ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకూ.. అధికార టీడీపీ పెద్దల అండదండలతో అక్కడ పెద్ద ఎత్తున లేటరైట్ తవ్వకాలు విచ్చలవిడిగా సాగాయి. ప్రారంభంలో ఆరేడు వాహనాలతో నడిచిన దందా చివరాఖరుకు 25 వాహనాలతో వందలాది ట్రిప్పులు వేసే స్థాయికి చేరుకుంది. గత ఎన్నికల్లో టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి తిరిగి అధికారంలోకి రావడంతో ఇప్పుడు మళ్లీ గిరిజనాపురం పరిసర ప్రాంతాల్లోని కొండలను పిండి చేసేస్తున్నారు. లేటరైట్‌ను తవ్వితీసి ప్రత్తిపాడు మండలం ఆర్లధార డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. దీంతోపాటు తొండంగి మండలం రావికంపాడు వద్ద మరో డంపింగ్ యార్డు కూడా ఉంది. రావికంపాడు యార్డు నుంచి రైల్వే వ్యాగన్ల ద్వారా టన్నుల కొద్దీ లేటరైట్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో మైనింగ్ జరుగుతున్నా వంతాడ, గిరిజనాపురం ప్రాంతాల గిరిజనులకు ఒరిగిందేమీ లేదని గిరిజన సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. కొండలనే నమ్ముకున్న తమ నోటి దగ్గర కూడు కూడా కబళించేస్తున్నారని అడవి బిడ్డలు ఆందోళన చెందుతున్నారు.

రోజుకు 440 ట్రిప్పులు

ఈ రెండు డంపింగ్ యార్డులకు రోజుకు ఒక్కో టిప్పర్‌తో సుమారు 20 ట్రిప్పుల చొప్పున లేటరైట్ తరలిస్తున్నారు. ఈవిధంగా రోజుకు 25 వాహనాలతో తక్కువలో తక్కువ 440 ట్రిప్పుల వరకూ లేటరైట్ తరలిస్తున్నారని అంచనా. నిబంధనలు తుంగలో తొక్కి ఒకో టిప్పర్‌లో 30 టన్నులకు మించి తరలిస్తున్నారు. గిరిజనాపురం అటవీ ప్రాంతంలో నాలుగు ఆధునిక యంత్రాలతో లేటరైట్ తవ్వుతున్నారు. గతంలో రెండు క్రషర్లు పని చేస్తే ఇప్పుడు మరో రెండింటిని జోడించారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా పదుల సంఖ్యలో టిప్పర్లు భారీ లోడుతో దుమ్ము రేపుతూ వెళుతుంటే ప్రమాదాలు జరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చినబాబు కనుసన్నల్లోనే విశాఖకు చెందిన అధికార పార్టీల కీలక ప్రజాప్రతినిధి అనుచరులు అనుమతికి మించి కొండలను పిండి చేసేస్తున్నారని మండిపడుతున్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



వంతాడ పరిసర అటవీ ప్రాంతంలోని గిరిజనులకు 30 ఏళ్లగా పోడు భూముల పట్టాలు ఇవ్వడం లేదు. ఆ భూములను ప్రైవేటు సంస్థలకు లీజులకు ఇస్తూ రూ.కోట్ల విలువైన ఖనిజ సంపదను రాత్రి, పగలు అనే తేడా లేకుండా తవ్వేసి, తరలించుకుపోతున్నారు. ఫలితంగా వ్యవసాయ భూములతో కళకళలాడాల్సిన భూములు భారీ గోతులతో అగాధాల్లా మిగులుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి.

– కొసిరెడ్డి గణేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి సీపీఐ (ఎంఎల్ – వినోద్ మిశ్రా)


నిబంధనలకు విరుద్ధంగా రాత్రిపూట టిప్పర్‌లోకి లేటరైట్ లోడింగ్


లేటరైట్‌తో క్యూ కట్టిన టిప్పర్లు

చిత్రం చెప్పిన కథ





యోగా చేద్దామా

పిల్లలూ... యోగా అంటే శరీరాన్ని, మనసును ఆరోగ్యంగా ఉంచగలిగే గొప్ప వ్యాయామ కళ. యోగ మన దేశంలో పుట్టింది. యోగా నేర్చిన వారు, యోగాసనాలను సాధన చేసే వారు ఇతరుల కంటే చురుగ్గా, ఆరోగ్యంగా ఉండటం ప్రూవ్ అయ్యింది. హైస్కూల్ వయసు నుంచే యోగాలో ప్రవేశం ఉంటే, యోగాను అలవాటుగా మార్చుకుంటే చదువుకు మంచిది... ఆరోగ్యానికి ఇంకా మంచిది. జూన్ 21 ఇంటర్నేషనల్ యోగా డే. దేశవ్యాప్తంగా అనేక ఈవెంట్స్ జరుగుతున్నాయి. ఇక్కడ మీరు చూస్తున్నది యోగా డే కోసం అమృత్‌సర్‌లో సాధన చేస్తున్న బాలలు. వీరి ఆసనాలు సూపర్బ్‌గా ఉన్నాయి కదూ. మీరు యోగా నేర్చుకోవడం మొదలెట్టండి.

బాల కవులు గిన్నిస్‌కు ఎక్కారు

మీకు కవితలు చదవడం మీకు ఇష్టమా? మీరు ఎప్పుడైనా ఒక కవిత రాశారా? రాసేందుకు ప్రయత్నించారా? కవిత్వం రాయడం ఒక కళ. సాధన చేస్తే అందరూ కవిత్వం రాయొచ్చు. ముఖ్యంగా చిన్నవయసులో కవిత్వం రాయడం ద్వారా మేధోశక్తి, భాషాపటిమను పెంచుకోవచ్చు. అలా చేసేవారిని 'బాల కవులు' అంటారు. మీరొక్కరే కాకుండా మీతోపాటు మీ స్నేహితులంతా కవితలు రాస్తే మరింత బాగుంటుంది కదా? ఇదే ఆలోచన వచ్చింది ఒక రచయిత్రికి. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసి పిల్లలందరి చేతా కవిత్వం రాయించింది.

యూకేకు చెందిన రచయిత్రి లారా ముచా అనే ఆవిడకు కవిత్వం అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా పిల్లలు రాసే కవిత్వంలో ఎంతో నిజాయితీ, సృజనాత్మకత ఉంటాయని నమ్మకం. అలా కవిత్వం రాసే వారినందరినీ ఒకచోట చేర్చి వారి చేత కవిత్వం రాయించాలని భావించారు. 3 అక్టోబర్ 2024న ఆ దేశ కవిత్వ దినోత్సవం సందర్భంగా భారీ కవితోత్సవం నిర్వహించారు. యూకే, స్పెయిన్, నైజీరియా, ఫిలిప్పీన్స్ దేశాల నుండి 7-12 సంవత్సరాల వయస్సు గల 43,516 మంది పిల్లల్ని ఒక చోటకు చేర్చి అందరి చేతా కవిత్వం రాయించారు. అందులో ఆమె కొడుకు కూడా పాల్గొనడం విశేషం.

అయితే అందరికీ కవిత్వం రాయడం రాకపోవచ్చు. మరి ఎలా? అందుకే ఆమె ఒక ఆలోచన చేశారు. 'జీవితంలో ఏది ముఖ్యమైనదని మీరు అనుకుంటున్నారు?' అని వారికో ప్రశ్న వేసి, సమాధానపత్రం ఇచ్చారు. వారు రాసిన సమాధానలన్నీ కలిపి ఆమే ఓ అందమైన కవిత తయారు చేశారు. అనంతరం ఆ పిల్లలందరికీ ఆమె ధ్రువపత్రాలు అందజేశారు. వారి ప్రయత్నాన్ని మెచ్చి గిన్నిస్ ప్రతినిధులు రికార్డు అందించారు. ఇదంతా చదివాక మీకు కూడా కవితలు రాయాలని ఉందా? ఆలస్యమెందుకు? వెంటనే కవిత్వం రాయడం మొదలుపెట్టండి. త్వరలోనే మీరు కూడా మరో గిన్నిస్ రికార్డు సాధించవచ్చు.

వండర్ కిడ్స్










అప్పు... ఓ సూపర్ ఏనుగు

హాయ్ కిడ్స్... మీరెప్పుడైనా ఏనుగమ్మా ఏనుగు మా ఊరొచ్చింది ఏనుగు అని పాడుకున్నారా? ఏనుగును చూస్తే ప్రేమ, ఇష్టం, ఫ్రెండ్‌షిప్ ఫీలింగ్ వస్తుంది కదూ. ఏనుగు ఎక్కాలనిపిస్తుంది కదూ. అందుకే ఏనుగు క్యారెక్టర్‌తో సినిమాలు వస్తుంటాయి మీ కోసం. ఇప్పుడు చెప్పబోయే సినిమా ఒక ఏనుగు పిల్ల క్యారెక్టర్‌తో తయారయ్యింది. సినిమా పేరు 'అప్పు'. ఇందులో ఏనుగు పిల్ల చేసే అడ్వెంచర్స్ భలేగా ఉంటాయి. ఈ సినిమా స్టోరీ సూపర్ ఎంగేజింగ్ గా ఉంటుంది. అప్పు అనేది ఈ సినిమాలోని ఏనుగు పిల్ల పేరు. అప్పు తన తండ్రిని వేటగాళ్ల బారి నుంచి కాపాడేందుకు దట్టమైన అడవుల మీదుగా అడ్వెంచరెస్ జర్నీ చేస్తుంది. ఇదే జర్నీలో అప్పు ఎన్నో ప్రాబ్లమ్స్‌ని ఫేస్ చేస్తుంది. అంతేకాదు ఈ జర్నీలో అప్పుకు నమ్మకమైన ఓ కుక్క తోడుగా నిలిచి అప్పూకి హెల్ప్ చేస్తూంటుంది. అప్పూ ఒక్కో ప్రాబ్లమ్‌ని సాల్వ్ చేస్తూ వెళ్తుంటే భలే థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఇదో యానిమేటెడ్ ఫిల్మ్. ప్రైమ్ వీడియోలో ఉంది చూడండి.

- ఇంటూరు హరికృష్ణ



మన సినిమా

అదొక బుల్లి థియేటర్

పిల్లలకే స్పెషల్ షో

పిల్లలూ! మీరు సినిమాలు చూడాలంటే అమ్మానాన్నలతో కలిసి థియేటర్‌కు వెళ్తారు. వారిద్దరి మధ్యన సీటులో కూర్చుని చూస్తారు. అయితే మీ కోసమే ప్రత్యేకంగా ఓ థియేటర్ ఉంటే ఎలా ఉంటుంది? అక్కడ కేవలం మీకోసం రూపొందించిన సినిమాలు ప్రదర్శిస్తే ఎలా ఉంటుంది? ఈ ఆలోచన చాలా బాగుంది కదా? ఇదే ఆలోచన వచ్చింది ఆల్ఫ్రెడో అన్నిబాలీ అనే ఆయనకు.

ఇటలీ దేశంలోని రోమ్‌కు చెందిన ఆయన 1934లో మిక్కీమౌస్ కార్టూన్‌లను చూశారు. అవి పిల్లల్ని ఎంతగానో ఆకట్టుకోవడం గమనించారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఓ థియేటర్ కట్టాలని ఆయనకు ఆలోచన వచ్చింది. విల్లా బోర్గీస్ నడిబొడ్డున 'సినిమా టోపోలినో' పేరుతో ఓ థియేటర్ నిర్మించారు. అనంతరం దాని పేరును 'సినిమా డీ పిక్కోలి'గా మార్చారు. ఇది అన్ని థియేటర్లలా భారీగా ఉండదు. ఇందులో కేవలం 62 సీట్లే ఉంటాయి. ప్రధానంగా పిల్లలే ఇందులో ప్రేక్షకులు. వారికోసం సినిమాలు వేస్తారు. రాత్రిపూట యురోపియన్, హాలీవుడ్ చిత్రాలు కూడా ప్రదర్శిస్తారు. ఈ థియేటర్ ప్రపంచంలోనే అతి చిన్న సినిమా థియేటర్‌గా గిన్నిస్ రికార్డ్ సొంతం చేసుకుంది. ఆకుపచ్చ రంగులోని ఈ భవనాన్ని చూసేందుకు నిత్యం ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తుంటారు. రోమ్‌ను సందర్శించే వారు తప్పకుండా ఈ థియేటర్‌కు వస్తారు.





మహనీయులు

చిత్రకళకు రారాజు... అడివి బాపిరాజు




పిల్లలూ... తెలుగు నేల మీద ఎంతోమంది అద్భుతమైన చిత్రకారులు జన్మించారు. జాతికి వారంతా వన్నె తెచ్చారు. అటువంటి వారిలో అడివి బాపిరాజు ఒకరు. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు, నాటకకర్త, చిత్రకారుడు. బాపిరాజు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 1895లో జన్మించారు. అక్కడే హైస్కూలులో చదివి, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో బి.ఏ చదివి, మద్రాస్ లా కాలేజీలో బి.ఎల్ పట్టా పొందారు. కొంతకాలం న్యాయవాదిగా పనిచేశాక బందరు నేషనల్ కాలేజీలో ప్రిన్సిపల్‌గా పనిచేశారు.

బాపిరాజుకు చిన్ననాటి నుండి కవితలు రాసే అలవాటు ఉండేది. ఆ క్రమంలో 'బాపిరాజు' అనే నవల రాశారు. 1922లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు. తన జైలు జీవితానుభవాలతో 'తొలకరి' అనే నవల రాశారు. చిత్రకళలో ఆయనది అందె వేసిన చెయ్యి. ఆయన చిత్రాలలో సముద్రగుప్తుడు, తిక్కన ప్రసిద్ధి పొందాయి. బాపిరాజు చిత్రించిన 'శబ్ద బ్రహ్మ' అనే చిత్రం డెన్మార్క్ ప్రదర్శనశాలలో ఉంది. 1951లో అప్పటి మద్రాసు ప్రభుత్వం కోరికపై శ్రీలంకలోని సిగిరియా కుడ్య చిత్రాల ప్రతికృతులను చిత్రించారు. బాపిరాజు రచనల్లో నారాయణరావు, తుఫాను, గోన గన్నారెడ్డి, కోనంగి, హిమబిందు తదితర నవలలు ప్రసిద్ధి పొందాయి. అనేక రేడియో నాటికలు, కథలు రాశారు. పిల్లలంతా పాడుకునే 'బావా బావా పన్నీరు' ఆయన రాసిందే. గోదావరి నది విశిష్టతపై 'ఉప్పొంగి పోయింది గోదావరి' అనే పాట రాశారు. మీరాబాయి, అనసూయ, ధ్రువ విజయం, పల్నాటి యుద్ధం వంటి చిత్రాలకు కళాదర్శకుడిగా పనిచేశారు. 1952 సెప్టెంబరు 22న మరణించారు.


పుస్తకాలు

చిన్నారి బాలిక అంతరంగ తరంగం



జర్మనీకి చెందిన అన్నాఫ్రాంక్ అనే బాలిక యూదురాలిగా పుట్టినందుకు తన కుటుంబంతోపాటు రహస్య జీవితం గడపవలసివచ్చింది. ఆ చిన్నఇంటిలో ఎవరికీ తెలియకుండా నెలలపాటు గడిపిన జీవితానుభవాలన్నీ డైరీలో రాసుకుంది. కొంతకాలానికి అనారోగ్యంతో మరణించింది. ఆ డైరీలోని అనుభవాలన్నీ ఆ తర్వాత పుస్తకంగా మారి ప్రపంచవ్యాప్తంగా పేరు పొందాయి. పిల్లలంతా తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.

పిల్లల్ని అలరించే పిల్లి కథ



అమెరికన్ రచయిత డాక్టర్ స్యూస్ 1957లో రాసిన పిల్లల పుస్తకం ఇది. ఓ వర్షాకాలం రోజున సాలీ, ఆమె తమ్ముడు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు 'ది క్యాట్' అనే పిల్లి కనిపిస్తుంది. వారిని అలరించడానికి పిల్లి రకరకాల పనులు చేస్తుండగా, ఆ పిల్లలు పెంచే చేప మాత్రం దీనికి అభ్యంతరం చెబుతుంది. సాయంత్రం దాకా పిల్లి వారిని ఎలా అలరించింది, వారి తల్లి వచ్చేముందు ఏం జరిగిందనేది మిగిలిన కథ. పిల్లలకు ఎంతో నచ్చే రచన ఇది.

కథ

పెసరపప్పు

అనగనగా ఒక ఊరిలో గంగమ్మ అనే ఆవిడ ఉండేది. ఆమె భర్త ఒక దుకాణంలో పని చేస్తూ ఉండేవాడు. అతను తెచ్చే కొద్ది జీతంతోనే ఆమె గుట్టుగా సంసారాన్ని నడిపేది. ఎవరి దగ్గరా చేయి చాచకుండా లౌక్యంగా పనులు చక్కబెట్టేది.

ఒకసారి వాళ్లింటికి చుట్టాలు వస్తున్నారని కబురు వచ్చింది. ఇంట్లో సరుకులేమీ లేవు. వచ్చినవారికి ఏం వండి పెట్టాలా అని ఆలోచిస్తుండగా డబ్బాలో ఎప్పుడో దాచిన పెసరపప్పు కనిపించింది. వచ్చినవారికి అదే వండి పెట్టాలని అనుకొని బయటకు తీసింది. నీళ్లలో నానబెట్టి, ఆ తర్వాత ఎండలో ఆరబెట్టింది. కాసేపటికి కొన్ని కాకులు ఆ పప్పును కాళ్లతో తొక్కి, తింటూ ఎంగిలి చేశాయి.

గంగమ్మ పరిగెత్తుకుంటూ వచ్చి వాటిని తరిమింది. కాకులు ఎంగిలి చేసిన పప్పుతో అతిథులకు వంట వండిపెట్టడం ఆమెకు మనస్కరించలేదు. కానీ ఏదైనా కొందామంటే చేతిలో డబ్బు లేదు. వెంటనే ఓ ఉపాయం ఆలోచించి, ఆ పప్పును మూటగట్టి వీధి చివరున్న ఓ ఇంట్లోకి వెళ్లింది. ఆ ఇంటి ఇల్లాలు చాలా అమాయకురాలని పేరు.

గంగమ్మ ఆమె దగ్గరికి వెళ్లి, తన దగ్గరున్న పప్పు చూపించి 'నాణ్యమైన పెసర పప్పు. ఇప్పుడే కడిగి ఆరబోశాను. మా ఆయనకు ఇవాళ వేయించిన పప్పు తినాలని ఉందంట. కానీ ఇప్పుడు దీన్ని వేయిస్తే బాగుండదు. దీన్ని నువ్వు తీసుకొని నీ దగ్గరున్న పప్పు ఇస్తావా?' అని అడిగింది.

అవతలున్న ఇల్లాలు చాలా సంతోషించింది. 'హయ్యో! ఈ గంగమ్మ ఎంత పిచ్చిది! కడిగి, ఆరబెట్టిన పప్పు ఇచ్చి దుమ్ముతో ఉండే పప్పు అడుగుతోంది' అని అనుకొని ఆ పప్పు తీసుకొని తన దగ్గరున్న పప్పు గంగమ్మకు ఇచ్చి పంపింది. ఇదంతా ఇంట్లో నుంచి వాళ్లాయన గమనించాడు.

భార్యను పిలిచి, 'పిచ్చి దానా! శుభ్రమైన పప్పును మనకు ఇచ్చి, మన దగ్గరున్న పప్పు అడగటానికి గంగమ్మ అంత తెలివితక్కువ మనిషి కాదు. ఎవరూ ఏదీ మనకు ఊరికే ఇవ్వరు. ఈ పప్పులో ఏదో దోషం ఉండి ఉంటుంది. దాన్ని పారెయ్' అని చెప్పాడు. ఆయన భార్య 'అయ్యో' అనుకుంటూ ఆ పెసరపప్పును పారేసింది.

నీతి: ఎవరూ ఏదీ మనకు ఊరికే ఇవ్వరు. అలా ఇస్తే అందులోని ఆలోచనను గుర్తించాలి.



తేనెటీగల డాన్స్

మీకు తెలుసా?

పిల్లలూ, మనం మన స్నేహితులను మనతో ఆడుకోవడానికి మనం ఎలా పిలుస్తాం? మాటలతోనో, సైగలతోనో పిలుస్తాం కదా! మరి తేనెటీగలు వాటి తోటి ఫ్రెండ్స్ ని పిలవాలంటే ఎలా పిలుస్తాయో అని ఎప్పుడైనా ఆలోచించారా? లేదా! అయితే ఇప్పుడు తెలుసుకుందాం. తేనెటీగలు పువ్వుల ద్వారా తేనెని సేకరిస్తాయి అని మనందరికి తెలుసు. అయితే, అన్ని తేనెటీగలు మూకుమ్మడిగా పువ్వులను వెతకడానికి వెళ్ళవు. ముందుగా స్కౌట్ బీ లేదా కార్మికటీగ వెళ్ళి తేనెకు అనుకూలమైన పువ్వులను కనుగొంటుంది. ఆ తరువాత తేనెపట్టులోకి తిరిగి వచ్చి, తన సహచర తేనెటీగల ముందు ఒక వృత్తాకారంలో తిరుగుతూ, ఆ తర్వాత నడుము కదిలిస్తూ నృత్యం చేస్తుంది. దీనిని 'వాగ్గిల్ డ్యాన్స్' అని అంటారు. ఈ డాన్స్ ద్వారాటీగ తన శరీరాన్ని సూర్యుని దిశకు సంబంధించి ఏ కోణంలో కదిలిస్తుందో, అది పుష్పాలు ఉన్న దిశను సూచిస్తుంది. ఈ విధంగా, ఒకే నృత్యంతో దూరం, దిశ, మరియు కొన్నిసార్లు పుష్పాల నాణ్యత కూడా తెలియజేయస్తాయి. ఈ డ్యాన్స్‌ను 1940లలో ఆస్ట్రియన్ శాస్త్రవేత్త కార్ల్ వాన్ ఫ్రిష్ అధ్యయనం చేసి, దాని రహస్యాలను వెల్లడించారు, దీనికిగాను అతనికి నోబెల్ బహుమతి కూడా లభించింది.



ఐపీవో స్ట్రీట్

సంభవ్ స్టీల్ ట్యూబ్స్ ఐపీవో 24న

- ధరల శ్రేణి షేరుకి రూ. 77–82
- రూ. 540 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ రెసిస్టెన్స్ వెల్డెడ్(ఈఆర్‌డబ్ల్యూ) స్టీల్ పైపుల తయారీ కంపెనీ సంభవ్ స్టీల్ ట్యూబ్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 25న ప్రారంభంకానుంది. 27న ముగియనున్న ఇష్యూకి రూ. 77–82 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 440 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఇష్యూ ద్వారా మొత్తం రూ. 540 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది. ఈక్విటీ జారీ నిధుల రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. దేశీయంగా ఈఆర్‌డబ్ల్యూ స్టీల్ పైపులు, స్ట్రక్చరల్ ట్యూబుల(హాలో సెక్షన్) తయారీలోని కీలక కంపెనీలలో ఒకటిగా సంభవ్ స్టీల్ నిలుస్తోంది.

ఐకాన్ ఫెసిలిటేటర్స్ @ రూ. 85-91

ఈ నెల 24-26 మధ్య ఐపీవో



న్యూఢిల్లీ: చిన్న, మధ్యతరహా కంపెనీ(ఎస్‌ఎంఈ).. ఐకాన్ ఫెసిలిటేటర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 85–91 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 24న ప్రారంభమై 26న ముగియనుంది. ఐపీవోలో భాగంగా 21 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా టెక్నికల్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసులందించే కంపెనీ రూ. 19.1 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కంపెనీ లిస్టింగ్‌కానుంది. ఐపీవో నిధుల్లో రూ. 16 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఎలక్ట్రికల్, క్యాప్టివ్ పవర్, బిల్డింగ్ మేనేజ్‌మెంట్‌తోపాటు వాటర్ ట్రీట్‌మెంట్ సర్వీసులు సమకూర్చుతోంది. అంతేకాకుండా ఫైర్ అండ్ సేఫ్టీ పరికరాలు, ఎలివేటర్లు, ఎస్కలేటర్ల నిర్వహణను సైతం చేపడుతోంది. 2025 మార్చి31కల్లా కంపెనీ 2,000 మందికిపైగా ఆయా విభాగాలలో నిపుణులైన ఉద్యోగులను కలిగి ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-6-2025

విశాఖ	565-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,950.00	3.96
JIOFIN	293.5	3.31
M&M	3,189.90	3.07
BHARTIARTL	1,934.00	3.04
NESTLEIND	2,383.10	2.77

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	4,331.10	-1.21
DRREDDY	1,322.80	-0.25
MARUTI	12,787.00	-0.15
ONGC	251.2	-0.14
AXISBANK	1,216.10	-0.11

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,366
ఎన్ఎస్ఈ	1,59,097
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,27,478
ఎఫ్ఐఐ	+ 7,941
డీఐఐ	- 3,050

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.85 (రాత్రి 11.30కు)	$	73.05 (క్రితం ముగింపు)
బ్రెంట్	77.04 (రాత్రి 11.30కు)	$	78.85 (క్రితం ముగింపు)

ఎయిరిండియాకు డ్రీమ్‌లైనర్ క్రాష్ సెగ

- 20 శాతం పడిపోయిన బుకింగ్స్
- 15 శాతం వరకు తగ్గిపోయిన చార్జీలు



న్యూఢిల్లీ: గతవారం బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలిన నేపథ్యంలో విమానయాన సంస్థ ఎయిరిండియా బుకింగ్స్, చార్జీలు పడిపోయాయి. దేశ, విదేశీ రూట్లలో బుకింగ్స్ 20 శాతం పడిపోగా, చార్జీలు సైతం సగటున 8–15 శాతం తగ్గాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. జూన్ 12న 242 మంది ప్రయాణికులతో అహ్మదాబాద్ నుంచి లండన్‌కి బైల్దేరిన కాస్సేపటికే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఉదంతం తెలిసిందే. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ రూట్లలో బుకింగ్స్ తగ్గడాన్ని గమనించామని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీవో) ప్రెసిడెంట్ రవి గోసాయి తెలిపారు. అంతర్జాతీయ రూట్లలో బుకింగ్స్ 18–22 శాతం, దేశీయంగా 10–12 శాతం మేర తగ్గినట్లు వివరించారు. అయితే, ఇదంతా తాత్కాలికమే కావచ్చని ఆయన పేర్కొన్నారు. ఇక ఇండిగో, ఆకాశతో నేరుగా పోటీ ఉన్న దేశీ రూట్లలో ఎయిరిండియా టికెట్ల చార్జీలు 8–12 శాతం తగ్గినట్లు గోసాయి చెప్పారు. అంతర్జాతీయంగా, ముఖ్యంగా యూరప్, ఆగ్నేయాసియా రూట్లలో చార్జీలు 10–15 శాతం క్షీణించినట్లు వివరించారు.

పలువురు ప్రయాణికులు ఎయిరిండియా ఫ్లయిట్స్‌లో ప్రయాణాలను రద్దు కూడా చేసుకున్నట్లు చెప్పారు. ప్రధానంగా కార్పొరేట్, హై-ఎండ్ లీజర్ ప్రయాణికులు ప్రత్యామ్నాయ విమాన సంస్థలకు మళ్లినట్లు వివరించారు. గత వారం రోజులుగా అంతర్జాతీయ రూట్లలో క్యాన్సిలేషన్లు 15–18 శాతం, దేశీ రూట్లలో 8–10 శాతం స్థాయిలో ఉన్నట్లు గోసాయి చెప్పారు. అయితే, ఎయిరిండియా విమానాలు అంతర్జాతీయ భద్రత ప్రమాణాలను పాటిస్తున్నట్లుగా నియంత్రణ సంస్థలు ధృవీకరిస్తున్న నేపథ్యంలో ఈ పరిస్థితి మారొచ్చని వివరించారు. మరోవైపు, ఎయిరిండియా ఫ్లయిట్స్ బుకింగ్స్ 15–20 శాతం వరకు, చార్జీలు కొన్ని రూట్లలో 10 శాతం వరకు తగ్గినట్లు ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఇన్ ఇండియన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ జనరల్ సెక్రటరీ రాజీవ్ మెహ్రా చెప్పారు.

సాయి లైఫ్‌లో వాటా విక్రయం

డీల్ విలువ రూ. 1,505 కోట్లు

న్యూఢిల్లీ: అసెట్ మేనేజర్ టీపీజీ ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఫార్మా రంగ కాంట్రాక్ట్ రీసెర్చ్, తయారీ కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్‌లో 10 శాతం వాటా విక్రయించింది. బీఎస్ఈ బ్లాక్‌డీల్ వివరాల ప్రకారం షేరుకి రూ. 722 సగటు ధరలో హైదరాబాద్ కంపెనీకి చెందిన 2.08 కోట్ల షేర్లను టీపీజీ ఆఫర్ చేసింది. వీటి విలువ రూ. 1,505 కోట్లు కాగా.. తాజా



లావాదేవీ తదుపరి సాయి లైఫ్‌లో టీపీజీ వాటా 24.73 శాతం నుంచి 14.73 శాతానికి దిగివచ్చింది. ఈ వాటాను నిప్పన్ ఇండియా ఎంఎఫ్, బ్లాక్‌రాక్, సొసైటీ జనరాలి, మోర్గాన్ స్టాన్లీ, యాక్సిస్ ఎంఎఫ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఎంఎఫ్, హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్, యూటీఐ ఎంఎఫ్ తదితర పలు ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు కొనుగోలు చేశాయి. ప్రధానంగా నిప్పన్ ఇండియా ఎంఎఫ్ 2.39 శాతం వాటాకు సమానమైన 49.86 లక్షల సాయి లైఫ్ షేర్లను సొంతం చేసుకుంది. దీంతో ఫార్మా కంపెనీలో నిప్పన్ ఇండియా వాటా 2.48 శాతం నుంచి 4.88 శాతానికి బలపడింది. కాగా.. గతేడాది డిసెంబర్‌లో సాయి లైఫ్ సైన్సెస్ ఐపీవో ద్వారా రూ. 3,043 కోట్లు సమీకరించిన సంగతి తెలిసిందే.

బ్లాక్‌డీల్స్ నేపథ్యంలో సాయి లైఫ్ షేరు బీఎస్ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 766 వద్ద ముగిసింది.

మౌలిక రంగంలో మరింత తగ్గిన వృద్ధి

- మే నెలలో 0.7 శాతానికి పరిమితం
- తొమ్మిది నెలల కనిష్ఠ స్థాయి ఇది

న్యూఢిల్లీ: మౌలిక రంగంలో వృద్ధి రేటు మే నెలలో మరింత క్షీణించి 0.7 శాతానికి పరిమితమైంది. ఇది తొమ్మిది నెలల కనిష్ఠ స్థాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వృద్ధి రేటు ఒక శాతంగా ఉండగా, గతేడాది మే నెలలో 6.9 శాతంగా నమోదైంది. ముఖ్యంగా ఎనిమిది మౌలిక రంగాలకు గాను నాలుగింటిలో ప్రతికూల వృద్ధి (క్షీణత) కనిపించింది. పారిశ్రామికోత్పత్తి సూచీలో ఈ ఎనిమిది రంగాలకు 40 శాతం వెయిటేజీ ఉండడం గమనార్హం. దీంతో మే నెల పారిశ్రామిక ఉత్పత్తి సైతం క్షీణతను చూడనున్నట్టు ఈ డేటా తెలియజేస్తుంది. మే నెలకు సంబంధించి పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గణాంకాలు ఈ నెల 30న విడుదల కానున్నాయి. మే నెలలో ముందస్తు వర్షాలు మౌలిక రంగ పనితీరుపై ప్రభావం చూపించినట్టు తెలుస్తోంది. ఫలితంగా తొమ్మిది నెలల్లో మొదటి సారి వృద్ధి క్షీణతను ఎదుర్కొన్నది. ''మే నెల చివర్లో వర్షాలు, రుతుపవనాలు ముందుగా రావడం విద్యుదుత్పత్తితోపాటు మైనింగ్ రంగాల పనితీరుపై ప్రభావం చూపించి ఉంటుంది''అని ఇక్రా సీనియర్ ఆర్థిక వేత్త రాహుల్ అగర్వాల్ తెలిపారు.



- బొగ్గు ఉత్పత్తి ఏప్రిల్ నెలలో 3.5 శాతంగా ఉంటే, మే నెలలో 2.8 శాతానికి తగ్గింది.
- విద్యుదుత్పత్తి ఐదేళ్లలోనే అత్యంత క్షీణతను చూవిచూసింది. మే నెలలో 5.8 శాతం (మైనస్) క్షీణించింది. ఏప్రిల్ నెలలో విద్యుదుత్పత్తి 1.7 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్, మే) కలిపి చూస్తే మౌలిక రంగంలో వృద్ధి రేటు 0.8 శాతానికి పరిమితమైంది. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో వృద్ధి 6.9 శాతంగా ఉంది.
- స్టీల్ రంగంలో 6.7 శాతం, సిమెంట్ రంగంలో 9.2 శాతం చొప్పున మెరుగైన వృద్ధి రేటు నమోదైంది. ప్రభుత్వ మూలధన వ్యయాలు ఇందుకు సానుకూలించాయి. ఏప్రిల్ నెలలో ప్రభుత్వ మూలధన వ్యయాలు 61 శాతం పెరగడం ఇందుకు నిదర్శనం.
- రిఫైనరీ ఉత్పత్తుల్లో వృద్ధి 1.1 శాతంగా ఉంది. ముడి చమురు ఉత్పత్తిలో 1.8 శాతం ప్రతికూల వృద్ధి నమోదైంది.
- సహజ వాయువు ఉత్పత్తి 3.6 శాతం పడిపోయింది.
- ఫెర్టిలైజర్స్ ఉత్పత్తి సైతం 5.9 శాతం క్షీణించింది.
- ఈ గణాంకాల నేపథ్యంలో మే నెలకు సంబంధించి ఐఐపీ వృద్ధి 2 శాతంలోపు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ నెలకు ఇది 2.7 శాతంగా ఉంది.

వృద్ధికి మద్దతుగానే రేట్ల తగ్గింపు...

- స్పష్టమైన సంకేతం ఇవ్వాలన్నదే ఉద్దేశ్యం
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా
- ఎంపీసీ సమావేశం చర్చా వివరాల వెల్లడి

ముంబై: అంతర్జాతీయంగా ఉద్రిక్తతల నడుమ సెంట్రల్ బ్యాంక్ వృద్ధికి మద్దతుగా నిలుస్తుందన్న స్పష్టమైన సంకేతం ఇవ్వడానికే వడ్డీ రేట్ల కోత నిర్ణయాన్ని తీసుకున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. లిక్విడిటీ పరంగా స్పష్టతకు, వినియోగం, పెట్టుబడులకు ఊతమిచ్చేందుకు వీలుగా రుణ వ్యయాలను తగ్గించడం ఈ నిర్ణయం వెనుక ఉద్దేశ్యాలుగా పేర్కొన్నారు. ఆర్‌బీఐ గవర్నర్



అధ్యక్షతన గల ఆరుగురు సభ్యుల ఎంపీసీ ప్యానెల్ ఈ నెలారంభంలో రెపో, రివర్స్ రెపో రేట్ల కోత నిర్ణయాలు ప్రకటించడం తెలిసిందే. ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన ఎంపీసీ సమావేశంలో చర్చించి, రికార్డు అయిన వివరాలు (మినిట్స్) విడుదలయ్యాయి. ఐదుగురు సభ్యులు 50 బేసిస్ పాయింట్ల మేర రేట్ల కోతకు అనుకూలంగా ఓటు వేశారు. సౌగత భట్టాచార్య మాత్రం 25 బేసిస్ పాయింట్లకు మొగ్గు చూపించారు.

- గత కొన్ని నెలల కాలంలో ద్రవ్యోల్బణం 3 శాతం మేర తగ్గడం (2024 అక్టోబర్‌లో నమోదైన 6.2 శాతం నుంచి 2025 ఏప్రిల్ నెలలో 3.2 శాతానికి), వార్షికంగా ద్రవ్యోల్బణం 3.7 శాతానికి పరిమితం అవుతుందన్న అంచనాల నేపథ్యంలో 50 బేసిస్ పాయింట్లకు అనుకూలంగా గవర్నర్ మల్హోత్రా మొగ్గు చూపించారు.
- అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అస్థిరమైన రేట్ల కోత కంటే.. 50 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించడం విధానపరమైన స్పష్టతకు, వేగవంతమైన బదిలీకి వీలు కల్పిస్తుందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ గుప్తా అభిప్రాయపడ్డారు. తటస్థ విధానానికి సైతం మద్దతు పలికారు.

ప్రత్యామ్నాయ 'మ్యాగ్నెట్స్' వనరులపై టాటా మోటర్స్ కసరత్తు

ముంబై: వాహనాల్లో ఉపయోగించే రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లపై చైనా ఆంక్షల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాటిని సమకూర్చుకోవడంపై ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వంతో కూడా కలిసి పని చేస్తోంది. ప్రస్తుతానికైతే తమ వద్ద తగినంత స్థాయిలో నిల్వలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో సమస్య తలెత్తకుండా మరిన్ని సమకూర్చుకునే మార్గాలపై దృష్టి పెడుతున్నామని కంపెనీ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, షేర్‌హోల్డర్లకు తెలిపారు. ఇక ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధానికి సంబంధించి కంపెనీ వ్యాపారంపై ఎలాంటి ప్రభావాలు పడొచ్చనేది అంచనా వేయడం కష్టమని చెప్పారు. అయితే, గ్రూప్‌లో భాగమైన కమర్షియల్ వాహనాల విభాగం, ప్యాసింజర్ వాహనాల విభాగం, జాగ్వార్‌ల్యాండ్‌రోవర్ పటిష్టంగా ఉన్నాయని చంద్రశేఖరన్ చెప్పారు. స్వల్పకాలికంగా భౌగోళిక-రాజకీయ సవాళ్లేవైనా ఎదురైతే అధిగమించే సామర్థ్యాలు వాటికి ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో భౌగోళిక-రాజకీయ స్పర్ధలు, మిలిటరీ ఉద్రిక్తతలు, టారిఫ్‌లపరమైన సవాళ్లు, కృత్రిమ మేధ మొదలైన వాటి ప్రభావం ఎక్కువగా ఆటోమోటివ్ రంగంలోనే కనిపించవచ్చని చంద్రశేఖరన్ చెప్పారు. ప్యాసింజర్ వాహనాల విభాగాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు విస్తరించే అవకాశాలపై స్పందిస్తూ.. దీనిపై తాము చర్చలు జరుపుతూనే ఉన్నామని, సరైన భౌగోళిక-రాజకీయ పరిస్థితుల కోసం ఎదురు చూస్తున్నామని వివరించారు.



హైదరాబాద్‌లో బ్రిగేడ్ గ్రూప్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్రిగేడ్ గ్రూప్‌లో భాగమైన వర్క్‌స్పేస్ బ్రాండ్ బజ్‌వర్క్స్ హైదరాబాద్‌లో కార్యకలాపాలను బలోపేతం చేసుకుంటోంది. సంస్థకు చెందిన ఆరో ఆర్బిట్‌లో 24,000 చ.అ. వర్క్‌స్పేస్‌ను అంతర్జాతీయ దిగ్గజం ఇన్ఫర్ ఇండియా లీజుకు తీసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో పోర్ట్‌ఫోలియోను 10 లక్షల చ.అ.కు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు బజ్‌వర్క్స్ జీఎం సిద్ధార్థ్ వర్మ తెలిపారు. 2024లో హైదరాబాద్‌లో 12.5 మిలియన్ చ.అ. ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు జరిగాయని, వార్షికంగా చూస్తే ఇది 56 శాతం అధికమని పేర్కొన్నారు. ఐటీ సర్వీసులు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల నుంచి ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంటోందని వివరించారు.

రత్నాభరణాల ఎగుమతులు డౌన్



ముంబై: రత్నాభరణాల ఎగుమతులు మే నెలలో 16 శాతం తగ్గిపోయాయి. 2,263 మిలియన్ డాలర్ల (19,261 కోట్లు) ఎగుమతులు నమోదయ్యాయి. గతేడాది మే నెలలో ఎగుమతులు 2,688 మిలియన్ డాలర్లు (రూ.22,414 కోట్లు)గా ఉన్నట్టు రత్నాభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) ప్రకటించింది. అమెరికా టారిఫ్‌ల అనంతరం వీటి ఎగుమతులు తగ్గిపోవడం గమనార్హం.

- కట్, పాలిష్డ్ వజ్రాల ఎగుమతులు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 35 శాతం తక్కువగా 950 మిలియన్ డాలర్ల మేర నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో వీటి ఎగుమతులు 12,272 మిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం.
- పాలిష్డ్ ల్యాబ్ గ్రోన్ వజ్రాల ఎగుమతులు సైతం 33 శాతం తగ్గి 81 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో వీటి ఎగుమతులు 120 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- బంగారం ఆభరణాల ఎగుమతులు మాత్రం 17 శాతం పెరిగి 997 మిలియన్ డాలర్లకు చేరాయి. క్రితం ఏడాది మే నెలలో బంగారం ఆభరణాల ఎగుమతులు 851 మిలియన్ డాలర్లుగానే ఉన్నాయి.
- వెండి ఆభరణాల ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–మే నెలల్లో 17 శాతానికి పైగా క్షీణించి 150 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.
- కలర్డ్ జెమ్‌స్టోన్ ఎగుమతులు ఏప్రిల్–మే నెలల్లో ఒక శాతం తగ్గి 62 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

అమెరికా టారిఫ్‌ల వల్లే..

''అమెరికా టారిఫ్‌ల వల్ల మొత్తం మీద ఎగుమతులు మే నెలలో 16 శాతం వరకు తగ్గాయి. అయినప్పటికీ బంగారం ఆభరణాల ఎగుమతులు మాత్రం పెరిగాయి. మధ్యప్రాచ్యంలో భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతుండడం బంగారానికి డిమాండ్‌ను పెంచింది''అని జీజేఈపీసీ చైర్మన్ కిరీట్ భన్సాలీ తెలిపారు.

దేశీ ఆటబొమ్మల నాణ్యత భేష్



- 91–98 శాతం ప్రమాణాలకు అనుగుణంగానే
- బీఐఎస్ డైరెక్టర్ అనిల్ కప్రి

ముంబై: దేశంలో 91 శాతం ఆటబొమ్మలు (టాయ్స్) నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగానే ఉన్నాయని భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) డైరెక్టర్ అనిల్ కప్రి తెలిపారు. దేశీ మార్కెట్లో నాణ్యమైన ఆటబొమ్మలు అందుబాటులో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. టాయ్స్‌కు సంబంధించి సరికొత్త నాణ్యత ప్రమాణాలను 2021 జనవరి నుంచి కేంద్ర సర్కారు అమలు చేస్తుండడం గమనార్హం. వీటిని అమలు దిశగా బీఐఎస్ విస్తృతమైన చర్యలు తీసుకున్నట్టు కప్రి చెప్పారు. ధ్రువీకరించిన ఆటబొమ్మలు దేశీయంగా అందుబాటులో ఉండేందుకు వీలుగా.. పరీక్షల కోసం తీసుకునే నమూనాలను బీఐఎస్ ఎప్పటికప్పుడు పెంచుతున్నట్టు చెప్పారు. బీఐఎస్ డేటా ప్రకారం చూస్తే.. ఇప్పటి వరకు 17,680 ఆటబొమ్మల నమూనాలను పరీక్షించి చూడగా, అందులో 16,240 (91 శాతం) నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే ఉన్నట్టు తేలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ 537 నమూనాలను పరీక్షించి చూడగా, వీటిల్లో 98 శాతం ప్రమాణాలకు సరితూగినట్టు స్పష్టమైంది. ఆటబొమ్మల భౌతిక స్వరూపం, వాటి తయారీలోకి హానికారక రసాయనాలు వినియోగించకుండా, వాటి విడి భాగాలను పిల్లలు మింగే ప్రమాదం లేకుండా, అంచులు పదునుగా లేకుండా ఉండేందుకు భద్రతా ప్రమాణాలను బీఐఎస్ రూపొందించి అమలు చేస్తుండడం గమనార్హం. వీటి ప్రకారం దేశీయంగా తయారైనవే కాకుండా, దిగుమతి అయినవి సైతం బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సిందే. బీఐఎస్ ధ్రువీకరణ కలిగిన టాయ్ తయారీ కంపెనీలు దేశంలో 1,640 ఉన్నాయి. ఇందులో 1,165 కంపెనీలు నాన్ ఎలక్ట్రానిక్ ఆటబొమ్మల తయారీకి సంబంధించినవి. 475 సంస్థలు ఎలక్ట్రికల్ టాయ్స్‌ను తయారు చేస్తున్నాయి.

ఈ ఏడాది వృద్ధి 6.2 శాతమే

2025-26 అంచనాలకు ఇక్రా స్వల్ప కోత

కోల్‌కతా: ప్రముఖ రేటింగ్ సంస్థ ఇక్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 6.2 శాతానికి పరిమితం కావొచ్చని అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండడం తెలిసిందే. స్థూల విలువ జోడింపు (జీవీఏ) వృద్ధి సైతం 6 శాతానికి తగ్గొచ్చని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 6.4 శాతంగా ఉంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 3.5 శాతానికిపైనే ఉండొచ్చని ఇక్రా అంచనా వేసింది. టోకు ధరల ద్రవ్యోల్బణం 1.8 శాతంగా ఉంటుందని తెలిపింది. ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతంగా ఉండొచ్చని, కరెంటు ఖాతా లోటు 1.2 శాతంగా ఉంటుందని పేర్కొంది. రబీ పంటల విక్రయంతో వచ్చే డబ్బు, రిజర్వాయర్లలో సాధారణం కంటే అధిక నిల్వలు గ్రామీణ డిమాండ్‌కు మద్దతునిస్తాయని తెలిపింది. బడ్జెట్‌లో కల్పించిన గణీయమైన పన్ను మినహాయింపు ప్రయోజనం, వడ్డీ రేట్ల తగ్గింపుతో ఈఎంఐల భారం దిగిరానుండడం, రిటైల్ ద్రవ్యోల్బణం సైతం తగ్గుముఖం పట్టడం.. గృహ వినియోగ ఆదాయ మిగులును పెంచేవిగా అభివర్ణించింది. ఎగుమతుల్లో ఉన్న స్తబ్దత కొంత కాలం పాటు కొనసాగుతుందని అంచనా వేసింది. వస్తువుల కంటే సేవల ఎగుమతులు మంచి పనితీరు చూపించొచ్చని పేర్కొంది.



భారత్ గురికి తొమ్మిది పతకాలు

ఆసియా కప్ లెగ్-2 ఆర్చరీ టోర్నీ


నాగసాయి షణ్ముఖి, కుశాల్ దలాల్

సింగపూర్: తుది మెట్టుపై తడబడినా... ఆసియా కప్ లెగ్-2 ఆర్చరీ టోర్నమెంట్‌లో భారత్ గొప్ప ప్రదర్శనే చేసింది. శుక్రవారం ముగిసిన ఈ టోర్నీలో భారత ఆర్చర్లు రెండు స్వర్ణ పతకాలు, ఆరు రజత పతకాలు, ఒక కాంస్య పతకంతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలు సంపాదించారు. రికర్వ్, కాంపౌండ్ కేటగిరీల్లో కలిపి మొత్తం 10 ఈవెంట్స్‌లో భారత ఆర్చర్లు ఫైనల్‌కు చేరుకోగా... రెండింటిలో మాత్రమే విజేతగా నిలిచారు.

పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో పారస్ హుడా, జుయెల్ సర్కార్, విష్ణు చౌధరీలతో కూడిన భారత జట్టు 0-6 (49-51, 54-55, 49-55) సెట్ పాయింట్లతో ఫుమియా సైటో, యు ఉరాటా, గకుటో మియాటాలతో కూడిన జపాన్ జట్టు చేతిలో ఓడిపోయి రజత పతకాన్ని దక్కించుకుంది.

రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో వైష్ణవి పవార్-విష్ణు చౌధరీ జోడీ రజతం సాధించింది. ఫైనల్లో వైష్ణవి-విష్ణు ద్వయం 0-6 (33-35, 28-35, 32-35) సెట్ పాయింట్లతో ఆరిఫ్ పంగెస్టు-అయు మరెటా ద్యానరి (ఇండోనేసియా) జంట చేతిలో ఓడిపోయింది.

కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో తేజల్ సాల్వే... కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో కుశాల్ దలాల్ స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. ఫైనల్స్‌లో తేజల్ 146-144 పాయింట్ల తేడాతో నాగసాయి షణ్ముఖి (భారత్)పై, కుశాల్ 149-143 పాయింట్ల తేడాతో మహోన్ జోషువా (ఆస్ట్రేలియా)పై విజయం సాధించారు. కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో సచిన్ చెచి 148-146 పాయింట్ల తేడాతో హిము బచ్చర్ (బంగ్లాదేశ్)పై గెలుపొందాడు.

పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగం ఫైనల్లో మిహిర్, కుశాల్ దలాల్, తిరుమురు గణేశ్‌లతో కూడిన భారత జట్టు 231-235 పాయింట్ల తేడాతో మిర్జామెటోవ్, త్యుతున్, ముసాలతో కూడిన కజకిస్తాన్ జట్టు చేతిలో ఓడిపోయి రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

నాగసాయి షణ్ముఖి, తేజల్, తనీషాలతో కూడిన భారత మహిళల కాంపౌండ్ జట్టు కూడా రజతం నెగ్గింది. ఫైనల్లో టీమిండియా 'షూట్ ఆఫ్'లో 26-29తో మలేసియా బృందం చేతిలో ఓటమి పాలైంది. అంతకుముందు రెండు జట్లు 232-232 పాయింట్లతో సమంగా నిలిచాయి. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో నాగసాయి షణ్ముఖి-కుశాల్ దలాల్ జోడీ రజతం సంపాదించింది. ఫైనల్లో షణ్ముఖి-కుశాల్ ద్వయం 153-155తో ఆదిల్-త్యుతున్ (కజకిస్తాన్) జంట చేతిలో ఓటమి చవిచూసింది.

నెలకు రూ. 25 వేలు

హాకీ ప్లేయర్లకు భత్యం ఇవ్వనున్న కేంద్ర క్రీడా శాఖ

పురుషులు, మహిళలు కలిపి 80 మంది క్రీడాకారులకు లబ్ధి



న్యూఢిల్లీ: భారత హాకీ ప్లేయర్లకు నెలవారీ భత్యం ఇచ్చేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ముందుకొచ్చింది. ఇప్పటి వరకు కేవలం ప్రదర్శన ఆధారంగా మాత్రమే ప్లేయర్లకు నజరానాలు అందుతుండగా... ఇప్పుడు అలా కాకుండా ప్రభుత్వం తరఫున ప్రతి నెల ఒక్కో ప్లేయర్‌కు రూ. 25 వేలు భత్యంగా ఇవ్వాలని క్రీడా శాఖ నిర్ణయించింది. ఈ అంశంపై చాన్నాళ్లుగా చర్చలు జరుగుతుండగా... హాకీ ఇండియా ప్రతిపాదనను కేంద్రం అంగీకరించింది. జాతీయ శిబిరాలకు ఎంపికయ్యే పురుష, మహిళా ప్లేయర్లకు ఈ భత్యం అందించనున్నట్లు వెల్లడించింది. 'ఆటగాళ్లకు నెలవారీ ప్రోత్సాహకంగా భత్యం రూపంలో అందించాలని హాకీ ఇండియా చాలా రోజులుగా కోరుతోంది. వారి డిమాండ్‌కు అంగీకారం తెలిపాం. ప్రతిభ గల ఆటగాళ్లకు అండగా నిలిస్తే మరిన్ని మెరుగైన ఫలితాలు వస్తాయి' అని కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.

- పురుషుల విభాగంలో 40 మంది ఆటగాళ్లు, మహిళల విభాగంలో 40 మంది ప్లేయర్లకు ఈ భత్యాలు అందించనుంది.
- టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)లో భాగంగా గురువారం నిర్వహించిన 'మిషన్ ఒలింపిక్ కమిటీ'లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.
- కోర్ గ్రూప్ ప్లేయర్లకు రూ. 50 వేల చొప్పున దక్కనున్నాయి. దీని వల్ల ప్రభుత్వానికి నెలకు రూ. 20 లక్షలు ఖర్చు కానున్నాయి.
- హాకీ ఇండియా ప్రతి నెలా ప్లేయర్ల జాబితాను క్రీడాశాఖకు పంపనుంది. ఫిట్‌నెస్, ఫామ్ ఆధారంగా ప్లేయర్ల ఎంపిక జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.
- ప్రస్తుతం హాకీ ఆటగాళ్లు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న విభాగాలు, సంస్థలు, బోర్డుల నుంచి జీతాలు పొందుతున్నారు. వీటికి అదనంగా అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన సమయంలో లభించే ప్రైజ్‌మనీని పంచుకుంటున్నారు.
- భారత పురుషుల హాకీ జట్టు గత కొంతకాలంలో ఎంతో మెరుగైంది. 2020 టోక్యో ఒలింపిక్స్, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో వరుసగా కాంస్య పతకాలు సాధించింది. మరోవైపు టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన మహిళల జట్టు... పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేకపోయింది.
- ప్రస్తుతం భారత పురుషుల, మహిళల హాకీ జట్లు ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ యూరోప్ అంచె పోటీల్లో పాల్గొంటున్నాయి. అయితే కఠిన పరిస్థితుల్లో ఇరు జట్లు విజయాలు సాధించలేక ఇబ్బంది పడుతున్నాయి.
- 'టాప్స్'లో భాగంగా హాకీ ఆటగాళ్లకే కాకుండా ఇతర క్రీడలకు చెందిన ప్లేయర్లకు సైతం క్రీడా మంత్రిత్వ శాఖ తాజాగా నిధులు విడుదల చేసింది.
- టెన్నిస్ ఆటగాళ్లు సాకేత్ మైనేని, జీవన్ నెడుంజెళియన్‌తో పాటు మరో ముగ్గురు మహిళా ప్లేయర్లకు కలిపి రూ. 1.38 కోట్లు వేర్వేరు కారణాల కోసం విడుదల చేసింది. మొత్తంగా ఈ భేటీలో అథ్లెట్ల కోసం మొత్తం రూ. 4.28 కోట్ల నిధులు విడుదల చేశారు. ఇందులో పలువురు పారా అథ్లెట్లు కూడా ఉన్నారు.
- ప్రతిభకు పట్టం కట్టే విధానంలో సాంకేతికతను వినియోగించుకోవాలని కేంద్ర క్రీడా శాఖ నిర్ణయించింది. గ్రామీణ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించిన అథ్లెట్లను ఖేలో ఇండియా రీజనల్ సెంటర్‌లలో అవకాశం కల్పించి వారి మెరుగుదలను నమోదు చేయాలని నిర్ణయించింది. వయో విభాగాలను బట్టి ప్రతిభావంతులకు మరింత ప్రోత్సాహం అందించనుంది.

భారత్ X బెల్జియం

నేడు ప్రొ హాకీ లీగ్ పురుషుల, మహిళల మ్యాచ్‌లు

ఆంట్‌వర్ప్ (బెల్జియం): అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొ లీగ్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న భారత పురుషుల జట్టు మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. వరుసగా రెండు రోజుల్లో (శనివారం, ఆదివారం) ప్రపంచ మూడో ర్యాంకర్ బెల్జియంతో టీమిండియా తలపడనుంది. యూరోపియన్ అంచె పోటీల్లో భాగంగా నెదర్లాండ్స్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా జట్ల చేతుల్లో వరుసగా రెండేసి మ్యాచ్‌ల్లో ఓడిన భారత్... ఏదో మ్యాచ్‌లో అయినా గెలుపు బోణీ కొట్టాలని చూస్తోంది. ఈ టోర్నీ ప్రదర్శన ఆధారంగా వచ్చే ఏడాది జరగనున్న హాకీ ప్రపంచకప్‌నకు అర్హత సాధించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌లు టీమిండియాకు కీలకం కానున్నాయి. స్వదేశంలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన భారత్... భారీ అంచనాలతో ప్రారంభించిన యూరోపియన్ టూర్‌లో మాత్రం పరాజయాలతో సతమతమవుతూ... పట్టిక మూడో స్థానం నుంచి ఎనిమిదో స్థానానికి పడిపోయింది. ప్రతి మ్యాచ్‌లోనూ మన ఆటగాళ్లు పోరాట పటిమ కనబరుస్తున్నా... గెలుపు గీత మాత్రం దాటలేకపోతున్నారు. చిన్న చిన్న తప్పిదాలతో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చి ఓటమిని ఆహ్వానిస్తున్నారు. పెనాల్టీ కార్నర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలోనూ టీమిండియా వెనుకబడిపోతోంది. అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో మెరుగు పడితేనే భారత జట్టు నెగ్గే అవకాశం ఉంది. ఇక మహిళల విభాగంలో ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిన భారత్... శనివారం, ఆదివారం బెల్జియం జట్టుతో తలపడనుంది. ప్రస్తుతం భారత్ ఏడో స్థానంలో ఉంది.

హారికకు మూడో స్థానం



సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక మూడో స్థానాన్ని దక్కించుకుంది. మరోవైపు భారత నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టార్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి వరుసగా మూడో ఓటమి చవిచూసి ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. అలీనా కష్లిన్‌స్కాయ (పోలాండ్)తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను హారిక 38 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించి 5 పాయింట్లతో మూడో స్థానాన్ని ఖరారు చేసుకుంది. గత ఏడాది కూడా మూడో స్థానంలో నిలిచిన హారిక ఈ ఏడాది టోర్నీలో కేవలం కోనేరు హంపి చేతిలో ఓడిపోయి... మిగతా ఎనిమిది గేముల్లో రెండింటిలో గెలిచి, ఆరింటిని 'డ్రా' చేసుకుంది. ఆరో రౌండ్ తర్వాత అగ్రస్థానంలో నిలిచిన హంపి వరుసగా మూడు గేముల్లో ఓడిపోయి 4.5 పాయింట్లతో ఐదో స్థానాన్ని పొందింది. ఏడో రౌండ్‌లో కరిసా యిప్ (అమెరికా) చేతిలో, ఎనిమిదో రౌండ్‌లో నినో బత్సియాష్‌విలి (జార్జియా) చేతిలో ఓడిన హంపి 46 ఎత్తుల్లో మరియా ముజీచుక్ (ఉక్రెయిన్) చేతిలో పరాజయం పాలైంది. హంపితోపాటు నానా జాగ్‌నిడ్జె (జార్జియా), బీబీసారా అసబయేవా (కజకిస్తాన్), అలీషా 4.5 పాయింట్లతో ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... నానా జాగ్‌నిడ్జె నాలుగో స్థానంలో, హంపి ఐదో స్థానంలో, బీబీసారా ఆరో స్థానంలో, అలీషా ఏడో స్థానంలో నిలిచారు. పది మంది మేటి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్‌లపాటు ఈ టోర్నీని నిర్వహించగా... 6 పాయింట్లతో కరిసా యిప్ (అమెరికా) చాంపియన్‌గా అవతరించింది. 5.5 పాయింట్లతో అలైస్ లీ (అమెరికా) రన్నరప్‌గా నిలిచింది. విజేత కరిసా యిప్‌నకు 60 వేల డాలర్లు (రూ. 51 లక్షల 96 వేలు), రన్నరప్ అలైస్ లీకి 50 వేల డాలర్లు (రూ. 43 లక్షల 30 వేలు), మూడో స్థానంలో నిలిచిన హారికకు 40 వేల డాలర్లు (రూ. 34 లక్షల 64 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.



లబుషేన్‌కు ఉద్వాసన

విండీస్‌తో సిరీస్‌కు ఆస్ట్రేలియా టెస్టు జట్టు ప్రకటన

బ్రిడ్జ్‌టౌన్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో పేలవ ప్రదర్శన కనబర్చిన ఆస్ట్రేలియా ప్లేయర్ మార్నస్ లబుషేన్ జాతీయ జట్టులో చోటు కోల్పోయాడు. ఈ నెల 25 నుంచి ఆస్ట్రేలియా, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... తొలి టెస్టు కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) శుక్రవారం జట్టును ప్రకటించింది. స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ గాయంతో ఇబ్బంది పడుతుండటంతో తొలి టెస్టుకు అతడిని ఎంపిక చేయలేదు. వికెట్ కీపర్ బ్యాటర్ జోష్ ఇన్‌గ్లిస్, టీనేజ్ ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్‌కు అవకాశం దక్కింది. ఇటీవల లార్డ్స్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో బ్యాటింగ్ వైఫల్యంతో ఆస్ట్రేలియా పరాజయం పాలవడంతో... సెలెక్టర్లు జట్టులో మార్పులు చేశారు. 'డబ్ల్యూటీసీ ఫైనల్లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డ స్మిత్ కోలుకునేందుకు కాస్త సమయం పడుతుంది. రెండో టెస్టు వరకు అతడు జట్టులో చేరొచ్చు. లబుషేన్, స్మిత్ స్థానాలను కొన్‌స్టాస్, ఇన్‌గ్లిస్ భర్తీ చేస్తారు. టీమిండియాతో 'బాక్సింగ్ డే' టెస్టులో కొన్‌స్టాస్ అరంగేట్ర పోరులోనే హాఫ్‌సెంచరీతో ఆకట్టుకుంటే... శ్రీలంక పిచ్‌లపై టెస్టు అరంగేట్రం చేసిన ఇన్‌గ్లిస్ తొలి మ్యాచ్‌లో సెంచరీతో కదంతొక్కాడు. లబుషేన్ జట్టులో కీలక ఆటగాడే అయినా ... అతడి ప్రదర్శన స్థాయికి తగ్గట్లు లేకపోవడంతోనే జట్టు నుంచి తప్పించాం. అతడు తిరిగి సత్తా చాటుతాడనే నమ్మకముంది' అని చీఫ్ సెలెక్టర్ బెయిలీ అన్నాడు.



సినెర్‌కు షాక్

కజకిస్తాన్ ప్లేయర్ బుబ్లిక్ సంచలనం




హాలె (జర్మనీ): హాలె ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినెర్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. కజకిస్తాన్‌కు చెందిన ప్రపంచ 45వ ర్యాంకర్ అలెగ్జాండర్ బుబ్లిక్ అద్భుత ఆటతీరుతో సినెర్‌ను బోల్తా కొట్టించి తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకున్నాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బుబ్లిక్ 3-6, 6-3, 6-4తో టాప్ సీడ్ సినెర్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2 గంటల 2 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో 6 అడుగుల 5 అంగుళాల ఎత్తు, 82 కేజీల బరువున్న బుబ్లిక్ 15 ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన బుబ్లిక్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్ (స్పెయిన్) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచిన సినెర్ ఈ మ్యాచ్‌లో ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 30 విన్నర్స్ కొట్టిన ఈ ఇటాలియన్ ప్లేయర్ 25 అనవసర తప్పిదాలు చేశాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది సినెర్ మూడు మ్యాచ్‌ల్లోనే ఓడిపోయాడు. అల్‌కరాజ్‌తో జరిగిన రోమ్ ఓపెన్ మాస్టర్స్ టోర్నీ ఫైనల్లో, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడిన సినెర్ తాజాగా బుబ్లిక్ చేతిలో ఓడిపోయాడు. సినెర్‌ను ఓడించిన ఉత్సాహంలో బుబ్లిక్ హాలె ఓపెన్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో బుబ్లిక్ 7-6 (7/2), 6-3తో ప్రపంచ 23వ ర్యాంకర్, ఏడో సీడ్ టామస్ మఖాచ్ (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందాడు.

సెంథిల్‌కు కాంస్యం




కుచింగ్ (మలేసియా): ఆసియా స్క్వాష్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ వెలవన్ సెంథిల్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో సెంథిల్ 9-11, 11-13, 5-11, 6-11తో రెండో సీడ్ లౌ సాజ్ క్వాన్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయాడు. 2023 ఆసియా చాంపియన్‌షిప్‌లో సెంథిల్ ఫైనల్లో ఓడిపోయి రజత పతకాన్ని దక్కించుకున్నాడు.



సెమీస్‌లో సహజ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ35 మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సహజ యామలపల్లి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికాలోని కన్సాస్ సిటీలో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 1-6, 6-2, 6-4తో జూలియా కార్సియా (మెక్సికో)పై గెలిచింది. 2 గంటల 31 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఏడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. నేడు జరిగే సెమీఫైనల్లో ఫియోనా క్రాలీ (అమెరికా)తో సహజ తలపడుతుంది.



పోరాడి ఓడిన బోపన్న జోడీ

లండన్: క్వీన్స్ క్లబ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్ ప్లేయర్ రోహన్ బోపన్న పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న (భారత్)-సాండర్ జిలె (బెల్జియం) ద్వయం 6-7 (4/7), 6-7 (5/7)తో నాలుగో సీడ్ జూలియన్ క్యాష్-లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 91 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-సాండర్ ఆరు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. మ్యాచ్ మొత్తంలో రెండు జోడీలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోగా... టైబ్రేక్‌లో బ్రిటన్ ద్వయం కీలకదశలో పాయింట్లు గెలిచి విజయాన్ని అందుకుంది. బోపన్న-సాండర్‌లకు 20,910 యూరోల (రూ. 20 లక్షల 82 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది బోపన్న మొత్తం 14 టోర్నీలలో పాల్గొన్నా ఒక్క టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయాడు.

రిత్విక్ ద్వయం అవుట్



లండన్: లెక్సస్ నాటింగ్‌హమ్ ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీ నుంచి భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ నిష్క్రమించాడు. నికోలస్ బరియంతోస్ (కొలంబియా)తో జతకట్టి ఈ టోర్నీలో బరిలోకి దిగిన రిత్విక్ క్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయాడు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ (భారత్)-బరియంతోస్ జంట 6-7 (9/11), 7-6 (7/5), 5-10తో 'సూపర్ టైబ్రేక్'లో డీగో హిడాల్గో (ఈక్వెడార్)-ప్యాట్రిక్ ట్రహాక్ (అమెరికా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 2 గంటల 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బరియంతోస్ ఎనిమిది ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. రెండు జోడీలు తమ సర్వీస్‌ను ఒక్కోసారి కోల్పోయాయి. అయితే 'సూపర్ టైబ్రేక్'లో హిడాల్గో-ప్యాట్రిక్ ద్వయం పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకుంది. మరో క్వార్టర్ ఫైనల్లో జీవన్ నెడుంజెళియన్ (భారత్)-జేమీ ఫారియా (పోర్చుగల్) ద్వయం 6-7 (2/7), 2-6తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) జోడీ చేతిలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన రితిక్-బరియంతోస్; జీవన్-ఫారియాలకు 1,840 యూరోల (రూ. 1 లక్ష 83 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 25 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆధిక్యంలో బంగ్లాదేశ్

శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 485 ఆలౌట్



గాలె: శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య తొలి టెస్టు 'డ్రా' దిశగా పయనిస్తోంది. ఇరు జట్ల బ్యాటర్లు భారీ స్కోర్లతో చెలరేగుతున్న ఈ పోరు చివరకు సమమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓవర్‌నైట్ స్కోరు 368/4తో శుక్రవారం నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 131.2 ఓవర్లలో 485 పరుగులకు ఆలౌటైంది. కమిందు మెండిస్ (87; 8 ఫోర్లు, 1 సిక్స్), మిలన్ రత్నానాయకే (39; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నయీమ్ 5 వికెట్లు పడగొట్టగా... హసన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హసన్ (56 బ్యాటింగ్; 6 ఫోర్లు), షాద్‌మన్ ఇస్లామ్ (76; 7 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో రాణించారు. నజ్ముల్, ముష్ఫికర్ (22 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. చేతిలో 7 వికెట్లు ఉన్న బంగ్లాదేశ్... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 10 పరుగులు కలుపుకొని 187 పరుగుల ఆధిక్యంలో ఉంది.



లండన్‌లో ఎండలు మండుతున్నాయి. శుక్రవారం నగరంలోని ఓ ఫౌంటెయిన్ వద్ద ఓ చిన్నారి ఉత్సాహం



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆగ్రాలోని తాజ్‌మహల్ సమీపంలో ఆసనాలు వేస్తున్న యువతులు



ఇంగ్లండ్‌లోని దోవర్‌లో ఎండ నుంచి ఉపశమనం కోసం ఏర్పాటు చేసిన నీటి స్ప్రేయర్

ఆ తీర్పు న్యాయ చరిత్రలోనే మాయని మచ్చ

ఎమర్జెన్సీకాలంలో ప్రాథమిక హక్కులు ఉండవంటూ ఆనాడు తీర్పిచ్చిన సుప్రీంకోర్టు

తీవ్రంగా తప్పుబట్టిన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

న్యూఢిల్లీ: యాభై ఏళ్ల క్రితం దేశంలో ఎమర్జెన్సీ కొనసాగుతున్నకాలంలో సర్వోన్నత న్యాయస్థానం వెలువర్చిన తీర్పు ప్రపంచ న్యాయచరిత్రలోనే మాయనిమచ్చ అని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అభివర్ణించారు. దేశంలో అత్యయిక స్థితి విధించి ఈనెల 25వ తేదీతో 50 ఏళ్లుపూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 25వ తేదీని 'సంవిధాన్ హత్యా దివస్'గా జరుపునున్న నేపథ్యంలో ధన్‌ఖడ్ ఈ వ్యాఖ్యలుచేయడం గమనార్హం. ఎమర్జెన్సీకాలంలో ప్రాథమిక హక్కులు ఉండవంటూ ఆనాడు తీర్పిచ్చిన సుప్రీంకోర్టును ధన్‌ఖడ్ తీవ్రంగా తప్పుబట్టారు. శుక్రవారం ఢిల్లీలో రాజ్యసభలో కొత్తగా ఎన్నికైన సభ్యులనుద్దేశించి ధన్‌ఖడ్ ప్రసంగించారు. ఈ వివరాలను ఉపరాష్ట్రపతి కార్యాలయం తర్వాత ఒక ప్రకటనలో వెల్లడించింది. ''మంత్రిమండలి అభిప్రాయాలకు వీసమెత్తయినా విలువ ఇవ్వకుండా నాటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని నాటి రాష్ట్రపతి ఫక్రుదీన్ అలీ అహ్మద్ ఆమోద ముద్ర వేశారు. కేవలం ప్రధాని హోదాలో ఉన్న ఒక్కరి సలహాకు రాష్ట్రపతి ఆమోదం తెలపకూడదు. రాజ్యాంగంలో దీనిపై ఎన్నెన్నో నిబంధనలున్నాయి. ప్రధాని సారథ్యంలోని మంత్రులు రాష్ట్రపతికి సలహాలు, సూచనలు చేయొచ్చు. కానీ ఇవేం పట్టించుకోకుండా ఇందిరా గాంధీ సిఫార్సుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీని విపరిణామాలను వెంటనే దేశం చవిచూసింది. ఆనాడు కొన్ని గంటల వ్యవధిలోనే లక్షకుపైగా పౌరులను ప్రభుత్వం కటకటాల వెనక్కు నెట్టింది''అని ధన్‌ఖడ్ గుర్తుచేశారు.

న్యాయస్థానం పాత్ర దారుణం

''ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రాలు అమలుకాకుండా ప్రభుత్వం అడ్డుకుంది. అలాంటప్పుడు జనం న్యాయం కోసం న్యాయస్థానాల వైపు చూస్తారు. పౌరుల ఆకాంక్షలు నెరవేరేలా తొమ్మిది హైకోర్టులు ఎమర్జెన్సీ విధించినా, విధించకపోయినా ప్రాథమిక హక్కులు మనుగడలోనే ఉంటాయని చరిత్రాత్మక తీర్పులు ఇచ్చాయి. కానీ ఆ తీర్పులను కొట్టేస్తూ సుప్రీంకోర్టు అత్యంత ప్రజాస్వామికవ్యతిరేక తీర్పును వెలువర్చింది. ఇది నిజంగా ప్రపంచం న్యాయచరిత్రలోనే చీకటిపేజీ. ఎమర్జెన్సీ అమల్లో ఉంటే పౌరులకు ప్రాథమిక హక్కులు ఉండబోమని సుప్రీంకోర్టు తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుతో నియంతృత్వం, అధికారవాదం దేశంలో తిష్టవేశాయి. కోర్టుల్లో న్యాయం దక్కుతుందని భావిస్తున్న ప్రపంచం ఈ తీర్పుతో దిగ్భ్రాంతికి గురైంది. ఎంతకాలం ఎమర్జెన్సీ కొనసాగాలో అంతకాలం అది అమల్లోఉండేలా పాలకులు ఆశించిందే చివరకు జరిగింది''అని ధన్‌ఖడ్ అన్నారు. ఈ పరిణామాల దృష్ట్యానే నేటి ప్రభుత్వం జూన్ 25వ తేదీని 'సంవిధాన్ హత్యా దివస్'గా జరపాలని సముచితంగా నిర్ణయం తీసుకుందని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21వ తేదీదాకా ఎమర్జెన్సీ అమల్లో ఉంది.

మళ్లీ ఆగిన యాక్సియం-4 ప్రయోగం

ఫ్లోరిడా: యాక్సియం-4 మిషన్ ప్రయోగం మళ్లీ నిలిచిపోయింది. భారత్‌కు చెందిన శుభాన్షు శుక్లా తదితరులతో కూడిన వ్యోమగాముల బృందం అంతరిక్ష యాత్ర మరోసారి ఆగిపోయింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)లోని రష్యాకు చెందిన సెక్షన్ జ్వెజ్డా సర్వీస్ మాడ్యూల్‌లో చేపట్టిన మరమ్మతులపై సమీక్ష జరిపేందుకు మరికొంత సమయం అవసరమని నాసా తెలిపింది. అందుకే, 22న జరగాల్సిన యాక్సియం-4 మిషన్ ప్రయోగాన్ని ఆపేసినట్లు వెల్లడించింది. ఐఎస్‌ఎస్‌లోని వ్యవస్థలన్నీ ఒకదానికొకటి అనుసంధానితమైన పరస్పర ఆధారిత వ్యవస్థలని నాసా వివరించింది. అందుకే అదనంగా వెళ్లే వ్యోమగాముల కోసం స్టేషన్ సిద్ధంగా ఉన్నదీ లేనిదీ నిర్ధారించుకోవాల్సి ఉందని చెప్పింది. ఇందుకు కొంత సమయం అవసరమని పేర్కొంది. ఒక వేళ జూన్‌లో ఈ ప్రయోగం చేపట్టడం వీలుకాకుంటే, జూలై రెండో అర్ధ భాగంలో వీలవుతుందని నాసా తెలిపింది. అయితే, తదుపరి తేదీని మాత్రం ప్రకటించలేదు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వస్తున్న ఈ పరీక్షను 22న మధ్యాహ్నం ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా చేపడతామని నాసా ప్రకటించడం తెల్సిందే.

యాక్సియం-4 మిషన్ ప్రయోగం వాస్తవానికి మే 29వ తేదీన చేపట్టాల్సి ఉంది. సాంకేతిక లోపాలు, వాతావరణ ప్రతికూలత వంటి కారణాలతో పలుమార్లు వాయిదా పడింది. యాక్షియం-4 వాణిజ్య మిషన్‌కు నాసా మాజీ వ్యోమగామి పెగ్గీ వాట్సన్ సారథిగా, భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తారు. వీరితోపాటు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రాజెక్టుకు చెందిన పోలండ్ వ్యోమగామి సవోస్జ్ ఉజ్‌నస్కి-విస్నియెవ్‌స్కీ, హంగరీకి చెందిన తిబోర్ కపు సైతం మిషన్‌లో పాలుపంచుకుంటున్నారు. వీరు మే 26వ తేదీ నుంచి ప్రత్యేక క్వారంటైన్‌లోనే కొనసాగుతున్నారు. అంతరిక్ష యాత్ర సమయంలో వీరు 60 వరకు శాస్త్రీయ ప్రయోగాలు చేపట్టనున్నారు. ఇందులో శుక్లా భారత్ తరఫున ఏడు ప్రయోగాలు చేపడతారు.

విద్యుత్ వైఫల్యమే కారణం!

ఎయిరిండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు బృందం

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: అకస్మాత్తుగా విద్యుత్ వైఫల్యం చెందడం వల్లే విమానం కూలిపోయి ఉంటుందని దర్యాప్తు బృందం భావిస్తోంది. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న ఎయిరిండియా విమానం ఏఐ-171 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన విషయం తెలిసిందే. అత్యవసర టర్నరౌండ్‌ను అమలు చేయడానికి లేదా మొత్తం విద్యుత్ నష్టం జరిగినప్పుడు బ్యాకప్ వ్యవస్థ అయిన రామ్ ఎయిర్ టర్బైన్ (ఆర్‌ఏటీ)ను ఉపయోగించుకోవడానికి అవసరమైన కనీస ఎత్తుకు విమానం చేరుకోలేదు. అయితే టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అకస్మాత్తుగా విద్యుత్తు అంతరాయం ఏర్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. బ్లాక్ బాక్స్ డేటాను డీకోడ్ చేసిన తర్వాతే అసలు కారణం తెలుస్తుందంటున్నారు. బ్లాక్ బాక్స్‌లు - ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్), కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్) ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఆధీనంలో ఉన్నాయి. అయితే బ్లాక్ బాక్స్‌లను విదేశాలకు పంపుతున్నట్లు వస్తున్న వార్తల స్పందించిన పౌర విమానయాన శాఖ.. తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది.

231 డీఎన్‌ఏల గుర్తింపు.. 210 మృతదేహాలు కుటుంబాలకు అప్పగింత

ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 231 డీఎన్‌ఏ నమూనాలు సరిపోలాయని, 210 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ శుక్రవారం తెలిపింది. మృతదేహాలు అప్పగించిన 210 మందిలో 166 మంది భారతీయులు కాగా, ఏడుగురు పోర్చుగీస్, 36 మంది బ్రిటిషర్స్, ఒక కెనడియన్ ఉన్నారని హాస్పిటల్ సూపరింటెండెంట్ రాకేష్ జోషి తెలిపారు. 183 మంది మృతదేహాలను అంబులెన్స్‌ల ద్వారా, 15 మంది మృతదేహాలను విమానంలో పంపించినట్లు తెలిపారు. విమాన ప్రమాదంలో 222 మంది బాధితులను గుర్తించగా, వారిలో ఎనిమిది మంది డీఎన్‌ఏ మ్యాచ్ కాలేదని తెలిపారు. జూన్ 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలిపోవడం, విమానంలోని 241 మంది మరణించడం తెలిసిందే.

నాకు ప్రాణహాని ఉంది

స్పీకర్‌కు కేంద్ర మంత్రి మజుందార్ లేఖ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో గురువారం తన వాహన కాన్వాయ్‌పై దాడి జరిగిందని కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ ఆరోపించారు. ఇది తీవ్ర హక్కుల ఉల్లంఘన, ప్రాణాలకు హాని కలిగించే ఘటన అని ఆయన అభివర్ణించారు. పశ్చిమ బెంగాల్‌లోని బాలుర్ఘాట్ ఎంపీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కూడా ఆయన మజుందార్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు శుక్రవారం లేఖ రాశారు. డైమండ్ హార్బర్ ప్రాంతంలోని బడ్జ్ బడ్జ్ వద్ద కాన్వాయ్‌ను చుట్టుముట్టిన అధికార టీఎంసీ కార్యకర్తలు తనపై దాడికి పాల్పడ్డారని అందులో ఆరోపించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ గోస్వామి కనీసం వారిని ఆపేందుకు ప్రయత్నం కూడా చేయకుండా చూస్తూ ఉండిపోయారన్నారు. తనతోపాటు తన పక్కనున్న వారికి ప్రాణహాని కలిగించేందుకు టీఎంసీ కార్యకర్తలు ప్రయత్నించారన్నారు.

భారత్‌తో చర్చలకు సిద్ధం: షెహబాజ్

ఇస్లామాబాద్: జమ్మూకశ్మీర్, సిందూ నదీ జలాల ఒప్పందం, వాణిజ్యం, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు సహా భారత్‌తో అన్ని అంశాలపై చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రుబియోతో శుక్రవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంపై ఆయన ప్రశంసలు కురిపించారు. భారత్ కాల్పుల విరమణకు వచ్చేందుకు సాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చర్చలు, దౌత్య మార్గాల్లో పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముగింపు పలకాలని షెహబాజ్ షరీఫ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అమెరికా-పాకిస్తాన్‌లో వాణిజ్యం, పెట్టుబడులు, విద్యుత్ తదితర రంగాల్లో ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాల్సిన అవసరముందన్నారు. రెండు రోజుల క్రితం పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో విందు ఇవ్వడం తెల్సిందే.

దమ్ముంటే రాజకీయంగా అంతం చేయండి

- ప్రత్యర్థులకు సవాలు విసిరిన ఉద్ధవ్ ఠాక్రే
- అంబులెన్స్ వెంట తెచ్చుకోవాలని సూచన

ముంబై: మహారాష్ట్రలోని శివసేనలో రెండు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. బాల్ ఠాక్రే స్థాపించిన శివసేన పార్టీ శివసేన (ఉద్ధవ్), శివసేన(షిండే)గా చీలిపోయిన సంగతి తెలిసిందే. శుక్రవారం ముంబైలో శివసేన 59వ వ్యవస్థాపక దినోత్సవంలో శివసేన(ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రే ప్రసంగించారు. ఠాక్రే బ్రాండ్‌ను ధ్వంసం చేసేందుకు బీజేపీతోపాటు ఏక్‌నాథ్ షిండే కుట్రలు సాగిస్తున్నారని ఆరోపించారు. 1991లో విడుదలైన ప్రహార్ చిత్రంలోని నానా పటేకర్ డైలాగ్‌ను గుర్తుచేస్తూ, ''మీకు దమ్ముంటే నన్ను రాజకీయంగా అంతం చేయండి''అని ప్రత్యర్థులకు సవాలు విసిరారు. కానీ, వెంటనే హాస్యధోరణిలోకి వెళ్లిపోయారు. ''నన్ను చంపడానికి రండి. కానీ, అంబులెన్స్ కూడా వెంట తెచ్చుకోండి. ఎందుకంటే దాని అవసరం మీకే ఉంటుంది''అని ఉద్ధవ్ వ్యాఖ్యానించారు. మరాఠీ పార్టీల్లో విభేదాలు సృష్టించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఠాక్రే బ్రాండ్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీని ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. మరోవైపు ఠాక్రే సవాల్‌పై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శివసేన(షిండే) చీఫ్ ఏక్‌నాథ్ షిండే స్పందించారు. ఉద్ధవ్ ఠాక్రేను ప్రజలు రాజకీయంగా ఎప్పుడో అంతం చేశారని, కొత్తగా చేయడానికి ఏమీ లేదని పేర్కొన్నారు. సింహం చర్మం కప్పుకున్నంత మాత్రాన తోడేలు ఎప్పటికీ సింహం కాలేదని స్పష్టంచేశారు. ఉద్ధవ్ ఠాక్రే చాలెంజ్‌పై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సైతం స్పందించారు. ఉత్తుత్తి కబుర్లు చెప్పేవారి గురించి మాట్లాడడం తనకు ఇష్టం లేదన్నారు.

ఆ 100 మందీ నా సంతానమే..

నా ఆస్తిలో వారికీ వాటా

'టెలిగ్రాం' చీఫ్ పావెల్ దురోవ్ ప్రకటన

లండన్: మెసేజింగ్ యాప్ టెలిగ్రాం వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్(40) సంచలన ప్రకటన చేశారు. వీర్య దానం ద్వారా తాను తండ్రిన యిన 100 మందికిపైగా సంతానానికి తనకున్న 13.9 బిలియన్ డాలర్ల ఆస్తిని పంచుతానని తెలిపారు. 'వాళ్లంతా నా పిల్లలే. నా ఆస్తిలో వాళ్లకూ సమాన హక్కులుంటాయి. నా మరణం తర్వాత వారికి అన్యాయం జరగాలని కోరుకోవడం లేదు'అని దురోవ్ చెప్పినట్లు ఫ్రాన్స్ పత్రిక 'లీ పాయింట్'పేర్కొంది. ముగ్గురు భాగస్వాముల ద్వారా ఆరుగురు సంతానికి అధికారికంగా తండ్రినని దురోవ్ చెప్పారు. 'ఒక ఫ్రెండ్‌కు సాయం చేసేందుకుగాను 15 ఏళ్ల క్రితం వీర్య దానం మొదలుపెట్టా. అలా 12 దేశాల్లో 100 మందికి పైగా పిల్లలు పుట్టినట్లు నా ఫ్రెండ్ చెప్పారు'అని ఆయన వెల్లడించారు. 'వీరందరికీ నా ఆస్తిలో వాటా ఇస్తా. అయితే, ఇప్పుడు కాదు, 30 ఏళ్ల తర్వాతే వారికి ఈ అవకాశం దక్కుతుంది. ఈ మేరకు వీలునామా రాశా'అని చెప్పారు. 'నా ఉద్యోగం ఎన్నో రిస్కులతో కూడుకున్నది. స్వతంత్ర్యాన్ని కాపాడుకునే క్రమంలో ఎందరో శత్రువులు కూడా తయారయ్యారు. కొన్ని దేశాలు కూడా నాకు వ్యతిరేకంగా ఉన్నాయి. అందుకే ముందుగానే ఏర్పాట్లు చేశా'అని దురోవ్ చెప్పారు. 'నా ద్వారా కలిగిన పిల్లలంతా సామాన్యుల మాదిరిగానే ఉండాలన్నది నా కోరిక. తమ జీవితాన్ని తామే నిర్మించుకోవాలి. ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి. బ్యాంకు అకౌంట్‌పై ఆధారపడకుండా సొంతంగా ఎదగాలి'అని కోరుకున్నారు. రష్యాలో జన్మించిన పావెల్ దురోవ్‌కు ఫ్రాన్స్, యూఏఈ ద్వంద పౌరసత్వముంది. ఇతడు సీఈవోగా ఉన్న టెలిగ్రాం యాప్ ప్రధాన కార్యాలయం యూఏఈలో ఉంది. ప్రస్తుతం దుబాయ్‌లో పావెల్ దురోవ్ ఉంటున్నారు. టెలిగ్రాం యాప్ నేరగాళ్లకు అడ్డాగా మారిందని ఆరోపిస్తూ ఫ్రాన్స్ అధికారులు గతేడాది అరెస్ట్ చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ..'నా యాప్‌ను నేరగాళ్లు వినియోగించుకున్నారని, నన్నూ నేరగాడంటే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు.

లోక్‌సభలో ఎన్నికల్లో 45% ఖర్చు బీజేపీదే

రూ.1,494 కోట్లు ఖర్చు పెట్టిన కాషాయం పార్టీ

- కాంగ్రెస్ వ్యయం రూ.620 కోట్లు: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ: గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ కలిపి చేసిన మొత్తం వ్యయంలో 45 శాతం వాటా భారతీయ జనతా పార్టీదేనని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) శుక్రవారం ఒక నివేదికలో వెల్లడించింది. ఈ ఎన్నికల్లో బీజేపీ రూ.1,494 కోట్లు ఖర్చు చేసినట్లు తెలియజేసింది. విపక్ష కాంగ్రెస్ రూ.620 కోట్లు ఖర్చు పెట్టిందని, మొత్తం వ్యయంలో ఆ పార్టీ వాటా 18.5 శాతమని వివరించింది. మొత్తం 32 జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎన్నికల ఖర్చుల రికార్డులను ఏడీఆర్ విశ్లేషించింది. 2024లో మార్చి 16 నుంచి జూన్ 6 దాకా లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలు సైతం జరిగాయి. ఈ ఎన్నికల కోసం 32 పార్టీలు రూ.3,352.81 కోట్లు ఖర్చు చేసినట్లు ఏడీఆర్ తెలియజేసింది. ఇందులో జాతీయ పార్టీల వాటా రూ.2,204 కోట్లు(65.75 కోట్లు) అని పేర్కొంది. విరాళాలు, నిధుల రూపంలో జాతీయ పార్టీలకు రూ.6,930.24 కోట్లు, ప్రాంతీయ పార్టీలకు రూ.515.32 కోట్లు అందినట్లు వివరించింది. అంటే మొత్తం నిధుల్లో జాతీయ పార్టీలకు 93.08 శాతం, ప్రాంతీయ పార్టీలకు 6.92 శాతం అందినట్లు స్పష్టమవుతోంది. ఏయే పార్టీలు ఎన్ని నిధులు ఖర్చు చేశాయన్నది ఆయా పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన 'వ్యయ నివేదికల'ఆధారంగా ఏడీఆర్ గుర్తించింది. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత 90 రోజుల్లోగా, అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత 75 రోజుల్లోగా పార్టీలు వ్యయ నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది. కానీ, బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ చాలా ఆలస్యంగా ఈ నివేదికలు ఇచ్చినట్లు ఏడీఆర్ పేర్కొంది. పార్టీలు ఎన్నికల ప్రచారం కోసమే అత్యధిక నిధులు ఖర్చు చేసినట్లు తెలిపింది. అన్ని పార్టీలు ప్రచారం కోసం రూ.2,008 కోట్లు వెచ్చించినట్లు తేల్చింది. అంటే మొత్తం ఖర్చులో ఇది 53 శాతంగా తెలుస్తోంది. ఆ తర్వాత రవాణా కోసం రాజకీయ పార్టీలు ఎక్కువ ఖర్చు పెట్టినట్లు వెల్లడించింది. ఎన్నికల సంఘం గుర్తింపు పొందని 690 పార్టీలు కూడా గత ఏడాది ఎన్నికల్లో పోటీ చేసినట్లు ఏడీఆర్ తెలియజేసింది. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు చేసే ఖర్చుపై నిఘా పెట్టడానికి ప్రత్యేకంగా పరిశీలకులను నియమించాలని ఎన్నికల సంఘానికి సూచించింది.

హెచ్ఏఎల్‌కు రాకెట్ల తయారీ కాంట్రాక్టు

బిడ్డింగ్‌లో అదానీ గ్రూప్‌ను వెనక్కి నెట్టిన హెచ్ఏఎల్

న్యూఢిల్లీ: యుద్ధ విమానాలు తయారుచేసే ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) మరో ముందడుగు వేసింది. రాకెట్ తయారీ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. బిడ్డింగ్‌లో రెండు అతిపెద్ద సంస్థలను వెనక్కి నెట్టి ఈ కాంట్రాక్ట్‌ను సొంతం చేసుకోవడం విశేషం. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్(ఎస్ఎస్ఎల్‌వీ) సాంకేతికత బదిలీ బిడ్డింగ్‌ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నిర్వహించింది. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ ఇస్రో ప్రమాణాల మేరకు 500 కిలోల వరకు బరువైన ఉపగ్రహాలను దిగువ భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టే రాకెట్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. హెచ్ఏఎల్‌తోపాటు అదానీ గ్రూప్‌కు చెందిన అల్ఫా డిజైన్ టెక్నాలజీస్, హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) సహా మరికొన్ని సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. ఇందులో హెచ్ఏఎల్‌కే కాంట్రాక్టు లభించింది. రూ.511 కోట్లతో ఎస్ఎస్ఎల్‌వీలు తయారు చేసేందుకు హెచ్ఏఎల్ ముందుకొచ్చింది. ఇస్రో నుంచి సాంకేతికత బదిలీ రానున్న రెండేళ్లలో పూర్తికానుంది. దేశంలో రాకెట్లు తయారు చేయబోతున్న మూడో కంపెనీ హెచ్ఏఎల్ కావడం విశేషం. అంతరిక్ష రంగంలోని స్టార్టప్ కంపెనీలైన స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్ ఇప్పటికే ఈ ఘనత సాధించాయి. రానున్న రెండేళ్లలో రెండు ప్రోటోటైప్ రాకెట్ల తయారీకి హెచ్ఏఎల్‌కు ఇస్రో సహకరించనుంది. ఆ తర్వాత హెచ్ఏఎల్ ప్రతిఏటా ఆరు నుంచి పది ఎస్ఎస్ఎల్‌వీలు సొంతంగానే తయారు చేయనుంది.

ఇంగ్లిష్ సిగ్గు చేటుకాదు.. అభివృద్ధికి మార్గం

ఇంగ్లిష్ మాట్లాడటంపై రాహుల్

న్యూఢిల్లీ: ఇంగ్లిష్ మాట్లాడటం సాధికారితే తప్ప, సిగ్గుపడే విషయం కాదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ప్రతి విద్యార్థికీ ఇంగ్లిష్ నేర్పాలని కోరారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..మన దేశంలో ఇంగ్లిష్‌లో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు ఎంతో దూరంలో లేవని వ్యాఖ్యానించారు. మన దేశాన్ని, సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ శుక్రవారం 'ఎక్స్'లో దీటుగా స్పందించారు. 'పేదల పిల్లలు ఇంగ్లిష్ భాష నేర్చుకోవడం బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లకు ఇష్టముండదు. ఎందుకంటే వారు ప్రశ్నించడం, పై స్థాయికి, సమాన హోదాకు ఎదగడం వారికి నచ్చదు'అని పేర్కొన్నారు. 'ఇంగ్లిష్ అడ్డుకట్ట కాదు, వారధి. ఇంగ్లిష్ నేర్చుకోవడం సిగ్గుచేటు కాదు, సాధికారితకు చిహ్నం. ఇంగ్లిష్ బంధనం కాదు..బంధనాలను తెంచే సాధనం.'అని రాహుల్ తెలిపారు. మాతృభాషకు ఉన్నంత ప్రాముఖ్యం నేడు ఇంగ్లిష్‌కుంది. ఇంగ్లిష్‌తో ఉపాధి దొరుకుతుంది. ఆత్మవిశ్వాసం కలుగుతుంది..అంటూ ఆయన వివరించారు. 'దేశంలోని ప్రతి భాషకు కూడా సొంత గుర్తింపుంది. ఆ భాషలను ఎదగనిద్దాం. అదే సమయంలో ప్రతి చిన్నారికి ఇంగ్లిష్ నేర్పండి. ప్రపంచంతో పోటీపడాలన్నా, ప్రతి చిన్నారికీ సమాన అవకాశాలు దక్కాలన్నా ఇంగ్లిష్‌తోనే సాధ్యం'అని స్పష్టం చేశారు.

కుష్వాహకు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

పాట్నా: రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎమ్) అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి హత్య బెదిరింపు కాల్స్ వచ్చాయి. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్న కార్యక్రమానికి పాట్నా నుంచి సివాన్‌కు బయలుదేరుతుండగా ఈ కాల్స్ వచ్చాయని ఉపేంద్ర కుష్వాహ తెలిపారు. రాత్రి 8:52 నుంచి 9:20 గంటల మధ్య వరకు వరుసగా ఏడు కాల్స్ వచ్చాయన్నారు. కాల్ చేసిన వ్యక్తి.. బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడినని చెప్పి.. ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా రాజకీయంగా మాట్లాడవద్దని హెచ్చరిస్తూ తీవ్రమైన బెదిరింపులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. కాల్ చేసిన వ్యక్తి తన సిబ్బందిని కూడా పదే పదే సంప్రదించాడని ఆయన అన్నారు. అలాగే రాత్రి 8:57 గంటలకు మరో మొబైల్ నుంచి బెదిరింపు మెసేజ్‌వచ్చిందని, ఒక నిర్దిష్ట పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం కొనసాగిస్తే, తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని, పదిరోజుల్లో చంపేస్తామని హెచ్చరించారని వెల్లడించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ట్విట్టర్‌లోనూ ఆయన పోస్ట్ చేశారు. బెదిరింపు కాల్స్ వచ్చిన నెంబర్లను కూడా జత చేశారు.

ఆరోగ్య సమస్యలకు పరిష్కారం: అమిత్ షా

బెంగళూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజలెదుర్కొంటున్న ఆరోగ్య రంగ సమస్యల్ని శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించిందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. సుమారు 12 కోట్ల టాయిలెట్లను కట్టించింది. ఫిట్ ఇండియా ఉద్యమం, యోగా డే, మిషన్ ఇంద్రధనుష్, పోషణ్ అభియాన్, ఆయుష్మాన్ భారత్, భారతీయ జనౌషధి పరియోజన వంటి కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. బెంగళూరులోని ఆదిచుంచనగిరి వర్సిటీ ప్రారంభం అనంతరం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. 'పేద ప్రజల ప్రధాన సమస్య అనారోగ్యం, ఖరీదైన వైద్యం. ప్రభుత్వ యంత్రాంగం పేదల వైద్యానికయ్యే ఖర్చును భరించాలి..అని కొన్నేళ్ల క్రితం గుజరాత్‌లో మన ప్రధాని మోదీ చెప్పారు. ఆయన ప్రధానమంత్రి అయ్యాక ఇప్పుడు దేశంలోని 60 కోట్ల మంది పేదలకు రూ.5 లక్షల చొప్పున ఉచిత వైద్యం అందుతోంది. ఈ విషయం నేను సగర్వంగా చెబుతున్నా' అని పేర్కొన్నారు. దేశంలో ఎయిమ్స్‌లను 7 నుంచి 23కు, మెడికల్ కాలేజీలను 387 నుంచి 780కి తమ ప్రభుత్వం పెంచిందని వివరించారు. ఆదిచుంచనగిరి మఠం గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం వెల్‌నెస్ సెంటర్లను నెలకొల్పి సేవలందిస్తున్నందుకు ప్రశంసించారు. మఠం 1,800 ఏళ్ల సంప్రదాయాలను కొనసాగిస్తున్నందుకు స్వామి నిర్మలానందనాథ స్వామీజీని ఆయన కొనియాడారు.

ప్రియుడితో హనీమూన్‌కు వెళ్లాలని.. కుమారుడు, కుమార్తెను చంపిన తల్లి

ముజఫర్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడితో హనీమూన్‌కు వెళ్లాలని ప్లాన్ చేసిన ఓ మహిళ..అందుకు అడ్డుగా ఉన్నారని ఐదేళ్ల కుమారుడిని, ఏడాది వయసున్న కూతురిని విషమిచ్చి చంపేసింది. చివరికి పోలీసులకు దొరికిపోయి, కటకటాలు లెక్కపెడుతోంది. రొడ్కాలి గ్రామానికి చెందిన ముస్కాన్(24)కు ఇద్దరు పిల్లలు. భర్త వసీమ్ జీవనోపాధి కోసం చండీగఢ్‌లో ఉంటున్నాడు. దీంతో ఆమె జునాయిద్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగిస్తోంది. అతడితో కలిసి ఎక్కడికైనా వెళ్లిపోవాలని నిర్ణయించుకుంది. ఇందుకు తన పిల్లలు అడ్డుగా ఉన్నారని భావించి గురువారం వారిద్దరికీ విషమిచ్చి చంపేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ముస్కాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా దారుణం వెలుగు చూసింది. జునాయిద్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

నైగర్‌లో ఉగ్రవాదుల దాడి: 34 మంది మృతి

డాకర్(సెనేగల్): ఆఫ్రికా దేశం నైగర్‌లో జిహాదీల దాడిలో 34 మంది సైనికులు చనిపోగా 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. మాలి, బుర్కినా ఫాసో, నైగర్ సరిహద్దులకు సమీపంలోని బనిబంగౌలో ఈ దారుణం చోటుచేసుకుంది. గురువారం ఉదయం 9 గంటల సమయంలో 200 బైక్‌లు, 8 ఇతర వాహనాల్లో వచ్చిన ఉగ్రవాదులు సైనిక పోస్టుపై ఆకస్మికంగా దాడి చేశారని రక్షణ శాఖ తెలిపింది. ప్రతిగా సైన్యం జరిపిన దాడిలో డజన్ల కొద్దీ ఉగ్రవాదులు హతమయ్యారని, మిగతా వారి కోసం భారీ ఎత్తున గాలింపు చేపట్టామంది.

రోడ్డు ప్రమాదంలో 9 మంది దుర్మరణం

పురులియా: పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లాలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులు వివాహ వేడుక నుంచి తిరిగి వస్తుండగా బలరాంపూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని నామ్షోల్ సమీపంలో జాతీయ రహదారి 18పై ఈ ప్రమాదం జరిగింది. నామ్షోల్ వద్ద బొలెరో వాహనం వేగంగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. వాహనం తీవ్రంగా దెబ్బతింది. గాయపడిన వారందరినీ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే, అక్కడికి చేరుకునేలోపే ప్రయాణికులందరూ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు.

ఆహార పంపిణీ కేంద్రం వద్ద కాల్పులు 35 మంది పాలస్తీనియన్ల మృత్యువాత

గాజా: గాజాలో అమెరికా, ఇజ్రాయెల్ సహకారంతో ఏర్పాటైన గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్(జీహెచ్ఎఫ్) ఆహార పంపిణీ కేంద్రాల వద్ద అన్నార్తులపై ఇజ్రాయెల్ ఆర్మీ క్రౌర్యం కొనసాగుతూనే ఉంది. శుక్రవారం జరిగిన కాల్పుల్లో మరో 35 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. ఆహార కేంద్రాల వద్దకు చేరిన వందలాది మంది జనంపైకి ఇజ్రాయెల్ సైన్యం యుద్ధ ట్యాంకులు, డ్రోన్లతో కాల్పులకు తెగబడిందని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. బుల్లెట్ గాయాలైన 100 మందికి పైగా చికిత్స కోసం వచ్చినట్లు నుసెయిరత్‌లోని అల్-ఔదా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మే నెలలో ఆహార పంపిణీ కేంద్రాలు తెరిచినప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం 400 మంది ప్రాణాలను ఇజ్రాయెల్ ఆర్మీ బలితీసుకుంది.

ఉక్రెయిన్ నగరాలపై రష్యా డ్రోన్ల దండు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం తీర ప్రాంత ఒడెసా, ఈశాన్య ప్రాంత ఖర్కీవ్ నగరాలే లక్ష్యంగా డ్రోన్లతో విరుచుకుపడింది. సుమారు 20కి పైగా డ్రోన్ దాడుల్లో అపార్టుమెంట్ భవన సముదాయాలు వణికిపోయాయి. ఒడెసాలోని నాలుగంతస్తుల నివాస భవనం, 23 అంతస్తుల ఆకాశ హర్మ్యంలో మంటలు చెలరేగాయి. భవనాలు కొంత భాగం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ భవనాల్లోని రెండు డజన్ల మంది గాయపడ్డారు. తమ పౌరులను భయభ్రాంతులకు గురిచేయాలన్న లక్ష్యంతో రష్యా దాడులకు తెగబడుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ టెలిగ్రాంలో పేర్కొన్నారు. ఇకనైనా ఆర్థిక ఆంక్షలతో రష్యాపై ఒత్తిడిని తీవ్రతరం చేయాలని యూరోపియన్ యూనియన్, అమెరికాలను కోరారు.

హృదయ స్పందన పెరగడానికి కారణమయ్యే హార్మోన్?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

ప్రశ్నలు- వివరణలు

1. ఒక జీవిని 'ఎండమిక్ జీవి' గా పేర్కొనడానికి గల కారణం.
   1) దాని జనాభా తరిగిపోవడం
   2) భూమిపై అలాంటి జీవి ఒక్కటి కూడా మిగలకపోవడం
   3) దానిని వేటాడడం నిషేధించడం
   4) ఒక ప్రత్యేక ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండడం

జ. 4;
వివరణ: జీవులు కొన్ని ప్రత్యేక ప్రాంతాలకే పరిమితమవుతాయి. వీటిని అరుదైన జాతులు లేదా ఎండమిక్ జాతులు అంటారు.
ఉదా: కంగారూ, ఆస్ట్రేలియా, కివీపక్షి-న్యూజిలాండ్ మొదలైనవి.

2. కింది పటంలోని ప్రయోగం ద్వారా నిరూపించే అంశం
   1) జీవులు, ఉద్దీపనలకు ప్రతిస్పందిస్తాయి
   2) జీవక్రియలు కాంతి సమక్షంలో మాత్రమే జరుగుతాయి
   3) జంతువులు మాత్రమే కాంతికి ప్రతిస్పందిస్తాయి
   4) మొక్కలు మాత్రమే కాంతికి ప్రతిస్పందిస్తాయి

జ. 1;
వివరణ: పటంలోని ప్రయోగాల్లో గాజు సీసాను చీకటి, వెలుతురు తగిలేలాగ రెండు భాగాలుగా విభజించి అందులో వానపామును వదిలి మూత మూశారు. కాంతిని ప్రసరింపచేసినపుడు అది కాంతిపడే ప్రాంతానికి ప్రయాణిస్తుంది. జీవులు ఉద్దీపనాలకు ప్రతిస్పందిస్తాయని తెలుసుకోవచ్చు.

3. వృక్షకణం ప్రత్యేకంగా ఏ కణాంగాలను కలిగి ఉంటుంది.
   1) మైటోకాండ్రియా, రైబోజోమ్లు, ప్లాస్టిడ్లు
   2) ప్లాస్టిడ్లు, కణత్వచం, లైసోజోమ్లు
   3) ప్లాస్టిడ్లు, కణకవచం, పెద్దరిక్తికలు
   4) ప్లాస్టిడ్లు, మైటోకాండ్రియా, లైసోజోమ్లు

జ. 3;
వివరణ: వృక్షకణంలో ప్లాస్టిడ్లు(వర్ణదాలు) కణకవచం, పెద్దరిక్తికలు ఉంటాయి. స్పష్టమైన కణకవచాన్ని చూపుతుంది. జంతు కణంలో పలుచని ప్లాస్మాత్వచం, చిన్న రిక్తికలు ఉంటాయి. ప్లాస్టిడ్లు ఉండవు.

4. ఏ రకపు పేపిల్లే ద్వారా ఎలాంటి రుచిని తెలుసుకోలేం?
   1) ఫిలిఫార్మ్ పాపిల్లే
   2) ఫోలియేట్ పాపిల్లే
   3) సర్కంవేలేట్ పాపిల్లే
   4) ఫంగిఫార్మ్ పాపిల్లే

జ. 1;
వివరణ: నాలుకపై సుమారు పదివేల రుచి కణికలు ఉంటాయి. ఇందులో ఫిలిఫార్మ్ పాపిల్లే పొలుసుల లాగా ఉంటుంది. ఇందులో ఎలాంటి రుచికణికలు ఉండకపోవడం వల్ల అవి రుచిని తెలుసుకోలేవు.

5. 'బయోపెస్టిసైడ్'గా ఉపయోగపడే బ్యాక్టీరియం ఏది?
   1) అజటోబ్యాక్టర్
   2) అజోస్పైరిల్లం
   3) బాసిల్లస్ తురెంజియన్సిస్
   4) బాసిల్లస్ పోపిల్లె

జ. 3;
వివరణ: బాసిల్లస్ తురంజియన్సిస్(BT) జీవరసాయన ఎరువుగా ఉపయోగపడుతుంది. దీన్ని అనేక పరిశోధనల్లోనూ ఉపయోగిస్తున్నారు.

6. పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో ఒక పెద్దపామును చూసిన అనిల్ హృదయ స్పందన పెరిగింది. అతని హృదయ స్పందన పెరగడానికి కారణ మయ్యే హార్మోన్ ఏది?
   1) థైరాక్సిన్
   2) అడ్రినలిన్
   3) థైరోట్రోపిన్
   4) గ్రీలిన్

జ. 2;
వివరణ: అడ్రినలిన్ హార్మోన్ శరీరంలోని అధివృక్క గ్రంధిలో విడుదలవుతుంది. ఈ హార్మోన్ మానసిక ఉద్వేగాలను నియంత్రిస్తుంది. అందువల్ల దీనిని 'పోరాట పలాయన హార్మోన్' అని అంటారు.

7. కింది వానిలో ఎక్కువ పీచు పదార్థాలను ఉన్నవేవి?
   అ. పాలు ఆ. తృణధాన్యాలు
   ఇ. నీరు ఈ. ఆకుకూరలు
   1) అ, ఆ 2) ఆ, ఇ
   3) ఇ, అ 4) ఈ, ఆ

జ. 4;
వివరణ: తృణధాన్యాలైన అన్నిరకాల గింజలు, ఆకుకూరల్లో పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి జీర్ణనాళంలో ఆహారాన్ని బరువును పెంచి సులభంగా జారే విధంగా చేస్తుంది. మలబద్ధకాన్ని నిరోధిస్తుంది.

8. కింది వానిలో సరికాని జత ఏది?
   1) పత్రవృంతము : పత్రాన్ని కాండంతో జతపరుస్తుంది
   2) అంచులు : పత్రానికి ఆకారము ఇస్తాయి
   3) పత్రదళం : భాష్పోత్సేకంలో సహకరిస్తుంది
   4) నడిమి ఈనె : నీటిని మాత్రమే రవాణా చేస్తుంది

జ. 4;
నడిమి ఈనె పత్రంలో మధ్యభాగంలో ఉంటుంది. ఇందులో ప్రసరణ కణజాలం ఉంటుంది. నీటితోపాటు పోషక పదార్థాలను సరఫరా చేయడానికి నాళికాపుంజాలను కలిగి ఉంటుంది.

9. కింది జీవుల్లో కేంద్రక పూర్వక జీవులకు సంబంధించిన జత ఏది?
   1) నీలి ఆకుపచ్చ శైవలాలు, బ్యాక్టీరియా
   2) బ్యాక్టీరియా, స్పంజికలు
   3) రైజోపస్, నీలి ఆకుపచ్చ శైవలం
   4) ఈస్ట్, పుట్టగొడుగు

జ. 1;
వివరణ: కేంద్రకం చుట్టూ నిర్దిష్టమైన త్వచం లేని కణాలను కేంద్రక పూర్వక కణాలు అంటారు. నీలి ఆకుపచ్చ శైవలాలు, బ్యాక్టీరియాల్లో ఈ స్థితి కనిపిస్తుంది. వీటిని కేంద్రక పూర్వ జీవులు అంటారు.

10. నేలను దున్నడం, పెల్లగించడం అనే ప్రక్రియ కింది వానిలో ఏ అంశానికి సహాయపడదు?
    1) వేళ్ల నేలలోకి సులభంగా చొచ్చుకొని పోవడానికి
    2) కొన్ని అపాయకరమైన సూక్ష్మజీవులను చంపడానికి
    3) భూసారాన్ని పెంచడానికి
    4) నీరు ఇంకే సామర్థ్యాన్ని వృద్ధి చేయడానికి

జ. 3;
వివరణ: వ్యవసాయంలో నేలను దున్నడం ముఖ్యమైన ప్రక్రియ. భూసారాన్ని పెంచడం కోసం నేలను దున్నుతారు. దీని వల్ల కింద ఉన్న మట్టిపైకి, పైనున్న మట్టి కిందికి వెళ్లడంతో పాటు గాలి చొరబడుతుంది.

11. మొదటిసారిగా జన్యువుని కృత్రిమంగా సంశ్లేషణ చేసిన శాస్త్రవేత్త ఎవరు?
    1) హరగోవింద ఖొరానా
    2) పంచానన్ మహేశ్వరి
    3) బీర్బల్ సాహిని
    4) ఎల్లాప్రగడ సుబ్బారావు

జ. 1;
వివరణ: హరగోవింద ఖొరానా భారతీయ శాస్త్రవేత్త. కణంలోని కేంద్రకంలో జన్యువు ఉంటుంది. ఇది జీవుల లక్షణాలకు మూలప్రమాణం. దీన్ని 1972లో కృత్రిమ పద్ధతుల్లో ఖొరానా బృందం ఆవిష్కరించింది. నేడు బయోటెక్నాలజీలో, జీన్ ఎడిటింగ్‌లో ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది.

ఇండియన్ జాగ్రఫీ

1. భారతదేశంలో తోట వ్యవసాయాన్ని ప్రవేశపెట్టిన విదేశీయులు ఎవరు?
1) పర్షియన్లు 2) పోర్చుగీసువారు
3) బ్రిటిషర్లు 4) అరబ్బులు

2. మనదేశంలో విస్థాపన వ్యవసాయానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) ఆంధ్రప్రదేశ్ - పోడు వ్యవసాయం
2) మధ్యప్రదేశ్ - బేవార్
3) అసోం - కురువా
4) కేరళ - పోనమ్

3. విస్తృత వ్యవసాయానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) ఈ వ్యవసాయ పద్ధతికి భూకమతం ఎక్కువగా ఉండాలి
బి) ఈ పద్ధతికి జనసాంద్రత తక్కువగా ఉండాలి
సి) ఈ పద్ధతిలో నీటిపారుదల ఎక్కువగా, యంత్రాల వినియోగం తక్కువగా ఉండాలి
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

4. భూకమత పరిమాణం తక్కువగా ఉండి, జనసాంద్రత ఎక్కువగా ఉన్న దేశాల్లో యాంత్రీకరణ లేకుండా చేసే వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
1) మిశ్రమ వ్యవసాయం
2) జీవనాధార వ్యవసాయం
3) సాంద్ర వ్యవసాయం
4) విస్తృత వ్యవసాయం

5. కింది వాటిలో తోట పంట కానిది ఏది?
1) రబ్బరు 2) టీ
3) కొబ్బరి 4) జనుము

6. వివిధ పరిశోధన కేంద్రాలు, అవి ఉన్న ప్రదేశాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) ప్రపంచ వరి పరిశోధన కేంద్రం - మనీలా (ఫిలిప్పీన్స్)
2) జాతీయ వరి పరిశోధన కేంద్రం - కోల్‌కతా
3) భారత వ్యవసాయ పరిశోధన కేంద్రం - న్యూఢిల్లీ
4) భారత చెరకు విత్తన పరిశోధన కేంద్రం - కోయంబత్తూర్

7. గోధుమ పంటకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) ఇది సమశీతోష్ణ మండలం పంట
బి) ఇది రెండో ప్రధాన ఆహార పంట
సి) ఇది ఖరీఫ్ కాలానికి చెందిన పంట
1) ఎ, బి 2) ఎ, సి
3) బి, సి 4) ఎ, బి, సి

8. కింది వాటిని జతపరచండి.
జాబితా - I
i) ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
ii) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పల్సెస్ రీసెర్చ్
iii) కేంద్ర సముద్ర చేపల పరిశోధన సంస్థ
iv) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్
జాబితా - II
a) ఆనంద్ b) కొచ్చిన్
c) ఢిల్లీ d) కాన్పూర్
1) i - c, ii - d, iii - b, iv - a
2) i - c, ii - a, iii - d, iv - b
3) i - d, ii - c, iii - a, iv - b
4) i - b, ii - c, iii - d, iv - a

9. భారతదేశంలో వరిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం ఏది?
1) మధ్యప్రదేశ్ 2) ఉత్తరప్రదేశ్
3) పశ్చిమబెంగాల్
4) తమిళనాడు

10. హరిత విప్లవానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) హరిత విప్లవం అనే పదాన్ని మొదట ఉపయోగించిన వ్యక్తి 'విలియం. ఎస్ గాడ్'
బి) హరిత విప్లవాన్ని మొదటిసారిగా ప్రపంచంలో వ్యాప్తి చేసిన వారు 'నార్మన్ బోర్లాగ్'
సి) భారతదేశంలో హరిత విప్లవాన్ని అధికంగా వ్యాప్తి చేసినవారు ఎం.ఎస్. స్వామినాథన్
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

11. కింది వాటిని జతపరచండి.

జాబితా - I	జాబితా - II
i) క్షీర విప్లవం	a) పండ్లు
ii) వెండి విప్లవం	b) చేపలు
iii) బంగారు విప్లవం	c) పాలు
iv) నీలి విప్లవం	d) కోడి గుడ్లు

1) i - c, ii - a, iii - d, iv - b
2) i - d, ii - c, iii - a, iv - b
3) i - c, ii - d, iii - a, iv - b
4) i - b, ii - d, iii - a, iv - c

12. హరిత విప్లవం వల్ల మన దేశంలో అత్యధికంగా ప్రయోజనం పొందిన పంట ఏది?
1) వరి 2) మొక్కజొన్న
3) జొన్న 4) గోధుమ

13. కింది వాటిలో 'గోల్డెన్ ఫైబర్' లేదా 'బంగారు పీచు' అని దేన్ని పిలుస్తారు?
1) జనుము 2) పత్తి
3) పొగాకు 4) సుగంధ ద్రవ్యాలు

14. పత్తి పంటకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
1) దీన్ని 'తెల్ల బంగారం' అని పిలుస్తారు
2) పత్తిని అత్యధికంగా నల్లరేగడి నేలలో పండిస్తారు
3) దేశంలో అత్యధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్ర
4) పైవన్నీ సరైనవే

15. భారతదేశంలో 'ఇంద్రధనస్సు విప్లవం'ను దేనిలో భాగంగా ప్రకటించారు?
1) మొదటి హరిత విప్లవం
2) రెండో హరిత విప్లవం
3) జాతీయ వ్యవసాయ విధానం - 2000
4) జాతీయ వ్యవసాయ విధానం - 2006

16. మొదటి హరిత విప్లవం వల్ల దేశంలో తక్కువ ప్రయోజనం పొందిన పంట ఏది?
1) పప్పుధాన్యాలు 2) నూనె గింజలు
3) మొక్కజొన్న 4) 1, 2

17. దేశంలో పంటలు, వాటిని అత్యధికంగా పండించే రాష్ట్రాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

జాబితా - I	జాబితా - II
i) సజ్జలు	a) కర్ణాటక
ii) రాగులు	b) మహారాష్ట్ర
iii) జొన్న	c) రాజస్థాన్

1) i - c, ii - b, iii - a
2) i - c, ii - a, iii - b
3) i - a, ii - b, iii - c
4) i - b, ii - a, iii - -c

18. బీరు, విస్కీ తయారీలో ఏ పంట గింజలను ఉపయోగిస్తారు?
1) బార్లీ 2) సజ్జ
3) రాగులు 4) సామలు

19. 1965-66లో హరిత విప్లవాన్ని మొదటి సారిగా ఏ ప్రాంతంలో ప్రవేశపెట్టారు?
1) పంజాబ్
2) హర్యానా
3) పశ్చిమ ఉత్తరప్రదేశ్
4) పైవన్నీ

20. రెండో హరిత విప్లవానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) దీన్ని 2006 మే 26న అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు
బి) ఇది పప్పుధాన్యాల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది
1) ఎ మాత్రమే
2) బి మాత్రమే
3) ఎ, బి సరైనవి
4) ఏదీకాదు

సమాధానాలు

1) 3	2) 3	3) 1	4) 3	5) 4
6) 2	7) 1	8) 1	9) 3	10) 4
11) 3	12) 4	13) 1	14) 4	15) 3
16) 4	17) 2	18) 1	19) 4	20) 3

సకలోత్తర పథేశ్వర అనే బిరుదు కలిగిన రాజు?



గుప్తానంతర యుగం

(క్రీ.శ. 6వ శతాబ్దం - 8వ శతాబ్దం)

గుప్తుల అనంతరం భారతదేశం మరోసారి అనేక చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయింది. ఈ రాజకీయ అనైక్యత ఉత్తర భారతంలో తీవ్రంగా ఉంది. ఈ కాలంలో ఉత్తరాదిలో... వల్లభి కేంద్రంగా- మైత్రకులు, గౌహతి కేంద్రం గా (కామరూప రాజ్యం)-వర్మన్ వంశం, పాటలీపుత్రం కేంద్రంగా-కడపటి గుప్తులు పాలిం చారు. అలాగే బెంగాల్ కేంద్రంగా - గౌడ వంశం, కనౌజ్ కేంద్రంగా - మౌఖరీలు, ఒడిశా కేంద్రంగా-మాతరులు, మానవంశం, స్థానేశ్వర్ కేంద్రంగా- పుష్యభూతులు పాలన కొన సాగించారు. అయితే పుష్యభూతులు క్రమంగా ఈ రాజ్యాలన్నింటినీ జయించి మొత్తం ఉత్తర భారతదేశాన్ని రాజకీయంగా ఏకంచేసి పరిపాలించారు.

ఈ కాలంలో దక్షిణ భారతదేశాన్ని పశ్చిమ గాంగులు, బాదామి చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు మొదలైన రాజవంశాలు పాలిస్తు న్నాయి. ఈ వంశాలు దక్షిణ భారతదేశంలో వాస్తుశిల్ప కళలకు అమూల్యమైన సేవలనందించాయి. గుప్తుల అనంతర యుగంలో ఉత్తరా దిని పాలించిన రాజవంశాలన్నింటిలో అతి గొప్ప రాజ వంశం పుష్యభూతి వంశం.

పుష్యభూతి వంశపాలన - హర్షవర్ధనుడు

పుష్యభూతి: ఇతడు తనపేరుతో పుష్యభూతి వంశాన్ని స్థాపించాడు. స్థానేశ్వర్ రాజధానిగా, గుప్తుల సామంతుడిగా ఉంటూ పరిపాలించాడు.

ప్రభాకర వర్ధనుడు: పుష్యభూతి వంశంలో తొలి స్వతంత్ర రాజు. తన స్వతంత్ర పాలనకు గుర్తు గా ఇతడు రాజాధిరాజ అనే బిరుదును ధరించాడు. ప్రభాకరుడి భార్యపేరు యశోమతి. ప్రభాకర వర్ధనుడు క్రీ.శ. 605లో మరణించగా అతడి భార్య సతీ సహగమనాన్ని ఆచరించిందని బాణుడి గ్రంథాల వల్ల తెలుస్తోంది.

రాజ్య వర్ధనుడు: ప్రభాకర వర్ధనుడు తన జ్యేష్ఠ పుత్రుడు రాజ్య వర్ధనుడికి బదులు రెండో కుమారుడు హర్షుడిని రాజుగా చేయాలని సంకల్పించాడు. ఇందుకు హర్షుడు సమ్మతించలేదు. దీంతో రాజ్యవర్ధనుడు రాజయ్యాడు. ఇతడి కాలంలో కనౌజ్‌ను గ్రహవర్మ అనే మౌకరీరాజు పాలించేవాడు. ఇతడు రాజ్యవర్ధనుడి సోదరి రాజ్యశ్రీ భర్త. మగధను, మాళ్వాను పాలించే దేవగుప్తుడు, గౌడ దేశాన్ని పాలించే శశాంకుడితో కలిసి.. గ్రహవర్మను చంపి కనౌజ్‌ను ఆక్రమించాడు. దీంతో రాజ్యవర్ధనుడు దేవగుప్తుడిని చంపి కనౌజ్‌ను ఆక్రమించాడు. కానీ శశాంకుడు ఇతడిని మోసపూరితంగా చంపాడు. దీంతో హర్షుడు రాజ్యానికి వచ్చాడు.

హర్షవర్ధనుడు: ఇతడు గౌడ శశాంకుడి నుంచి కనౌజ్‌ను విడిపించడమే కాకుండా.. రాజధానిని స్థానేశ్వరం నుంచి కనౌజ్‌కు మార్చాడు. శశాంకుడి అనంతరం గౌడ దేశాన్ని కూడా ఆక్రమించాడు.

ఆ తర్వాత తన దిగ్విజయ యాత్రలు ప్రారంభించి..సింధు, వల్లభి, గుజరాత్, సౌ రాష్ట్ర మొదలైన ప్రాంతాల్ని జయించాడు. అయితే లత, మాళ్వా ప్రాంతాలపై ఆధిపత్యం విషయంలో హర్షుడికి.. బాదామి చాళుక్యరాజు రెండో పులకేశితో ఘర్షణ అనివార్యమైంది. హర్షుడు.. పులకేశితో జరిపే యుద్ధానికి చేసిన సన్నాహాల గురించి బాణభట్టుడు తన రచనల్లో వివరంగా తెలిపాడు. వీరి మధ్య జరిగిన యుద్ధం గురించిన ప్రస్తావన రెండో పులకేశికి చెందిన ఐహోల్ ప్రశస్తిలో కనిపిస్తుంది. అయితే ఈ యుద్ధంలో హర్షుడి విజయం సందిగ్ధకరం అని భావించాలి. కానీ పులకేశి వారసులు ఈ యుద్ధంలో పులకేశి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. అయితే చరిత్రకారులు వీరి మధ్య స్నేహపూర్వక ఒప్పందం జరిగినట్లు భావిస్తున్నారు. హర్షుడు సాధించిన సైనిక విజయాల సమాచారం అతడు జారీ చేసిన పలు శాసనాల ద్వారా లభిస్తోంది. హర్షుడు బన్సిఖేర, మధుబన్, సోనేపట్ మొదలైన శాసనాలను జారీ చేశాడు. హర్షుడు మరణించే నాటికి ఇతడి రాజ్యంలో కాశ్మీర్ తప్ప మిగిలిన ఉత్తర భారతదేశమంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అంతర్భాగంగా ఉండేది. అందుకే హర్షుడిని ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ రాజుగా పరిగణిస్తారు.

హర్షుడి పాలనా విధానం: ప్రాచీన భారతదేశ చరిత్రలో చివరిసారిగా ఒక పటిష్ఠమైన పాలనాపద్ధతిని ఏర్పాటు చేసిన రాజు హర్షుడు. ఇతడి పాలనా సమర్థత వల్ల గుప్తుల అనంతరం ఉత్తర భారతంలో దాదాపు 40 ఏళ్ల పాటు శాంతియుత వాతావరణం ఏర్పడింది. కనౌజ్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతాలను ఇతడు ప్రత్యక్షంగా పాలించినప్పటికీ.. పరోక్ష పాలనలో మాత్రం చాలా ప్రాంతాలుండేవి. హర్షుడి కాలంలో వచ్చిన ప్రధాన మార్పు భూస్వామ్య వ్యవస్థ ఏర్పడడం. దీంతోపాటు సామంత వ్యవస్థ కూడా పెరిగిపోయింది. ఒక రాజుకున్న సామంతుల సంఖ్యను బట్టి అతడి గొప్పదనాన్ని అంచనా వేయడం ప్రారంభమైంది. హర్షుడు తన సామ్రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం అనేక రాష్ట్రాలుగా విభజించాడు. వీటిని భుక్తి అని పిలిచేవారు. రాష్ట్రాలను విషయ అనే పేరుతో జిల్లాలుగా విభజించారు. జిల్లాలను పాథక అనే మరో విభాగంగా విభజించారు. పాలనలో చిట్టచివరి విభాగం గ్రామం. పరిపాలనలో రాజుకు సహాయంగా మంత్రి పరిషత్ ఉండేది. హర్షుడి అధికారుల్లో ముఖ్యమైనవారు మంత్రి, సేనాపతి, మహాసామంత, కుమారామాత్య, ఉపారిక, విషయపతి, రాజస్థానీయ తదితరులు. ఉన్నతాధికారులందరికీ వేతనాలను భూముల రూపంలోనే చెల్లించే వారు. కేవలం కిందిస్థాయి సైనికులకే జీతాలను నగదు రూపంలో చెల్లించేవారు. అందుకే ఈ కాలంలో అతి తక్కువ సంఖ్యలో నాణేలు కనిపిస్తాయి. నాణేల కొరతకు మరో కారణం ఈ కాలంలో వ్యాపార వాణిజ్యాలు మరింతగా క్షీణించడమే. ప్రజలపై పన్నుల భారం తక్కువగానే ఉండేది. రాజ్యానికి ప్రధాన ఆదాయ వనరు భూమిశిస్తు. ఇది పంటలో 1/6వ వంతుగా ఉండేది. ఇంకా 'తుల్యమేయ' అనే అమ్మకం పన్ను కూడా విధించారు.

హర్షుడి సాంస్కృతిక సేవ: హర్షుడు స్వయంగా మూడు నాటకాలను రచించినట్లు ప్రతీతి. అవి నాగానందం, రత్నావళి, ప్రియదర్శిక. హర్షుడి ఆస్థాన కవి బాణుడు మూడు కావ్యాలను రచించాడు. అవి హర్షచరిత్ర, కాదంబరి, పార్వతీ పరిణయం. హర్షుడి ఆస్థానంలోని మరో కవి మయూరుడు.. సూర్యశతకం అనే గ్రంథాన్ని రచించాడు. హర్షుడు ప్రతి ఐదేళ్లకోసారి ప్రయాగ వద్ద మహామోక్ష పరిషత్‌ను నిర్వహించేవాడు. ఈ సమావేశంలో తన సంపదనంతా దాన, ధర్మాలకు వెచ్చించేవాడని హ్యుయాన్‌త్సాంగ్ తెలిపాడు. క్రీ.శ. 643లో కనౌజ్‌లో హర్షుడు ఒక సర్వమత సమ్మేళనాన్ని హ్యుయాన్‌త్సాంగ్ అధ్యక్షతన నిర్వహించాడు. హర్షుడు మొదట శైవ మతాన్ని ఆదరించినప్పటికీ తర్వాతి కాలంలో బౌద్ధాన్ని స్వీకరించాడు. ప్రతీ సంవత్సరం రాజధానిలో బౌద్ధమత సమావేశాలు నిర్వహించేవాడు. నలంద విశ్వవిద్యాలయానికి 100 గ్రామాలను దానంగా ఇచ్చాడు. అందుకే ఇతని కాలంలో నలంద బౌద్ధ విశ్వవిద్యాలయం చాలా ఉన్నత దశలో ఉందని హ్యుయాన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. 10వేల మంది విద్యార్థులు, 1,500 మంది గురువులతో ఈ విశ్వవిద్యాలయం గొప్పగా విలసిల్లిందని అతడు తెలిపాడు. హర్షుడు తాను కాశ్మీర్‌ను సందర్శించినప్పుడు అక్కడినుంచి బుద్ధుడి దంతపు అవశేషాన్ని కనౌజ్‌కు తెచ్చి దానిపై బౌద్ధస్తూపాన్ని నిర్మించాడు. ప్రాచీన భారతదేశ చరిత్రలో మహాయాన బౌద్ధాన్ని ఆదరించిన చివరి చక్రవర్తిగా హర్షుడిని పేర్కొనవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. హ్యుయాన్‌త్సాంగ్ ప్రకారం హర్షుడు చాతుర్వర్ణాల్లోని ఏ వర్ణానికి చెందినవాడు?
ఎ) బ్రాహ్మణ బి) క్షత్రియ
సి) వైశ్య డి) శూద్ర

2. స్థానేశ్వర్ నుంచి కనౌజ్‌కు రాజధానిని మార్చిన ఉత్తర భారతదేశ రాజు?
ఎ) నరవర్ధన బి) ఆదిత్య వర్ధన
సి) ప్రభాకర వర్ధన డి) హర్ష వర్ధన

3. హర్షుడి చేతిలో ఓడిన వల్లభి పాలకుడు?
ఎ) రెండో ధ్రువసేనుడు
బి) రెండో ప్రవరిసేనుడు
సి) మూడో ధ్రువసేనుడు
డి) మూడో ప్రవరిసేనుడు

4. హర్షుడి దిగ్విజయ యాత్రలకు నాయకత్వం వహించిన సేనాపతి ఎవరు?
ఎ) దండి బి) భండి
సి) వ్యాఘ్రకేతు డి) నిర్ఘాత

5. సకలోత్తర పథేశ్వర అనే బిరుదు కలిగిన రాజు?
ఎ) గ్రహవర్మ బి) శశాంక
సి) హర్ష డి) భాస్కరవర్మ

6. భారతదేశ చరిత్రలో తొలిసారిగా అధికారులకు భూదానాలు చేసిన రాజవంశం?
ఎ) శాతవాహనులు బి) గుప్తులు
సి) ఇక్ష్వాకులు డి) పుష్యభూతులు

7. ఏ వర్ణాన్ని హ్యుయాన్‌త్సాంగ్ వ్యవసాయదారులుగా పేర్కొన్నాడు?
ఎ) బ్రాహ్మణులు బి) క్షత్రియులు
సి) వైశ్యులు డి) శూద్రులు

8. బాణుడి ప్రకారం హర్షుడి సమాజంలో సర్వసాధారణమైపోయిన దురాచారం?
ఎ) సతీ సహగమనం
బి) వరకట్నం
సి) కన్యాశుల్కం
డి) వితంతు వివాహాల నిషేధం

9. హర్షుడు ఆదరించిన మతం?
ఎ) హిందూ మతం బి) బౌద్ధ మతం
సి) జైన మతం డి) వైష్ణవ మతం

10. హర్షుడి కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న మతం?
ఎ) వైష్ణవం బి) బౌద్ధం
సి) శైవం డి) జైనం

11. ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ చక్రవర్తిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) సముద్రగుప్తుడు బి) హర్షవర్ధనుడు
సి) రెండో చంద్రగుప్తుడు డి) యశోధర్ముడు

12. రాజపుత్ర, శీలాదిత్య అనే బిరుదులు ధరించిన రాజు?
ఎ) రెండో పులకేశి
బి) మొదటి మహేంద్రవర్మ
సి) హర్షుడు
డి) రెండో నరసింహవర్మ

13. హర్షుడి కాలంలోని పాలనా విభాగాల్లో సరైన క్రమం?
ఎ) భుక్తి - విషయ - పాథక - గ్రామ
బి) విషయ - గ్రామ - భుక్తి - పాథక
సి) పాథక - భుక్తి - విషయ - గ్రామ
డి) గ్రామ - భుక్తి - విషయ - పాథక

14. హర్షుడి కాలంలో చాత-భాత అంటే?
ఎ) పన్నులు
బి) సైనికులు
సి) కులాలు డి) భూదానాలు

15. హర్షుడు ఏ ప్రాంతంలో సర్వమత సమ్మేళనం నిర్వహించాడు?
ఎ) ప్రయాగ బి) పాటలీపుత్రం
సి) కనౌజ్ డి) వల్లభి

సమాధానాలు

1) సి	2) డి	3) ఎ	4) బి	5) సి
6) డి	7) డి	8) బి	9) బి	10) సి
11) బి	12)సి	13)ఎ	14)బి	15) సి

వందేళ్లలో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

విషమ రోజులు: నెలలోని రోజులను వారాలుగా పొందుపరచగా మిగిలే రోజులను విషమ రోజులు అంటారు. అంటే ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చే శేషమే విషమ రోజులు. ఒక వారంలో విషమ రోజులు **(odd days)** 0.

రోజులు	విషమ రోజులు
28	0
29	1
30	2
31	3

ఉదా: 7)29(4 28 / 1   7)31(4 28 / 3

- ఈ రోజు సోమవారం అయితే 61 రోజుల తర్వాత వచ్చేవారం? **(Deputy Jailor, 2012)**
  ఎ) బుధవారం బి) శనివారం
  సి) మంగళవారం డి) గురువారం
  జవాబు: బి

సాధన: విషమ రోజులు 7)61(8 56 / 5

∴ సోమవారం + 5 విషమ రోజులు
= శనివారం.

- ఈ రోజు మంగళవారం. 94వ రోజు ఏ వారం?
  ఎ) శుక్రవారం బి) శనివారం
  సి) ఆదివారం డి) సోమవారం
  జవాబు: ఎ

నెలల వారీగా విషమ రోజులు:

నెలలు	విషమ రోజులు		
		Ju	2
		Jy	3
J	3	Au	3
F	0/1	S	2
M	3	O	3
A	2	N	2
M	3	D	3

- ఆగస్టులో ఎన్ని విషమ రోజులున్నాయి?
  ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
  జవాబు: సి

సాధన: ఆగస్టు నెలలో 31 రోజులుంటాయి.

7)31(4 28 / 3

= ఆగస్టులో 3 విషమ రోజులుంటాయి.

గమనిక: సాధారణ సంవత్సరం, లీపు సంవత్సరాల్లో ఒకే రోజు, ఒకే తేదీ ఉండే నెలలు

సాధారణ సంవత్సరం	లీపు సంవత్సరం
జనవరి – అక్టోబర్	జనవరి – ఏప్రిల్
ఫిబ్రవరి – నవంబర్	జనవరి – జూలై
మార్చి – నవంబర్	ఫిబ్రవరి – ఆగస్టు
ఏప్రిల్ – జూలై	మార్చి – నవంబర్
సెప్టెంబర్ – డిసెంబర్	ఏప్రిల్ – జూలై
	సెప్టెంబర్ – డిసెంబర్

ఉదాహరణ:

1. ఏదైనా ఒక సంవత్సరంలో (సాధారణ/ లీపు) ఒకే రోజుతో ప్రారంభమయ్యే రెండు నెలలేవి?
   ఎ) మార్చి–నవంబర్
   బి) మార్చి–జూలై సి) జూలై– ఆగస్టు
   డి) పైవేవీ కావు
   జవాబు: ఎ
2. సాధారణ సంవత్సరంలో ఏ నెలలు ఒకే రోజుతో ప్రారంభమవుతాయి?
   ఎ) జనవరి–జూలై బి) జూన్– ఏప్రిల్
   సి) ఏప్రిల్–అక్టోబర్
   డి) జనవరి– అక్టోబర్
   జవాబు: డి
3. 31 రోజులున్న నెలలో చివరి రోజు బుధవారమైతే ఎన్ని సోమవారాలు ఉంటాయి? **(General S.I. 2010)**
   ఎ) 4 బి) 3 సి) 5
   డి) చెప్పలేం
   జవాబు: సి

వివరణ: 31 రోజులున్న నెలలో 29, 30, 31 రోజుల్లో వచ్చే వారాలు 5 వస్తాయి. అంటే 31 రోజులున్న నెలలో 1, 2, 3 తేదీల్లో వచ్చే వారాలు 5 సార్లు వస్తాయి. కాబట్టి సోమవారం అయిదుసార్లు వస్తుంది.

సంవత్సరాలకు విషమ రోజులు

సౌర సంవత్సరం:

- భూమి, సూర్యుడి చుట్టూ ఒకసారి తిరిగి రావడానికి 365 రోజుల 5 గంటల 48 నిమిషాల 48 సెకన్లు పడుతుంది. 365 రోజుల కంటే ఎక్కువగా ఉన్న సుమారు 6 గంటలను ఒక రోజుగా ఉంచడం వీలు కాదు. కాబట్టి సాధారణ సంవత్సరానికి 365 రోజులుగా తీసుకున్నారు.
- మిగిలిన ఆరు గంటలు నాలుగేళ్లలో 24 గంటలు.. అంటే ఒక రోజు అవుతుంది. దీన్ని ఫిబ్రవరి నెలలోని చివరి రోజు (29వ తేదీ)గా పరిగణిస్తారు. దీన్ని లీపు సంవత్సరం అంటారు.

సాధారణ సంవత్సరం: ఇచ్చిన సంవత్సరం చివరి రెండు స్థానాలు అంటే ఒకట్లు, పదుల స్థానాల్లోని సంఖ్య 4తో నిశ్శేషంగా భాగించకపోతే దాన్ని



సాధారణ సంవత్సరం అంటారు. సాధారణ సంవత్సరంలో 365 రోజులుంటాయి.

సాధారణ సంవత్సరాలు	సాధారణ సంవత్సరాలు కానివి
1981, 82, 83	1988, 92, 96
2001, 2002	2000, 2004

$\frac{365}{7}$ = 52 వారాలు + 1 విషమ రోజు

- సాధారణ సంవత్సరంలో 1 విషమ రోజు ఉంటుంది.
- సాధారణ సంవత్సరం ఏ రోజుతో ప్రారంభమవుతుందో.. అదే రోజుతో ముగుస్తుంది.

లీపు సంవత్సరం: ఇచ్చిన సంవత్సరంలోని చివరి రెండు స్థానాలు అంటే ఒకట్లు, పదుల స్థానాల్లోని సంఖ్యను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లీపు సంవత్సరం ప్రతి 4 ఏళ్లకు ఒకసారి వస్తుంది. లీపు సంవత్సరంలో 366 రోజులుంటాయి.

- లీపు సంవత్సరంలో రెండు విషమ రోజులు ఉంటాయి.
- లీపు సంవత్సరంలో ప్రారంభ రోజు ఏ వారం అవుతుందో డిసెంబర్ 30 కూడా అదే వారం అవుతుంది.

1. కింది వాటిలో లీపు సంవత్సరం ఏది?
   ఎ) 1986 బి) 2002
   సి) 2100 డి) 1992 జవాబు: డి

శతాబ్ద సంవత్సరాలు 4తో నిశ్శేషంగా భాగితమైతే అవి లీపు సంవత్సరాలు కావు. 400తో నిశ్శేషంగా భాగితమైతేనే అవి లీపు సంవత్సరాలు అవుతాయి. ప్రతి నాలుగో శతాబ్దం లీపు సంవత్సరం అవుతుంది.

లీపు సంవత్సరాలయ్యే శతాబ్దాలు:
400, 800, 1200, 1600, 2000, ...

లీపు సంవత్సరాలు కాని శతాబ్దాలు:
100, 200, 300, 500, 600 ...

2. కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?
   ఎ) 1100 బి) 1300
   సి) 1700 డి) పైవేవీ కావు
   జవాబు: డి
3. కిందివాటిలో సాధారణ సంవత్సరం ఏది?
   ఎ) 1200 బి) 2400
   సి) 2600 డి) పైవేవీ కావు
   జవాబు: సి
4. కిందివాటిలో లీపు సంవత్సరం కానిది?
   ఎ) 1744 బి) 2016
   సి) 1982 డి) పైవేవీ కావు
   జవాబు: సి
5. 481 రోజుల్లో ఎన్ని విషమ రోజులు ఉన్నాయి?
   ఎ) 1 బి) 2 సి) 4 డి) 5
   జవాబు: డి

100 సంవత్సరాలకు విషమ రోజులు

- వందేళ్లలో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
  100 ఏళ్లలో 24 లీపు సంవత్సరాలు, 76 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.
  సాధారణ సంవత్సరానికి ఒక విషమ రోజు, ఒక లీపు సంవత్సరానికి రెండు విషమ రోజులు ఉంటాయి. ఆ ప్రకారం.. 100 ఏళ్లకు విషమ రోజులు
  $= 76\times1 + 24\times2 = 76+48 = 124$
  $\frac{124}{7} = 5$ విషమ రోజులు

సంవత్సరం	విషమ రోజులు
100	$5 \rightarrow 5$
200	$10 \rightarrow 3$
300	$15 \rightarrow 1$
400	$20 + 1 \rightarrow 0$
500	5
600	3
700	1
800	0

- 100 సంవత్సరాల్లో 5, 200 సంవత్సరాల్లో 3, 300 సంవత్సరాల్లో 1, ప్రతి 4వ శతాబ్దానికి 0 విషమ రోజులు ఉంటాయి.

విషమ రోజులు	వారం
1	సోమవారం
2	మంగళవారం
3	బుధవారం
4	గురువారం
5	శుక్రవారం
6	శనివారం
0	ఆదివారం

ఉదా:

1. క్రీ.శ.1వ సంవత్సరం జనవరి 1వ తేదీన ఏ వారం?
   ఎ) శనివారం బి) ఆదివారం
   సి) సోమవారం డి) మంగళవారం
   జవాబు: సి
2. కింది వాటిలో ఏదైనా శతాబ్దం చివరి రోజు కానిది ఏది? **(General S.I. 2012)**
   ఎ) శుక్రవారం బి) ఆదివారం
   సి) మంగళవారం డి) సోమవారం
   జవాబు: సి

వివరణ: శతాబ్దం చివరి నాటికి విషమ రోజులుగా మిగిలేవి 5, 3, 1, 0.

అంటే 5–శుక్రవారం, 3–బుధవారం, 1–సోమవారం, 0–ఆదివారం. వీటిలో ఏదో ఒకటి తప్పకుండా ఉంటుంది. కానీ మంగళవారం, గురువారం, శనివారాలు శతాబ్దం చివరి రోజులుగా రావు.

శతాబ్దం చివరి రోజులు		ప్రారంభ రోజులు
శుక్రవారం	→	శనివారం
బుధవారం	→	గురువారం
సోమవారం	→	మంగళవారం
ఆదివారం	→	సోమవారం

ఉదా:

1. కిందివాటిలో ఏదైనా శతాబ్ద సంవత్సరం ప్రారంభ రోజు కానిది?
   ఎ) శనివారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) సోమవారం
   జవాబు: సి
2. 247 సంవత్సరాల్లో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
   ఎ) 1 బి) 3 సి) 4 డి) 5

జ. 200 రోజులకు 3 విషమ రోజులు ఉంటాయి. 47 ఏళ్లకు ఉండే విషమ రోజుల సంఖ్య తెలుసుకోవాలి.
47 ఏళ్లు = 11×4 + 3 = 44 + 3.
అంటే 47 ఏళ్లలో 11 లీపు సంవత్సరాలు, 36 సాధారణ సంవత్సరాలు ఉంటాయి.
47 ఏళ్లలో ఉండే విషమ రోజులు
$= 11\times2 + 36\times1 = 22 + 36 = 58$
58/7 = 2 విషమ రోజులు ఉంటాయి.
247 ఏళ్లకు విషమ రోజులు = 2+3 = 5
జవాబు: డి

3. 481 సంవత్సరాల్లో ఎన్ని విషమ రోజులు ఉంటాయి?
   ఎ) 5 బి) 3 సి) 2 డి) 1
   జవాబు: బి
4. క్రీ.శ. 100వ సంవత్సరంలో ఎన్ని విషమ రోజులు ఉన్నాయి?
   ఎ) 5 బి) 4 సి) 2 డి) 1
   జవాబు: డి

గతంలో అడిగిన ప్రశ్న


- 1977 జూలై 1వ తేదీ శుక్రవారం అయితే 1970 జూలై 1 ఏ వారం అవుతుంది? (అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్, 2013)
  1) బుధవారం 2) గురువారం
  3) ఆదివారం 4) మంగళవారం

వివరణ: 1970 జూలై 1 నుంచి 1977 జూలై 1 వరకు విషమ రోజులు =

సంవత్సరాలు	విషమ రోజులు
1971	1
1972	2 (లీపు సంవత్సరం)
1973	1
1974	1
1975	1
1976	2 (లీపు సంవత్సరం)
1977	1

మొత్తం విషమ రోజులు = 9 ~ 2
కావలసిన రోజు = శుక్రవారం–2 = బుధవారం
జవాబు: 1

Idea of group discussion is..



Directions (Q.No. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Any misinterpretation of a message (1)/ leads to communication breakdown (2)/ and creates confusion (3)/ and misunderstanding. (4)/ No error (5)
2. Organizational competent (1)/ is the ability (2)/ to organize information (3)/ in a logical and structured way. (4)/ No error (5)
3. In jet propulsion engines, (1)/ gas turbines are used (2)/ only to provide the work requires (3)/ for the compressor of the engine. (4)/ No error (5)
4. When you do use (1)/ the remote control for a long time, (2)/ take out the batteries (3)/ and store them in a cool, dry place. (4)/ No error (5)
5. He has submitted (1)/ the report (2)/ before he received (3)/ the memo. (4)/ No error (5)

Directions (Q.No. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Ionic compounds can be separate into their constituent ions with little effort.
   1) sieved 2) segregated
   3) filtered 4) dissociated
   5) no correction required
7. Some of the more powerful microcomputers have all or most of the quality of earlier minicomputers.
   1) resemblances
   2) characteristics 3) features
   4) properties
   5) no correction required
8. A compound microscope is a device that is used to produce very large enlarged appearance.
   1) ramification 2) upshot
   3) magnifications 4) disclosure
   5) no correction required
9. The Space Age began on October 4, 1957, when Russia started Sputnik 1 into orbit.
   1) experimented 2) launched
   3) send 4) devised
   5) no correction required
10. X-rays are high energy photons, which can knock an atom outside of a molecule.
    1) out 2) along
    3) inside 4) within
    5) no correction required

Directions (Q.No. 11 - 15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Crude oil is a mixture of different compounds that boil at different temperatures.
B) The remaining and heaviest fraction is the residue, which supplies waxes, asphalts and some fuel oils.
C) The fraction obtained by boiling between about 140 degrees and 320 degrees C is termed kerosene.
D) The next fraction, normally refined into gasoline, boils between about 30 degrees and 200 degrees C.
E) The lightest fraction consists of gases that boil below atmospheric temperature.
F) The fraction boiling above about 320 degrees C is commonly refined into heating, diesel and lubricating oils.

11. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
13. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 16 - 25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. In a huge ____ to the government and political parties in Tamil Nadu, the Supreme Court stayed the centre's ______ to holding of Jallikattu during Pongal.
    1) setback, decision
    2) decision, proposal
    3) opposition, recession
    4) retention, argument
    5) format, demand
17. The _____ attempted to storm the mission building during the attack.
    1) assailants 2) goon
    3) attacker 4) janitors
    5) scrutinizers
18. I was ____ to start a production house of my own, but the project never ____ because astrologers advised me not to go ahead with production.
    1) possibly, started
    2) Supposed, took off
    3) probably, crashed
    4) thought, worked
    5) naturally, rendered
19. Through telephone lines, an engineer with a personal computer can ____ data in the memory of other computers all ____ the world.
    1) access, over 2) possess, across
    3) acquire, along
    4) pertain, among
    5) grab, between
20. The warehouse supervisor can likewise use a personal computer with an _____ program to keep personal records, and those in the large computer's memory, _____.
    1) record, record
    2) inventory, updated
    3) list, recorded
    4) register, stored
    5) check, retrieved
21. Aeroplanes have the ___ of being dangerous and even the hardened travelers are _____ by them.
    1) probability, confused
    2) remark, sick
    3) reputation, intimidated
    4) statement, rescued
    5) possibility, sad
22. The very idea of group discussion is _____ on the concept of cooperation, where all members are _____ to work as a team.
    1) revolving, accepting
    2) based, expected
    3) rotating, accepted
    4) producing, entered
    5) removed, ejected
23. Air pollution has been a major _____ not only to the quality of environment but also to the human health.
    1) problem 2) concern
    3) disaster 4) threat
    5) coincidence
24. We could complete the assignment if it _____ not so late.
    1) had 2) was
    3) would 4) were
    5) have
25. Having just eaten his dinner, he _____ to have even a soft drink.
    1) was ready 2) wasn't
    3) not supposed
    4) was not ready 5) almost ready

Directions (Q.No. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

It was through Jimmy John that I discovered that a vocabulary is an outgrowth of experience. As fast as he learned some activity, he acquired without effort the vocabulary that went with it. From the pony he learned saddle, bridle, stirrup, blacksmith and so on, although to begin with he had **hidden** from our pet in terror, with absolutely no words to describe anything about him. After a summer of sailing he unconsciously acquired nautical terms as a matter of course. But when we tried to increase his vocabulary by making him memorize words **arbitrarily**, he became confused and mixed them all up and misused them amusingly. The first time he saw a funeral procession he asked, "What's that" and someone said, "It's a hearse". Now it happened that Jimmy had not been looking at the hearse when this was said. His attention was focused on an Army officer in the procession. Sometime later he announced that there was a hearse in front of our house and when we peered out, rather **alarmed**, we saw a soldier standing there talking calmly to someone. No hearse anywhere. I than realized that you can't make a child merely memorize words; he has to live them, and therefore many experiences are vital to the growth of a child's vocabulary. Jimmy John educated me more than I ever educated him!

26. Which of the two statements is true according to the passage?
    a) A child with a poor vocabulary is not very intelligent.
    b) Children's vocabulary comes from experience - they have to live the words they learn.
    1) only a 2) only b
    3) both a & b 4) neither a nor b
    5) either a or b
27. Identify the false statement:
    1) Children's vocabulary comes from experience.
    2) A child with poor vocabulary will not pass aptitude tests.
    3) Children educate their parents more often than the other way round.
    4) When we try to increase a child's vocabulary by making him memorize words, he becomes confused.
    5) Vocabulary is an outgrowth of experience.
28. The antonym of **hidden** is
    1) conceal 2) veil 3) secret
    4) divulge 5) expect
29. The antonym of **arbitrarily** is
    1) subjectively 2) personally
    3) individually
    4) instinctively 5) logically
30. The synonym of **alarmed** is
    1) startled 2) stirrup
    3) sensitized 4) scrutinized
    5) overwhelmed

Directions (Q. No. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Seeing is a complex act ____ (31) the optical system of the eye takes light ____ (32) from the object and forms an ____ (33) on a light sensitive layer, the retina. This ____ (34) energy ____ (35) a photochemical process is transformed into nerve energy and ____ (36) through the visual pathways to the brain. In the ____ (37) sense seeing is not complete until what is seen is interpreted ____ (38) the observer. This ____ (39) is based on past experience; hence, to a considerable ____ (40) seeing is a learned skill.

31. 1) wherein 2) where
    3) where in 4) where upon
    5) where on
32. 1) originate 2) emanating
    3) derive 4) radiate
    5) emit
33. 1) copy 2) picture
    3) image 4) icon
    5) figure
34. 1) beam 2) glow
    3) brightness 4) light
    5) darkness
35. 1) during 2) thorough
    3) throw 4) trough
    5) through

KEY

1) 5; 2) 1; 3) 3; 4) 1; 5) 1;
6) 4; 7) 3; 8) 3; 9) 2; 10) 1;
11) 5; 12) 3; 13) 5; 14) 2; 15) 2;
16) 1; 17) 1; 18) 2; 19) 1; 20) 2;
21) 3; 22) 2; 23) 2; 24) 4; 25) 4;
26) 2; 27) 2; 28) 4; 29) 5; 30) 1;
31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5;